
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 13
బుధవారం 27-9-2023
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'


41 ఏళ్ల తర్వాత..
ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్‌లో భారత జట్టుకు స్వర్ణ పతకం - 12లో


ముఖేశ్ అంబానీ బాటలోనే..
జీతాలు తీసుకోకుండానే ఆకాశ్, ఈషా, అనంత్ బాధ్యతలు - 13లో


మన దౌత్యం.. కొత్త శిఖరాలకు
భారత దౌత్య ప్రతిభ కొత్త శిఖరాలను తాకిందని.. ప్రపంచ గతిని మార్చే నిర్ణయాలకు ఢిల్లీ వేదికగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸


వచ్చేసారి ఊరుకోం..!
జడ్జీల నియామకాల కోసం కొలీజియం చేసిన 70 సిఫార్సులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని సుప్రీం అసహనం వ్యక్తం చేసింది.
వివరాలు 6లో ▸


ఉగ్రవాదంపై మెతక వైఖరా?
రాజకీయ సౌలభ్యం కోసం ఉగ్రవాదంపై మెతక వైఖరి సరికాదని ఐరాస వేదికగా కెనడాకు భారత్ చురకలంటించింది.
వివరాలు 6లో ▸


మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు
జూలైలో అదృశ్యమైన ఇద్దరు విద్యార్థులు హత్యకు గురయ్యారని తెలియడంతో మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత నెలకొంది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

'పరిపాలన'కు విశాఖ ముస్తాబు

'పరిపాలన'కు విశాఖ నగరం ముస్తామవుతోంది. హిల్–3లో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన భవనాలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయని గుర్తించినట్లు సమాచారం.
వివరాలు 2లో ▸

అవయవదానంతో అమరుడయ్యాడు

తాను మరణిస్తూ ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు కట్టా కృష్ణ అనే యువకుడు. ఓ ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయిన కృష్ణ అవయవదానంతో అమరుడయ్యాడు. పుట్టెడుదుఃఖంలో ఉండి కూడా ఇతరులకు సాయం చేయాలని ఆ కుటుంబం తీసుకున్న నిర్ణయం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.
వివరాలు 5లో ▸

చక్రస్నానంతో సేద తీరిన శ్రీనివాసుడు

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. 9 రోజుల పాటు వివిధ వాహనాల్లో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవేంకటేశ్వరస్వామి.. మంగళవారం స్నపన తిరుమంజనం సేవలో సేద తీరారు.
వివరాలు 14లో ▸

చంద్రబాబును ఎప్పటికీ నమ్మొద్దు

'చంద్రబాబు జైలుకు ఎందుకు వెళ్లారో, ఏమేం చేశారో అందరికీ తెలుసు. చంద్రబాబును ఎప్పటికీ నమ్మొద్దు' అని ఏపీ ప్రజలకు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి చేశారు. వైఎస్ జగన్ మంచి పరిపాలన అందిస్తున్నారని కితాబిచ్చారు.
వివరాలు 5లో ▸



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌ఛార్జ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఇక టాప్ గేర్!

మనం గేర్ మార్చాల్సిన సమయం ఆసన్నమైంది

ఈ ఆరు నెలలు కీలకం.. సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌ఛార్జ్‌లకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం

- ఇప్పటివరకూ ఒక ఎత్తు.. ఎన్నికలకు సన్నద్ధమయ్యే తీరు మరొక ఎత్తు
- వచ్చే ఆరు నెలల్లో ఎలా పనిచేస్తామన్నది చాలా ముఖ్యమైన విషయం
- ఇది మనసులో పెట్టుకుని ప్రతి అడుగు ముందుకు వేయండి
- 175కు 175 స్థానాల్లో గెలుపు అసాధ్యమేమీ కాదు.. సుసాధ్యమే
- క్షేత్ర స్థాయిలో మనకు పూర్తి అనుకూలంగా పరిస్థితులు
- అందుకే ఒంటరిగా పోటీ చేయలేక, పొత్తులు పెట్టుకుంటున్న విపక్షాలు
- గడప గడపకూ ద్వారా మనపట్ల ప్రజలు ఎంత సానుకూలంగా ఉన్నారో కళ్లారా చూశారు.. ఇప్పుడు అదే ఆత్మవిశ్వాసం, ధైర్యంతో ముందడుగు వేయండి
- నిత్యం ప్రజలతో మమేకం కండి.. విభేదాలు పరిష్కరించుకుని సమన్వయంతో కదలండి
- చివరి దశలో సర్వేలు.. ప్రజల్లో ఎంత ఎక్కువ ఉంటే సర్వేల్లో అంత మంచి ఫలితాలు వస్తాయి
- ప్రజల్లో.. ఎవరికి ఇస్తే కరెక్టు? అనే ప్రాతిపదికనే టికెట్లు ఇస్తాం
- మనం అంతా ఒక కుటుంబం..
- టికెట్లు ఇవ్వనంత మాత్రాన నా వాళ్లు కాకుండా పోరు.. టికెట్లు ఇవ్వలేని పక్షంలో వారికి మరొకటి ఇస్తాం
- జుట్టు ఉంటేనే ముడి వేసుకోగలం.. అధికారంలో ఉంటే ప్రజలకు మరింత మంచి చేయగలం.. టికెట్ల విషయంలో నేను తీసుకునే నిర్ణయాలను అందరూ పెద్ద మనసుతో అర్థం చేసుకోవాలి
- వచ్చే రెండు నెలలు జగనన్న ఆరోగ్య సురక్ష, ఏపీకి జగన్ కావాలి కార్యక్రమాల నిర్వహణ

2లో

ప్రపంచ బ్యాంకులో ఏపీ పలుకు'బడి'


ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏపీ విద్యార్థిని గాయత్రి

- విద్యా రంగానికి సీఎం వైఎస్ జగన్ ఎంతో ప్రాధాన్యమిస్తున్నారు.. నాడు–నేడు కింద ప్రభుత్వ స్కూళ్లను సమూలంగా మార్చారు
- అమ్మఒడి, విద్యా కానుకతో పాటు డిజిటల్ ఎడ్యుకేషన్, టోఫెల్ శిక్షణ అందిస్తున్నారు.. ట్యాబ్‌లు సైతం ఇచ్చారు
- వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించిన రాష్ట్ర విద్యార్థులు
- సీఎం కృషికి ప్రతినిధుల అభినందనలు
- రాష్ట్రానికి అవసరమైన సాయం అందిస్తామని హామీ

2లో

వహిదా రెహమాన్‌కు దాదాసాహెబ్ ఫాల్కే


సినిమా రంగంలో విశేష సేవలకు గాను భారత ప్రభుత్వం అందించే సర్వోన్నత పురస్కారం 'దాదాసాహెబ్ ఫాల్కే' 2021వ సంవత్సరానికి సుప్రసిద్ధ నటి వహిదా రెహమాన్‌ను వరించింది. ఈ విషయాన్ని కేంద్ర సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. హైదరాబాద్, విశాఖ, చెన్నైతో అనుబంధం కలిగిన వహిదా 'రోజులు మారాయి'తో సినిమా రంగంలోకి ప్రవేశించారు. ఆ తర్వాత హిందీ సినిమాల్లో అగ్రతారగా వెలుగొందారు.
- వివరాలు 11లో



ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుతో భూ దోపిడీ

లింగమనేనితో క్విడ్‌ప్రోకో.. హెరిటేజ్‌కు భూముల కానుక
హెరిటేజ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్‌లో డైరెక్టర్ హోదాలో తీర్మానం
లోకేశ్‌ను నిందితుడిగా చేరుస్తూ కోర్టులో సీఐడీ మెమో దాఖలు
లోకేశ్ పేరిట హెరిటేజ్ ఫుడ్స్‌లో 23,66,400 షేర్లు

సాక్షి, అమరావతి: మాజీ సీఎం చంద్రబాబు సహకార డెయిరీలను దెబ్బతీసి తమ కుటుంబ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ వ్యాపారం, ఆస్తులను అమాంతం పెంచగా ఆయన తనయుడు లోకేశ్ రాజధానిలో ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్‌ఆర్) అలైన్‌మెంట్ ఖరారులో అక్రమాలతో హెరిటేజ్ ఫుడ్స్ కోసం భూములను కొల్లగొట్టారు. తమ బినామీ, సన్నిహితుడు లింగమనేని రమేశ్ కుటుంబంతో క్విడ్‌ప్రోకోకు పాల్పడి భారీ భూదోపిడీకి తెగబడటంలో చంద్రబాబు, లోకేశ్ చక్కటి సమన్వయం కనబరిచారు. క్విడ్ ప్రోకో కింద చంద్రబాబు కరకట్ట నివాసాన్ని తీసుకోగా హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్ హోదాలో లోకేశ్ భూములను కొల్లగొట్టారు. ఈ అవినీతి భూబాగోతాన్ని సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆధారాలతో సహా బట్టబయలు చేసింది. క్విడ్ ప్రోకో కింద చంద్రబాబు పొందిన కరకట్ట నివాసాన్ని, నారాయణ కుటుంబ సభ్యులు
మిగతా 3వ పేజీలో ▶

అవినీతి నిర్మూలనకు సచివాలయ వ్యవస్థ

కాగ్ నివేదిక స్పష్టీకరణ



- అర్హత ఉన్న కుటుంబాలకు సకాలంలో పారదర్శక సేవలందించడమే దీని లక్ష్యం.. వలంటీర్లతో పాటు వార్డు సచివాలయాలు అందుకే ఏర్పాటు
- ఈ వార్డు సచివాలయాలను వార్డు కమిటీలు, ప్రాంతీయ సభలకు జవాబుదారీ చేయాలి
- స్వపరిపాలనకు ప్రభుత్వ వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలి
- వాటిని వార్డు సచివాలయాలు, ప్రాంతీయ సభలతో అనుసంధానించాలి

5లో

సాగులో ఏపీనే మేటి..



- అంతర్జాతీయ స్థాయిలో స్ఫూర్తిగా నిలిచిన ఆర్బీకే వ్యవస్థ
- రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్
- రైతులు పచ్చగా ఉండడంతో టీడీపీకి, పచ్చ మీడియాకు కడుపు మంట
- అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

5లో

ఫైబర్ నెట్‌లో రూ.114 కోట్లు దోచేశారు



- అసెంబ్లీలో జరిగిన చర్చలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- బ్లాక్ లిస్టులో ఉన్న టెరాసాఫ్ట్‌కు అక్రమంగా కట్టబెట్టారు..
- హెరిటేజ్ డైరెక్టరే అందులోనూ డైరెక్టర్‌గా ఉన్నారు
- షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు డబ్బులు చేరాయి

2లో

ఇదండీ సంగతి


'మనకు' కాదులే కంగారుపడకు!

క్లుప్తంగా...

సీనియర్ జర్నలిస్ట్ ఆనంద్ మృతి

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: సీనియర్ జర్నలిస్టు యు.ఆనంద్‌కుమార్ (61) మంగళవారం న్యూఢిల్లీలో మృతి చెందారు. ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చదివిన ఆయన మూడున్నర దశాబ్దాల క్రితం జర్నలిజాన్ని కెరీర్‌గా స్వీకరించారు. ఢిల్లీలో సాక్షి, ఉదయం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లలో కరస్పాండెంట్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన న్యూఢిల్లీలోని ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు కార్యాలయంలో మీడియా కోఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు. ఆనంద్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఆనంద్ మృతి పట్ల ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ విచారం వ్యక్తం చేశారు.

సీఎం వైఎస్ జగన్ సంతాపం

ఆనంద్‌కుమార్ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆనంద్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆనంద్ ఢిల్లీలో గత 35 ఏళ్లుగా వివిధ మీడియా సంస్థల్లో జర్నలిస్టుగా పనిచేసి మంచి గుర్తింపు పొందారని సీఎం తెలిపారు.

'మిలాద్ ఉన్ నబీ'కి సెలవు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ముస్లింల పవిత్ర పండుగ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఈ నెల 28న నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్ కింద సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గతంలో ప్రభుత్వ సెలవులు ప్రకటిస్తూ విడుదల చేసిన జీవో నంబర్ 2693లో సవరణ చేస్తున్నట్లు సీఎస్ జవహర్‌రెడ్డి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బ్యాంకు యూనియన్లతో పాటు పలు మైనార్టీ సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఏపీ మత్స్య వర్సిటీ-ఐఓబీపీ మధ్య ఒప్పందం

సాక్షి, అమరావతి: భారత్ సహా మరో ఏడు దేశాల ప్రయోజనాల కోసం బంగాళాఖాతంలో పనిచేసే బే ఆఫ్ బెంగాల్ ప్రోగ్రామ్-ఇంటర్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్ (బీవోబీపీ-ఐజీవో)తో ఏపీ మత్స్య విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుంది. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో బీవోబీపీ-ఐజీవో డైరెక్టర్ పి.కృష్ణన్, ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ ఓఎస్‌డీ ఓగిరాల సుధాకర్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. 2003లో ఏర్పాటైన బీవోబీపీ-ఐజీవో సంస్థ చెన్నై కేంద్రంగా పని చేస్తోంది. భారత్‌తోపాటు శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్, ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్, మాల్దీవుల ప్రభుత్వాలు ప్రాంతీయ మత్స్య సలహా మండలిని ఏర్పాటు చేసి ఆయా దేశాల్లో మత్స్యరంగ ప్రయోజనాల కోసం కృషి చేస్తున్నాయి. ఈ ఒప్పందం ద్వారా ఆయా దేశాల శాస్త్రవేత్తలతో సంయుక్తంగా పరిశోధనలు చేసే వెసులుబాటు ఏపీ మత్స్య వర్సిటీకి కలుగుతుంది.

శ్రీసిటీకి 'ఐకానిక్ బ్రాండ్ ఇండియా- 2023' అవార్డు



శ్రీసిటీ తరఫున అవార్డు స్వీకరిస్తున్న సతీష్ కామత్

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): ఎకనమిక్ టైమ్స్ ఎడ్జ్ 'ఐకానిక్ బ్రాండ్ ఆఫ్ ఇండియా-2023' అవార్డు శ్రీసిటీని వరించింది. ఈ నెల 25వ తేదీ సాయంత్రం ముంబైలో జరిగిన ఎకనమిక్ టైమ్స్ కాన్క్లేవ్ ఆరవ ఎడిషన్‌లో 2023 సంవత్సరానికి గాను 'ఐకానిక్ బ్రాండ్ ఆఫ్ ఇండియా' అవార్డును శ్రీసిటీకి అందజేశారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాజీ శాస్త్రవేత్త డాక్టర్ మైల్‌స్వామి అన్నాదురై, శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్‌కు ట్రోఫీ అందజేశారు. అంతర్జాతీయ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించిన విశిష్ట భారతీయ బ్రాండ్‌గా హోదా దక్కించుకున్నందుకు న్యాయనిర్ణేతల ప్యానెల్ శ్రీసిటీని అవార్డుకు ఎంపిక చేసింది. జీవన ప్రమాణాలు పెంచడం, సామాజిక, ఆర్థిక వృద్ధికి దోహదపడటం, పర్యావరణాన్ని పరిరక్షించడం తదితర అంశాల్లో శ్రీసిటీ పాత్రను ప్యానెల్ పరిగణనలోకి తీసుకుంది. అవార్డు రావడంపై శ్రీ సిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఆప్కాబ్‌కు నాఫ్స్కాబ్ అవార్డు ప్రదానం

కడప అగ్రికల్చర్: బ్యాంకుల పనితీరు, అప్పులు, అభివృద్ధి, వసూళ్లు, మూలధనం వంటి ప్రమాణాల ఆధారంగా నాఫ్స్కాబ్(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్స్ కోపరేటివ్ బ్యాంక్స్ లిమిటెడ్) 2020-21, 2021-22 సంవత్సరాలకు ఆప్కాబ్ ను జాతీయ స్థాయిలో అత్యుత్తమ రాష్ట్ర స్థాయి బ్యాంకుగా ఎంపిక చేసింది. జైపూర్‌లోని మ్యారియోట్ హోటల్ ఫంక్షన్ హాల్‌లో రాజస్తాన్ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి లాల్ చంద్ కటారియా, అగ్రికల్చర్ అండ్ రిజిస్ట్రార్స్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రేయ గుహాల, నాఫ్స్కాబ్ చైర్మన్ కె.రవీంద్రరావు చేతుల మీదుగా ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, ఎండీ శ్రీనాథ్‌రెడ్డిలకు మంగళవారం అవార్డు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

ప్రపంచ బ్యాంకులో ఏపీ పలుకు'బడి'

విద్యా రంగానికి సీఎం వైఎస్ జగన్ ఎంతో ప్రాధాన్యమిస్తున్నారు

వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించిన రాష్ట్ర విద్యార్థులు

సాక్షి, అమరావతి: పేదరికం, అసమానతలను తగ్గించేందుకు విద్య అత్యంత శక్తివంతమైన సాధనమని, అందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యా సంస్కరణలను చేపట్టారని రాష్ట్ర విద్యార్థులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న 10 మంది విద్యార్థుల బృందం అమెరికాలో ఐక్యరాజ్యసమితి సదస్సుకు వెళ్లిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఐక్యరాజ్యసమితి స్పెషల్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్ నేతృత్వంలో వాషింగ్టన్ వెళ్లిన విద్యార్థుల బృందం అక్కడ ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సోమవారం బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, సీఎం జగన్ సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న మేలును ఇంగ్లిష్‌లో చక్కగా వివరించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు విద్యార్థులు సోదాహరణంగా సమాధానాలు చెప్పారు.

విద్యా సంస్కరణలతో ఎంతో మార్పు..

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలు సమాజంలో ఎంతో మార్పును తీసుకొచ్చాయని రాష్ట్ర విద్యార్థులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పాఠశాలలు అద్భుతంగా మారాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న తాము నేడు ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు వరకు వచ్చి మాట్లాడుతున్నామంటే.. ఏపీలో పేదరిక నిర్మూలన, విద్యకు సీఎం వైఎస్ జగన్ ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నాడు-నేడు: మనబడి, పేద పిల్లలు అంతర్జాతీయంగా ఉన్న పోటీని తట్టుకుని ఎదిగేందుకు విద్యకు ఇస్తున్న ప్రాధాన్యం, డిజిటల్ ఎడ్యుకేషన్, టోఫెల్ శిక్షణ, ట్యాబ్స్ పంపిణీ వంటి అంశాలను ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు విద్యార్థులు వివరించారు. రాష్ట్రంలో అన్ని వర్గాలవారు ఉన్నత చదువులు అభ్యసించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు.



ప్రపంచ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ ఉన్నత ప్రతినిధులతో మాట్లాడుతున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు కుమార్తె, దళిత బాలిక దడాల జ్యోత్స్న

నాడు నేడు కింద పాఠశాలల్లో సకల వసతులు కల్పించడమే కాకుండా జగనన్న విద్యాకానుక, జగనన్న అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, ట్యాబ్స్ పంపిణీ తదితరాల గురించి వివరించారు. సాధారణ ప్రభుత్వ స్కూళ్ల నుంచి వచ్చిన తాము ఇలాంటి అంతర్జాతీయ వేదికలపై మాట్లాడడం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు అందిన గౌరవంగా పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి వల్లే తాము ఈ స్థాయిలో ఉన్నామని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి సహకారం అందిస్తాం

ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు.. విద్యార్థులు చెప్పిన అంశాలను ఆసక్తిగా విని విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పేదరిక నిర్మూలన, విద్యారంగం అభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషిని వారు అభినందించారు. ఈ రంగంలో తాము కూడా పాలుపంచుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు. విద్యా సంస్కరణలను ప్రభావవంతంగా అమలు చేసేందుకు కావాల్సిన యంత్రాంగంపై అభిప్రాయాలు చెప్పాలని విద్యార్థులను కోరారు. రాష్ట్రంలో విద్యా సంస్కరణలు విజయవంతం కావడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ద్వారా తల్లులను చైతన్యవంతం చేసిందని విద్యార్థులు వెల్లడించారు. ఈ విధానం ఎంతో ఉత్తమమైందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు తమ ఆలోచనలను మార్పిడి చేసుకునేందుకు, వాతావరణ మార్పు, స్థిరమైన అభివృద్ధి వంటి అంశాలపై చర్చించేందుకు ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేయాలని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులను కోరారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలతో విద్యా మార్పిడి కార్యక్రమాలను ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణం, సంస్కృతిపై క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని దేశాల్లో మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్సెప్ట్‌ని ప్రవేశపెట్టి రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించాలని విద్యార్థులు కోరారు.

చరిత్ర సృష్టించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు..

భారత్‌లో సాంకేతిక విద్యను మెరుగుపరచడం, విద్యార్థులకు మరిన్ని కెరీర్ అవకాశాలను అందించడం కోసం జూన్ 23న ప్రపంచ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల బోర్డు 255.5 మిలియన్ల డాలర్ల రుణాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా భారత్‌లో పేద విద్యార్థుల ప్రగతి కోసం సహకారం అందిస్తామని హామీ కూడా ఇచ్చింది. ఈ క్రమంలో ఏపీ విద్యార్థులు ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ప్రసంగించడం, రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, విద్యా సంస్కరణలను లబ్ధి పొందిన విద్యార్థులే స్వయంగా వివరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థుల బృందం అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొని చరిత్ర సృష్టించింది. వరల్డ్ బ్యాంకు ప్రతినిధులతో సమావేశంలో ప్రపంచ బ్యాంక్ సీనియర్ అనలిస్ట్ ట్రేసీ విల్లిచౌస్కీ, సీనియర్ ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్ లారా గ్రెగొరీ, లీడ్ హెల్త్ స్పెషలిస్ట్ రిఫత్ హసన్, పబ్లిక్ ఎంగేజ్‌మెంట్ ఆఫీసర్ లిలౌతో పాటు సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు, కేజీబీవీ కార్యదర్శి మధుసూదనరావు, ఉత్తర అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్ పాల్గొన్నారు.

'పరిపాలన'కు విశాఖ ముస్తాబు

- హిల్-3లో 2 లక్షల చ.అ. భవనాల గుర్తింపు
- ప్రభుత్వ కార్యాలయాల కోసం అనువైనవని అంచనా
- హిల్-1, 2లో నివాస భవనాలు అధికారులకు!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: దసరా వచ్చిందయ్యా.. పరిపాలన రాజధాని తెచ్చిందయ్యా అంటూ విశాఖ నగరం అందంగా ముస్తాబవుతోంది! వివిధ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు అధికారులకు నివాస భవనాలను సిద్ధం చేసే ప్రక్రియ వేగవంతమైంది. హిల్-3లో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన భవనాలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయని గుర్తించినట్లు తెలుస్తోంది. హిల్ 1, 2ల్లో నివాసయోగ్యమైన భవనాలను అధికారులకు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. అక్టోబరు చివరినాటికి నిర్మాణం పూర్తయ్యే పలు భవనాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

తుది దశ భవనాల వివరాల సేకరణ

విశాఖ కేంద్రంగా పరిపాలన రాజధానిని ఏర్పాటు చేస్తామని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గతంలోనే ప్రకటించారు. ఈ క్రమంలో అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. హిల్ 1, 2ల్లో నివాసయోగ్యమైన భవనాల విస్తీర్ణం సుమారు 40 వేల చదరపు అడుగుల మేర ఉంటుందని లెక్కగట్టారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వివిధ ప్రైవేట్ భవనాలను కూడా గుర్తించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ప్రధానంగా రానున్న రెండు నెలల్లోగా పూర్తయ్యే భవనాలపై దృష్టి సారించారు. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగంతో పాటు స్థానిక సచివాలయాల ద్వారా ఈ వివరాలను సేకరిస్తున్నారు. వీటి విస్తీర్ణం ఎంత మేర ఉంటుందనే వివరాలు ఈ నెలాఖరు నాటికి సిద్ధమవుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ వివరాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత వాటిని లీజుకు తీసుకుని ఏయే విభాగాలను ఏర్పాటు చేయవచ్చనే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. ఇప్పటికే ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న అదనపు విస్తీర్ణం ఎంత? అక్కడ ఏ విభాగాలను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది? అనే వివరాలను కూడా అధికారులు సిద్ధం చేస్తున్నారు.

హెల్త్ అకౌంట్లకు రికార్డుల లింక్‌లో ఏపీ నంబర్ 1

- రాష్ట్ర వైద్య శాఖకు నాలుగు జాతీయ అవార్డులు
- జిల్లాల విభాగంలో విశాఖ, ఏలూరుకు అవార్డు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏబీడీఎం అమలులోనూ పురస్కారం
- ఏబీ-పీఎంజేఏవై నిధులు 100 శాతం వినియోగంలోనూ మరో అవార్డు

సాక్షి, అమరావతి: ప్రజలకు పేపర్ రహిత వైద్య సేవలు అందించడంతోపాటు ఏబీ-పీఎంజేఏవైలో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్ర వైద్య శాఖకు జాతీయ స్థాయిలో నాలుగు అవార్డులు లభించాయి. ఆరోగ్య మంథన్-2023 ఉత్సవాల్లో భాగంగా ఢిల్లీలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, డిప్యూటీ డైరెక్టర్ బి.వి.రావు, డాక్టర్ కోటిరెడ్డి మంగళవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవీయా నుంచి ఈ అవార్డులను అందుకున్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) కింద అత్యధిక మంది ప్రజల హెల్త్ అకౌంట్లకు ఆరోగ్య రికార్డులను లింక్ చేసినందుకు దేశంలో ఏపీ మొదటి ర్యాంక్ కైవసం చేసుకుంది. హెల్త్ అకౌంట్లకు రికార్డుల లింక్‌లో జిల్లాల విభాగంలోనూ ఏపీకి అవార్డు లభించింది. ఈ విభాగంలో విశాఖ జిల్లా దేశంలో రెండో ర్యాంకు, ఏలూరు జిల్లా మూడో ర్యాంకు పొందాయి. ప్రైవేటుఆస్పత్రుల్లో ఏబీడీఎం అమలులో భాగంగా అత్యధిక మైక్రోసైట్స్‌ను ఏర్పాటు చేసినందుకు, ఏబీ-పీఎంజేఏవై నిధులను 100 శాతం వినియోగించినందుకు మరో రెండు అవార్డులు వచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ నివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిశానిర్దేశంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి పౌరుడి ఆరోగ్య వివరాలను డిజిటలైజేషన్ చేసేలా 4.19 కోట్ల మందికి హెల్త్ అకౌంట్‌లు సృష్టించామన్నారు. 4.52 కోట్ల హెల్త్ రికార్డులను అనుసంధానం చేసినట్లు తెలిపారు.

ఇక టాప్ గేర్!

ఆర్నెల్లు కీలకం.. సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లకు సీఎం జగన్ దిశానిర్దేశం

సాక్షి, అమరావతి: శాసనసభ సమావేశాలు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో ఇక మనం గేర్ మార్చాల్సిన సమయం ఆసన్నమైందని పార్టీ నేతలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఇన్ని రోజులు మనం చేసిన ప్రచారం, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఒక ఎత్తు కాగా శాసనసభ సమావేశాలు ముగిశాక నిర్వహించే కార్యక్రమాలు, ఎన్నికలకు సన్నద్ధమయ్యే తీరు ఇంకొక ఎత్తు అని పేర్కొన్నారు. ఇన్ని రోజులు మనం బాగా చేశాం కదా..! వచ్చే ఆరు నెలలు సరిగా పని చేయకపోయినా పర్వాలేదనే భావన సరి కాదని హితవు పలికారు. రానున్న ఆర్నెల్లు ఎలా పని చేస్తామన్నదే చాలా ముఖ్యమైన విషయమని, ఇది మనసులో పెట్టుకుని ప్రతి అడుగూ ముందుకు వేయాలని పార్టీ నేతలకు సూచించారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్సీలతో ముఖ్యమంత్రి జగన్ సమావేశమయ్యారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఏపీకి జగనే కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) అనే పేరుతో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై వచ్చే రెండు నెలల్లో నిర్వహించే ప్రచారంపై చర్చించారు. ఎన్నికలకు సన్నద్ధం కావాల్సిన తీరుపై పార్టీ నేతలకు మార్గనిర్దేశం చేశారు. సమావేశంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

సాధ్యమేనని నేను గతంలోనే చెప్పా

నేను ఇంతకు ముందే చెప్పా.. 175కు 175 స్థానాల్లో గెలుపు ఎందుకు సాధ్యం కాదు? వైనాట్ 175? ఇది సాధ్యమే. క్షేత్రస్థాయిలో అందుకు తగ్గ సానుకూల పరిస్థితులు ఉన్నాయి కాబట్టే ఇది సాధ్యం. మనం క్షేత్ర స్థాయిలో అంత బలంగా ఉన్నాం కాబట్టే ప్రతిపక్షాలు ఒంటరిగా పోటీ చేయలేక, భయపడి పొత్తులకు వెళ్తున్నాయి. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో మన పార్టీ పట్ల, ప్రభుత్వం పట్ల ప్రజల సానుకూల స్పందనను మీరంతా కళ్లారా చూశారు. ప్రతి ఇంటికీ మీరు వెళ్లినప్పుడు, అక్కచెల్లెమ్మలకు లేఖలను అందించినప్పుడు వారిలో వచ్చిన స్పందనను మీరు చూశారు. ఇదే ఆత్మవిశ్వాసం, ఇదే ధైర్యం, ఇదే ముందు చూపు, ఇదే ముందస్తు ప్రణాళికతో అందరూ అడుగులు ముందుకేయాలి. అందుకనే ఇంతకుముందు చేసిందంతా ఒక ఎత్తు, ఈ ఆరు నెలల్లో మనం చేయబోయేది మరొక ఎత్తు! ప్రజలతో నిరంతరం సంబంధాలు నెరపుతూ వారితో మమేకమై ఉండడం ఒక ముఖ్యమైన విషయం కాగా.. ఆర్గనైజేషన్, ప్లానింగ్, వ్యూహాలు మరొక ముఖ్యమైన అంశాలు. వీటికి సంబంధించిన ప్రతి అడుగు రాబోయే రోజుల్లో వేయాలి. రాబోయే రోజుల్లో పరిశీలకులు, ప్రాంతీయ సమన్వయకర్తలు ఇంకా క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ప్రతి నియోజక వర్గంలో విభేదాలు లేకుండా చూసుకోవడం అన్నది చాలా ముఖ్యమైన అంశం. గ్రామ, మండల స్థాయి నాయకుల్లో ఎలాంటి విభేదాలున్నా వాటిన్నింటినీ పరిష్కరించుకుని, సమన్వయపర్చుకుని అడుగులు వేయించాలి. వచ్చే ఆర్నెల్లు వీటిపై దృష్టి పెట్టాలి.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు

> ప్రజల్లో... ఎవరికి ఇస్తే సరైంది? అనే ప్రతిపాదికనే టిక్కెట్లు ఇస్తా. టికెట్టు ఇవ్వనంత మాత్రాన.. ఆ మనిషి నా మనిషి కాకుండా పోతాడని అనుకోవద్దు. టికెట్ ఇస్తే అది ఒక బాధ్యత. టికెట్ వచ్చినా, రాకున్నా మీరు ఎప్పటికీ నా వాళ్లుగానే ఉంటారు. అది కచ్చితంగా గుర్తు పెట్టుకోండి. జుత్తు ఉంటేనే ముడివేసుకోగలం. అధికారంలో ఉంటేనే ప్రజలకు మరింత మంచి చేయగలం. టికెట్ ఇవ్వలేని పక్షంలో వారికి మరొకటి ఇస్తా. లీడర్ మీద, పార్టీ మీద నమ్మకం ఉంచాలి. అప్పుడే అడుగులు సరైన మార్గంలో పడతాయి. టికెట్ల విషయంలో నేను తీసుకోబోయే నిర్ణయాలకు అందరూ పెద్ద మనసుతో సహకరించాలి.
> - సీఎం వైఎస్ జగన్

ప్రజల్లో.. ఎవరికిస్తే సరైందనే ప్రాతిపదికనే టికెట్లు..

మరో విషయాన్ని కూడా గుర్తు పెట్టుకోవాలి. మనం అంతా ఒక కుటుంబంలో సభ్యులమే. చాలా మందికి తిరిగి టికెట్లు రావొచ్చు.. కొంతమందికి ఇవ్వలేకపోవచ్చు. ప్రజల్లో మీరు ఉన్న పరిస్థితులను బట్టి.. మనం వేసే అడుగులు బట్టి.. ఏది కరెక్ట్? ఎవరికి ఇస్తే కరెక్ట్? అనే ప్రాతిపదికన నిర్ణయాలను తీసుకోవచ్చు. సర్వేలు కూడా దాదాపు తుది దశలోకి వస్తున్నాయి. చివరి దశ సర్వేలు కూడా జరుగుతుంటాయి. రానున్న రెండు నెలలు అందరూ ఎంత ఎక్కువగా ప్రజల్లో ఉంటే అంత మంచి ఫలితాలు మీపట్ల వస్తాయి. అందుకనే ప్రజల్లో మమేకమై ఉండండి.

2 నెలలు.. 2 భారీ కార్యక్రమాలు

వచ్చే రెండు నెలలకు సంబంధించి రెండు భారీ కార్యక్రమాలను చేపడుతున్నాం. జగనన్న ఆరోగ్య సురక్ష, ఏపీకి జగనే కావాలి అనే కార్యక్రమాలను పార్టీ నుంచి చేపడుతున్నాం. ఏపీకి జగనే కావాలి కార్యక్రమం ద్వారా గత నాలుగేళ్లకుపైగా ఆ గ్రామంలో జరిగిన అభివృద్ధిని చాలా స్పష్టంగా చూపిస్తాం. గతంలో మనం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం చాలా సానుకూల ఫలితాలను ఇచ్చింది. దాదాపు 98 లక్షల సర్టిఫికెట్లు ఇచ్చాం. లబ్ధిదారులందరినీ జల్లెడ పట్టి వారందరికీ సహాయ, సహకారాలు అందిస్తూ మంచి చేయగలిగాం. అర్హులైనవారికి అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేశాం. దీనిలాగే ఆరోగ్య సురక్షను చేపడుతున్నాం.

ఐదు దశల్లో జగనన్న ఆరోగ్య సురక్ష..

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆరోగ్య పరంగా ప్రతి ఇంటినీ జల్లెడపడతాం. ప్రతి ఇంట్లోనూ పరీక్షలు చేస్తాం. ఉచితంగా మందులు ఇస్తాం. గుర్తించిన వారికి చేయూతనిచ్చి వారికి మెరుగైన చికిత్సలు అందిస్తాం. నయం అయ్యేంతవరకూ విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో వారికి చేయూతనిస్తాం. ఇది కూడా మరొక విప్లవాత్మకమైన కార్యక్రమం. ఇందులో ప్రజా ప్రతినిధులను, పార్టీ శ్రేణులను మమేకం చేస్తాం.
- మొత్తం ఐదు దశల్లో జగనన్న సురక్షకార్యక్రమం జరుగుతుంది. మొదటి దశలో వలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తారు.
- రెండో దశలో ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు, ఆశావర్కర్లు ప్రతి ఇంటికీ పరీక్షలు చేయడానికి వెళ్తారు. ఆరోగ్యశ్రీని ఎలా ఉపయోగించుకోవాలి? అన్న దానిపై కూడా అవగాహన కల్పిస్తారు.
- మూడో దశలో వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు క్యాంపు ఏర్పాటు తేదీ, వివరాలు తెలియజేస్తారు. క్యాంపు కన్నా మూడు రోజులు ముందు ఈ కార్యక్రమం జరుగుతుంది.
- నాలుగో దశలో క్యాంపులను ఏర్పాటు చేస్తారు. దీని తర్వాత ఐదో దశలో అనారోగ్యంతో ఉన్నవారిని గుర్తించి వారికి నయం అయ్యేంతవరకూ చేయూత నిస్తారు. ఇప్పటికే కార్యక్రమం మొదలయ్యింది. పూర్తిస్థాయి అవగాహనకోసం ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నాం. ఈ రెండు కార్యక్రమాల్లో కేడర్‌ను, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులను, వలంటీర్లను పాల్గొనేలా ఇన్వాల్వ్ చేస్తున్నాం. కాబట్టి ఈ కార్యక్రమం గురించి మీకు పూర్తి అవగాహన ఉండాలి. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనాలి.
- నవంబర్ చివరికి గడప గడపకూ కార్యక్రమాన్ని పూర్తిచేయాలి. ఆ తర్వాత మిగిలిన కార్యక్రమాల్లో మమేకం కావాలి.

ఫైబర్ నెట్‌లో రూ.114 కోట్లు దోచేశారు

- అసెంబ్లీలో చర్చలో మంత్రి గుడివాడ అమర్నాథ్
- రెండు శాతం వాటా అమ్మితే రూ.400 కోట్లు వస్తాయంటారా?
- రెండు ఎకరాల బాబుకు అన్ని వేల కోట్లు, వ్యాపారాలు ఎలా వచ్చాయి?

సాక్షి, అమరావతి: ఫైబర్‌నెట్ స్కామ్‌లో మాజీ సీఎం చంద్రబాబు రూ.114 కోట్లకుపైగా ప్రజాధనాన్ని లూటీ చేశారని, ఇది ఒక కేస్ స్టడీ లాంటిదని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యానించారు. 2015 సెప్టెంబర్ నుంచి 2018 వరకు ఈ కుంభకోణం జరిగిందన్నారు. 2021లో ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైనట్లు చెప్పారు. చంద్రబాబు తన ఓఎస్‌డీ అభీష్ట ద్వారా ఈవీఎంల దొంగ వేమూరి హరికృష్ణప్రసాద్‌ని మెంబర్ ఆఫ్ గవర్నింగ్ కౌన్సిల్‌గా నియమించాలని ఐటీ కార్యదర్శికి లేఖ రాశారని చెప్పారు. ప్రాజెక్టు సాంకేతిక మదింపు కమిటీ, టెండర్ మదింపు కమిటీలోనూ హరికృష్ణప్రసాద్ సభ్యుడిగా ఉన్నాడని తెలిపారు. హెరిటేజ్ సంస్థల్లో డైరెక్టర్‌గా పనిచేసిన దేవినేని సీతారామయ్య 2000 సెప్టెంబర్ 30 నుంచి 2014 వరకు టెరా సాఫ్ట్ సంస్థకు 14 ఏళ్లు డైరెక్టర్‌గా ఉన్నారని వెల్లడించారు. ఫైబర్‌నెట్ ప్రాజెక్టుపై మంగళవారం అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు.

బ్లాక్ లిస్టు కంపెనీకి టెండర్

అప్పటిదాకా బ్లాక్ లిస్టులో పెట్టిన టెరా సాఫ్ట్‌ను రూ.333 కోట్ల బిడ్డింగ్ ముగియటానికి ఒక్క రోజు ముందు బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించారు. అప్పటి ఏపీటీఎస్ వీసీ అండ్ ఎండీ సుందర్ దీనిపై అభ్యంతరం తెలిపితే ఆయన్ను బదిలీ చేశారు. టెండర్ ప్రక్రియ ముగిశాక హరికృష్ణప్రసాద్‌ను టెరా మీడియా క్లౌడ్ సొల్యూషన్స్ నుంచి డైరెక్టర్‌గా తొలగించారు. ఈ స్కామ్ పూర్తిగా చంద్రబాబు కనుసన్నల్లోనే జరిగింది. ఏపీఎస్ఎఫ్ఎల్ నుంచి టెరా సాఫ్ట్‌కి రూ.284 కోట్లు విడుదల చేయగా అందులో రూ.117 కోట్లు ఫాస్ట్ లైన్ అనే సంస్థకి ఇచ్చారు. ఆగస్టులో టెండర్లు జరిగితే సెప్టెంబర్‌లో ఆ కంపెనీ ఏర్పాటైంది. నెట్‌వర్క్, ఎక్స్‌వైజెడ్, కాపీ మీడియా లాంటి షెల్ కంపెనీల ద్వారా డబ్బును బదిలీ చేశారు. ఈ డబ్బంతా హరికృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులు వేమూరి అభిజ్ఞ, వేమూరి నీలిమ తదితరులకు వెళ్లినట్లు తేలింది. ఈ కంపెనీలన్నింటి చిరునామా, టెరా సాఫ్ట్‌వేర్ అడ్రస్ ఒక్కటే. అప్పటికప్పుడు సృష్టించిన షెల్ కంపెనీల ద్వారా డబ్బులను తరలించారు. పెండ్యాల శ్రీనివాస్ ద్వారా ఈ డబ్బంతా చంద్రబాబు వద్దకు చేరింది. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి సీమెన్స్ వెబ్‌సైట్‌లో ఏపీ ప్రాజెక్టు గురించి ఎక్కడా లేదు. గుజరాత్, మధ్యప్రదేశ్, కర్నాటక ప్రాజెక్టుల గురించి మాత్రమే ఉంది. తమకున్న వ్యాపార సంస్థలో 2 శాతం అమ్మేస్తే రూ.400 కోట్లు వస్తాయని బాబు సతీమణి అంటున్నారు. ఆ వ్యాపారాలు ఉండడానికి ఆమె భర్త బ్యాక్‌గ్రౌండ్ ఏమిటి? 2 శాతం అమ్మితేనే రూ.400 కోట్లు వస్తాయంటే వంద శాతం అమ్మేస్తే రూ. 20 వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? చంద్రబాబు రెండు ఎకరాల నుంచి ఈ స్థాయికి ఎలా ఎదిగారు?

అన్నీ అవకతవకలే: వేణుగోపాల్, ఎమ్మెల్యే

టెండర్లలో నిబంధనలను పాటించలేదు. ఇతర సంస్థలతో కన్సార్టియమ్‌గా ఏర్పడి టెరాసాఫ్ట్ వేసిన టెండర్ డాక్యుమెంట్లు సరైనవి కాకపోవడంతో ఇతరులు అభ్యంతరం తెలిపారు. ఈ స్కామ్‌కు ప్రత్యక్ష సాక్షిని, బాధితుడిని నేనే కనుక ఈ విషయాలు స్పష్టంగా చెప్పగలుగుతున్నా.

సూత్రధారులు బాబు, లోకేశ్‌లే: అబ్బయ్యచౌదరి, దెందులూరు ఎమ్మెల్యే

ఫైబర్ గ్రిడ్ స్కామ్ సూత్రధారులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు నారా లోకేశ్‌లే. వేమూరి హరికృష్ణ ప్రసాద్ ద్వారా వీరు దోపిడీకి పాల్పడ్డారు. టెండర్లలోనే కాకుండా నాసిరకం పరికరాలతో ప్రజాధనాన్ని దోచేశారు.

బాబు అవినీతిని ఎవరు కట్ చేస్తారు?

(ఫైబర్ గ్రిడ్ స్కామ్‌పై 26.3.2016న ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ అసెంబ్లీలో ఏమన్నారో తాజాగా సభలో ప్రదర్శించారు) 'చంద్రబాబు ఫైబర్ ఆప్టిక్ కేబుల్ ప్రాజెక్టును రూ.333 కోట్లకు ఎంత దారుణంగా ఇచ్చారో, ఇందులో ఎన్ని వందల కోట్ల స్కామ్ జరిగిందో చెబుతా. చౌక దుకాణాల్లో ఈ-పోస్ యంత్రాలను అమర్చడంలో విఫలమై బ్లాక్ లిస్టులో పెట్టిన టెరా సాఫ్ట్‌వేర్ లిమిటెడ్ అనే సంస్థకు ఫైబర్ గ్రిడ్ పనులను రూ.333 కోట్లకు ఎలా అప్పగించారో చంద్రబాబుకే తెలియాలి. హెరిటేజ్‌తో సంబంధాలున్న వేమూరి హరికృష్ణప్రసాద్‌కి టెరా సాఫ్ట్‌తో అనుబంధం ఉంది. ఈవీఎంల దొంగతనం కేసు నమోదైన వ్యక్తికి చెందిన సంస్థకు ఈ ప్రాజెక్టును ఇచ్చారు. టెండర్ల పర్యవేక్షణ కమిటీలో ఆయన్ను సభ్యుడిగా నియమించారు. ఆయనే టెరా మీడియా క్లౌడ్ సొల్యూషన్స్ సంస్థ డైరెక్టర్‌గానూ వ్యవహరిస్తున్నాడు. పర్యవేక్షణ కమిటీ సభ్యుడుగా ఉంటూ తన సొంత సంస్థ టెరా సాఫ్ట్‌కు పనులు ఇచ్చేసుకున్నారు. హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న దేవినేని సీతారామయ్య 2014 సెప్టెంబర్ 30 వరకు టెరా సాఫ్ట్‌వేర్‌లోనూ డైరెక్టర్‌గా పనిచేశాడు. అదే సంస్థకు ఫైబర్ ఆప్టికల్ పనుల్ని చంద్రబాబు అప్పగించారు. వేమూరి హరికృష్ణప్రసాద్, చంద్రబాబు కుటుంబం మధ్య సన్నిహిత సంబంధాలున్నట్లు తేటతెల్లమవు తుంటే ఇక ఇది ఏ రకంగా పారదర్శకం? ఇది సబబేనా? పెన్షన్లు, ఇళ్ల విషయంలో ఒకటో అరో అవినీతి జరిగితే కట్ చేయాలంటాడు చంద్రబాబు. మరి ఆయనే దగ్గరుండి చేస్తున్న అవినీతిని ఎవరు కట్ చేస్తారు?' అని అప్పట్లో వైఎస్ జగన్ పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ప్రభుత్వానికి అసైన్డ్ రైతుల జేజేలు

1,094వ రోజు దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి రైతులు జేజేలు పలుకుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 1,094వ రోజుకు చేరాయి. నాయకులు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి తీసుకోని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ బహుజన హక్కులకు పెద్దపీట వేస్తున్న సీఎం జగన్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. నాయకులు బొలిమేర శ్యామ్యూల్, బట్టు రవి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, పల్లె బాబు, కారుమూరి పుష్పరాజు, మాదిగాని గురునాథం పాల్గొన్నారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో లోకేశ్ భేటీ

- ఢిల్లీలో మీడియాతో నారా లోకేశ్
- ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఫైబర్‌నెట్‌తో నాకేం సంబంధం?



రాష్ట్రపతికి వినతిపత్రం ఇస్తున్న లోకేశ్, ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసు సహా ఇన్నర్ రింగ్, ఫైబర్‌నెట్ కేసులతో తనకేంటి సంబంధమని టీడీపీ నేత నారా లోకేశ్ ప్రశ్నించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు లేకపోయినప్పటికీ ఆ కేసు ఎలా పెట్టారో తనకు అర్థం కావడం లేదన్నారు. రోజుకో కేసు, రోజుకో తప్పుడు ప్రచారంతో ప్రభుత్వం వేధిస్తోందని, దీనికి తప్పకుండా రిటర్న్ గిఫ్ట్ ఇచ్చే బాధ్యత తీసుకుంటానని వ్యాఖ్యానించారు. లోకేశ్, టీడీపీ ఎంపీలు కేశినేని నాని, కనకమేడల రవీంద్ర, గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు. కక్ష సాధింపులో భాగంగా చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి, నిబంధనలు పాటించకుండా అరెస్ట్ చేశారని రాష్ట్రపతికి వివరించామని చెప్పారు. 2019 తర్వాత టీడీపీ నేతలపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు, అరెస్ట్ అంశాలను రాష్ట్రపతికి తెలియజేశామని, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తమ వద్ద ఉన్న ఆధారాలని ఆమెకు అందజేశామని చెప్పారు.

బాబుకు బెయిల్ రాకుండా అవరోధాలు సృష్టిస్తున్నారు

రాష్ట్ర మాజీ హోంమంత్రి చినరాజప్ప

సాక్షి, రాజమహేంద్రవరం: మాజీ సీఎం చంద్రబాబుకు బెయిల్ రాకుండా అవరోధాలు సృష్టిస్తున్నారని రాష్ట్ర మాజీ హోంమంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించారు. రాజమహేంద్రవరంలో ఉన్న చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణిలను చినరాజప్ప మంగళవారం పరామర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుకు మద్దతుగా సీతానగరంలో బుధవారం నిర్వహించనున్న నిరసన దీక్షలో భువనేశ్వరి పాల్గొంటారని చెప్పారు. సినీ నిర్మాత అశ్వనీదత్, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ కూడా భువనేశ్వరి, బ్రాహ్మణిలను పరామర్శించారు. కాగా, స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న చంద్రబాబు జైలు జీవితం మంగళవారం 17వ రోజుకు చేరింది.

'మార్గదర్శి కేసు' వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించారంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై దాఖలైన పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. మంగళవారం వీటిని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ముందుకు వచ్చాయి. విచారణ 2 వారాలు వాయిదా వేయాలని లిఖిత పూర్వకంగా కోరినట్లు రామోజీరావు తరపు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. తదుపరి విచారణ వీలైనంత త్వరగా తేదీని ఇవ్వాలని, అక్టోబర్ 10కు వాయిదా వేయాలని ఉండవల్లి అరుణ్‌కుమార్ తరపు న్యాయవాది రమేశ్ అల్లంకి కోరారు. తదుపరి విచారణ తేదీని తాము నిర్ణయించి చెబుతామని ధర్మాసనం పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది.

కేంద్రానికి తెలిసే బాబు అరెస్టు

- సీపీఎం నేతలు బేబీ, రాఘవులు

సాక్షి, అమరావతి: చంద్రబాబు కేసు కేంద్రానికి తెలియకుండా జరగదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసే ఆయన్ను అరెస్టు చేయించినట్లు వార్తలు వస్తున్నాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబీ, బీవీ రాఘవులు అన్నారు. కేంద్ర నిఘా సంస్థల సూచనల మేరకే తాము చర్యలు తీసుకుంటున్నామని సీఐడీ కూడా నివేదికలో పేర్కొందని తెలిపారు. విజయవాడలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును అరెస్టు చేసిన పద్ధతి బాగాలేదని, విచారణలో వాస్తవాలు వెల్లడవుతాయని చెప్పారు.

అప్పటి ప్రభుత్వ పెద్దల పరస్పర లబ్ధి కోసమే

ఐఆర్ఆర్ భూ దోపిడీ

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టీకరణ

- కుటుంబానికి, పార్టీకి లబ్ధి చేకూర్చేలా సహకరించుకున్నారు
- సీఐడీ పోలీసు కస్టడీ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా బెయిల్ సరికాదు
- ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు డీఫాల్ట్ కస్టడీలో ఉన్నట్లు కాదు
- అందుకే ఏసీబీ కోర్టులో సీఐడీ పీటీ వారెంట్ దాఖలు చేసింది
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్
- రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కేసులని చెప్పిన బాబు న్యాయవాదులు
- సమష్టి నిర్ణయాలకు నేర స్వభావాన్ని ఆపాదిస్తున్నారని వాదన.. విచారణ నేటికి వాయిదా



సాక్షి, అమరావతి: అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) భూ దోపిడీ వ్యవహారంలో అప్పటి సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబుపై నమోదు చేసిన కేసు అప్పటి ప్రభుత్వ పెద్దల పరస్పర సహకారానికి సంబంధించినదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా నమోదు చేసిన కేసు అని చంద్రబాబు తరపు న్యాయవాది చేసిన వాదనను తోసిపుచ్చింది. ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో కుటుంబానికి, పార్టీకి, సన్నిహితులకు లబ్ధి చేకూర్చేందుకు అప్పటి ప్రభుత్వ పెద్దలు పరస్పరం సహకరించుకున్నారని రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో అప్పటి ప్రభుత్వ పెద్దలు సాగించిన భూదోపిడీపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఎం చంద్రబాబు, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, బాబు సన్నిహితులు, వ్యాపారవేత్తలు లింగమనేని రమేష్, లింగమనేని వెంకట సూర్య రాజశేఖర్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ డైరెక్టర్ అంజనీ కుమార్ తదితరులపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ చంద్రబాబు హైకోర్టులో ఇటీవల దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం విచారణ జరిపారు. ప్రభుత్వం తరపున ఏజీ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు పోలీసు కస్టడీ కోరుతూ తాము దాఖలు చేసిన పిటిషన్ ఏసీబీ కోర్టులో పెండింగ్‌లో ఉండగా, ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపడానికి వీల్లేదని తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు డీఫాల్ట్ కస్టడీలో ఉన్నట్లు భావించడానికి వీల్లేదన్నారు. చంద్రబాబు ఇప్పటికే అరెస్టయిన నేపథ్యంలో ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఆయన డీఫాల్ట్‌గా కస్టడీలో ఉన్నట్లు భావిస్తూ ఆయన న్యాయవాదులు ప్రస్తావిస్తున్న తీర్పులు ఇక్కడ వర్తించవన్నారు. ఈ కేసులో సీఐడీ పీటీ వారెంట్, మరో కేసులో పోలీసు కస్టడీ పిటిషన్ దాఖలు చేసిందని చెప్పారు. చంద్రబాబు డీఫాల్ట్ కస్టడీలో ఉన్నట్లు భావించడంలేదు కాబట్టే, ఏసీబీ కోర్టులో సీఐడీ పీటీ వారెంట్ దాఖలు చేసిందని చెప్పారు. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టులో మినీ ట్రయల్ నిర్వహించడానికి వీల్లేదన్నారు. కింది కోర్టుకెళ్లకుండా నేరుగా హైకోర్టుకు రావడానికి వీల్లేదని తెలిపారు. కోర్టు సమయం ముగియడంతో న్యాయస్థానం శ్రీరామ్ వాదనల నిమిత్తం తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. మధ్యాహ్నం 2.15 గంటలకు విచారణ జరుపుతామని న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అంతకు ముందు చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ కేసు నమోదు చేశారన్నారు. గత ప్రభుత్వం, అధికారులు సమష్టిగా తీసుకున్న నిర్ణయాలకు నేర స్వభావాన్ని ఆపాదిస్తున్నారని తెలిపారు. అసలు ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణమే జరగలేదని, ఎలాంటి భూమినీ సేకరించలేదని, ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. హెరిటేజ్ కంపెనీతో చంద్రబాబుకు ప్రత్యక్ష సంబంధం లేదన్నారు. అది లిస్టింగ్ కంపెనీ అని, లక్షల మంది వాటాదారులున్నారని తెలిపారు. వ్యాపార విస్తరణలో భాగంగా 2014లో ఆ కంపెనీ అమరావతి పరిధిలో కొన్న భూమి రింగ్ రోడ్డుకు 9 కి.మీ. దూరంలో ఉందన్నారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పు ద్వారా వ్యాపారవేత్త లింగమనేని రమేష్‌కు లబ్ధి చేకూర్చారని, అందులో భాగంగానే కరకట్ట వద్ద ఉన్న ఇంటిని చంద్రబాబుకు ఇచ్చారని సీఐడీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. లింగమనేని రమేష్ ఖాతాలో జమ చేసిన రూ.27 లక్షలు అవినీతి సొమ్ము కాదని, ఈ డబ్బు చంద్రబాబు తను ఉంటున్న ఇంటికి చెల్లించిన అద్దె మొత్తమని తెలిపారు.

సుప్రీంకోర్టులో నేడు చంద్రబాబు పిటిషన్ విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (క్రిమినల్)ను బుధవారం సుప్రీంకోర్టు విచారించనుంది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరపనుంది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో తనను అరెస్టు చేసే ముందు గవర్నర్ నుంచి అనుమతి తీసుకోలేదని చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించగా, పిటిషన్ కొట్టివేసిన విషయం విదితమే. అందువల్లే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి 2014లో ఏపీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులు కావడం వల్ల ఈ పిటిషన్ విచారణ ధర్మాసనంలో ఉంటారా? వైదొలుగుతారా? అనేది న్యాయవర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.



▶ మొదటి పేజీ తరువాయి

సీడ్ క్యాపిటల్‌లో పొందిన 75,888 చ.గజాల ప్లాట్లు, కౌలు మొత్తంగా పొందిన రూ.1.92 కోట్లను అటాచ్ చేయాలని ఇప్పటికే నిర్ణయించింది. ఈమేరకు న్యాయస్థానంలో పిటిషన్ కూడా దాఖలు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఏ-1గా చంద్రబాబు, ఏ-2గా నారాయణను పేర్కొన్న సిట్ నారా లోకేశ్‌ను ఏ-14గా పేర్కొంటూ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో మంగళవారం ప్రత్యేక మెమో దాఖలు చేసింది. లింగమనేని రమేశ్, రాజశేఖర్‌లతోపాటు హెరిటేజ్ ఫుడ్స్ సంస్థను కూడా ఈ కేసులో నిందితులుగా పేర్కొంది.

ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో అవినీతి మెలికలు

అమరావతి ముసుగులో చంద్రబాబు సాగించిన భారీ భూదందాలో ఐఆర్ఆర్ కుంభకోణం ఓ భాగం! మాజీ మంత్రి పొంగూరు నారాయణతో పాటు లోకేశ్ ఈ కుంభకోణంలో కీలక పాత్ర పోషించారు. చంద్రబాబు తమ బినామీ, సన్నిహితుడైన లింగమనేని రమేష్‌తో క్విడ్ ప్రోకోకు పాల్పడి ఆయన భూముల విలువను భారీగా పెరిగేలా చేశారు. అందుకు ప్రతిగా బినామీల పేరిట భారీగా భూములను పొందడమే కాకుండా కరకట్ట నివాసంతోపాటు హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు కానుకగా దక్కించుకున్నారు. నాడు సీఆర్‌డీఏ అధికారులు రూపొందించిన 94 కి.మీ. అమరావతి ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌పై చంద్రబాబు, నారాయణ మండిపడ్డారు. ఆ అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్ రింగ్ రోడ్డు అమరావతిలోని పెదపరిమి, నిడమర్రు, చినవడ్లపూడి, పెదవడ్లపూడి మీదుగా వెళ్తుంది. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి చెందిన భూములకు 3 కి.మీ. దూరం నుంచి దాన్ని నిర్మించాల్సి వస్తుంది. దీంతో తమ భూముల విలువ అమాంతం పెరగదని వారు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారి ఆదేశాలతో సీఆర్‌డీయే అధికారులు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. చంద్రబాబు, లింగమనేని కుటుంబానికి చెందిన వందలాది ఎకరాలున్న తాడికొండ, కంతేరు, కాజను పరిగణనలోకి తీసుకున్నారు. అందుకోసం ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కిలోమీటర్లు దక్షిణానికి జరిపారు. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి కంతేరు, కాజలో ఉన్న భూములను ఆనుకుని ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా 97.50 కి.మీ. అలైన్‌మెంట్‌ను రూపొందించారు. అయితే ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు. అనంతరం సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యూరాంగ్ కన్సల్టెన్సీని రంగంలోకి తెచ్చి అప్పటికే ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్ డిజైన్‌ను అమరావతి మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. ఎస్టీయూపీ అనే కన్సల్టెన్సీని నియమించి మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగా ఉండాలని ఆదేశించారు. అప్పటికే సీఆర్‌డీయే అధికారుల ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించేలా చేశారు. ఈ క్రమంలో తాడికొండ, కంతేరు, కాజలో హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకుని అలైన్‌మెంట్‌ను ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసింది.

హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు

ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మెలికలు తిప్పడం ద్వారా లింగమనేని కుటుంబం భూముల విలువను భారీగా పెరిగేలా చేశారు. కంతేరు, కాజలో లింగమనేని కుటుంబానికి ఉన్న 355 ఎకరాలను ఆనుకునే అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. అందుకు ప్రతిగా అదే ప్రాంతంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములను పొందారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని కంతేరులో హెరిటేజ్ ఫుడ్స్‌కు 10.4 ఎకరాలు పొందగా 2014 జూన్ నుంచి సెప్టెంబరు మధ్యలో కొనుగోలు చేసినట్టు చూపించారు. లింగమనేని కుటుంబ నుంచి మరో 4.55 ఎకరాలను కొనుగోలు పేరిట హెరిటేజ్ ఫుడ్స్ దక్కించుకుంది. అప్పటికే ఈ కుంభకోణం గురించి బయటకు పొక్కడంతో ఆ సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని లింగమనేని కుటుంబానికి చెందిన 355 ఎకరాలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉండటం గమనార్హం.

లోకేశ్ కీలక 'భూ'మిక

క్విడ్‌ప్రోకోకు పాల్పడి హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములను దక్కేలా చేయడంలో లోకేశ్ కీలక భూమిక పోషించారు. ఆయన 2008 జూలై 1 నుంచి 2013 జూన్ 29 వరకు హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా ఉన్నారు. అనంతరం 2017 మార్చి 31 వరకు నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని కొనుగోలు పేరిట భూములను దక్కించుకోవాలని నిర్ణయించిన హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో లోకేశ్ కూడా పాల్గొన్నారు. క్విడ్ ప్రోకో కింద భూములను పొందే ప్రక్రియలో ఆయన కీలక భూమిక పోషించారు. లోకేశ్ పేరిట హెరిటేజ్ ఫుడ్స్‌లో 23,66,400 షేర్లు ఉన్నాయి. అంటే హెరిటేజ్ ఫుడ్స్‌లో లోకేశ్‌కు 10.20 శాతం వాటా ఉంది.

బాబుకు కరకట్ట నివాసం

క్విడ్‌ప్రోకోలో భాగంగా లింగమనేని రమేశ్ విజయవాడ వద్ద కృష్ణా కరకట్టపై ఉన్న తన బంగ్లాను చంద్రబాబుకు ఇచ్చారు. దీనిపై కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారాన్ని మసిపూసేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఆ బంగ్లాను అద్దెకు ఇచ్చానని లింగమనేని రమేశ్ బుకాయించారు. కానీ ఆయన అద్దె వసూలు చేసినట్టుగానీ, చంద్రబాబు చెల్లించినట్టుగానీ ఆదాయపన్ను వివరాల్లో లేవు. తరువాత ఆ ఇంటిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని చెప్పారు. మరి చంద్రబాబు ప్రభుత్వం నుంచి హెచ్ఆర్ఏ ఎందుకు పొందారన్న ప్రశ్నకు సమాధానం లేదు. దీంతో ఆ బంగ్లాను చంద్రబాబుకు వ్యక్తిగతంగా క్విడ్‌ప్రోకో కింద ఇచ్చారని స్పష్టమైంది. లింగమనేని నుంచి కానుకగా స్వీకరించిన కరకట్ట ఇంట్లోనే చంద్రబాబు, లోకేశ్ దర్జాగా నివసించడం గమనార్హం.

పవన్‌కూ వాటా

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కూడా ఈ అవినీతి పాపంలో పిడికెడు వాటా ఇచ్చారు. కాజకు సమీపంలో ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌కు చేరువలో పవన్‌కళ్యాణ్‌కు 2.4 ఎకరాలున్నాయి. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కళ్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

భారీగా పెరిగిన విలువ

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ప్రకారమైతే ఎకరా రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరం రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. అంటే రిజిస్టర్ విలువే నాలుగున్నర రెట్లకుపైగా పెరిగింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ ప్రకారం మార్కెట్ ధరను బట్టి హెరిటేజ్ ఫుడ్స్ 10.4 ఎకరాల మార్కెట్ విలువ రూ.5.20 కోట్ల నుంచి రూ.41.6 కోట్లకు కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే రూ.62.4 కోట్లకు చేరుతుందని తేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకుని రద్దు చేసినట్టు చూపిన మరో 4.55 ఎకరాల విలువ కూడా రూ.27.3 కోట్లకు చేరుతుంది. ఇక చంద్రబాబు బినామీల పేరిట ఉన్న వందలాది ఎకరాల విలువ అమాంతం పెరిగింది.

చంద్రబాబు బెయిల్, పోలీసు కస్టడీ పిటిషన్లపై

విచారణ నేటికి వాయిదా

- ఏసీబీ కోర్టు జడ్జి సెలవు కారణంగా ఎంఎస్‌జే కోర్టుకు పిటిషన్లు
- ఇప్పటికిప్పుడు విచారణ జరిపి వెంటనే తీర్పు ఇవ్వలేనన్న ఎంఎస్‌జే
- బుధవారం ఏసీబీ కోర్టులోనే వాదనలు వినిపించాలని స్పష్టీకరణ
- ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో నిందితుడిగా లోకేశ్.. సీఐడీ మెమో

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న మాజీ సీఎం నారా చంద్రబాబును 5 రోజులు తమ కస్టడీకి అప్పగించాలంటూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో సీఐడీ దాఖలు చేసిన పిటిషన్, ఇదే కుంభకోణంలో బెయిల్ కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ బుధవారానికి వాయిదా పడింది. వాస్తవానికి ఈ రెండు పిటిషన్లపై ఏసీబీ కోర్టు మంగళవారం విచారణ జరపాల్సి ఉంది. అయితే ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సెలవు పెట్టడంతో ఇవి ఇన్‌చార్జి కోర్టు అయిన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి (ఎంఎస్‌జే) కోర్టు ముందుకు వచ్చాయి. సీఐడీ కస్టడీ పిటిషన్ విచారణకు రాగానే విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంఎస్‌జే ఎ.సత్యానంద్ తెలిపారు. చంద్రబాబు బెయిల్ పిటిషన్ విచారణకు రాగా దాన్ని కూడా బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. ఇది ఓ వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన వ్యవహారమని, బెయిల్‌పై విచారణ చేపట్టాలని చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాదులు ప్రమోద్ కుమార్ దూబే, దమ్మాలపాటి శ్రీనివాస్ కోరారు. కోర్టు ఆదేశాల మేరకు కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ కూడా దాఖలు చేశామని చెప్పారు. దీనికి న్యాయమూర్తి సత్యానంద్ స్పందిస్తూ.. బెయిల్ పిటిషన్‌పై ఈ రోజే వాదనలు విని ఈ రోజే తీర్పునిచ్చే పరిస్థితి లేదన్నారు. బుధవారం ఏసీబీ కోర్టు జడ్జి విధులకు హాజరవుతున్నారని, ఆ కోర్టులోనే వాదనలు వినిపించుకోవాలని స్పష్టం చేశారు. తాను బుధవారం సెలవుపై వెళుతున్నానని, అందువల్ల బెయిల్ పిటిషన్‌పై ఇప్పటికిప్పుడు తీర్పు వెలువరించలేనని తేల్చి చెప్పారు. ఇదిలా ఉంటే, ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు తనయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను 14వ నిందితుడిగా చేరుస్తూ కోర్టులో సీఐడీ ఓ మెమో దాఖలు చేసింది.

బాబు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో ముగిసిన వాదనలు

తీర్పు రిజర్వ్ చేసిన న్యాయస్థానం

- బాబు ప్రోద్బలంతోనే అంగళ్లు నుంచి పుంగనూరు వరకు టీడీపీ విధ్వంసం
- చంద్రబాబే పార్టీ శ్రేణుల్ని రెచ్చగొట్టారు
- ఆయన బెయిల్ పిటిషన్‌కు విచారణార్హతే లేదు.. దానిని కొట్టేయండి
- హైకోర్టును కోరిన అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: యుద్ధభేరి పేరుతో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల సందర్శన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లు నుంచి చిత్తూరు జిల్లా పుంగనూరు వరకు టీడీపీ శ్రేణులు ఇటీవల సాగించిన విధ్వంసంపై నమోదు చేసిన కేసులో బెయిల్ కోరుతూ ఆ పార్టీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు మంగళవారం ముగిశాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి తీర్పును రిజర్వ్ చేశారు. పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అసలు ఈ బెయిల్ పిటిషన్‌కు విచారణార్హతే లేదన్నారు. మరో కేసులో అరెస్టయినందున ఈ కేసులో కూడా అరెస్టయినట్లు భావించడానికి వీల్లేదన్నారు. పలు కేసులు ఒకే పోలీస్‌స్టేషన్‌లో నమోదై, వాటిని ఒకే అధికారి దర్యాప్తు చేస్తుంటే అప్పుడు డీమ్డ్ (అన్నీ కేసుల్లో అరెస్ట్ అయినట్లు) అరెస్ట్ వస్తుందని, వేర్వేరు కేసులు, వేర్వేరు దర్యాప్తు అధికారులున్నప్పుడు అది డీమ్డ్ అరెస్ట్ కిందకు రాదని స్పష్టంచేశారు. డీమ్డ్ అరెస్ట్ అయితే పీటీ వారెంట్‌తో పనేముంటుందని ప్రశ్నించారు. చట్ట ప్రకారమే పీటీ వారెంట్ దాఖలు చేశామన్నారు. అసలు చంద్రబాబు ప్రోద్బలంతోనే అంగళ్లు ఘటన జరిగిందన్నారు. అంగళ్లు వద్ద మొదలైన టీడీపీ శ్రేణుల విధ్వంసం చిత్తూరు జిల్లా పుంగనూరు వరకు కొనసాగిందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రిగా, పార్టీ అధినేతగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన చంద్రబాబే దగ్గరుండి శ్రేణులను రెచ్చగొట్టారని తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోలను పరిశీలించాలని కోర్టును కోరారు. మారణహోమం సృష్టించడం ద్వారా శాంతిభద్రతల సమస్య లేవనెత్తాలన్నదే చంద్రబాబు వ్యూహమన్నారు. అంతిమంగా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కుట్ర పన్నారని తెలిపారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను కొట్టేయాలని ఆయన కోరారు. అంతకు ముందు చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ మరో కేసులో అరెస్టయి జైలులో ఉన్నందున, ఈ కేసులో కూడా అరెస్టయినట్లు భావించాల్సి ఉంటుందన్నారు. అందుకే బెయిల్ పిటిషన్ వేశామని తెలిపారు. అధికార పార్టీ నేతలు చంద్రబాబు కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారని, ఆ దాడి నుంచి ఆయన్ని వ్యక్తిగత భద్రతా సిబ్బంది రక్షించారని తెలిపారు. ఘటన జరిగిన నాలుగు రోజుల తరువాత ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే పలువురికి హైకోర్టులో ముందస్తు బెయిల్ మంజూరైందని చెప్పారు.

నాలుగో పారిశ్రామిక విప్లవానికి ఏపీ రెడీ

- ఏయూలో ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీ ల్యాబ్
- కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- నూతన సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన కల్పించే అవకాశం
- ఇంజినీరింగ్ కోర్సుల్లో ఇప్పటికే ఇండస్ట్రీ 4.0ను సబ్జెక్టుగా చేర్చిన ఏయూ



పుణేలోని ల్యాబొరేటరీ

ఏయూ క్యాంపస్: నాలుగో పారిశ్రామిక విప్లవాన్ని అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధమైంది. ఇందులో భాగంగానే ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీ ల్యాబొరేటరీ ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)లో ఏర్పాటు కాబోతోంది. ఇప్పటికే ఇండస్ట్రీ 4.0ను ఒక సబ్జెక్టుగా ఏయూలో ఇంజినీరింగ్ విద్యార్థులకు బోధిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే భారత భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏయూలో ఇండస్ట్రీ 4.0 ల్యాబొరేటరీ ఏర్పాటు చేయబోతున్నారు. ఇటీవల ఏయూను సందర్శించిన భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు ఇక్కడి మౌలిక వసతులు, విద్యార్థులకు ఉపయుక్తంగా ఏర్పాటైన నూతన పరిశోధన, స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రాలను పరిశీలించారు. కాగా, దీనిని మరింత బలోపేతం చేసేలా ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీ ప్రోటోటైప్ ల్యాబొరేటరీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది.

దేశంలోనే రెండో ల్యాబ్

భారత భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారంతో పుణేలో ఇప్పటికే సెంటర్ ఫర్ ఇండస్ట్రీ 4.0 (సీ4ఐ4) ల్యాబ్ ఏర్పాటైంది. ఇదే తరహాలో ఏయూలో రూ.4 కోట్ల వ్యయంతో ల్యాబ్ ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందాన్ని ఇటీవల చేసుకున్నారు. ఏయూ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ పుణేలోని సీ4ఐ4 ల్యాబ్‌ను సందర్శించి సమర్థ్ ఉద్యోగ్ ఫోరంతో అవగాహన ఒప్పందం చేసుకున్నారు.


పరిశ్రమ స్వరూపం మారిపోతోంది

ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికల ఫలితంగా పరిశ్రమల పనితీరు, స్వరూపాలు పూర్తిగా మారిపోతున్నాయి. దీనిలో భాగంగా లాజిస్టిక్స్, సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్, సప్లయ్ ఆటోమేషన్ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న షాప్ ఫ్లోర్ పనులు ఇకపై టాప్ ఫ్లోర్ నుంచి జరుగుతాయి. వీడియో కెమెరాలో పరిశీలిస్తూ ఏఐ, రోబోటిక్స్ సాయంతో డిజిటలైజేషన్ ప్రాసెస్‌తో పనిచేయడం త్వరలో సాధ్యపడుతుంది. ప్రస్తుతం ఉన్న వస్తు ఉత్పత్తి స్థానంలో ప్రతి వ్యక్తికి వ్యక్తిగతంగా అవసరమైన ఉత్పత్తులు రాబోతున్నాయి. ఇప్పటికే జర్మనీలో ఇండస్ట్రీ 4.0 అమలవుతోంది. త్వరలో ప్రపంచం మొత్తం ఈ టెక్నాలజీని వినియోగించబోతోంది. ఇప్పటినుంచి విద్యార్థులను నూతన సాంకేతికతకు సన్నద్ధం చేస్తూ, వారికి విస్తృత అవగాహన కల్పించే విధంగా ఈ ల్యాబ్ పనిచేస్తుంది.

ఫ్యూచర్ టెక్నాలజీ పరిచయం

ఏయూలో ఏర్పాటయ్యే ఇండస్ట్రీ 4.0 సెంటర్‌లో ఫ్యూచర్ టెక్నాలజీ యంత్రాలు, ఉపకరణాలు ఏర్పాటు అవుతాయి. రోబోటిక్, ఏఐ, ఎంఐతో పని చేయడం, డేటా సైన్స్, సేల్స్ ఫోర్స్ ఆటోమేషన్, లైవ్ స్ట్రీమింగ్, మాన్యుఫాక్చరింగ్ డిజిటలైజేషన్ ప్రాసెస్ వంటి వాటిపై అవగాహన కల్పించేలా దీనిని ఏర్పాటు చేస్తారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతను తయారు చేయాలనే ఉద్దేశంతో ఏయూ ఇప్పటికే ఇండస్ట్రీ 4.0ను ఒక సబ్జెక్టుగా ఇంజినీరింగ్ విద్యార్థులకు బోధిస్తోంది. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలోనే దీనిని పరిచయం చేస్తూ దాదాపు మూడేళ్లు దీనిని చదివే అవకాశం కల్పించారు. తద్వారా భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పనిచేసే సామర్థ్యాలను విద్యార్థులు పెంపొందించుకుంటారు.

సీఎం కోరిక మేరకు..



మారుతున్న ప్రతి టెక్నాలజీని రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి పరిచయం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారు. దీనిలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసే ఇండస్ట్రీ 4.0 ల్యాబొరేటరీని ఏయూతోపాటు అనుబంధ కళాశాలల విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు సందర్శించి, అవగాహన పొందేవిధంగా అవకాశం కల్పిస్తాం. భవిష్యత్ టెక్నాలజీలపై ఇప్పటి నుంచే అవగాహన అందించడం సాధ్యపడుతుంది.

– పీవీజీడీ ప్రసాదరెడ్డి, ఉపకులపతి

చెప్పాల్సింది ఇంతే: సరైనది చేయండి. పవిత్రంగా ఉండండి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 27 సెప్టెంబర్ 2023

ఈ పరిస్థితి మారేదెట్లా?

భారత – కెనడా సంబంధాలు కొంతకాలంగా ఇరుకునపడ్డ మాట నిజమే కానీ, గత వారం రోజుల పరిణామాలతో అధఃపాతాళానికి పడిపోయాయి. కెనడా పౌరుడైన ఓ ఖలిస్తానీ సిక్కును భారత్ హతమార్చిందంటూ ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో గత వారం చేసిన ఆరోపణ ఒక్కసారిగా పరిస్థితిని దిగజార్చింది. భారత ప్రభుత్వం ఆ ఆరోపణల్ని తీవ్రంగా ఖండించడం, కెనడా తన మాట వెనక్కి తీసుకోకపోవడం, వరుస దౌత్యవేత్తల బహిష్కరణలు... కొద్దిరోజులుగా వేడిని పెంచుతూ వస్తున్నాయి. భారత్‌లో పర్యటించదలచినవారికి అనేక జాగ్రత్తలు చెబుతూ కెనడా ప్రత్యేక సూచన లిస్తే, కెనడా దేశస్థులకు వీసాల జారీని భారత్ నిలుపు చేసింది. ఆలస్యంగానైనా నిద్ర లేచిన భారత సర్కార్ సదరు ఖలిస్తానీ మద్దతుదార్లకు దేశంలో ఉన్న ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం మొదలెట్టింది. తాజాగా ఐరాస వేదికపైనా అంతర్లీనంగా కెనడా వైఖరిని ఎండగట్టింది. వరుస చూస్తే, రెండు దేశాల మధ్య దౌత్యఘర్షణకు ఇప్పుడప్పుడే తెర పడేలా కనపడట్లేదు.

ఈ వ్యవహారంలో తప్పంతా కెనడా ప్రధానిదే. వారం క్రితం భారత్‌పై తీవ్ర ఆరోపణతో రెండు దేశాల మధ్య దౌత్య తుపాను రేపిన ట్రూడో ఇప్పటి వరకు సాక్ష్యం చూపలేకపోయారు. అదేమంటే, 'ఫైవ్ ఐస్' గూఢచర్య కూటమి సేకరించిన సమాచారమే ఈ ఆరోపణకు ఆధారమని కెనడా దేశపు మీడియాలో లీకులు వస్తున్నాయి. ఆ మాటకొస్తే ట్రూడో హయాంలో భారత్‌కు వ్యతిరేకంగా జరిగిన అరాచకాలు అనేకం. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యను కొని యాడే శకటాలు, దౌత్యవేత్తలపై హింసను ప్రేరేపిస్తూ ''కిల్ ఇండియా'' పేరిట పోస్టర్లు, హిందూ ఆలయాలపై దాడుల లాంటివన్నీ ఆయన ఏలుబడిలో ఎగసిపడ్డవే. కెనడాలోని సిక్కు ఓట్ల కోసం తీవ్రవాద సభలకు సైతం ఆయన హాజరయ్యారు. అప్పట్లోనే భారత దౌత్యవేత్తలు తమ అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

కెనడా ప్రయోజనాల కన్నా తన స్వప్రయోజనాలకే ట్రూడో పెద్ద పీట వేస్తున్నట్టున్నారు. ఖలిస్తానీ మద్దతుదారుల్ని సంతోషపరచి, నాలుగు ఓట్లు ఎక్కువ సంపాదించాలన్నదే ఆయన తాపత్రయంగా కనిపిస్తోంది. పరిణతి లేని ఆయన రాజకీయ చర్యలపై నిపుణులైన కెనడా దౌత్యవేత్తలు ఇప్పటికే పెదవి విరిచారు. 2018లో భారత పర్యటన సందర్భంగా నేరస్థుణ్ణి విందుకు ఆహ్వానించి ఫోటోలు దిగి రచ్చ రేపిన ట్రూడో తన తాజా చర్యలతో ఏకంగా భారత్‌తో బంధానికే పూర్తిగా నిప్పంటించేశారు. నిజానికి, భారత అభ్యర్థనపై 2016 నుంచి ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీస్‌లో ఉన్న తీవ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ జూన్ 18న గుర్తు తెలియని దుండగుల తుపాకీ కాల్పులకు చనిపోయాడు. నాలుగు నెలల తర్వాత ట్రూడో నిద్ర లేచి, అది భారత్ చేసిన హత్య అనడం విడ్డూరం.

పడిపోతున్న ప్రతిష్ఠను నిలబెట్టుకొనేందుకే జస్టిన్ ట్రూడో ఇలా అంతర్జాతీయంగా భారత్‌పై బురద జల్లాలని ప్రయత్నిస్తున్నారు. గతంలో 1968 నుంచి 1984 మధ్య కెనడా ప్రధానిగా పనిచేసిన ఆయన తండ్రి ప్రియర్ ట్రూడో సైతం ఇలాగే పెడసరంగా వ్యవహరించారు. సిక్కు తీవ్రవాది తల్విందర్ సింగ్ పర్మార్‌ను అప్పగించమని అభ్యర్థిస్తే నిరాకరించారు. చివరకు ఆ తీవ్రవాది ఓ ఉగ్రసంస్థకు అధిపతై, 1985లో ఎయిరిండియా విమానాన్ని బాంబు పెట్టి పేల్చేసి, 329 మంది మరణానికి కారణమయ్యాడు. 2016లో తండ్రి లానే కొడుకు ప్రధాని కాగానే, ఆ కేసులో శిక్షపడ్డ ఏకైక వ్యక్తి పెరోల్‌పై విడుదలయ్యాడు. 2018లో ట్రూడో భారత్ సందర్శించినప్పుడు అప్పటి పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ తాము అన్వేషిస్తున్న తీవ్రవాదుల జాబితాను అందజేశారు. తాజాగా మరణించిన నిజ్జర్ పేరూ అందులో ఉంది. ఈసారి పెద్ద ట్రూడో బాటలోనే చిన్న ట్రూడో చర్యలేమీ చేపట్టలేదు.

నిజ్జర్ మరణంపై ఇంతవరకు చేసిన దర్యాప్తు, అనుమానితులు, అదుపులో తీసుకున్న పేర్లేమీ కెనడా చెప్పట్లేదు. ఇండియాపై ఆరోపణలు చేసి పది రోజులవుతున్నా తన వాదనకు బలం చేకూర్చే సాక్ష్యమేమీ ట్రూడో చూపలేకపోయారన్నది గుర్తించాలి. ఈ గొడవ ఇలా నడుస్తుండగానే, నాజీ సంబంధాలున్న ఓ వయోవృద్ధుడిని శుక్రవారం కెనడా పార్లమెంట్ గౌరవించి, మరో తప్పు చేసింది. ఆఖరికి స్పీకర్ క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. తాము నెత్తిన పెట్టుకుంటున్న వ్యక్తుల నేపథ్యం తెలుసుకోవడంలో కెనడా పాలనా యంత్రాంగం విఫలమవుతోందనడానికి ఇది మరో మచ్చుతునక. భారత్ సైతం విదేశీగడ్డపై నివసిస్తూ, మాతృదేశానికి ద్రోహం చేయాలని చూస్తున్నవారిపై ఇకనైనా కఠినంగా వ్యవహరించాలి. ఈ ఖలిస్తానీలకు నిధులెక్కడ నుంచి వస్తున్నాయి, వారికి తెరచాటు అండదండ ఎవరనేది కనిపెట్టి, సాక్ష్యాధారాలతో అంతర్జాతీయంగా బట్టబయలు చేయాలి.

దేశంలో ద్రవ్యోల్బణం, అధిక వడ్డీరేట్ల లాంటి వంద తలనొప్పులున్న ట్రూడో నిరాధార ఆరోపణలకు దిగే కన్నా ముందు ఆ సమస్యలపై దృష్టి పెట్టాలి. ఎనిమిదేళ్ళ క్రితం ఎన్నుకున్న తనను 63 శాతం మంది ఇప్పుడు వ్యతిరేకించడానికి కారణాలు గ్రహించాలి. ఎన్నికల్లో ఓట్లు, సీట్లు, నిధుల కోసం ఆయన పార్టీ వర్గాలు ఖలిస్తానీ అనుకూల వర్గాలపై అతిగా ఆధారపడడం మానుకోవాలి. పౌరుల భావస్వేచ్ఛను పరిరక్షించాల్సిందే కానీ, ఆ మిషతో తీవ్రవాదం సాగిస్తే సహించబోమని అక్కడి సిక్కు ప్రవాసీలకూ స్పష్టం చేయాలి. కెనడాకు 10వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి భారత్. అక్కడి పర్యాటకుల సంఖ్యలో నాలుగో స్థానం మనదే. కెనడాకెళ్ళే విద్యార్థుల్లో 40 శాతం మనవాళ్ళే. అందుకే ఎన్నికల్లో గెలుపోటముల కన్నా దేశాల మధ్య దశాబ్దాల బంధం ముఖ్యమని ట్రూడో గ్రహించాలి. భారత్ సైతం పరిస్థితిని చక్కదిద్దడమెలాగో ఆలోచించాలి. ఆ దిశగా అడుగులు వేయాలి. ఇరుపక్షాలకూ కావాల్సిన అమెరికా మధ్యవర్తిత్వమూ అందుకు కలిసిరావచ్చు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.8.49 వరకు తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ధనిష్ఠ ఉ.6.06 వరకు తదుపరి శతభిషం (తెల్లవారితే గురువారం), **వర్జ్యం:** ప.12.46 నుండి 2.15 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.29 నుండి 12.17 వరకు, **అమృత ఘడియలు:** రా.9.43 నుండి 11.14 వరకు.

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం: 5.52
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

జెనరిక్ ఔషధాలంటే నాసిరకం కాదు!

విశ్లేషణ


డాక్టర్ కె.కె. తల్వార్

వైద్యులు తప్పనిసరిగా జెనరిక్ ఔషధాలనే రాయాలని ఇటీవల జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) ఓ ప్రకటన విడుదల చేసి, వైద్యుల ఆందోళన అనంతరం ఆ నిర్ణయాన్ని నిలిపివేసింది. దేశంలో అందుబాటులో ఉన్న కొన్ని జెనరిక్ ఔషధాలు నాసిరకమైనవన్న అభిప్రాయం సమాజంలో ఉంది. దీని కారణంగానే, రోగులు వాటిని ఉపయోగించడానికి ఇష్టపడటం లేదు. అధిక ధర ఉన్నప్పటికీ 'బ్రాండెడ్' మందులను తీసుకోవడానికే మొగ్గుచూపుతున్నారు. సాధారణంగా తయారీ ప్రక్రియలో నిర్లక్ష్యం, లేదా ఉద్దేశపూర్వకంగా తప్పు చేయడం వలన నాసిరకం మందులు (కలుషితమైనవి అయినా లేదా నాణ్యత లేనివైనా) ఉత్పత్తవుతాయి. అందువల్ల, మన నియంత్రణ యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలి.

ప్రపంచ ఫార్మసీగా భారత్‌ను పేర్కొంటారు. ప్రపంచవ్యాప్తంగా భారీ సంఖ్యలో జెనరిక్ మందులు భారత్ నుండి ఎగుమతి అవుతాయి. 21వ శతాబ్ది ప్రారంభం వరకు, మన దేశంలోని పేటెంట్ వ్యవస్థ ఉత్పత్తి పేటెంట్లను కాకుండా ప్రక్రియ పేటెంట్లను మాత్రమే అనుమతించింది. ఇది భారతీయ ఔషధ పరిశ్రమకు, పేటెంట్ ఉల్లంఘనకు పాల్పడకుండా ఔషధాలను తయారు చేయడానికి అవకాశాన్ని కల్పించింది. 'రివర్స్ ఇంజనీరింగ్' విధానం వల్ల వివిధ తయారీ ప్రక్రియలు అభివృద్ధి చెందగలవు. భారతీయ తయారీ రంగం విజయగాథల్లో ఒకటిగా భారతదేశ ఔషధ రంగాన్ని పరిగణిస్తున్నారు. ప్రత్యేకంగా, హెచ్ఐవి/ఎయిడ్స్, ప్రాణాలను కాపాడే వ్యాక్సిన్‌లు వంటి సంక్లిష్ట రంగాల్లో ఇవాళ మనం ప్రపంచం మొత్తానికి జెనరిక్ ఔషధాలకు సంబంధించి అతిపెద్ద సరఫరాదారుగా ఉన్నాము. 'బ్రాండెడ్' ఔషధాల లాగే జెనరిక్ మందులు కూడా అదేవిధమైన క్రియాశీల పదార్థం కలిగినవి కాబట్టి, ఒకేరకమైన ప్రయోజనాలను కలిగిస్తాయి.

జెనరిక్ ఔషధాల ధర తక్కువగా ఉండటమే వాటిని సమర్థించడానికి ప్రధాన కారణం. ఎందుకంటే అవి పదేపదే జంతు, క్లినికల్ అధ్యయనాలకు గురికావాల్సిన అవసరం లేదు. ధర సమస్య దృష్ట్యా, అవి అభివృద్ధి చెందుతున్న దేశాలకు చాలా ముఖ్యమైనవి. అలాగే ఇవి ప్రపంచానికి విపరీతంగా ప్రయోజనం చేకూర్చాయి. ఔషధాల నాణ్యత విషయంలో ఏ విధమైన రాజీ ఉండకూడదన్నది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే దేశంలో అందుబాటులో ఉన్న కొన్ని జెనరిక్ మందులు నాసిరకమైనవన్న అభిప్రాయం సమాజంలో ఉంది. దీని కారణంగానే, రోగులు సహేతుకంగానే జెనరిక్ ఔషధాలను ఉపయోగించడానికి ఇష్టపడటం లేదు. అధిక ధర ఉన్నప్పటికీ బ్రాండెడ్ మందులను తీసుకోవడానికే వీరు తరచుగా మొగ్గు చూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జన్ ఔషధి ఔట్‌లెట్లలో పేలవమైన అమ్మకాలే దీనికి నిదర్శనం.

వైద్యులు తప్పనిసరిగా జెనరిక్ మందులనే రాయాలని ఇటీవల జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఓ ప్రకటన విడుదల చేసింది. అందుబాటులో ఉన్న జెనరిక్ ఔషధాల నాణ్యతకు సంబంధించిన తీవ్రమైన సమస్యను ఇది తెరపైకి తెచ్చింది. ఆ ప్రకటనపై వైద్యులు సముచితమైన ఆందోళనలను వ్యక్తం చేశారు. ఇది మీడియాలో ప్రముఖంగా వచ్చింది. దీంతో జెనరిక్ ఔషధాలను వైద్యులు తప్పనిసరిగా రాయడానికి సంబంధించిన తన నిర్ణయాన్ని ఎన్ఎంసి ప్రస్తుతానికి నిలిపివేయడం సరైన చర్య. ఏదేమైనప్పటికీ, జెనరిక్ ఔషధాల ప్రాధాన్యతపై దృష్టి సారించాల్సిన అవసరమైతే ఉంది. నిజానికి, ఆరోగ్య సంరక్షణ కోసం పెట్టే ఖర్చును తగ్గించడానికి జెనరిక్ ఔషధాల వినియోగం చక్కటి మార్గం. ప్రభుత్వం కూడా నాణ్యమైన జెనరిక్‌లను నిర్ధారించడానికి అన్ని విధాలా కృషి చేయాలి.



మన దేశంలో నకిలీ లేదా నాసిరకం ఔషధాలు ఉండటం, ప్రధానంగా పేలవమైన క్రమబద్ధీకరణ వ్యవస్థ ఫలితమే. అలాంటి కొన్ని మందుల ఉపయోగం తర్వాత ఉత్పన్నమైన తీవ్రమైన సమస్యలకు సంబంధించిన సంఘటనలు కూడా బయటకు వచ్చాయి. గత సంవత్సరం, ఒక కంపెనీ తయారు చేసిన ప్రొపోఫోల్ ఇంజెక్షన్‌ను ఉపయోగించడం వల్ల ఏర్పడిన ప్రతికూల ఫలితాలు, ఆఖరికి మరణం సంభవించడం కూడా చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్ దృష్టికి వచ్చింది. భారతదేశం నుండి ఎగుమతైన దగ్గు సిరప్ వాడకం వల్ల గాంబియాలో నమోదైన మరణాలు, ఫార్మా హబ్‌గా మన దేశానికి ఉన్నపేరు ప్రతిష్ఠను దెబ్బతీశాయి.

నాసిరకం మందులు వాడిన తర్వాత ఉండే ప్రమాదాల్లో తగిన రీతిలో లేని ప్రతిస్పందన, ఆ ఔషధానికి నిరోధకత అభివృద్ధి కావడం వంటివి తీవ్రమైన ఆందోళన కలిగించే అంశాలు. సమర్థవంతమైన నియంత్రణ యంత్రాంగం లేనప్పుడు, కొన్ని ఔషధ తయారీ సంస్థలు డబ్బును ఆదాచేసుకునే ప్రయత్నంలో, అంత ర్జాతీయంగా ఆమోదించిన ఉత్తమ పద్ధతులను అనుసరించకుండా విస్మరిస్తున్నాయి. వీటి ఉత్పత్తుల విషయంలో కంపెనీలు చాలా తరచుగా రాజీపడి పోతున్నాయి. నిర్లక్ష్యం, కల్తీ ఉండటం వంటి నిజాయితీ లేని పద్ధతులను కూడా గమనించవచ్చు. సాధారణంగా తయారీ ప్రక్రియలో నిర్లక్ష్యం లేదా ఉద్దేశపూర్వకంగా తప్పు చేయడం వలన నకిలీ మందులు (కలుషితమైనవి అయినా లేదా నాణ్యత లేనివైనా) సంభవిస్తాయి. ఇది ఏ విధంగానూ ఆమోదయోగ్యం కాదు. దీన్ని తీవ్రంగా ఖండించాల్సి ఉంది.

బ్రాండెడ్ ఔషధాల లాగే ప్రభావవంతమైనవనీ, సురక్షితమైనవనీ, వాటికి ప్రత్యామ్నాయం కాగలవనీ తగిన ధ్రువీకరణ జరిగిన తర్వాత మాత్రమే యూరోపియన్ దేశాలు, అమెరికా జెనరిక్ ఔషధాలను ఉపయోగించడానికి ఆమోదిస్తాయనేది అందరికీ తెలిసిందే. జెనరిక్ ఔషధాలను ఆమోదించడానికి కఠినమైన సమీక్షా ప్రక్రియ అమలులో ఉంటుంది. ఉదాహరణకు, అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ), ఉత్తమ ఉత్పాదక పద్ధతులకు అనుగుణంగా ఉండేలా తయారీ ప్లాంట్‌లను కూడా తనిఖీ చేస్తుంది. ఇది జెనరిక్ ఔషధాలపై రోగి విశ్వాసాన్ని పెంచడానికి ఉపయోగపడుతుంది. ఐఎమ్ఎస్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం, జెనరిక్ మందులు అమెరికాలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు ఒక దశాబ్దంలో (2009–2019) దాదాపు 2.2 ట్రిలియన్ డాలర్లను ఆదా చేశాయి. జెనరిక్ ఔషధాలు ఎంత ముఖ్యమైనవో ఈ సొమ్మే చెబుతోంది.

అందువల్ల, మనం పాఠాలు నేర్చుకుని, మన నియంత్రణ యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలి. కచ్చితమైన నాణ్యతా నియంత్రణ చర్యలు అమలులో లేకుంటే, అసమర్థమైన మందులు, తీవ్రమైన దుష్ప్రభావాల రూపంలో జంట ప్రమాదాలు అలాగే ఉంటాయి. మన ప్రస్తుత విధాన మార్గదర్శకాలను పునఃపరిశీలించి, అమలు ప్రక్రియను బలోపేతం చేయడం తక్షణ అవసరం. పూర్తి శిక్షణ పొందిన నిపుణులు నిర్వహించే పరీక్షా సౌకర్యాల రూపంలో తగిన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రస్తుతమున్న చట్టబద్ధమైన, ఇతర రక్షణలకు చెందిన కచ్చితమైన పర్యవేక్షణ చాలా ముఖ్యమైనది. చట్టపరమైన నియంత్రణ విధానాలు కంపెనీలు స్వీయనియంత్రణను ప్రోత్సహించే విధంగా నిర్మాణాత్మకంగా ఉండాలి. అయితే వికృతమైన కేసులను సాహసంతో ఎదుర్కోవటానికి సంకల్పం ఉండాలి. భారతదేశంలో ఔషధాల నాణ్యతను నియంత్రించడానికి బాధ్యత వహించే 'సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్' (సీడీఎస్‌సీవో)ను తప్పనిసరిగా బలోపేతం చేయాలి.

మన ఔషధ అప్రమత్తత, నిఘా వ్యవస్థ జాగరూకత కార్యక్రమాలను కూడా శక్తిమంతం చేయాల్సిన అవసరం ఉంది. మార్కెటింగ్ అనంతరం మన ఉత్పత్తుల భద్రతను నిర్ధారించడానికి ఇవి మార్గాలు. ఔషధ హెచ్చరికల తర్వాత, వాటిని వెనక్కి తీసుకునే ఏ తదుపరి చర్యనైనా తప్పనిసరిగా పబ్లిక్ డొమైన్‌లో వీలైనంత త్వరగా ఉంచాలి.

నాణ్యమైన జెనరిక్ ఔషధాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత, ఇక బ్రాండెడ్ మందులను మార్కెట్ చేయవద్దని ప్రభుత్వం ఔషధ కంపెనీలను ఆదేశించాలి. ఫార్మాస్యూటికల్ కంపెనీలు తమ మార్కెటింగ్ బడ్జెట్‌లను తగ్గించి, పరిశోధన, అభివృద్ధితో పాటు నాణ్యతా నియంత్రణపై ఎక్కువ ఖర్చు చేసేలా ప్రోత్సహించాలి.

నాణ్యమైన జెనరిక్ ఔషధాలను నిర్ధారించే సవాలును సీడీఎస్‌సీఓ తప్పనిసరిగా ఎదుర్కోవాలి. మన ఇంటిని మనం చక్కదిద్దుకున్న తర్వాత, జాతీయ వైద్య కమిషన్ ఆదేశాన్ని స్వాగతించవచ్చు.

వ్యాసకర్త పీజీఐఎంఈఆర్ మాజీ డైరెక్టర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తగిన గౌరవం



వహీదా రెహమాన్ (ప్రసిద్ధ నటి)ను దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో గౌరవించనుండటం గొప్ప వార్త. కొంచెం ఆలస్యంగా వచ్చినా, ఇప్పటికైనా వచ్చింది.

– ఖాలిద్ మొహమద్, దర్శకుడు – సినీ విమర్శకుడు

కొన్నైనా చదవండి!



సగటు పాఠకుడు నిమిషానికి 240 పదాలు చదవగలడు. రోజుకు 20 నిమిషాలు చదివినా, ఏడాదికి 18 లక్షల పదాలు అవుతాయి. ఇంకో రకంగా చెప్పాలంటే, 25–30 అనువాద పుస్తకాలు అవుతాయి. మీతో అనువాదాలు చదివించాలన్నది నా ఆసక్తి!

– అరుణవ సిన్హా, అనువాదకుడు

మీకేం తెలుసు?



సినీ నటి పరిణీతి చోప్రా తన పెళ్లిలో ఎరుపు రంగు దుస్తులు ధరించలేదని కొందరు ట్రోల్ చేస్తున్నారు. కన్నడిగ, మలయాళీ వధువులు సంప్రదాయంగా పూర్తి తెలుపు లేదా భిన్నమైన అంచులతో కూడిన తెలుపు చీర కట్టుకుంటారు. తెలుగువాళ్లలో కొంతమంది పసుపు నీళ్లలో ముంచిన తెల్ల కాటన్ చీర కట్టుకుంటారు. వీళ్లంతా హిందువులు కాదనా వీళ్ల ఉద్దేశం?

– అనూషా రవి సూద్, జర్నలిస్ట్

వాళ్లకూ తెలుసు



పాకిస్తానీయుల నిజాయతీ నాకు నచ్చుతుంది. 'తీవ్రవాదాన్ని తిరస్కరించండి' అని నేను దేశం పేరైనా ఎత్తకుండా ఎప్పుడు ట్వీట్ చేసినా, వేలాది పాకిస్తానీయులు నా టైమ్‌లైన్‌లోకి వచ్చి నన్ను దూషిస్తుంటారు. తీవ్రవాద ఫ్యాక్టరీ పాకిస్తాన్ కాకుండా ఇంకోటి ఉండదని వాళ్లకు కూడా తెలుసు.

– సాజిద్ యూసుఫ్ షా, కశ్మీర్ న్యాయవాది

మురిపెం మాత్రమే!



ఇండియా గొప్ప దేశం. కానీ ప్రపంచ శక్తి కానిదాన్ని మోదీ ప్రభుత్వం అలా చూపించే యత్నం చేస్తోంది. ఈ తరహా తీవ్ర జాతీయవాదం ప్రమాదకరం. అది మరెవరినో కాదు, భారతీయులను ప్రభావితం చేస్తుంది. వేళ్లు గట్టిగా లేనంతవరకూ ఏ దేశమూ తన చివుళ్లను చూసి మురిసిపోదు.

– ఆశిస్ బసు, కెనడా ప్రొఫెసర్

నిశ్శబ్దం సుఖం



వాస్తవాలు, సత్యాలతో నిమిత్తం లేకుండా తమ భ్రమల్లో ఉండేవారితో వాదించడం కాలయాపన. అన్నీ సత్యాలు చూపినా కొంత మంది వాటిని అర్థం చేసుకోలేరు. కొంత మందికి అహం అడ్డొస్తుంది. అజ్ఞానం అరుస్తున్నప్పుడు, ప్రజ్ఞ తన పని తాను చూసుకోవడం మంచిది.

– అఫ్‌షైన్ ఇమ్రానీ, కార్డియాలజిస్ట్

నిజమైన కర్మయోగి



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నేటితో (26 సెప్టెంబర్) 91 ఏళ్లు. నాకు ఇష్టమైన జ్ఞాపకాల్లో ఒకటి. 1999లో ఆయన లోక్‌సభకు పోటీచేసినప్పుడు (ఓడిపోయారు) 'ఫాలో ద లీడర్' ప్రోగ్రామ్ చేయడం. ఆ రోజు వాళ్ల మనవడి బర్త్ డే అయితే, వాళ్ల కుటుంబం కేక్ కట్ చేయడాన్ని కూడా షూట్ చేయాలనుకున్నాం. 'మీరు నన్ను ఇంటర్వ్యూ చేస్తున్నారు, నా కుటుంబాన్ని కాదు' అని ఆయన సున్నితంగా తిరస్కరించారు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఆదాయం పెంచడమే లక్ష్యం

రైతులు అధిక రాబడి పొందేందుకు ప్రకృతి (సేంద్రియ) వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటూ పాడి పరిశ్రమకు వెన్నుదన్నుగా నిలుస్తోంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. రసాయన ఎరువులూ, క్రిమిసంహారకాలు వంటి వాటిని వాడి చేసే వ్యవసాయం రైతులకు నష్టాలను మిగుల్చుతుండటంతో ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు 'అమూల్' సంస్థతో ఒప్పందం కుదుర్చుకొంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం లక్షలాది ఎకరాల్లో 8 లక్షల మంది రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని సాగిస్తున్నారు. అయితే వీరిలో కొంతమంది మాత్రమే నేరుగా తమ ఉత్పత్తులను విక్రయించుకోగలుగుతున్నారు. మరికొంతమంది మధ్యవర్తులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలా ఈ రైతులు అక్రమార్కుల బారిన పడకుండా ప్రభుత్వం రైతుబజార్లలో ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేయడం, కలక్టరేట్ ప్రాంగణాలు, సచివాలయాలు, ఆర్బీకేలు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో



జరిగే వారాంతపు సంతల్లో వీరిని ప్రోత్సహించడం ద్వారా ఆదుకుంటోంది. సేంద్రియ పద్ధతుల్లో పండించే పంటలు చాలా వరకూ స్థానికంగా వినియోగమవుతున్నాయి. మిగిలిన రూ. 1,100 కోట్ల విలువైన 1.42 లక్షల టన్నుల ఉత్పత్తులను అమ్ము కోవడానికి ఉన్న సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం కృషి చేస్తూ ఉంది.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను రిలయన్స్ ఎస్టేట్, బిగ్ బాస్కెట్ ఇతర కంపెనీల భాగస్వామ్యంతో 'రైతు సాధికార సంస్థ' మార్కెట్ చేయడంలో ముందుకు వెళ్తోంది. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానానికి 12 రకాల ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. జీడిమామిడి, మొక్కజొన్న, బెల్లం, కాఫీ, పసుపుతో సహా 12 రకాల వ్యవసాయ ఉత్పత్తులను; ఆర్గానిక్ సర్టిఫికెట్ పొందిన రైతుల ఉత్పత్తులలో తౌలుత ధాన్యం, సెనగలు, కందులు, కందిపప్పు, సెనగపిండి తదితరాలను ప్రీమియం ధరకు 'అమూల్ ఆర్గానిక్స్' పేరిట విపణిలోకి రైతు సాధికార సంస్థ తీసుకురానుంది.

వ్యవసాయ అనుబంధ పరిశ్రమ అయిన పాడిపరిశ్రమ బాగుంటేనే రైతులు పచ్చగా ఉంటారని ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. మూగజీవాలు ప్రమాదవశాత్తు మృతి చెందితే 'వైఎస్సార్ పశు బీమా' పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందజేసి పశువుల యజమానులను ఆదుకుంటోంది. అంతేకాకుండా ఆకస్మిక జబ్బులు వస్తే '1962' టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం మందించగానే పశువు వద్దకే పశువైద్య సంచార వాహనంలో వైద్య సిబ్బంది వచ్చి చికిత్స చేసే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. అలాగే 'జగనన్న పాలవెల్లువ' పథకం ద్వారా పాడిరైతులకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకొన్నది. ఇలా రైతు ఆదాయాన్ని పెంచడం ద్వారా రైతును రాజు చేయాలని చూస్తున్న ఏపీ ప్రభుత్వానికి అభినందనలు.

– దాసరి కృష్ణారెడ్డి, సీనియర్ పాత్రికేయుడు। 93925 82015

పల్లెల్లోనూ స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు

ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో వినూత్న విధానాలతో ముందడుగు వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామాల్లోని 'ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, వైద్య సేవలు' అన్న లక్ష్యంలో భాగంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్య క్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' దిశగా రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కలిగించి వారి ఆరోగ్య అవసరాలను గుర్తించి పరిష్కరించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రకటించిన ప్రభుత్వం దీనిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు చర్యలు ప్రారంభించింది.

ఈ కార్యక్రమంలో భాగంగా తొలి ఆరోగ్య శిబిరం సెప్టెంబర్ 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమవుతుంది. ప్రజలందరికీ ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధి బాధితులు, గర్భిణులు, బాలింతలు, నియో నేటల్, శిశువులు. బాలలు వంటి వారికి ఈ కార్యక్రమంలో వైద్య సేవలందిస్తారు.

ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' వంటి కార్యక్రమం ద్వారా ఇప్పటికే గ్రామాల్లో ఇంటింటికీ వైద్య సేవలందిస్తున్నది. ఇప్పుడు ప్రత్యేక వైద్య శిబిరాలను గ్రామాల్లో ఏర్పాటు చేసి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చి గ్రామీణ పేదలకు మరింత చేరువయ్యేందుకు ఈ 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తాజాగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలను వారి ముంగిట్లోనే గుర్తించటం మాత్రమే కాక వారికి సరైన వైద్య సలహాలు, చికిత్స అందే విధంగా చర్యలు తీసుకోవటం, అవసరమైన కేసులను ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేయటం వంటి చర్యలు తీసుకుంటారు. ఈ బాధ్యతలను ఫ్యామిలీ డాక్టర్ విధులు నిర్వహించే వైద్య నిపుణులతో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ), ఏఎన్ఎంలకు అప్పగించారు. వారు పేషెం



ట్లకు తగిన కన్సల్టెన్సీ సేవల ద్వారా వైద్య సలహాలు, సూచనలు అందిస్తారు. అలాగే వారి అవసరాలకు తగిన మందులను కూడా అందచేస్తారు.

మొత్తం 162 రకాల మందులు. 18 సర్జికల్స్ అందుబాటులో ఉంచుతున్నారు. స్పెషలిస్టు డాక్టర్ల సూచనల మేరకు ఇతర మందుల్ని కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 30న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు 45 రోజుల పాటు కొనసాగి నవంబర్ 15 నాటికి ముగుస్తాయి.

శిబిరాలలో ఏడు రకాల వైద్య పరీక్షలకు సంబంధించిన టెస్ట్ కిట్లు, అవసరమైన పరిమాణంలో ఔషధాలు అందుబాటులో ఉంటాయి. ఈ వైద్య శిబిరాలలో సేవలందించేందుకు ఆసక్తి కలిగిన డాక్టర్ల అసోసియేషన్లు, ప్రైవేటు ఆస్పత్రులు, వైద్య విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు సంబంధించిన ప్రచార కార్యక్రమంలో ఏఎన్ఎం/సీహెచ్ఓలు క్షేత్రస్థాయి సందర్శనలు ప్రారంభించారు. ఇంటింటి సర్వేలో ఇప్పటి వరకూ దాదాపు 38 లక్షల ఇళ్లలో వ్యక్తుల ఆరోగ్య వివరాలను సేకరించారు. ఈ నెల 19వ తేదీ వరకూ వివిధరకాల వ్యాధుల నిర్ధారణ కోసం దాదాపు 29 లక్షల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన మందుల్ని కూడా ఉచితంగా ఇవ్వడంతో పాటు తర్వాత వారు పూర్తిగా నయమయ్యే వరకూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో అనుసంధానం చేస్తామని సీఎం ప్రకటించారు.

– కల్లి వెంకట రమణమూర్తి,
రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ

ఉన్నది పంచుకోవాలి

బ్రహ్మచారులు, సాధువుల కన్నా సంసార జీవితాన్ని గడిపే వారికే కొన్ని దాన ధర్మాలు నిర్వర్తించే అవకాశముంది. వాళ్లను సాయం అడిగే వారుంటారు. అలాంటి వారికి సాయం చేసి పుణ్యం గడించే వీలు వీరికే ఎక్కువ.

సంసారి తన దగ్గర ఉన్నవాటిని ఎవరెవరికి ఏది అవసరమో వాటిని నిండు మనసుతో ఇవ్వాలి. ఏ మేరకు ఇవ్వగలరో ఆ మేరకు ఇస్తే చాలు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం వాటిలో ముఖ్యమైనది. కడుపునిండా అన్నం పెట్టిన మనిషి ముఖాన్ని చూడండి. అతని ముఖంలో ఓ తృప్తి, ఓ ఆనందం కనిపిస్తాయి. కానీ మిగిలిన దానాల విషయంలో ఈ తృప్తి అంతగా కనిపించదు. ఎవరైనా తినడానికి వస్తున్నారేమోనని చూసిన తర్వాత తినాలనేది భారతీయ సంప్రదాయం. తన దగ్గర ఉన్నదాన్ని ఇతరులకు పెట్టక తానే తినడం, ఇతరులకు తెలీకుండా దాచిపెట్టి తినడాన్ని పాపమనే భావనా ఉంది. అందుకే అంటారు, ఎన్ని పూజలు, వ్రతాలు చేసినా దానం చేయడం ముఖ్యం. అందులోనూ 'అన్నదానా'న్ని మించింది మరొకటి లేదు.

జ్యోతిర్మయం

ఓ ధనవంతుడు ఎన్నో పూజలు చేసి, భగవంతుడిని ఆరాధించి ఇక తానెవరికీ ఏదీ చెయ్యవలసిన అవసరం లేదని నిర్ణయించుకుని తన దగ్గరున్నది ఎవరికీ ఇవ్వక, ఎవరికీ పిడికెడు అన్నం కూడా పెట్టక 'తానూ, తన కుటుంబం' అనుకొని బతికాడు. తీరా ఆయన మరణించాక రాక్షసుడిగా మారి నదీ ప్రవాహంలో కొట్టుకొచ్చే శవాలను పీక్కుతింటూ తన తప్పు తాను తెలుసుకుని తనను క్షమించమని దేవుడిని వేడుకున్నాడు. దీంతో రాక్షస రూపం పోయి సద్గతి పొందినట్లు ఓ కథ ఉంది. ఇటువంటి కథల నుంచి గ్రహించాల్సిన నీతి ఒక్కటే: తాను తినడమే కాదు ఇతరులకూ పెట్టాలి.

– యామిజాల జగదీశ్

సాగులో ఏపీనే మేటి

అంతర్జాతీయ స్థాయిలో స్ఫూర్తిగా నిలిచిన ఆర్బీకే వ్యవస్థ

- రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న సీఎం జగన్
- రైతులు పచ్చగా ఉండడంతో టీడీపీకి, పచ్చ మీడియాకు కడుపు మంట
- అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి, అమరావతి : వ్యవసాయ రంగం పురోగతిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మేటిగా నిలిచిందని.. రైతు సంక్షేమం, వ్యవసాయరంగ అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న అనేక చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. 2022–23లో వ్యవసాయవృద్ధి రేటు జాతీయస్థాయిలో 11.2 శాతంగా ఉండగా ఏపీలో అది 13.18 శాతం సాధించినట్లు తెలిపారు. అసెంబ్లీలో మంగళవారం వ్యవసాయరంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై జరిగిన స్వల్పకాలిక చర్చకు ఆయన సమాధానమిచ్చారు. ఆయన ఏమన్నారంటే..

- మా 52 నెలల పాలనలో వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి కోసం రూ.1,70,463 కోట్లు ఖర్చుచేశాం. వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా ఇప్పటివరకు రూ.31,005 కోట్లు ఇచ్చాం. దీంతో రైతులు అప్పులుచేయాల్సిన అవసరంలేకుండా సాగుచేస్తున్నారు.
- రూ.14,042 కోట్ల మేర సున్నావడ్డీ రుణాలు అందించాం. గత ప్రభుత్వం సున్నావడ్డీ రాయితీని దాదాపు రూ.785 కోట్లు బకాయి పెట్టింది.
- ఒక్క ఉచిత పంటల బీమా కిందనే రైతులకు రూ.7,802 కోట్లు అందించాం.
- ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఇప్పటికే ప్రభుత్వం రూ.1,976 కోట్లకు పైగా అందించింది.
- అలాగే, ఇప్పటివరకు రూ.58,855 కోట్లు ఖర్చుచేసి పంట దిగుబడులను కొనుగోలు చేసింది. శనగ రైతులకు బోనస్ కింద రూ.300 ఇచ్చాం. రూ.1,052 కోట్లతో యాంత్రీకరణ పరికరాలు అందిస్తున్నాం.
- గత టీడీపీ హయాంలో ట్రాక్టర్ల కొనుగోలులో గోల్‌మాల్ చేశారు. రూ.5 లక్షలున్న ఒక్కో ట్రాక్టర్‌ను రూ.6 లక్షల చొప్పున కొన్నారు. దీనివల్ల రైతులు రూ.లక్ష చొప్పున నష్టపోయారు. కానీ, ఇప్పుడు సీఎం ఆర్బీకే వ్యవస్థ పెట్టాక రైతులకే పూర్తి స్వేచ్ఛ ఇచ్చి వారికి నచ్చిన కంపెనీ, మోడల్‌ను కొనుగోలు చేసుకునేలా చేశారు.

రైతుభరోసా కేంద్రాలతో కొత్త శకం..

రైతుభరోసా కేంద్రాలతో వ్యవసాయ రంగంలో ఒక కొత్త శకం ప్రారంభమైంది. రైతులకు అవసరమైన వాటన్నింటినీ అందించేలా ఈ ఆర్బీకేలు పనిచేస్తున్నాయి. అంతర్జాతీయస్థాయిలో సైతం ఇవి స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు ఇతర వస్తువులను తక్కువ ధరలకే రైతులకు సకాలంలో అందేలా ఆర్బీకేలు చేస్తున్నాయి. ఈ–క్రాప్, ఆర్బీకే వ్యవస్థ, పంటల బీమాలో ఏపీ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర తోమర్ పలు సమావేశాల్లో ప్రకటించారు. మరోవైపు.. ధరల స్థిరీకరణ నిధితో రైతులకు కనీస మద్దతు ధరను అందించేలా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. ఇక రైతులకు రుణాల విషయంలో గత టీడీపీ హయాంలో రూ.3,64,624 కోట్లు ఇస్తే ఈ నాలుగున్నరేళ్లలో మా ప్రభుత్వం రూ.7,62,863 కోట్లు ఇచ్చింది.



సీజన్ ప్రారంభానికి ముందే 'మద్దతు' ప్రకటన

రాష్ట్రంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు ప్రకటిస్తామన్న హామీ మేరకు 2023–24 సీజన్‌కు సంబంధించి వివిధ వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలను ప్రకటించినట్లు వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారం మద్దతు ధరలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఏటా సీజన్‌కు ముందుగానే 22 రకాల పంటలకు మద్దతు ధరలను ప్రకటిస్తున్నామన్నారు. ఆర్బీకేల్లో తమ ఉత్పత్తులను అమ్మదల్చిన రైతులు తమ ఉత్పత్తులు కనీస నాణ్యతా ప్రమాణాలు ఉండేలా చూసుకోవాలని కాకాణి సూచించారు.

రైతులు బాగుంటే పచ్చ మీడియాకు కడుపుమంట..

సీఎం జగన్ చేపట్టిన వ్యవసాయ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రైతులు ఎంతో సంతోషంగా ఉంటే టీడీపీకి, పచ్చమీడియాకు కడుపు మంటగా ఉంది. గతంలో చంద్రబాబు ఐదేళ్లూ కరువు మండలాలే ఉన్నాయి. కానీ, ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క కరువు మండలాన్నీ ప్రకటించలేదు. దీంతో రామోజీ, ఎల్లో మీడియా తట్టుకోలేకపోతున్నాయి. అందుకే తప్పుడు వార్తలతో నిత్యం దుష్ప్రచారం చేస్తున్నాయి. చర్చలో ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, కరణం ధర్మశ్రీ కూడా మాట్లాడారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో అనేక లాభాలు

- ఈ విధానంలో ఫోర్జరీకి ఆస్కారమే లేదు
- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



సాక్షి, అమరావతి: ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రజలకు అనేక లాభాలు ఉంటాయని, ఇప్పటి వరకూ ఉన్న రిజిస్ట్రేషన్ విధానంలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు దీని ద్వారా చెక్ పడుతుందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శాసన సభలో మంగళవారం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌పై పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ శాఖలు అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్తున్నాయన్నారు. ఏదైనా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు దాన్ని అర్థం చేసుకునేందుకు ప్రజలు కొంత సమయం తీసుకుంటారని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానంలో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనంతగా విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిందన్నారు.

నకిలీవనడం సరికాదు..

నూతన విధానంలో రిజిస్ట్రేషన్ అనంతరం అందిస్తున్న ధ్రువపత్రాలు నకిలీవంటూ ప్రచారం నడుస్తోందని, ఇది సరికాదని చెప్పారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు ఈ ధ్రువపత్రాలను అనుమతిస్తాయన్నారు. ఆ మేరకు చట్టాల్లో మార్పులు వచ్చాయన్నారు. ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఎస్ఎల్‌బీసీలో బ్యాంకర్స్‌తో సమీక్షించగా ఈ పత్రాలను అనుమతిస్తామని వారు స్పష్టం చేసినట్టు వివరించారు. మరోవైపు పాత విధానంలో ఫోర్జరీకి ఆస్కారం ఉండేదని, ఆన్‌లైన్ విధానంలో ఫోర్జరీకి ఎంతమాత్రం ఆస్కారం ఉండదన్నారు. గతంలో రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మ్యుటేషన్ కోసం తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లాల్సి ఉండేదని, నూతన విధానంలో ఆటో మ్యుటేషన్ అవుతుందన్నారు. రిజిస్ట్రేషన్ రుసుములపైనా చాలా మందిలో అపోహలు ఉంటాయని, ఆన్‌లైన్ విధానంలో ప్రతి సర్వే నెంబర్ ఆధారంగా రుసుములు ఖరారు చేయడం జరిగిందన్నారు. ఆన్‌లైన్ విధానంలో అత్యంత పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే పలు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభించామని భవిష్యత్తులో అన్ని సచివాలయాల్లో అందుబాటులోకి తెస్తామన్నారు.

తెలంగాణ

చంద్రబాబును ఎప్పటికీ నమ్మొద్దు


ఏపీ ప్రజలకు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: 'టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు జైల్లో ప్రశాంతంగా కూర్చున్నారు. ఆయన జైలుకు ఎందుకు వెళ్లారో, ఏమేం చేశారో అందరికీ తెలుసు. చంద్రబాబును నమ్మలేం. ఎప్పటికీ నమ్మరాదు..' అని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఏపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని దారుస్సలాంలో నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఏపీ పరిస్థితులపై ఒవైసీ మాట్లాడారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రెండే ఆప్షన్లు ఉన్నాయని, ఒకటి టీడీపీ కాగా.. రెండోది జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ వైసీపీ అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంచి పాలన అందిస్తున్నారని కితాబిచ్చారు. కానీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును మాత్రం నమ్మలేమని, ప్రజలు కూడా ఆయన్ను ఎప్పుడూ నమ్మకూడదని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మజ్లిస్ పార్టీ పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

అవినీతి నిర్మూలనకు సచివాలయ వ్యవస్థ

అధికారాలతో పాటు సమర్థమైన విధుల వికేంద్రీకరణకు తగిన వ్యవస్థాగత యంత్రాంగాన్ని రూపొందించాలి

- 74వ రాజ్యాంగ సవరణ చట్టం అమలుపై కాగ్ నివేదిక స్పష్టీకరణ



సాక్షి, అమరావతి : పరిపాలనలో అన్ని స్థాయిల్లో అవినీతి నిర్మూలనకు వార్డు వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థను 2019లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక స్పష్టంచేసింది. అర్హత ఉన్న కుటుంబాలకు సకాలంలో పారదర్శకమైన సేవలను అందించడానికి పట్టణ ప్రాంతాల్లో ఈ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిందని పేర్కొంది. 74వ రాజ్యాంగ సవరణ చట్టం అమలు సమర్థతపై కాగ్ ఇచ్చిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీకి సమర్పించింది. రాష్ట్రం, పట్టణ స్థానిక సంస్థల మాదిరిగానే వార్డును ఒక పరిపాలన విభాగంగా చేసిందని ఆ నివేదిక తెలిపింది. పట్టణ స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తికి భంగం కలగకుండా పరిపాలనా సౌలభ్యం కోసం వార్డు కార్యదర్శి రెండు లేదా అంతకంటే ఎక్కువ సమీప వార్డులకు కూడా సేవలందిస్తారని పేర్కొంది. ఒక్కో వార్డు సచివాలయంలో పది మంది వార్డు కార్యదర్శుల చొప్పున 37,860 వార్డు కార్యదర్శుల పోస్టులతో 3,786 వార్డు సచివాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొంది. ఎంపిక కమిటీ ఇంటర్వ్యూల ద్వారా గౌరవ వేతనంపై వలంటీర్లను ఎంపిక చేసిందని, 2019 సెప్టెంబర్ నాటికి 70,888 వలంటీరు పోస్టులున్నాయని తెలిపింది.

వార్డు కమిటీలను ఏర్పాటుచేయాలి..

అయితే, వార్డు స్థాయిలో కొత్త వ్యవస్థ ఏర్పాటు 74వ రాజ్యాంగ సవరణకు, పురపాలక చట్టాలకు అనుగుణంగాలేదని కాగ్ ప్రస్తావించింది. ఈ వార్డు సచివాలయాలను వార్డు కమిటీలు, ప్రాంతీయ సభలకు జవాబుదారీ చేయడం ద్వారా రాజ్యాంగపరమైన వ్యవస్థలో ఏకీకృతం చేయాలని ప్రభుత్వానికి సూచించింది. అలాగే, స్వపరిపాలన కల్పించటానికి వార్డు కమిటీలను ఏర్పాటుచేసి వాటిని వార్డు సచివాలయాలు, ప్రాంతీయ సభలతో అనుసంధానించాల్సిందిగా ప్రభుత్వానికి కాగ్ సిఫార్సు చేసింది. ఇక భారత రాజ్యాంగం ఆదేశించినట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టాల ద్వారా తగిన చట్టపరమైన యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని.. అయితే, అధికారాలతో సమర్థమైన విధుల వికేంద్రీకరణకు తగిన వ్యవస్థాగత యంత్రాంగాన్ని రూపొందించడానికి ప్రభుత్వం కృషిచేయాలని కోరింది. 18 విధుల్లో 13 విధులు పూర్తిగాను, మూడు విధులు పాక్షికంగా నగరపాలక సంస్థలకు ప్రభుత్వం అప్పగించిందని కాగ్ పేర్కొంది. ఇక ఆస్తిపన్ను ఎగవేతదారుల నుంచి బకాయిల రికవరీని పట్టణ స్థానిక సంస్థలు అమలు చేస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించుకోవాలని కాగ్ సూచించింది. నిబంధనల మేరకు ఎగవేతదారులపై జరిమానాలు విధించవచ్చునని, ప్రభుత్వం అన్నిరకాల భవనాలకు రుసుము విధింపు, వసూలుతో పాటు భవన నిర్మాణ అనుమతులు మంజూరు అధికారాన్ని పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేయవచ్చునని సూచించింది. పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం మొదలైన వాటికి సంబంధించి అధికారాలను అనుబంధ సంస్థలకు బదులుగా పట్టణ స్థానిక సంస్థలకే ప్రభుత్వం కేటాయించాలని సిఫార్సు చేసింది. అలాగే, స్థానిక అవసరాలకు తగ్గట్లుగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడానికి పట్టణ స్థానిక సంస్థల మార్గదర్శకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రణాళికా కమిటీలు, మహానగర కమిటీలను ఏర్పాటుచేయాలని సిఫార్సు చేసింది. చట్ట నిబంధనలకు అనుగుణంగా ఆస్తిపన్ను బోర్డును ఏర్పాటు చేయాల్సిందిగా కాగ్ సిఫార్సు చేసింది.

ఆర్థిక సంఘాలు ఏర్పాటుచేయాలి

పట్టణ స్థానిక సంస్థలకు ద్రవ్య గ్రాంట్ల బదిలీ, వాటి లభ్యతను సకాలంలో అందేటట్లు ప్రభుత్వం చూడాలని.. అలాగే, పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను సమీక్షించడానికి, పట్టణ స్థానిక సంస్థలకు నిధులు అందించడానికి సకాలంలో రాష్ట్ర ఆర్థిక సంఘాలను ఏర్పాటుచేయాలని కాగ్ సిఫార్సు చేసింది. వాస్తవ రాబడులను నిర్ధారించుకున్న తరు వాత ప్రజలకు అందించే అన్ని పురపా లక సేవల ఖరీదును సరిగ్గా నిర్ణయించి, ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుని వాస్తవిక బడ్జెట్లను సిద్ధంచేయడానికి పట్టణ స్థానిక సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం ప్రేరేపించాలని కాగ్ సిఫార్సు చేసింది.

గుంటూరు నుంచి హెలికాప్టర్‌లో తిరుపతికి, అక్కడ పద్మావతి ఆస్పత్రిలోకి గుండెను తరలిస్తున్న వైద్య సిబ్బంది





అవయవదానంతో అమరుడయ్యాడు

నలుగురికి ఉపయోగపడాలని

నా బిడ్డ ఎప్పుడూ నలుగురికి ఉపయోగపడాలని, నలుగురికి మంచి చేయాలనే ఆలోచన కలిగి ఉండేవాడు. అకస్మాత్తుగా చనిపోయాడు. నా బిడ్డ ఆశయం నెరవేర్చేందుకు అతని అవయవాలను నలుగురికి ఉపయోగపడాలని ముందుకు వచ్చాం. మా బిడ్డను పూడ్చిపెట్టడం ఇష్టం లేదు. అవయవదానం ద్వారా నలుగురిలో నా బిడ్డ బతికే ఉంటాడు.

– మృతుడి తల్లి మల్లేశ్వరి

బ్రెయిన్‌డెడ్ అయిన చిలకలూరిపేట యువకుడి స్ఫూర్తి

- అవయవదానం చేసి ఆరుగురి జీవితాల్లో వెలుగు నింపి..
- గుండె, కాలేయం, రెండు కిడ్నీలు, రెండు కళ్లు దానం
- సీఎం జగన్ చొరవతో వేగంగా అవయవాల తరలింపు
- గ్రీన్‌చానల్ ద్వారా తిరుపతికి గుండె, విశాఖకు కాలేయం


అవయవదాత కట్టా కృష్ణ

గుంటూరు మెడికల్/తిరుపతి తుడా/గోపాల పట్నం (విశాఖ పశ్చిమ): తాను మరణిస్తూ ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు కట్టా కృష్ణ అనే యువకుడు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై బ్రెయిన్‌డెడ్ అయిన కృష్ణ అవయవదానంతో అమరుడు అయ్యాడు. పుట్టెడుదుఃఖంలో ఉండి కూడా ఇతరులకు సాయం చేయాలని ఆ కుటుంబం తీసుకున్న నిర్ణయం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. వివరాల్లోకి వెళితే పల్నాడు జిల్లా చిలకలూరిపేట శాంతినగర్‌కు చెందిన కట్టా కృష్ణ (18) ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 23న కాలేజీకి వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉన్న సమయంలో అటుగా వెళుతున్న ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి వేగంగా వచ్చి కృష్ణను ఢీకొట్టింది. తలకి బలమైన గాయం తగలటంతో చికిత్స నిమిత్తం గుంటూరు రమేశ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యుల చేసిన ప్రయత్నాలు ఫలించక కృష్ణ ఈనెల 25న బ్రెయిన్‌డెడ్ అయినట్లు డాక్టర్లు ప్రకటించారు. ముగ్గురి సంతానంలో ప్రథముడైన కృష్ణ మరణాన్ని తల్లిదండ్రులు రాజు, మల్లేశ్వరి జీర్ణించుకోలేకపోయారు. అనంతరం తమ బిడ్డ దూరమైనా నలుగురి జీవితాల్లో వెలుగులు నింపాలని భావించి తమ కుమారుడి అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారు. కృష్ణ గుండెను తిరుపతికి, కాలేయాన్ని విశాఖపట్నంకు, రెండు కిడ్నీల్లో ఒకటి విజయవాడ ఆయుష్ ఆస్పత్రికి, రెండోది గుంటూరు రమేశ్ ఆస్పత్రికి, రెండు కళ్లు (ఇద్దరికి అమర్చేందుకు) గుంటూరులోని సుదర్శిని ఆస్పత్రికి తరలించారు.

విజయవంతంగా గుండె మార్పిడి

తిరుపతిలోని టీటీడీ శ్రీపద్మావతి గుండె చికిత్సాలయంలో గుండెమార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలోని ఐదుగురు వైద్యుల బృందం సుమారు 5.10 గంటలపాటు కష్టపడి గుండెమార్పిడి శస్త్రచికిత్సను చేపట్టారు. గుంటూరు నుంచి వచ్చిన కృష్ణ గుండెను కర్నూలుకు చెందిన శ్రీనివాసన్ (33)కు అమర్చారు. శ్రీనివాసన్ గుండె సంబంధిత సమస్యతో మూడు నెలల క్రితం శ్రీపద్మావతి ఆస్పత్రికి వచ్చాడు. అతనికి అన్ని పరీక్షలు చేసిన డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ గణపతి మార్పిడి అనివార్యమని తేల్చారు. అవయవదాన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయించారు. ఈ క్రమంలో కృష్ణ అవయవదానంతో శ్రీనివాసన్‌కు చికిత్స చేశారు.

విశాఖలో గ్రీన్‌చానెల్

కృష్ణ కాలేయాన్ని తొలుత గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విశాఖ విమానాశ్రయంకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో గ్రీన్‌చానల్ ద్వారా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి రోడ్డు మార్గంలో తరలించారు. విమానాశ్రయం నుంచి 6 నిమిషాల్లోనే ఆస్పత్రికి కాలేయాన్ని చేర్చారు. సకాలంలో అంబులెన్స్ ఆస్పత్రికి చేరేందుకు ట్రాఫిక్ పోలీసులు విశేష కృషి చేశారు.

సీఎం జగన్ ప్రత్యేక చొరవ

ఓ ప్రాణం నిలిపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతలా ఆత్రత పడతారో మరోసారి నిరూపించారు. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి సీఎంవోతో చర్చలు జరిపిన నేపథ్యంలో గుండె మార్పిడి అవసరాన్ని ఉన్నతాధికారులు సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో గుండెను పదిలంగా, వేగంగా తరలించేందుకు ప్రత్యేక చాపర్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. అలానే రూ. 13 లక్షలు ఖరీదైన గుండె మార్పిడి వైద్యానికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి నిధులను మంజూరు చేయించారు. గుంటూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా గన్నవరం విమానాశ్రయంకు గుండెను తరలించి అక్కడి నుంచి ప్రత్యేక చాపర్ ద్వారా తిరుపతి విమానాశ్రయంకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి గ్రీన్‌చానల్ ద్వారా 23 నిమిషాల్లో తిరుపతిలోని శ్రీపద్మావతి ఆస్పత్రికి తీసుకొచ్చారు. దీనికోసం పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చంద్రబాబుపై మాకెందుకు కక్ష ఉంటుంది?

- బాబు ఎవడి మీదో ఆధారపడి రాజకీయాలు చేస్తారు
- సోనియాతో కలిసి జగన్‌పై అక్రమ కేసులు పెట్టించినట్లు అంగీకరిస్తావా బాబూ?
- స్కిల్ స్కామ్‌లో ఆధారాలతో పట్టుబడ్డాడు కాబట్టే బాబు జైలుకు
- బాబు అరెస్టుతో తిరుణాల్లో తప్పిపోయినోడిలా లోకేశ్ తీరు
- జైల్లో దోమలు కుట్టక.. రంభా ఊర్వశిలు కన్నుకొడతారా?
- మాజీ మంత్రి కొడాలి నాని



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయలేక ఎవడి మీదనో ఆధారపడి రాజకీ యాలు చేసే చంద్రబాబుపై తమకు వ్యక్తిగత కక్ష ఎందుకు ఉంటుందని మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. ఆయన మంగళవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లా డుతూ.. 'రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీడీపీ అధ్యక్షుడు చంద్ర బాబు కుటుంబాలు విరుద్ధమైన రాజకీయ పార్టీల్లో ఉన్నాయి. అప్పుడెప్పుడూ లేని వ్యక్తిగత కక్ష ఇప్పుడే వచ్చిందా? సీఎం జగన్‌కు ఎందుకు వ్యక్తిగత కక్ష ఉందో బాబు చెప్పాలి. 2012లో వ్యక్తిగత కక్షతోనే సోనియాగాంధీతో కలిసి వైఎస్ జగన్‌ను అరెస్టు చేయించావని అంగీకరిస్తావా' అని ప్రశ్నించారు. 'చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో ప్రజాధనాన్ని దోచేసి, పక్కా ఆధారాలతో దొరికిపోయాడు కాబట్టే ఏసీబీ కోర్టు రిమాండ్ విధించి, జైలుకు పంపింది. ఢిల్లీ నుంచి పెద్ద లాయర్లతో వేయించిన క్వాష్ పిటిషన్‌ను కూడా హైకోర్టు తోసిపుచ్చింది. చంద్రబాబు గతంలో 10, 15 శాతం కమీషన్ తీసుకుని బతికేవాడు. కొడుకు, కుటుంబ సభ్యులు రంగంలోకి వచ్చాక ప్రభుత్వ ఖజానాను మొత్తం దోచేశారు. కుటుంబ సభ్యులు చేసిన కుంభకోణానికి చంద్రబాబు జైల్లో ఉన్నాడు' అని అన్నారు. 'చంద్రబాబు ఇన్నర్ రింగ్ రోడ్డు, రాజధానితో పాటు అన్నింటిలోనూ కుంభకోణాలు చేశారని మేం మొదటి నుంచీ చెబుతున్నాం. ఎన్ని దొంగతనాలు చేసినా ఆయన జోలికి ఎవరూ రారన్న నమ్మకం చంద్రబాబుది. అందుకే 'నీ బాబే ఏం చేయలేకపోయాడు.. నువ్వేం చేస్తావ్' అంటూ బీరాలు పలికాడు. బాలయ్య డైలాగ్‌లా ఫ్లూట్ జింక ముందు ఊదాలి. కానీ చంద్రబాబు సింహం ముందు ఊదాడు. బాబు ప్రచారంలోనే దిట్ట. జనంలో ఆయనకు బలమేమీ ఉండదు' అని చెప్పారు. 'టీడీపీని చంద్రబాబు కుల పార్టీగా మార్చారు. ఆయన బడుగు, బలహీనవర్గాల వారికి ముగ్గు రు నలుగురికన్నా రాజ్యసభ సీట్లు ఇచ్చాడా? హైదరాబాద్, బెంగళూరు.. ఇలా అన్ని చోట్లా ర్యాలీలు చేస్తున్నదెవరు? పేదలు చంద్రబాబు కోసం ఏనాడూ పాదయాత్రలు చేయరు. 'బాబుతో నేను'.. అంటే అందరూ ఆయనతో పాటు జైలుకు వెళ్లాలా' అంటూ ధ్వజమెత్తారు. 'బాబును అరెస్టు చేయగానే తిరుణాల్లో తప్పిపోయిన పిల్లాడిలా లోకేశ్ బిత్తర చూపులు చూస్తున్నాడు. ఎన్ని ఎక్కువ కేసులు ఉంటే అంత పెద్ద నామినేటెడ్ పదవులు ఇస్తానన్నాడు. ఇప్పుడు వాళ్ల నాన్న మీద ఎక్కువ కేసులు పెడుతున్నారని అంటున్నాడు. ఏం నీకు వద్దా పెద్ద పదవి? జైల్లో చంద్రబాబుకు వేడి నీళ్లు ఇవ్వడంలేదని, దోమలు కుడుతున్నాయని భువనేశ్వరి చెప్పడం విడ్డూరం. కోర్టు ఆదేశాల మేరకే జైల్లో సౌకర్యాలు కల్పిస్తారు. జైల్లో దోమలు కుట్టక రంభా ఊర్వశి వచ్చి కన్ను కొడతారా? దోమల మీద చంద్రబాబు దండయాత్ర చేశాడు కదా అవన్నీ పగబట్టి ఉంటాయి' అని కొడాలి నాని వ్యాఖ్యానించారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతి ఇవ్వొద్దు

- డీపీఆర్‌ను పరిశీలించే ముందు మా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి
- సీడబ్ల్యూసీ చైర్మన్ వోరాకు ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి లేఖ

సాక్షి, అమరావతి: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేడబ్ల్యూడీటీ–1 (బచావత్ ట్రిబ్యు నల్) నీటి కేటాయింపులు చేయలేదని.. కేడ బ్ల్యూడీటీ–2 కూడా ఇదే అంశాన్ని ఎత్తి చూపిన నేపథ్యంలో ఆ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఆ ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీ ఆర్)ను పరిశీలించే ముందు ఇప్పటికే తాము లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణన లోకి తీసుకోవాలని కోరింది. ఈ మేరకు సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరాకు ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి మంగళవారం లేఖ రాశారు.

లేఖలో ప్రధానాంశాలు ఇవీ..

- చిన్న నీటివనరుల విభాగంలో వినియోగించుకోని 45.6 టీఎంసీలకు.. కృష్ణా డెల్టాకు మళ్లించే గోదావరి జలాలకుగానూ తమకు కృష్ణా జలాల్లో దక్కే 45 టీఎంసీలను జత చేసి.. 90 టీఎంసీలను పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోత లకు తనకు తానే కేటాయించుకుంటూ తెలంగాణ సర్కార్ 2022, ఆగస్టు 18న ఉత్తర్వులు (జీవో 246)ను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ద్వారా కేడబ్ల్యూడీటీ–1ను తెలంగాణ సర్కార్ ఉల్లంఘించింది. దీనివల్ల దిగువ రాష్ట్రమైన ఏపీ హక్కులకు విఘాతం కలుగుతుంది.
- పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల్లో పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించిన తెలంగాణ సర్కార్‌పై జరిమానా విధిస్తూ 2022, డిసెంబర్ 22న ఎన్జీటీ ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు 2023, ఫిబ్రవరి 17న స్టే ఇచ్చినప్పటికీ.. తాగునీటికి అవసరమైన 7.15 టీఎంసీలను తరలించడానికి అవసరమైన పనులను మాత్రమే చేపట్టాలని నిర్దేశించింది.
- ఈ ఎత్తిపోతలకు నీటి కేటాయింపులకు సంబంధించిన ఉత్తర్వులను రద్దు చేయాలని మేము దాఖలు చేసిన పిటిషన్ (ఐఏ 13)పై కేడబ్ల్యూడీటీ–2 విచారణ చేసింది. ఆ ఎత్తిపోతలకు ట్రిబ్యునల్ నీటిని కేటాయించలేదని.. విభజన చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత చేపట్టిన ఆ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు చేసే అధికారం తమకు లేదని కేడబ్ల్యూడీటీ–2 ఈనెల 20న తేల్చిచెప్పింది.
- కృష్ణా డెల్టాకు మళ్లించే 80 టీఎంసీల గోదావరి జలాల్లో సాగర్‌కు ఎగువన అదనంగా 45 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకునే అధికారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉంది. విభజన నేపథ్యంలో ఆ 45 టీఎంసీలు తమకే దక్కుతాయని తెలంగాణ చెబుతోంది. అందులో ఆంధ్రప్రదేశ్‌కు వాటా ఉంది. ఈ విషయంలో కేడబ్ల్యూడీటీ–2 తుది తీర్పు ఇంకా వెలువడని నేపథ్యంలో.. పాలమూరు–రంగారెడ్డికి తెలంగాణ చేసుకున్న నీటి కేటాయింపులు చట్టవిరుద్ధం.

తెలంగాణ

జీఎమ్మార్ ఎయిర్‌పోర్టుకు నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరోసారి ప్రతిష్టాత్మక 'నేషనల్ ఎనర్జీ లీడర్' అవార్డు లభించింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించిన 'ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్'– 24వ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో 'నేషనల్ ఎనర్జీ లీడర్', 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ యూనిట్' అవార్డులను గెలుచుకుంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 'నేషనల్ ఎనర్జీ లీడర్' అవార్డు లభించడం వరుసగా ఇది ఐదోసారి కాగా 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ యూనిట్' అవార్డు లభించడం వరుసగా ఇది ఏడవసారి. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పాణికర్ మాట్లాడుతూ...ఇంధన వినియోగంలో సమర్థవంతమైన, నాణ్యమైన విధానాలను అమలు చేయడం వల్ల సత్ఫలితాలను సాధించామన్నారు. పర్యావరణ పరిరక్షణకు అనేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. 2030 నాటికి కార్బన్ న్యూట్రాలిటీని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

క్లుప్తంగా...

టీబీ మందుల కొరత లేదు

న్యూఢిల్లీ: భారత్‌లో టీబీ మందులకి ఎలాంటి కొరత లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం స్పష్టం చేసింది. ఆరు నెలలు, అంతకంటే ఎక్కువ రోజులకు సరిపడా మందులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ (ఎన్‌టీఈపీ) కింద పంపిణీ చేసే ఔషధాలు లభించడం లేదని వచ్చిన కథనాలన్నీ తప్పుడువని పేర్కొంది. కీలకమైన సైక్లో సెరిన్ సహా అన్ని ఔషధాలు ఉన్నాయి. ఆగస్టులోనే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సరఫరా చేశామని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది.

దక్షిణ కొరియా భారీ సైనిక పరేడ్

సియోల్: సోదర దేశం ఉత్తరకొరియాతో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్న వేళ.. దక్షిణ కొరియా మంగళవారం భారీ సైనిక పరేడ్‌ను నిర్వహించింది. యుద్ధ ట్యాంకులు, ఫిరంగులు, డ్రోన్లు, శక్తివంతమైన బాలిస్టిక్ క్షిపణులు కలిపి 200 రకాలైన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను ప్రదర్శించింది. దీంతోపాటు 6,700 మంది కొరియా జవాన్లు, మరో 300 మంది అమెరికా సైనికులు పరేడ్‌లో పాల్గొన్నారు.

ఢిల్లీలోని దుకాణంలో 20 కోట్ల ఆభరణాలు చోరీ

న్యూఢిల్లీ: ఢిల్లీలోని భోగాల్ ఏరియాలోని ఓ నగల దుకాణంలోని రూ.20 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలను దొంగలు ఎత్తుకుపోయారు. ఆదివారం రాత్రి ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని ముగ్గురు దుండగులు ఉమ్రావ్ సింగ్ జువెల్లర్స్ దుకాణం గోడకు కన్నం వేసి లోపలున్న స్ట్రాంగ్ రూంను బద్దలు కొట్టారు. దుకాణంలో 30 కిలోల బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల నగదు ఉన్నట్లు నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. అక్కడున్న సీసీకెమెరాలను దుండగులు ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. సోమవారం కూడా దుకాణం మూసివేసి ఉండటంతో ఈ విషయం మంగళవారం వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు.

జేపీ నడ్డా పూజలు చేస్తుండగా గణేశ్ మండపంలో మంటలు

పుణె: బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పూజలు చేస్తున్న సమయంలోనే గణేశ్ మంటపంలో మంటలు చెలరేగాయి. భద్రతాధికారులు అప్రమత్తమై ఆయన్ను వెంటనే అక్కడి నుంచి బయటకు తీసుకువచ్చారు. మహారాష్ట్రలోని పుణెలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. లోకమాన్యనగర్‌లోని ఓ గణేశ్ మంటపంలో జేపీ నడ్డా, మహారాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రశేఖర్ బవాంకులేతో కలిసి పూజలు చేస్తున్నారు. అదే సమయంలో మంటపం పైభాగంలో మంటలు వ్యాపించాయి. దీంతో, భద్రతాధికారులు వారిని వెంటనే బయటకు తీసుకువచ్చారు.

రాజకీయ సౌలభ్యం కోసం... ఉగ్రవాదంపై మెతక వైఖరా?

ఐరాస వేదికపై కెనడాకు భారత్ చురకలు | పాక్, అమెరికాలకు కూడా



- అది పక్కా అవకాశవాద ధోరణే
- విదేశాంగ మంత్రి జై శంకర్ నిప్పులు
- ఏకస్వామ్య పోకడలు చెల్లవిక!
- పెద్ద దేశాల తీరునూ ఎండగట్టిన మంత్రి

ఐక్యరాజ్యసమితి: ఖలిస్తానీ ఉగ్రవాదం విషయంలో మెతకగా వ్యవహరిస్తున్న కెనడాకు ఐక్యరాజ్య సమితి వేదికగా భారత్ చురకలంటించింది. ఉగ్రవాదం, తీవ్రవాదం, హింసల విషయంలో కేవలం రాజకీయ సౌలభ్యం కోసం మెతక వైఖరి అవలంబించడం సరికాదని స్పష్టం చేసింది. ఇలాంటి అవకాశవాద ధోరణులకు దూరంగా ఉండాలని ఐరాస సభ్య దేశాలకు పిలుపునిచ్చింది. మంగళవారం ఐరాస 78వ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడిన విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ ఈ మేరకు కుండ బద్దలు కొట్టారు. కశ్మీర్ విషయంలో అంతర్జాతీయ వేదికలపై పాకిస్తాన్ ప్రదర్శిస్తున్న కొద్ది బుద్ధులను కూడా ఏకిపారేశారు. 'ప్రాదేశిక సమగ్రత, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో వేలు పెట్టరాదన్నవి కనీస మర్యాదలు. అంతే తప్ప ఇలాంటి విషయాల్లో తమ రాజకీయ స్వార్థాలకు, అవసరాలకు అనుగుణంగా ఇష్టానికి వైఖరులు మార్చుకునే తీరు సరి కాదు' అంటూ పాక్ తో పాటు పరోక్షంగా అమెరికా తీరును కూడా దుయ్యబట్టారు. ఐరాస వేదికగా పాక్ తాత్కాలిక ప్రధాని ఇటీవల దిగజారుడు వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఇక కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఇరు దేశాల మధ్య తీవ్ర విభేదాలకు, దౌత్య సంక్షోభానికి దారి తీసింది. హత్యలో భారత్ ప్రమేయం ఉందన్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వ్యాఖ్యలతో మంటలు రాజుకున్నాయి. ఖలిస్తానీ అనుకూల పార్టీ మద్దతుతో అధికారాన్ని కాపాడుకుంటున్న ట్రూడో వారిని మంచి చేసుకునేందుకే ఇలా వ్యవహరిస్తున్నారని ఆయన సొంత పార్టీ ఎంపీలే విమర్శిస్తుండటం తెలిసిందే. అంతేగాక నిజ్జర్ హత్యకు సంబంధించి నిఘా సమాచారాన్ని కెనడాతో అమెరికా పంచుకుందని కూడా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పాక్, అమెరికా తీరును పరోక్షంగా దుయ్యబడుతూ ఐరాస వేదికపై జై శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

పెద్ద దేశాలూ, కొద్ది బుద్ధులు!

పెద్ద దేశాల పెత్తందారీ, ఏకపక్ష పోకడలకు వ్యతిరేకంగా వర్ధమాన దేశాల గొంతుకను ఐరాస వేదికపై జై శంకర్ ఈ సందర్భంగా గట్టిగా వినిపించారు. కొన్ని పెద్ద దేశాలే తమ అవసరాలకు అనుగుణంగా అజెండాను నిర్దేశించి, మిగతా దేశాలన్నీ తమను అనుసరించాలని కట్టడి చేసే రోజులకు కాలం చెల్లిందని స్పష్టం చేశారు. 'ఈ పోకడలు ఎల్లకాలమూ చెల్లవు. వాటినెవరూ సవాలే చేయరని అనుకోవద్దు. వ్యాక్సిన్ల విషయంలో వర్ణ వివక్షను ఇంకెప్పుడూ అనుమతించరాదు. వాతావరణ మార్పులకు అడ్డుకట్ట వేయడంలో పెద్ద దేశాలు తమ బాధ్యతలను తప్పించుకోరాదు. నిరుపేద దేశాలకు అందాల్సిన ఆహార, ఇంధన నిల్వలను పెద్ద దేశాలు తమ మార్కెట్ బలాన్ని ఉపయోగించి చెరబట్టరాదు' అంటూ శషభిషలకు తావు లేకుండా స్పష్టం చేశారు. అభివృద్ధిలోనూ, అన్నింట్లోనూ అన్ని దేశాలకూ సమాన భాగస్వామ్యం కల్పించే నూతన ప్రజాస్వామిక వాతావరణం నెలకొని తీరుతుందని మంత్రి ధీమా వెలిబుచ్చారు. అంతర్జాతీయ మార్కెట్లలో కూడా అన్ని రకాల నిబంధనలు అన్ని విషయాల్లోనూ అన్ని దేశాలకూ సమానంగా వర్తించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్ ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. అలీనోద్యమానికి మద్దతిచ్చిన రోజుల నుంచి విశ్వమిత్ర (ప్రపంచ నేస్తం) స్థాయి దాకా భారత్ ఎదిగింది. మిగతా దేశాలన్నీ తమ జాతీయ ప్రయోజనాలే చూసుకుంటాయి. భారత్ మాత్రం విశ్వ శ్రేయస్సునే తన మేలుగా భావిస్తుంది' అని స్పష్టం చేశారు. ఆ గురుతర బాధ్యతను దృష్టిలో ఉంచుకునే జీ20 సారథ్యాన్ని భారత్ స్వీకరించిందని వివరించారు. 'ఇతర దేశాల వాదనను సానుభూతితో వినడం, వాటి వైఖరిని గౌరవించడం బలహీనత కాదు. పరస్పర సహకారానికి సూచిక. ఐరాస లక్ష్యానికి కొనసాగింపు' అంటూ చైనా మితి మీరిన దూకుడుకు కూడా జై శంకర్ చురకలు వేశారు.

శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టకి జనవరి 22 ముహూర్తం ..?

న్యూఢిల్లీ: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం వచ్చే ఏడాది జనవరి 20–24 మధ్య ఉంటుందని ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా చెప్పారు. మూడంతస్తుల్లో నిర్మాణం జరుపుకుంటున్న రామాలయంలో గ్రౌండ్ ఫ్లోర్ డిసెంబర్ చివరి నాటికి సిద్ధమైపోతుందని వెల్లడించారు. జనవరి 22న ఆలయంలో శ్రీరాముడి విగ్రహం ప్రాణప్రతిష్ట జరిపే అవకాశాలున్నాయని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని చెప్పారు. జనవరి 20–24 మధ్య ఆలయ ప్రారంభోత్సవానికి ముహూర్తాలు దివ్యంగా ఉన్నాయని ప్రధాని రావడానికి ఏ రోజు వీలవుతుందో అదే రోజు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఆ తేదీని పీఎంఓ కార్యాలయం ఖరారు చేయాల్సి ఉంటుందని తెలిపారు. మంగళవారం ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

నిజ్జర్ హత్య విచారణకు సహకరించండి

వాషింగ్టన్: కెనడాలో ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యపై అమెరికా తన స్వరం పెంచుతోంది. నిజ్జర్ హత్యపై లోతుగా విచారించి కుట్రదారులకి తగిన శిక్ష విధించాలని కెనడా ప్రభుత్వానికి సూచించింది. ఈ విచారణలో కెనడా దర్యాప్తు సంస్థలకు సహకరించాలని భారత్‌పై ఒత్తిడి పెంచుతోంది. ఇప్పటికే నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని ట్రూడో ఆరోపిస్తే, దానిని భారత్ గట్టిగా తిప్పి కొట్టిన తెలిసిందే. నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలు అత్యంత ఆందోళనకరమైనవని, ఈ అంశంలో కెనడాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ అన్నారు. నిజ్జర్ హత్య వెనుకనున్న వారిని విచారించడం కెనడాకు అత్యంత సంక్లిష్టమైనదని, భారత్ ఈ విచారణకు సహకరించాలని మిల్లర్ విజ్ఞప్తి చేశారు.

మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

అదృశ్యమైన ఇద్దరు విద్యార్థులు దారుణ హత్య

- సామాజిక మాధ్యమాల్లో వారి ఫొటోలు వైరల్
- ఆగ్రహంతో నిరసనలకు దిగిన విద్యార్థులు
- హత్యకేసు దర్యాప్తు సీబీఐకి అప్పగింత
- అయిదు రోజులపాటు ఇంటర్నెట్ సేవలు నిలిపివేత

ఇంఫాల్: జులై నుంచి కనిపించకుండా పోయిన ఇద్దరు విద్యార్థులు హత్యకు గురయ్యారని తెలియడంతో మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. మృతులను హిజం లింథోయింగంబి(17), ఫిజమ్ హేమ్‌జిత్(20)గా గుర్తించారు. వారి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మంగళవారం ఉదయం విద్యార్థులు ఇంఫాల్‌లో భారీ ర్యాలీ జరిపారు. సీఎం కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. అడ్డుకునేందుకు పోలీసులు లాఠీచార్జి చేయడంతోపాటు టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం సంయమనం పాటించాలని, దర్యాప్తునకు సహకరించాలని ప్రజలను కోరింది. కిడ్నాప్, హత్యపై దర్యాప్తును సీబీఐకి అప్పగించామని తెలిపింది. విద్యార్థుల హంతకులను పట్టుకుని, కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేసింది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలపై అయిదు రోజులపాటు నిషేధం విధిస్తున్నట్లు తెలిపింది. అన్ని స్కూళ్లకు శుక్రవారం వరకు సెలవులు ప్రకటించింది. దాదాపు నాలుగు నెలల అనంతరం రాష్ట్రంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను ఈ నెల 23న పునరుద్ధరించిన విషయం తెలిసిందే. మైతేయి వర్గానికి చెందిన హిజం లింథో ఇంగంబి(17) ఆమె స్నేహితుడు ఫిజమ్ హేమ్‌జిత్(20) కలిసి జూలై 6వ తేదీన చురాచంద్‌పూర్‌లోని పర్యాటక ప్రాంతం లండాన్‌కు వెళ్లారు. ఆ తర్వాత వారి జాడ తెలియలేదు. వారి ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాయి. కుటుంబసభ్యులు ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా వారి మృతదేహాల ఫొటోలు సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఒక ఫొటోలో ఇద్దరు విద్యార్థుల పక్కన సాయుధులు నిలబడి ఉండగా, మరో ఫొటోలో ఇద్దరి మృతదేహాలున్నాయి. హంతకులను పట్టుకునేందుకు ఇప్పటికే పోలీసు బలగాలు వేట ప్రారంభించాయని సీఎం ఎన్.బీరేన్ సింగ్ తెలిపారు. హత్య ఘటనపై విచారణ చేపట్టేందుకు స్పెషల్ డైరెక్టర్ అజయ్ భట్నాగర్ నేతృత్వంలోని సీబీఐ బృందం ఇంఫాల్ చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.

లాఠీచార్జిలో 45 మందికి గాయాలు

విద్యార్థుల కిడ్నాప్, హత్యను నిరసిస్తూ మంగళవారం విద్యార్థులు ఇంఫాల్‌లో భారీ ర్యాలీ చేపట్టారు. ముఖ్యమంత్రి కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్న పోలీసులు, భద్రతాబలగాలతో బాహాబాహీకి దిగారు. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. లాఠీచార్జి చేశారు. ఈ ఘటనలో 45 మందికి పైగా విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో ఎక్కువమంది బాలికలే ఉన్నారని పోలీసులు తెలిపారు. కాగా, ఇటువంటి అమానవీయ ఘటనలు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మైతేయి, కుకీల మధ్య జరుగుతున్న ఘర్షణల్లో 175 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.



ఈ ఫొటోలో ఉన్నదెవరో గుర్తు పట్టారా ? ఒకరు బెంగళూరుకి చెందిన టెక్కీ సిద్ పూరీ. అతని పక్కన బ్లూ జాకెట్, సన్‌గ్లాసెస్‌తో స్మార్ట్‌గా కనిపిస్తున్నదెవరో కాదు. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్. సామాజిక మాధ్యమాల్లో సిద్ ఈ ఫొటో షేర్ చేసిన వెంటనే అది వైరల్‌గా మారింది. లైక్‌లు, కామెంట్లు వెల్లువెత్తాయి. ఇటీవల శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లినప్పుడు అక్కడ రోడ్డుపై అనుకోకుండా పిచాయ్ తారసపడ్డారని సిద్ పూరీ ఫొటో షేర్ చేస్తూ పంచుకున్నారు. సుందర్ పిచాయ్ చుట్టూ భద్రతా సిబ్బంది లేరని, ఒక గార్డ్ ఉంటే అతనే ఈ ఫొటో తీశాడని వెల్లడించారు. అలా వీధిలో సాక్షాత్తూ సుందర్ పిచాయ్ కనిపిస్తారని తనకెవరో ముందుగా చెప్పలేదంటూ జోక్ చేశారు. ఒక సామాన్యుడిలా ఉన్న సుందర్‌పిచాయ్‌ని ఎలా గుర్తు పట్టారంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

మన దౌత్యం... కొత్త శిఖరాలకు

ప్రపంచగతినే మలుపు తిప్పే నిర్ణయాలకు వేదికైన జీ20

- దూసుకెళ్తున్న నయా భారత్
- గత 30 రోజుల పరిణామాలే నిదర్శనం
- చంద్రయాన్ నుంచి జీ 20 దాకా ఎన్నో దిగ్విజయాలు
- ప్రధాని 'మంత్లీ ప్రోగ్రెస్ రిపోర్ట్'





ప్రగతిమైదాన్‌లోని భారత్ మండపంలో జరిగిన కార్యక్రమ వేదికపై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: గత నెల రోజుల్లో భారత దౌత్య ప్రతిభ నూతన శిఖరాలను తాకిందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా 21వ శతాబ్దిలో ప్రపంచ గతిని నిర్ణయించే పలు కీలక నిర్ణయాలకు ఢిల్లీ వేదికగా ఇటీవల జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సు వేదికైందన్నారు. నేటి భిన్న ధ్రువ ప్రపంచంలో అన్ని దేశాలను ఒకే వేదిక మీదికి తేవడం చిన్న విషయమేమీ కాదన్నారు. 'దేశ వృద్ధి ప్రస్థానం నిర్నిరోధంగా సాగాలంటే స్వచ్ఛమైన, స్పష్టమైన, సుస్థిరమైన పాలన చాలా ముఖ్యం. ప్రస్తుతం దేశంలో చోటుచేసుకుంటున్న సానుకూల పరిణామాలు, మార్పులకు రాజకీయ స్థిరత్వం, విధాన స్పష్టత, పాలనలో ప్రతి అడుగులోనూ పాటిస్తున్న ప్రజాస్వామిక విలువలే ప్రధాన కారణం' అని అభిప్రాయపడ్డారు. మంగళవారం ఇక్కడ జీ20 కనెక్ట్ లో విద్యార్థులు, బోధన సిబ్బంది, విద్యా సంస్థల అధిపతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అవినీతిని, వ్యవస్థలో లీకేజీలను అరికట్టేందుకు, దళారుల జాడ్యాన్ని నిర్మూలించేందుకు, పథకాల అమలుకు టెక్నాలజీని గరిష్ఠంగా వాడుకునేందుకు గత తొమ్మిదేళ్లలో తమ సర్కారు చిత్తశుద్ధితో ప్రయత్నించిందని చెప్పారు.

భారత్, ద హ్యాపెనింగ్ ప్లేస్!

భారత్ ఇప్పుడు ఎన్నో కీలక సంఘటనలకు వేదికగా మారుతోందని మోదీ అన్నారు. 'గత నెల రోజుల ఘటనలే ఇందుకు నిదర్శనం. దానిపై ప్రగతి నివేదిక ఇవ్వదలచుకున్నా. అప్పుడు నూతన భారతం వృద్ధి పథంలో పెడుతున్న పరుగుల తాలూకు వేగం, తీవ్రత అర్థమవుతాయి. గత నెల వ్యవధిలో నేను ఏకంగా 85 దేశాల అధినేతలతో భేటీ అయ్యా. ఇక ఆగస్టు 23ను మనమెప్పటికీ గుర్తుంచుకోవాలి. అది భారత్ సగర్వంగా చంద్రుని మీద అడుగు పెట్టిన రోజు. ప్రపంచమంతా మన వాణిని విన్న రోజు. మనందరి పెదవులపై గర్వంతో కూడిన దరహాసం వెలిగిన రోజు. అందుకే జాతీయ అంతరిక్ష దినంగా ఆగస్టు 23 మన దేశ చరిత్రలో అజరామరంగా నిలవనుంది. ఆ విజయపు ఊపులో వెనువెంటనే సౌర యాత్రకు మనం శ్రీకారం చుట్టాం' అన్నారు. ఇక మామూలుగా కేవలం ఒక దౌత్య భేటీగా జరిగే జీ20 సదస్సును మన ప్రయత్నాలతో పౌర భాగస్వామ్యంతో కూడిన జాతీయ ఉద్యమంగా మలచుకున్నాం. ఢిల్లీ డిక్లరేషన్‌కు జీ20 దేశాల నుంచి 100 శాతం ఏకాభిప్రాయం దక్కడం ప్రపంచ స్థాయిలో పతాక శీర్షికలో నిలిచింది. ఆఫ్రికన్ యూనియన్ జీ20లో శాశ్వత సభ్య దేశంగా చేరింది. ఇలాంటివన్నీ ఆ సదస్సు సారథ్య సందేశంగా మనం సాధించిన ఘనతలే. అంతేకాదు, భారత ప్రయత్నాల వల్ల మరో ఆరు దేశాలు బ్రిక్స్ కూటమిలో చేరాయి' అని వివరించారు.

వీరికి అందలం, వారికి అరదండాలు!

నేడు మన దేశంలో నిజాయితీపరులకు గుర్తింపు, అవినీతిపరులకు తగిన శిక్ష దక్కుతున్నాయని మోదీ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మధ్య తరగతి శ్రేయస్సు కోసం గత నెల రోజుల్లో కేంద్రం ఎన్నో పథకాలు తెచ్చింది. పీఎం విశ్వకర్మ యోజన, రోజ్ గార్ మేళాతో లక్ష మంది యువతకు ఉపాధి వంటివన్నీ వాటిలో భాగమే' అన్నారు. 'మన దేశం మీద అంతర్జాతీయంగా భరోసా ఇనుమడిస్తోంది. విదేశీ పెట్టుబడుల వెల్లువ రికార్డులు తాకుతోంది. కేవలం ఐదేళ్లలో 13.5 కోట్ల భారతీయులు పేదరికం నుంచి బయటపడి నూతన మధ్య తరగతిగా రూపుదాల్చారు' అని వివరించారు.

యువతా! కలసి నడుద్దాం...!

జీ20 సదస్సు ఘన విజయానికి యువత భాగస్వామ్యం ప్రధాన కారణమని మోదీ అన్నారు. లోకల్ నినాదానికి ఊపు తెచ్చేందుకు కాలేజీ, వర్సిటీ క్యాంపస్ లు కేంద్రాలుగా మారాలని ఆశాభావం వెలిబుచ్చారు. 'ఖాదీ దుస్తులు ధరించడం ద్వారా వాటికి ప్రాచుర్యం కల్పించండి. క్యాంపస్‌లలో ఖాదీ ఫ్యాషన్ షోలు పెట్టండి' అని యువతను కోరారు. 'మన స్వాతంత్ర్య యోధుల్లా దేశం కోసం మరణించే అదృష్టం మనకు లేదు. కనీసం దేశం కోసం జీవితాలను అంకితం చేసే సదవకాశం మాత్రం మనందరికీ ఉంది' అని గుర్తు చేశారు. వందేళ్ల క్రితం యువత స్వరాజ్య భారతం కోసం కదం తొక్కింది. మనమిప్పుడు సమృద్ధ భారతం కోసం పాటుపడదాం. రండి, కలసి నడుద్దాం!' అని పిలుపునిచ్చారు.

బెంగళూరు బంద్ పాక్షికం

సాక్షి, బెంగళూరు: తమిళనాడుకు కావేరి నీటి విడుదలను నిరసిస్తూ వివిధ సంఘాలిచ్చిన పిలుపుపై మంగళవారం బెంగళూరు బంద్ పాక్షికంగా జరిగింది. సాధారణ జనజీవనానికి అంతరాయం కలిగింది. విద్యాసంస్థలు మూతబడ్డాయి. చాలా వరకు కార్యాలయాలు, దుకాణాలు, వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. పోలీసులు ముందు జాగ్రత్తగా నిషేధాజ్ఞలు విధించారు. మైసూరు బ్యాంకు సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. జేడీఎస్ పార్టీ కార్యాలయం జేపీ భవన్ నుంచి ఊరేగింపుగా బయలుదేరిన కార్యకర్తలు, నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కర్ణాటక రక్షణ వేదిక నేతలు, కార్యకర్తలు సీఎం ఇంటి ముట్టడికి సాగుతుండగా వందలాది మందిని అదుపులోకి తీసుకున్నారు.

ఆ జవానుది తప్పుడు ఫిర్యాదు

వెల్లడించిన కేరళ పోలీసులు

కొల్లం(కేరళ): నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)కు చెందిన కొందరు తనను కొట్టి వీపుపై 'పీఎఫ్ఐ' అని రాశారంటూ ఓ జవాను చేసిన సంచలన ఫిర్యాదు ఉత్తిదేనని కేరళ పోలీసులు తేల్చారు. జవాను షైన్ కుమార్‌తోపాటు సహకరించిన అతడి స్నేహితుడిని పోలీసులు విచారిస్తున్నారు. రాజస్తాన్‌లో జైసల్మేర్‌లో ఉన్న ఆర్మీ విభాగంలో షైన్ కుమార్ పనిచేస్తున్నారు. ఇటీవల సెలవుపై సొంతూరు కడక్కల్‌కు వచ్చారు. ఆదివారం రాత్రి ఇంటికి సమీపంలోని రబ్బర్ ప్లాంటేషన్ వద్ద ఆరుగురు వ్యక్తులు తనను కొట్టి, పీఎఫ్ఐ అంటూ తన వీపుపై రాశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు షైన్ కుమార్ స్నేహితుడిని అదుపులోకి తీసుకున్నారు. కుమార్‌కు ప్రచార యావ ఉందని అతడి స్నేహితుడు తెలిపారు. మద్యం తాగాక అతడు చెప్పినట్లే వీపుపై రంగుతో పీఎఫ్ఐ అని రాసినట్లు చెప్పాడు. కొట్టాలని కూడా షైన్ కుమార్ కోరాడని, మత్తులో ఆ పనిచేయలేక పోయేసరికి నోటికి ప్లాస్టర్ అంటించమన్నాడని తెలిపాడు. ఈ మేరకు షైన్ కుమార్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి ఎవరినీ అరెస్ట్ చేయలేదని పోలీసులు తెలిపారు.

విజయవంతంగా క్రయోజనిక్ సీ-20 పరీక్షలు

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరిలో వున్న లిక్విడ్ ప్రపొల్లెంట్ స్పేస్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ) ఈ నెల 22న క్రయోజనిక్ (సీఈ–20) ఇంజిన్‌కు భూస్థిర పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. మంగళవారం ఇస్రో తన వెబ్‌సైట్‌లో ఈ విషయం తెలిపింది. గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి అప్పర్‌స్టేజీలో అంటే మూడో దశలో వినియోగించే క్రయోజనిక్ దశను సరికొత్తగా రూపొందించింది. ఇస్రో తాజాగా రూపొందించిన సీఈ–20 ఇంజిన్‌ను ఎల్‌వీఎం3 రాకెట్లకే వినియోగించబోతున్నారు. ఈనెల 22న క్రయోజనిక్ దశలో 20 టన్నుల ఇంధనాన్ని నింపి సుమారు 50 సెకన్లపాటు మండించి పరీక్షించారు. క్రయోజనిక్ దశలో మూడోరకం ఇంజిన్ అందుబాటులోకి వచ్చిందని ఇస్రో ప్రకటించింది.

గ్యాస్ స్టేషన్‌లో పేలుడు.. 20 మంది మృతి

యెరవాన్(ఆర్మీనియా): గ్యాస్‌స్టేషన్‌లో సంభవించిన భారీ పేలుడుతో 20 మంది చనిపోగా మరో 300 మంది వరకు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు అంటున్నారు. అజర్‌బైజాన్, ఆర్మీనియాల మధ్య మూడు దశాబ్దాల వివాదానికి కారణమైన నగోర్నో–కరబాఖ్‌లో సోమవారం రాత్రి ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఒకప్పటి సోవియెట్ యూనియన్‌లోని అజర్‌బైజాన్‌లో స్వతంత్ర ప్రాంతం నగోర్నో–కరబాఖ్. ఆర్మీనియన్ సంతతి ప్రజల ఆధీనంలో ఉండేది. సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నమయ్యాక ఆ ప్రాంత పాలకులు ఆర్మీనియాలో విలీనమయ్యేందుకు మొగ్గు చూపడం అజర్‌బైజాన్‌తో విభేదాలకు కారణమైంది. ఆ ప్రాంతానికి ఇంధనం, ఆహార సరఫరాలను అజర్‌బైజాన్ నిలిపివేసింది. వారం క్రితం అజర్‌బైజాన్ బలగాలు మెరుపుదాడులు చేసి ఆర్మీనియా వేర్పాటువాదులను అదుపులోకి తీసుకున్నాయి. అప్పటి నుంచి అక్కడున్న ఆర్మీనియన్లు ఆర్మీనియాలో తలదాచుకునేందుకు మూటాముల్లె సర్దుకుని బయలుదేరుతున్నారు. ఈ క్రమంలోనే భారీ పేలుడు సంభవించింది.

వచ్చేసారి ఊరుకోం!

- పెండింగ్‌లో 70 సిఫార్సులు
- న్యాయమూర్తుల నియామకంలో తీవ్రంగా జాప్యం
- కేంద్రంపై సుప్రీం అసహనం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా న్యాయమూర్తుల నియామకాల్లో జరుగుతున్న జాప్యంపై సుప్రీం కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. గత ఏడాది నవంబర్ నుంచి సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సులు 70 వరకు కేంద్రం దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది. వాటిని ఇన్నాళ్లు ఎందుకు పెండింగ్‌లో ఉంచారని కేంద్రాన్ని ప్రశ్నించింది. న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధూలియాలతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ ఈ సమస్య పరిష్కారానికి అటార్నీ జనరల్ కార్యాలయం చొరవ తీసుకోవాలని పేర్కొంది. దీనికి అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ఏడు రోజులు సమయం అడిగారు. దీనిపై జస్టిస్ సంజయ్ కిషన్ స్పందిస్తూ '' నేను ఎన్నో చెప్పాలనుకున్నాను. కానీ నన్ను నేను నియంత్రించుకుంటున్నాను. సమస్య పరిష్కారానికి అటార్నీ జనరల్ ఏడు రోజులు మాత్రమే సమయం అడిగారు. నేను ఇప్పటికి మౌనంగా ఉంటున్నారు. వచ్చేసారి ఇక ఊరుకోను. అటార్నీ జనరల్ కార్యాలయమే కేంద్రం దగ్గరున్న పెండింగ్ సిఫార్సుల సమస్యను పరిష్కరించాలి. ఎందుకంటే న్యాయమూర్తుల కొరత అన్నది అతి పెద్ద సమస్య'' అని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ కుండబద్దలు కొట్టారు. జడ్జీల నియామకం జాప్యం అవుతున్న కొద్దీ చాలా మంది లాయర్లు తమ దరఖాస్తుల్ని వెనక్కి తీసుకుంటున్నారని, అత్యంత ప్రతిభ కలిగిన లాయర్లు న్యాయమూర్తుల పదవుల్లోకి రాకుండా ఉండడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. ''కిందటి వారం వరకు 80 సిఫార్సులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ తర్వాత 10 మంది నియామకం జరిగింది. ఇప్పుడు పెండింగ్‌లో 70 ఉన్నాయి. వాటిలో 26 న్యాయమూర్తుల బదిలీలకు సంబంధించినవి. ఒక సమస్మాత్మక హైకోర్టుకు సంబంధించిన ప్రధాన న్యాయమూర్తి నియామకం కూడా ఇంకా పెండింగ్‌లో ఉంది'' అని జస్టిస్ కౌల్ వివరించారు. న్యాయమూర్తుల నియామకం అంశంలో కేంద్రం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తుందో అర్థం కావడం లేదన్నారు.

బిల్లుకు ఆమోదం దేశానికి దిశానిర్దేశం: మోదీ

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంటు ఆమోదం నూతన భవితవ్యం వైపు దేశానికి దిశానిర్దేశం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అపారమైన అవకాశాలకు యువతకు ద్వారాలు తెరిచేందుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని పునరుద్ఘాటించారు. పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందిన 51 వేల మందికి మంగళవారం నియామక పత్రాలు అందజేసిన అనంతరం ఆయన వర్చ్యువల్ విధానంలో మాట్లాడారు. పాలనలో సాంకేతిక పరిజ్ఞానం వాడకం నానాటికీ పెరుగుతోందని గుర్తు చేశారు. 'దానివల్ల ప్రభుత్వ పథకాల అమలులో అవినీతికి అడ్డుకట్ట పడింది. సంక్లిష్టతలు తగ్గి సౌలభ్యం, విశ్వసనీయత పెరిగింది' అని వారికి వివరించారు. పౌరులే ముందు అన్నదే మూల మంత్రంగా పని చేయలని ఉద్బోధించారు. పాలనను మరింత మెరుగు పరిచేలా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. దేశం కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సిన, గొప్ప లక్ష్యాలను సాకారం చేసుకోవాల్సిన తరుణమిదని ప్రధాని అభిప్రాయపడ్డారు.

సీసీటీవీలో రికార్డయిన నిజ్జర్ హత్య

వాషింగ్టన్ పోస్టు సంచలన కథనం

వాషింగ్టన్: కెనడాలో ఖలిస్తాన్ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు కీలకమైన అంశాలను వెలుగులోకి తెచ్చింది. నిజ్జర్ హత్యకు చెందిన 90 సెకండ్ల పాటు ఉన్న సీసీటీవీ ఫుటేజ్ తమకు లభించిందని వెల్లడించింది. నిజ్జర్‌ను తుపాకీతో కాల్చిన దుండగుడు మొత్తం 50 తూటాలు పేలిస్తే అందులో 34 నిజ్జర్ శరీరంలో దూసుకువెళ్లి అతని ప్రాణాలు తీశాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్టుగా వివరించింది. నిజ్జర్ హత్య వెనకాల భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర ఆరోపణలు చేయడంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారి తీసిన విషయం తెలిసిందే. నిజ్జర్ హత్యపై కెనడా ప్రభుత్వం నెమ్మదిగా స్పందించిందని వాషింగ్టన్‌పోస్టు తన కథనంలో ఆరోపించింది. సీసీ కెమెరా ఫుటేజ్‌లో దుండగులు నిజ్జర్‌పై కాల్పులు జరిపి వెళ్లిపోయిన దృశ్యాలు రికార్డయ్యాయి. బ్రిటీష్ కొలంబియాలోని సర్రేలో జూన్ 18న రాత్రి 8 గంటల ప్రాంతంలో గురు నానక్ సింగ్ గురుద్వార వెలుపల పార్కింగ్ ఏరియా నుంచి నిజ్జర్ తన ట్రక్‌ను బయటకు తీసుకు వస్తుండగా, అదే సమయంలో పార్క్ చేయడానికి తెల్ల రంగు సెడాన్ కారు వేగంగా వచ్చింది. హఠాత్తుగా సెడాన్ కారు వచ్చి ట్రక్కుకి అడ్డంగా ఆగింది. స్వెట్టర్లు ధరించిన ఇద్దరు వ్యక్తులు అప్పుడే అక్కడికి వచ్చారు. అందులో ఒకరు పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో ట్రక్‌లో డ్రైవింగ్ సీటులో ఉన్న నిజ్జర్‌పై గుళ్ల వర్షం కురిపించాడు. అక్కడ్నుంచి వెళ్లిపోయిన సెడాన్ కారు వెళ్లిన దిశగా ఆ ఇద్దరు వ్యక్తులు పరుగులు పెట్టినంత వరకు ఆ ఫుటేజ్‌లో రికార్డయింది. గురు ద్వారాకి సమీపంలో ఉన్న మైదానంలో సాకర్ ఆడుకుంటున్న వాలంటీర్ భూపీందర్‌జీత్ సింగ్ కాల్పుల శబ్దం విని అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చారు. అప్పటికే నిజ్జర్ మరణించాడని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తు ఎవరు చేపట్టాలనే అంశంపై కెనడా రాయల్ మౌంటెడ్ పోలీసు, సర్రే ఇన్వెస్టిగేషన్ బృందం మధ్య భేదాభిప్రాయాలు రావడంతో విచారణలో తీవ్ర జాప్యం, నిర్లక్ష్యం జరిగినట్టుగా వాషింగ్టన్ పోస్టు పేర్కొంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం : 27 : సెప్టెంబర్ : 2023

పోలీసులు జనస్నేహిగా ఉండాలి : సీఎం



మైసూరు: పోలీసు శాఖలో అధికారులు, సిబ్బంది అందరూ కూడా జనస్నేహిగా పనిచేయాలని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. మంగళవారం మైసూరులోని పోలీసు మైదానంలో శిక్షణ ముగిసిన నూతన పోలీసు సిబ్బందికి పాసింగ్ ఔట్ పరేడ్ జరిగింది. సీఎం పాల్గొని గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. మానసికంగా, దైహికంగా దృఢంగా ఉండి, ప్రజల రక్షణ కోసం పనిచేయాలన్నారు. పోలీసులపైన చాలా నమ్మకంతో ప్రజలు వస్తారని, జనస్నేహిగా మెలుగుతూ వారి సమస్యలను పరిష్కారం చేయాలని సూచించారు.

ఉవ్వెత్తున జల పోరాటం

- స్తంభించిన సిలికాన్ నగరం
- ఉధృతంగా బెంగళూరు బంద్
- కావేరి జలాల నిలిపివేతకు పట్టు

శివాజీనగర: తమిళనాడుకు కావేరి నీరు విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం జరిగిన బెంగళూరు బంద్‌తో సిలికాన్ సిటీ దాదాపు స్తంభించింది. దుకాణాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు మూతబడ్డాయి. జన, వాహన సంచారం చాలావరకు తగ్గిపోయినది. బంద్ అంతటా శాంతియుతంగా జరిగింది, ఎక్కడా పెద్ద అల్లర్లు జరగలేదు. బెంగళూరు బంద్ నేపథ్యంలో నగరంలో అనేక రోడ్లలో ప్రజల సంచారం తగ్గింది. బీఎంటీసీ బస్సులు, మెట్రో రైలు సంచారం యథా ప్రకారం ఉన్నా కూడా ప్రయాణికుల సంఖ్య తక్కువే. రాష్ట్రంలో కరువు తాండవిస్తుంటే, ఇక్కడి ప్రజలకే నీరు లేకపోతే తమిళనాడుకు కావేరి నీటిని విడుదల చేయడం తగదంటూ సుమారు 50 కన్నడ, రైతు, ప్రజా సంఘాలు జల సంరక్షణా సమితి పేరిట బెంగళూరు బంద్ చేపట్టాయి. బీజేపీ, జేడీఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ కూడా బంద్‌కు మద్దతిచ్చాయి.

చెదురు మదురు ఘటనలు

బంద్ నేపథ్యంలో బెంగళూరులోని ప్రముఖ వ్యక్తుల నివాసాలు, ప్రధాన స్థలాల్లో పోలీసుల గస్తీ పెరిగింది. మైసూరు బ్యాంక్ సర్కిల్, టౌన్‌హాల్, ఫ్రీడం పార్కులో భారీ బందోబస్తు ఏర్పాటైంది. ఫ్రీడం పార్కు తప్ప వేరే చోట్ల ధర్నాలు చేయడానికి అనుమతించలేదు. టౌన్‌హాల్, మైసూరు బ్యాంక్ సర్కిల్, నేషనల్ కాలేజీ మైదానంలో ధర్నాలు చేసేందుకు యత్నించిన వివిధ సంఘాల కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్యకర్తలు వాగ్వివాదానికి దిగి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫ్రీడం పార్కులో ఒక వ్యక్తి పచ్చ శాలువాను ఉపయోగించి ఉరి వేసుకోవటానికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకొని నిర్బంధించారు. ఫ్రీడంపార్క్‌లో కన్నడ కంఠీరవ డా.రాజ్‌కుమార్ వేషధారి అందరినీ ఆకట్టుకున్నారు.

టౌన్‌హాల్ నుంచి ఫ్రీడంపార్క్‌కి ర్యాలీ

రైతు సంఘంతో పాటుగా వివిధ సంఘాల వేలాది మంది కార్యకర్తలు జేసీ రోడ్డులోని టౌన్‌హాల్ నుంచి ఫ్రీడం పార్కు వరకు ఊరేగింపు నిర్వహించారు. తమిళనాడుకు కావేరి నీటిని తక్షణమే నిలుపుదల చేయాలని, కేంద్రం జోక్యం చేసుకోవాలని నినాదాలు చేశారు. టౌన్‌హాల్ వద్ద సమావేశమయ్యారు. అక్కడి నుంచి ఫ్రీడం పార్కు వరకు వేలాదిమంది రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు సాగిస్తూ ఊరేగింపుగా తరలారు. పోలీసులు మార్గ మధ్యలో కొందరిని అరెస్టు చేసి సిటీ బస్సుల్లో తీసుకొని వెళ్లి ఆ తరువాత విడుదల చేశారు. కావేరి వివాదంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని రవాణా మంత్రి రామలింగారెడ్డి డిమాండ్ చేశారు. రైతు సంఘం అధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్ నేతృత్వంలో మంత్రికి వినతిపత్రం సమర్పించారు.



బంద్ నేపథ్యంలో మంగళవారం ఉదయం బెంగళూరులోని తుమకూరు హైవే వెలవెల



జల ఉద్యమంలో మెరిసిన కంఠీరవ రాజ్‌కుమార్ వేషధారి



టౌన్‌హాల్ వద్ద మహిళా కార్యకర్త అడ్డగింత

వాణిజ్య సముదాయాలు మూత

- చిక్కపేట, కేఆర్ మార్కెట్, అవెన్యూ రోడ్డు, మైసూరు బ్యాంక్ సర్కిల్, మెజిస్టిక్, గాంధీ నగర, శివాజీనగరతో పాటు నగరంలోని ప్రముఖ ప్రాంతాల్లో దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు మూతపడ్డాయి. హోటళ్లు, బార్- రెస్టారెంట్లు కూడా మూసివేశారు.
- సినీ రంగం మద్దతు ప్రకటించగా అన్ని సినిమా థియేటర్, మాల్‌లు బంద్ అయ్యాయి. టీవీ సీరియళ్లు, సినిమా షూటింగ్‌లను నిలిపేశారు.
- బంద్‌తో నగరంలో పలు కార్యకలాపాలు స్తంభించిపోయాయి. సామాన్య ప్రజల జీవితాలకు ఇబ్బంది నెలకొంది. బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో సందడి తక్కువగా కనిపించింది.
- బంద్ నేపథ్యంలో పాఠశాల- కాలేజీలకు సెలవిచ్చారు. ఆసుపత్రి, మెడికల్ స్టోర్, కూరగాయలు, పాలు దుకాణాలు, తపాలా కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాలు యథా ప్రకారంగా పనులు కొనసాగించాయి. అయితే కార్యాలయాల్లో హాజరు శాతం తగ్గింది.
- రాష్ట్ర శక్తికేంద్రం విధానసౌధ, వికాససౌధ, బహుళ అంతస్తుల భవనంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరు అంతంతే ఉండింది.

రోజూ 3 వేల క్యూసెక్కులు వదలండి

- కర్ణాటకకు కావేరి నీటి కమిటీ సిఫార్సు
- ఫలించని కరువు వాదన



బనశంకరి: కావేరి జలాల విషయంలో రాష్ట్రానికి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా తమిళనాడుకు నిత్యం 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని కావేరినీటి నియంత్రణ కమిటీ (సీడబ్ల్యూఆర్‌సీ) సిఫార్సు చేసింది. అక్టోబరు 15 వరకు ఇలాగే నీటిని వదలాలని ఢిల్లీలో మంగళవారం జరిగిన సమావేశంలో స్పష్టంచేయడంతో సిద్దరామయ్య సర్కారుకు మరిన్ని చిక్కులు వచ్చేలా ఉన్నాయి.

ఏం చర్చించారంటే

ఈ నెల 25 వరకు వరకు కర్ణాటక నాలుగు జలాశయాలకు ఇన్‌ఫ్లో 53 వేల క్యూసెక్కులుగా ఉంది. కర్ణాటక ప్రభుత్వం ఈ నెల 13న రాష్ట్రంలో 161 తాలూకాల్లో తీవ్రమైన కరువు, 34 తాలూకాల్లో అతి తీవ్ర కరువు ఉన్నట్లు ప్రకటించింది. వీటిలో 32 తీవ్ర కరువు పీడిత తాలూకాలు కావేరి జలాశయ పరిధిలో ఉన్నాయని ఢిల్లీ భేటీలో చర్చకు వచ్చింది. కరువు వల్ల నీటిని విడుదల చేసే పరిస్థితి లేదని కర్ణాటక అధికారులు వాదించినా ఫలితం లేకపోయింది.



ఫ్రీడంపార్క్‌లో నిరసనకారులు



కలాసిపాళ్యలో నిలిచిపోయిన ప్రైవేటు బస్సులు



నిత్యం రద్దీగా ఉండే మల్లేశ్వరంలోని 8వ క్రాస్ ఇలా అయ్యింది



ప్రయాణికులు లేక బోసిపోయిన మెజెస్టిక్ బస్టాండు



కావేరి జలాల కోసం రక్తంతో సంతకాలు

మేకెదాటే పరిష్కారం: సీఎం

మైసూరు: మేకెదాటు ప్రాజెక్టు ద్వారా మాత్రమే తమిళనాడుతో ఉన్న కావేరి నీటి సమస్య పరిష్కారం అవుతుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. మంగళవారం మైసూరులో మండకళ్ళి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ మామూలుగా అయితే మంచి వర్షాలు పడితే కర్ణాటక నుంచి తమిళనాడుకు మొత్తం 177 టీఎంసీల నీటిని వదలాలని సుప్రీంకోర్టు చెప్పిందని తెలిపారు. అయితే వర్షాలు లేక కరువు ఉంటే అప్పుడు ఏం చేయాలనేదానిపై నిర్ణయం ఉంటుందని, ప్రస్తుతం సుప్రీంకోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉండాలని అన్నారు. వీటన్నింటికి పరిష్కారం మేకెదాటు మాత్రమే, ఈ విషయంలో ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలని కోరారు.

ఎవరు బంద్ చేసినా అడ్డుకోం

కావేరి నీటి కోసం కన్నడ సంఘాలు, పోరాట సంఘాలు, రైతులు, ప్రతిపక్షాలు ఎవరు పోరాటం చేసినా దానికి అడ్డుపడబోమని సీఎం అన్నారు. బంద్‌లను ప్రస్తావిస్తూ వాటికి ఆటంకాలు కల్పించబోమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలి తప్ప ఎవరినీ ఇబ్బంది పెట్టమన్నారు. బంద్ సమయంలో నిరసనకారులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, లేదంటే పోలీసులు వారి పనిచేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వాణిజ్యానికి నిరసన గండి

- వందలాది కోట్ల నష్టం

బనశంకరి: రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మ అయిన సిలికాన్ సిటీలో మంగళవారం, అలాగే శుక్రవారం జరిగే బంద్ వల్ల జరిగే నష్టం ఎంతో తెలుసా.. రూ.4 వేల కోట్లని అంచనా. మంగళవారం బంద్ అయిపోగా శుక్రవారం కర్ణాటక బంద్‌కు వాటాళ్ నాగరాజు, ఇతర రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. ఒకే వారంలో రెండు బంద్‌ల వల్ల వ్యాపారాలు వాణిజ్యాలకు విఘాతం ఏర్పడుతుందని పారిశ్రామికవేత్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది సామాన్య ప్రజలకు కూడా అసౌకర్యం కలిగిస్తుందన్నారు.

వారంరోజులు ప్రభావం

కోవిడ్ మహమ్మారి తరువాత కోలుకుంటున్న వివిధ పారిశ్రామికరంగాలపై బంద్ ప్రభావం ఉంటుందని వాణిజ్యవేత్తలు తెలిపారు. ఇక చిరువ్యాపారులు, కూలీ కార్మికులకు కూడా పనులు దొరకవని అన్నారు. కావేరి సమస్యపై సంఘీభావంతో ఉన్నామని, కానీ బంద్‌లు పరిష్కారం కాదని చెప్పారు. పదే పదే బంద్‌లు చేయడంతో బెంగళూరు, కర్ణాటకపై విశ్వాసానికి భంగం కలుగుతుందని, ఇక్కడ అంతర్జాతీయస్థాయి వ్యవహారాలు, పరిశ్రమలు ఉన్నాయని, వీటికి మనం కొన్ని నిబంధనలు పాటించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు అన్నారు. ఒక్క రోజు బంద్ నష్టంతో కోలుకోవడానికి వ్యాపారకేంద్రాలు కనీసం ఒకవారం పడుతుందని చెప్పారు. వివిధ రంగాలకు వచ్చే ఆదాయం, ప్రభుత్వానికి వచ్చే సంపాదన కలిపితే వేలాది కోట్ల నష్టం ఉంటుందని తెలిపారు.



కలాసిపాళ్యలో మూతపడిన షాపులు

ఇది స్టాలిన్ కింద పనిచేసే ప్రభుత్వమా : కుమార

దొడ్డబళ్లాపురం: కావేరి జలాల పంపకాల విషయంలో పూర్తిగా విఫలమైన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కన్నడ ప్రజల ప్రభుత్వమో లేక స్టాలిన్ కింద పనిచేసే ప్రభుత్వమో అర్థం కావడం లేదని మాజీ సీఎం కుమారస్వామి ప్రశ్నించారు. ఈమేరకు మంగళవారం మీడియా ప్రకటన విడుదల చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ తమిళనాడు డీఎంకే పార్టీకి బీ టీమ్ అంటూ చురకలు అంటించారు. కావేరి పోరాటాన్ని అణచివేయాలనే ప్రభుత్వం వైఖరి విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో లేనప్పుడు మేకెదాటు పథకం అమలు చేయాలని పాదయాత్ర చేసిన కాంగ్రెస్ నాయకులు నేడు అదే కావేరి జలాల కోసం పోరాటం చేస్తున్న వారిని అరెస్టు చేయిస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వారికి ఒక న్యాయం, కన్నడిగులకు ఒక న్యాయంగా ఉందన్నారు. కన్నడిగులు శాంతియుతంగా పోరాడడంలో తప్పేంటని ప్రశ్నించారు.


నాయకుల నిర్బంధం

యశవంతపుర: బంద్‌లో పాల్గొన్న బీజేపీ, జేడీఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. బీజేపీ నాయకులు మైసూరు బ్యాంక్ వద్ద ఆందోళన చేయగా అరెస్టు చేశారు. జేడీఎస్ నాయకులు పార్టీ ఆఫీసు నుంచి ఊరేగింపుగా వెళుతుండగా పోలీసులు అడ్డగించి ఎమ్మెల్సీ శరవణతో పాటు అనేక మందిని నిర్బంధించారు.

అది ప్రభాస్ బొమ్మేనా?

- అభిమానుల అసంతృప్తి

మైసూరు: మైసూరు నగరంలో ప్రదర్శనలో ఉంచిన బాహుబలి నటుడు ప్రభాస్ మైనపు విగ్రహం అభిమానులకు అసహనం కలిగిస్తోంది. అందులో ప్రభాస్ పోలికలు లేకపోవడమే కారణం. సెలబ్రిటీ వ్యాక్స్ మ్యూజియంలో బాహుబలి సినిమాలో మాదిరిగా ఉండే ప్రభాస్ నిలువెత్తు బొమ్మని ఉంచారు. బాహుబలి దుస్తులను బట్టి పరిశీలించి చూస్తే అది బాహుబలి ప్రభాస్ అనుకుంటారు తప్ప ముఖంలో తమ హీరో రూపురేఖలు లేవని అభిమానులు అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రతిమ ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి అసమాధానం వెలిబుచ్చారు. ఈ బొమ్మ మా హీరో కాదని ట్రోల్ చేయడం మొదలైంది. నిర్వాహకులు స్పందిస్తూ విగ్రహం ముఖం ప్రభాస్‌లా లేదని తమ దృష్టికి రాలేదని, అభ్యంతరం ఉంటే తొలగిస్తామని తెలిపారు.



ప్రదర్శనలో ఉంచిన మైనపు విగ్రహం

అడిగినంత నీరు విడుదల చేయలేం

- నీటి నిల్వలు అడుగంటాయి : డీసీఎం

దొడ్డబళ్లాపురం: తమిళనాడుకు అడిగినంత నీటిని విడుదల చేయలేమని, తమ వద్ద నీరు కూడా నిల్వ లేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. బెంగళూరు బంద్ నేపథ్యంలో బెంగళూరు సదాశివనగరలోని నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన కావేరి నీటి నిర్వహణ కమిటీ సమావేశంలో తమిళనాడు ప్రభుత్వం 12,500 క్యూసెక్కుల నీరు అడగడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం మనం 5 వేల క్యూసెక్కుల నీరు కూడా విడుదల చేయలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. నిత్యం ఎంతమేరకు నీరు వచ్చి చేరుతోంది, ఎంతమేరకు నీరు విడుదల చేస్తున్నామనే సమాచారం రహస్యంగా ఉంచలేమన్నారు. బిళిగుండ్లు డ్యాంలో ఇందుకు సంబంధించి సమాచారం ప్రతిక్షణం నమోదవుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్నది కన్నడ ప్రజల ప్రభుత్వం కాదని, స్టాలిన్ కింద పనిచేసే ప్రభుత్వమని కుమారస్వామి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన డీకే, మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సయంలో కుమారస్వామి తండ్రి దేవెగౌడ ఏం మాట్లాడారో తెలుసని, ఇప్పుడు ఏమని లేఖ రాసారో తెలుసా అని ప్రశ్నించారు. కావేరిజలాల విషయంలో రాజకీయాలు మాని వాస్తవాలను మాట్లాడాలన్నారు. కావేరి జలాల కోసం పోరాటం చేయడంలో తప్పులేదని, శాంతియుతంగా పోరాటాలు చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

నాటు పుట్టగొడుగులు తిని అస్వస్థత!



తుమకూరు ఆస్పత్రిలో బాధితులు

- 25 మందికిపైగా ఆస్పత్రిపాలు

తుమకూరు: కలుషిత ఆహారం తిని గ్రామస్తులు ఆస్పత్రి పాలైన సంఘటన తుమకూరు తాలూకాలోని శెట్టిప్పనహళ్ళి గ్రామంలో జరిగింది. మంగళవారం సాయంత్రం 25 మందికి పైన అస్వస్థతకు గురికాగా బంధుమిత్రులు వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శెట్టిప్పనహళ్ళిలో 54 ఇళ్ళు ఉండగా, ఆదివారం నుంచే కొందరికి కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు వంటి మొదలయ్యాయి. ఇప్పుడు తీవ్రం కావడంతో గ్రామంలో కలవరం నెలకొంది. బోరమ్మ (68), భైరప్ప (80), గంగమ్మ (70), నంజమ్మ (85) అనేవారిని మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వర్షాలు పడడంతో గ్రామంలో పెరిగిన నాటు పుట్టగొడుగులను కూర చేసుకుని తిన్నారని, వారే అనారోగ్యానికి గురయ్యారని స్థానికులు తెలిపారు. కాగా, పుట్టగొడుగులు తినని వారికి కూడా అస్వస్థత కలిగిందని కొందరు చెప్పారు.

సాంకేతిక పరిజ్ఞానంలో భారత్ ముందంజ

బనశంకరి: సాంకేతిక పరిజ్ఞానంలో భారత్ ముందంజలో ఉందని విదేశీయులు మన సాంకేతిక పరిజ్ఞానానికి వెంట పడుతున్నారని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, రక్షణ మంత్రి సలహాదారు డాక్టర్ జీ.సతీశ్‌రెడ్డి తెలిపారు. యలహంక ఓ యూనివర్సిటీలో సివిల్, ఏరోనాటికల్, మెకానికల్ ఇంజనీరింగ్ రంగాలపై రెండురోజుల పాటు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సమ్మేళనాన్ని డాక్టర్ జీ.సతీశ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఒకటిన్నర దశాబ్దం వరకు మన దేశ పరిశ్రమలు, అభివృద్ధి కేవలం విదేశీయుల నుంచి దిగుమతి చేసుకుని సాంకేతిక పరిజ్ఞానం, సామాగ్రిపై ఆధారపడేవారమన్నారు. కానీ ప్రస్తుతం స్వల్ప అవధిలోనే భారత్ సాంకేతిక పరిజ్ఞానంలో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. మనదేశంలోనే పరికరాలను ఉత్పత్తి చేసి వందలాది యుద్ధ విమానాలను ఉత్పత్తి చేశామని, వాటికి నేడు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. ఇక ఇస్రో గగనయాన్ పేరుతో అంతర్జాతీయస్థాయిలో పేరుపొందామని తెలిపారు.

న్యూస్‌రీల్

బంద్ ఎఫెక్టు, పలు విమానాల రద్దు



ఎయిర్‌పోర్టులో చిక్కుకుపోయిన ప్రయాణికులు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు బంద్ ఎఫెక్ట్ కెంపేగౌడ ఎయిర్‌పోర్టుపై పడింది. ఏకంగా 13 విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీ, కొచ్చి, మంగళూరు, ముంబై, దేశంలోని పలు నగరాలకు వెళ్లే 13 విమాన సర్వీసులు నడవలేదు. బంద్ ఉందని తెలిసి వందల సంఖ్యలో ప్రయాణికులు తాము ప్రయాణించే విమానాలు మధ్యాహ్నం, సాయంత్రం ఉన్నప్పటికీ సకాలంలో చేరుకోలేమనే భయంతో తెల్లవారుజామునే వచ్చారు. సీట్లలో కూర్చుని ప్రయాణికులు నిద్రపోవడం కనిపించింది. క్యాబ్‌లు, బస్సులు బంద్ కావడంతో దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో ఉండిపోయారు.

మాజీ సీఎం సతీమణి కన్నుమూత



శారద పాటిల్ (ఫైల్)

యశవంతపుర: మాజీ ముఖ్యమంత్రి దివంగత వీరేంద్రపాటిల్ భార్య శారదా పాటిల్ (93) బెంగళూరు సదాశివ నగరలోని తన నివాసంలో కన్నుమూశారు. ఆమెకు ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే కైలాసనాథ్ పాటిల్ ఒకరు. ఆమె పార్థివ దేహాన్ని చించోళికి తీసుకెళ్లారు. చించోళిలో బుధవారం భర్త సమాధి పక్కనే శారద అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

నకిలీ ఐటీ ఉద్యోగాల స్కాంపై దర్యాప్తు

అనంతపురం క్రైం: కరువు జిల్లాలోని నిరుపేద యువతీ, యువకులకు ఉపాధి పేరుతో ఆశ చూపి మోసాలకు తెగబడుతున్న ముఠాలు ఎక్కువయ్యాయి. నిజమని నమ్మి కుటుంబానికి అండగా ఉందామని ఆశపడే యువతీ, యువకుల అవసరాలను ఈ ముఠాలు ఆసరాగా చేసుకుంటున్నాయి. మీకు అనుభవం లేని కారణంగా తామే శిక్షణ ఇచ్చి నైపుణ్యాన్ని పెంపొందిస్తామని చెబుతున్నారు. వీరి వలలో పడిన నిరుద్యోగుల నుంచి అందిన కాడికి దండుకుని రాత్రికి రాత్రి బ్యాచ్‌ల వారిగా ఎంపిక చేసి బెంగళూరుకు తీసుకెళుతున్నారు. అక్కడ నాలుగు నుంచి ఆరు నెలల కాలం వారికి శిక్షణ పేరుతో పనికి రాని ఓ సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టుని ఇచ్చి పని చేయిస్తారు. శిక్షణ ముగిసిందని, నెల రోజుల గడువులోగా అందరికి ఆఫర్ లెటర్స్ వస్తాయని చెప్పి పంపుతారు. అప్పటికి లక్షల రూపాయలను మోసగాళ్లు వసూలు చేసి ఉంటారు. ఈ తరహా బెంగళూరు కేంద్రంగా నకిలీ ఐటీ ఉద్యోగాల పేరుతో సాగుతున్న మోసగాళ్ల బారిన పడి వందల మంది నిరుద్యోగులు బలవుతున్నారు.

ముఠా మూలాలపై నిఘా

ఈ తరహాలో ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేసిన ముఠా సభ్యులు బాధితులపైనే దౌర్జన్యాలకు పాల్పడడం గమనార్హం. అనంతపురం సమీపంలోని రాప్తాడుకు చెందిన టీడీపీ నేతల పేర్లతో బెదిరించారని ఫిర్యాదులు రావడంతో అనంతపురం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సీరియస్‌గా పరిగణించారు. నిందితుల కార్యకలాపాల సమాచారాన్ని నిఘా వర్గాల ద్వారా సేకరించే పనిలో ఉన్నారు. యువతను మోసం చేసిన ఈ ముఠా మూలాలపై కూపీ లాగుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల పేరుతో మోసాలకు తెగబడే వారి జాబితాను కూడా సిద్ధం చేయాలని ఎస్పీ ఆదేశించారు.

ఎక్స్‌ప్రెస్ వేపై ఘోర ప్రమాదం

- ముగ్గురు దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు- మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే పై మరో ఘోర ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ని దాటి పక్క రోడ్డులో వెళ్తున్న వాహనాలను ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఈ దుర్ఘటన చెన్నపట్టణ వద్ద జరిగింది. సోమవారం సాయంత్రం చెన్నపట్టణ తాలూకా లంబాణి తాండా వద్ద ఎక్స్‌ప్రెస్‌వే పై వేగంగా వెళ్తున్న ఫార్చ్యూనర్ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఎగిరి పక్క రోడ్డులో వెళ్తున్న శాంట్రో, ఇన్నోవా, స్కార్పియో వాహనాలను ఢీకొంది. శాంట్రో కారులోని ఇద్దరు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు ఆస్పత్రిలో చనిపోయారు. హొసకోటకు చెందిన రేణుకమ్మ, మంజుళ, సుధీర్ మృతులు. ఇతర వాహనాల్లోని కొందరు గాయపడ్డారు.

క్లుప్తంగా

కావేరి నీటిని తమిళనాడుకు వదలొద్దు



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: కావేరి నీటిని తమిళనాడుకు విడుదల చేయరాదని కర్ణాటక సేన డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు రమేష్ మాట్లాడారు. కావేరి జలాశయంలో నీటి నిల్వ తక్కువగా ఉన్నందున రాష్ట్రంలోని రైతులకు వ్యవసాయానికి సరిపడా నీరు లేనప్పుడు ప్రభుత్వం తమిళనాడుకు నీటిని వదలడం సరికాదన్నారు. నిత్యం 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయకుండా నిలిపివేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

అదుపు తప్పిన బస్సు



ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కకు జారిన దృశ్యం

కంప్లి: పాఠశాల, కళాశాలల విద్యార్థులతో వెళుతున్న ఆర్టీసీ బస్సుకు డ్రైవర్ సమయస్ఫూర్తితో త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం హరపనహళ్లి డిపో బస్సు విద్యార్థులతో హరపనహళ్లి తాలూకాలోని అలమరసికెరె మార్గం మీదుగా ఎప్పటిలానే వెళుతుండగా చెరువు గట్టు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి డ్రైవర్ మానేష్ కుడి వైపునకు బస్సును తిప్పి వెంటనే నిలిపి వేయడంతో బస్సుతో పాటు అందులో ప్రయాణిస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

డిసెంబరులో తెలుగు జాతీయ సదస్సు

శివాజీనగర: రాష్ట్రేతర తెలుగు సమాఖ్య, విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో బెంగళూరులో డిసెంబర్ 23, 24 తేదీల్లో తెలుగు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో దేశంలోని అన్ని తెలుగు సంఘ సంస్థల నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొననున్నారని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు ఏ.రాధాకృష్ణరాజు తెలిపారు. ప్రారంభోత్సవానికి పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును ఆహ్వానించినట్లు తెలిపారు. ఇంకా అనేక రంగాలకు చెందిన తెలుగు ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. సాహిత్యం, సంస్కృతి, భాష గురించి సదస్సులు ఉంటాయన్నారు. ఆదికేశవుల నాయుడు, సీ.ఏ.వరదరాజులు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

చేతులతో వేడి పాయసం వడ్డింపు



పాయసాన్ని చేతులతో కలిపి వడ్డిస్తున్న స్వామీజీ

రాయచూరు రూరల్: సలసలా కాగుతున్న వేడి పాయసాన్ని చేతులతో కలిపి వడ్డించిన ఘటన బాగల్‌కోటె జిల్లా జమఖండి సమీపంలోని మైగూరులో జరిగింది. సోమవారం రాత్రి చక్రవర్తి సదాశివమఠం జాతర మహోత్సవ సమయంలో కోలూరు చిక్కయ్య గురుబసయ్య హిరేమఠ్ స్వామీజీ తన చేతులతో వేడి వేడి పాయసాన్ని కలిపి వడ్డించడం భక్తులకు ఆశ్చర్యం కలిగించింది. చేతిలో ఎలాంటి గరిట సాయం లేకుండానే భక్తుల జయజయ ధ్వానాల మధ్య స్వామీజీ ఈ కార్యాన్ని నెరవేర్చారు. కాగా వేలాది మంది భక్తులు సదాశివ మఠం జాతర మహోత్సవంలో పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో జయకేతనం



చాంపియన్స్‌గా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికను అందజేస్తున్న అతిథులు

బళ్లారి రూరల్: జిల్లా పీయూ విద్యా శాఖ, ఇండిపెండెంట్ పీయూ(బెస్ట్) కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన జిల్లా స్థాయి పీయూ కళాశాలల క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. కంప్లి, కురుగోడు, బళ్లారి, సండూరు, సిరుగుప్ప తాలూకా క్రీడాకారులకు నిర్వహించిన పోటీల్లో ఓవరాల్‌గా బళ్లారి తాలూకా విద్యార్థులు విజేతలుగా నిలిచారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన బళ్లారి తాలూకా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు అర్హత సాధించారు. విజేతలకు జిల్లా పీయూ విద్యా శాఖ ఉప సంచాలకుడు టి.పాలాక్షి జ్ఞాపికను, పతకాన్ని అందజేశారు. జిల్లా క్రీడాధికారి రహమతుల్లా, బెస్ట్ కళాశాల ప్రిన్స్‌పాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్స్‌పాల్ జి.శ్రీనివాస రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్స్‌పాళ్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాచనగరిలో వినూత్న ధర్నాలు

- కావేరి జలాల విడుదలపై ఆగ్రహం
- సామూహిక భజనలు చేస్తూ నిరసన
- వెంటనే నీటి విడుదలను నిలిపి వేయాలని డిమాండ్



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం



కరవే స్వాభిమాని సేనె కార్యకర్తల నిరసన

మైసూరు: తమిళనాడుకు కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ మంగళవారం మైసూరు నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో పోరాట సంస్థలు, రైతు సంఘాలు వినూత్న ధర్నా నిర్వహించారు. మంగళవారం మళ్లీ 18 రోజుల పాటు మూడు వేల కూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరి నీటి నిర్వహణ ప్రాధికార ఆదేశించడంతో స్థానిక పోరాట సంస్థలు మండిపడుతున్నాయి.

స్టాలిన్ దిష్టిబొమ్మతో నిరసన :

జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున ధర్నాలు, సామూహిక భజనలు చేస్తూ తమిళనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా జలాశయాలు వెలవెలపోతున్నాయని, ఇటువంటి తరుణంలో ప్రజల జీవనాడి కావేరిలో కూడా నీరు అడుగంటిందని, ఈ సమయంలో కోర్టుల్లో సరైన వాదనలు వినిపించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు మండిపడ్డారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ దిష్టిబొమ్మతో ఆందోళనకారులు శవయాత్ర నిర్వహించారు. ఇక గంధధగుడి ఫౌండేషన్ సభ్యులు కూడా ధర్నా నిర్వహించారు. మైసూరు జిల్లా పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ నిరసన వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, తమిళనాడుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

టి.నరసిపుర బంద్ విజయవంతం :

తమిళనాడుకు కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ కబిని కావేరి హితరక్షణ సమితితోపాటు వివిధ పోరాట సంఘాలు, కన్నడ సంఘాలు మంగళవారం మైసూరు జిల్లాలోని టీ నరసిపుర పట్టణంలో బంద్ నిర్వహించాయి. అన్ని కార్యాలయాలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్ పాటించారు.

మండ్యలో ఫొటోగ్రాఫర్ల ధర్నా

మండ్య: కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ ఫొటోగ్రాఫర్లు మండ్య నగరంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. నగరంలోని సిల్వర్ జూబ్లీ పార్కుకు చేరుకున్న వారు మానవహారం నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. అనంతరం జిల్లా అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

గురుభవన్‌ను నిర్మిస్తాం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: జిల్లాలో ఎన్నో ఏళ్లుగా మరుగున పడిన గురుభవన్ నిర్మాణాన్ని ఖచ్చితంగా పూర్తి చేస్తామని, ఇందుకు రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసి ఉపాధ్యాయుల ఆశయాలకు అనుగుణంగా భవన నిర్మాణం జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ, విద్యా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల కృషి వల్లే దేశాభివృద్ధి సాధ్యమని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ఉపాధ్యాయ స్థాయి నుంచి రాష్ట్రపతి దాకా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని కొనియాడారు. తల్లి, తండ్రి తర్వాత గురువు స్థానం ఎంతో గొప్పదన్నారు. అలాంటి గురువులు ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపుతున్నారన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపమేయర్ బి.జానకి, హనుమక్క, ఎం.శివాజీరావ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

- వర్సిటీల్లో విద్యార్థులకు బంగారు భవిష్యత్
- వైస్‌చాన్సలర్ డాక్టర్ టీఎన్.నాగభూషణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్‌చాన్సలర్ యశ్వంత్ భూపాల్ తదితరులు

సాక్షి,బళ్లారి: విద్యతోనే అభివృద్ధి సాధ్యం అని, ఆ దిశగా ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా మారాలని కిష్కింధ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ టీఎస్ నాగభూషణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కిష్కింధ విశ్వవిద్యాలయంలో మొదటి బ్యాచ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అమెరికాలో అత్యంత ఉన్నత విద్యాభ్యాసాలు ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. మన దేశంలో కూడా ఇటీవల ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులకు బంగారు బాటలు వేస్తున్నాయన్నారు. కిష్కింధ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఉన్నత స్థాయికి చేరుకొనే అవకాశం ఉంటుందన్నారు. విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ యశ్వంత్ భూపాల్, వైజే.పృథ్వీరాజ్ భూపాల్, అశోక్ భూపాల్, డాక్టర్ వీజే.భరత్, అమరరాజ్ భూపాల్, డాక్టర్ యూ.ఈరన్న, డాక్టర్ ఎస్‌బీ.కామశెట్టి, డాక్టర్ అన్నంరాజు, కాశీ విశ్వనాథ్, పీ.అమరేశయ్య, ప్రొఫెసర్ వెంకటేశులు, డాక్టర్ కేఎస్‌ఆర్.శ్రీధర్, డాక్టర్ ఎస్.మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలిప్పిస్తామని రూ.కోట్లు లూటీ

- మంత్రి పేరు చెప్పి దందా



గురు విశ్వకర్మ

రాయచూరు రూరల్: గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్లు ఇప్పిస్తామని చైత్రా కుందాపుర గ్యాంగ్ వసూళ్ల కేసు కనుమరుగు కాక ముందే మంత్రి పేరుతో ఆప్త సహాయకుడు ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులకు రూ.కోట్లలో శఠగోపం పెట్టిన ఘటన జిల్లాలో వెలుగు చూసింది. రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు ఆప్త సహాయకుడినని చెప్పుకొని డబ్బులు వసూలు చేస్తున్న గురు విశ్వకర్మ నిజస్వరూపం బయటపడింది. అతనిపై అంగన్‌వాడీ, ఎస్ఐ, ఎఫ్‌డీసీ, ఇతర ఉద్యోగాలు ఇప్పిస్తానని 28 మంది నుంచి అడ్వాన్స్‌గా రూ.2 కోట్లు వసూలు చేశాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే తాము గురు విశ్వకర్మను ఇప్పటికే తమ వద్ద విధుల నుంచి తొలగించామని మంత్రి బోసురాజు విలేకరులకు స్పష్టం చేశారు. ప్రస్తుతం అతను మాజీ ఎంపీ బీవీ నాయక్‌తో, బీజేపీలో గుర్తింపు పొందారన్నారు.

అన్ని దానాల్లోకి రక్తదానం శ్రేష్టం



రక్తదానం చేస్తున్న ఆశా కార్యకర్తలు

గంగావతి: అన్ని దానాల్లోకి రక్తదానం పవిత్రమైందని డాక్టర్ సబ్రిన్ పేర్కొన్నారు. నగరంలోని ఇస్లాంపురలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రధానంగా మనిషి మరొకరి ప్రాణాలను కాపాడేందుకు కన్ను, కిడ్నీ, రక్తదానం లాంటివి చేయాలన్నారు. శిబిరంలో 100 మంది రక్తదానం చేయడం శ్లాఘనీయం అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్, నేత్రావతి, ఆశా కార్యకర్తలు దీపా, శరణమ్మ, లాల్‌బీ పాల్గొన్నారు.

సహాయధనం కోసం ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కోలారు: కట్టడ కార్మికుల పిల్లల విద్యాభ్యాసానికి సహాయధనం అందించాలని డిమాండ్ చేస్తూ కట్టడ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి భీమరాజ్ మాట్లాడుతూ కట్టడ కార్మిక నిర్మాణ మండలి నుంచి 2021 నుంచి రూ.1.5 లక్షల సహాయధనం బకాయి ఉందన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు విద్యా సహాయం అందించడానికి దరఖాస్తులు ఆహ్వానించలేదని ఆరోపించారు. కార్మికుల పిల్లలకు విద్యాభ్యాస భాగ్య పథకం కింద వెంటనే సహాయధనం అందించడానికి దరఖాస్తులు స్వీకరించాలన్నారు, సహాయధనం నిలిపి వేయడం వల్ల కట్టడ కార్మికుల పిల్లలు విద్యాభ్యాసాన్ని మధ్యలోనే నిలిపి వేసే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వెంటనే సహాయధనం అందించాలన్నారు. ధర్నాలో సంఘం ప్రముఖులు విజయకృష్ణ, హగరి నాగరాజప్ప, రామచంద్రప్ప, రామాంజి, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కాఫీ సదస్సు

సాక్షి బెంగళూరు: కేంద్ర కామర్స్, వాణిజ్య మంత్రి శాఖ, భారత కాఫీ బోర్డు, అంతర్జాతీయ కాఫీ సంస్థ ఆధ్వర్యంలో బెంగళూరు ప్యాలెస్‌లో జరుగుతున్న ఐదో ప్రపంచ కాఫీ సదస్సు రెండో రోజైన మంగళవారం కూడా కొనసాగింది. రెండో రోజూ కాఫీని కేవలం ఒక పానీయంగా మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ ఉత్పత్తుల్లో వినియోగించేలా పరిశ్రమ కొత్త అడుగులు వేయాలని నిపుణులు చర్చలో కోరారు. కాఫీ రంగానికి సంబంధించిన ప్రపంచ స్థాయి నాయకులు, ఆర్థిక నిపుణులు, రైతులు కాఫీ రంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.

భారీ వర్షాలతో భీమాకు వరద



నీట మునిగిన వీరాంజనేయ ఆలయం

రాయచూరు రూరల్: గత రెండు రోజుల నుంచి యాదగిరి జిల్లాలో జోరుగా వానలు కురుస్తున్నాయి. దీంతో భీమా నదికి వరద పోటెత్తింది. కళ్యాణ కర్ణాటకలోని యాదగిరి, రాయచూరు జిల్లాల్లో పూర్తి స్థాయిలో వరద నీరు చేరడంతో భీమా నదిలోకి 5 వేల క్యూసెక్కుల నీరు వదిలారు. యాదగిరి జిల్లా గురుసణిగి వద్ద ఆరు గేట్లను తెరిచారు. నదీ తీర ప్రాంతంలోని వీరాంజనేయ, కంగాళేశ్వర ఆలయాలు నీట మునిగాయి. నదీ పరివాహక జిల్లాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిమజ్జనాలతో జలకాలుష్యం



నదిలో గణేష్ విగ్రహ నిమజ్జనం చేసిన దృశ్యం

కంప్లి: ఓ వైపు సరైన వర్షాలు లేక జలాశయాలు నిండక తాగునీటి కోసం పరితపించాల్సిన పరిస్థితి ఎదురైంది. ఏటా తుంగభద్ర జలాశయం ఆగస్టు నెలలోనే నిండుకుండలా ప్రజలకు ఎంతో ఆనందం కల్గించేది. అయితే ఈ ఏడాది పరిస్థితి తారుమారైంది. జలాశయంలో నీటి కొరత వల్ల నదికి చాలీచాలని విధంగా నీటిని వదులుతున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో కంప్లి కోట ప్రాంతాన గల నదిలో గణేష్ నిమజ్జనాలు జోరుగా చేయడంతో మట్టి విగ్రహాలు నెమ్మదిగా కరుగుతూ మరోవైపు పీఓపీ విగ్రహాలు నదిలో నీటిపై తేలుతుండడంతో నదిలో నీరు కలుషితమవుతోంది. ఈ నీటిని తాగే పట్టణవాసులు, నదీ పరివాహక ప్రాంత వాసులకు అంటువ్యాధుల ముప్పు తప్పదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

కంప్లి: పట్టణంలోని 6వ వార్డు ప్రభుదేవర సంస్థాన విరక్తమఠం పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న కే.నవ్య, కే.పూజ యోగా పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అరుధంతి ఇరువురిని అభినందిస్తూ ప్రతి విద్యార్థిని యోగా పట్ల ఆసక్తి చూపి ఇలా రాష్ట్ర స్థాయికి ఎంపికై పాఠశాల కీర్తిని పెంచాలని కోరారు.

తిరుపతి ప్యాసింజర్ సేవలు పునరారంభం

హుబ్లీ: గతంలో రద్దు చేసిన తిరుపతి-హుబ్లీ-తిరుపతి డైలీ ప్యాసింజర్ ప్రత్యేక రైలు సంచారాన్ని సోమవారం నుంచి పునః ప్రారంభించారు. ఈ రైలు సేవలను ఈ నెల 22 నుంచి అక్టోబర్ 1 వరకు రద్దు చేయాలని తీర్మానించిన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు నైరుతి రైల్వే అధికారులు తెలిపారు.

కోలారు వార్తలు...

కరువు పరిహారం అందించాలని ధర్నా



రైల్వే స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

కేజీఎఫ్: రాష్ట్రంలో కరువు నివారణ చర్యల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు బంగారుపేట రైల్వే స్టేషన్ ముందు ధర్నా నిర్వహించి రైల్వే మేనేజర్ అనిల్‌కుమార్ ద్వారా ప్రధానమంత్రికి వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.నారాయణగౌడ మాట్లాడుతూ జిల్లాలో తొలకరి వానలు సరిగా కురవక పోవడం వల్ల జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వ్యవసాయ పనులు కుంటుపడ్డాయి. రైతులు పొట్ట చేతబట్టుకుని నగరాలకు వలస వెళ్లకముందే ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి ముందుకు రావాలని కోరారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను నిభాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. ప్రభుత్వ సాయం కోసం రైతులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తాము 195 తాలూకాలను కరువు తాలూకాలుగా ప్రకటించి కేంద్రానికి నివేదిక పంపామని తెలిపి చేతులు దులుపుకుంటోందన్నారు. కరువుపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ధర్నాలో జిల్లా అధ్యక్షుడు మరగల్ శ్రీనివాస్, తాలూకా అధ్యక్షుడు కే.అప్పోజిరావు, కిరణ్, ఉపాధ్యక్షుడు చాంద్‌పాషా పాల్గొన్నారు.

పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

శ్రీనివాసపురం: పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణ సమీపంలోని పుంగనూరు క్రాస్ వద్ద ఉన్న సీతారామ కళ్యాణ మంటపంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పదో తరగతిలో తాలూకా ఎప్పటిలాగా వంద శాతం ఫలితాలు సాధించి ముందు వరుసలో ఉండాలన్నారు. నియోజకవర్గంలో దుస్థితికి చేరిన పలు పాఠశాలలు, మైదానాలకు వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి ప్రభుత్వమే వారికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించాలన్నారు. ఎమ్మెల్సీ వై ఎ నారాయణస్వామి, టీపీ ఈఓ శివకుమారి, బీఈఓ కె.భాగ్యలక్ష్మి, రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి చంద్రశేఖర్ నుగ్గలి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

మాలూరు: చిక్కతిరుపతి శ్రీప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవం సందర్భంగా స్వామి వారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలను నిర్వహించారు. ఆలయంలో యేటా మాదిరిగానే పవిత్రోత్సవాన్ని ఈసారి కూడా వైభవంగా జరిపారు. ప్రధాన అర్చకులు రవి, గోపాల కృష్ణ భారద్వాజ్‌ల నేతృత్వంలో ఉదయం స్వామి వారికి అభిషేకం, వేదమంత్ర పారాయణం జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

ఆరోగ్యాధికారి ఆకస్మిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రబాబు

రాయచూరు రూరల్: జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు మంగళవారం మాన్వి తాలూకా కల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలు అందించడానికి ముందుండాలని అధికారులకు, సిబ్బందికి సూచనలిచ్చారు. ఆరోగ్య కార్యకర్తలు పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు.

కరువు సహాయక పనులు చేపట్టండి



వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: జిల్లాలోని తాలూకాలను కరువు పీడిత తాలూకాలుగా ప్రకటించి కరువు సహాయక పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రాంత రైతు కూలీ కార్మికుల సంఘం అధ్యక్షుడు కరియప్ప డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు లేక ప్రజలు ఉపాధి కోసం వలస వెళుతున్నారన్నారు. జాతీయ గ్రామీణ ఉద్యోగ ఖాత్రి పథకాన్ని విస్తరించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

వన్యజీవుల స్టాంపుల పుస్తకం విడుదల



పుస్తకం విడుదల చేస్తున్న దృశ్యం

బనశంకరి: అంతరించిపోతున్న జీవ జాతుల దినోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆన్ నేచర్ (ఐయుసీఎన్), సిటీస్ సంస్థలు వన్యప్రాణులు, మొక్కల వ్యాపారాన్ని నియంత్రించడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. పలురకాల జాతుల పక్షులు, ప్రాణులు, చెట్లను రక్షించడానికి రెండు సంస్థలూ కృషిచేస్తాయి. మంగళవారం బెంగళూరు కేంద్ర తపాలాఫీసులో జరిగిన కార్యక్రమంలో ప్రవాసాంధ్రుడు, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి ఎం.లోకేశ్వరరావు రాసిన సిటీస్ అంతరించిపోతున్న జాతులకు చెందిన స్టాంపుల పుస్తకాన్ని పరిసర ప్రేమికురాలు ప్రియావెంకటేశ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీ.రాజు మాస్టర్ క్రాఫ్ట్‌మ్యాన్ విడుదల చేశారు.

శరణ బసవేశ్వర రథోత్సవం

గంగావతి: కారటగిలో శ్రీశరణ బసవేశ్వర జాతర మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఉదయాన్నే శరణ బసవేశ్వరుడికి పలు రకాల అభిషేకాలు, పూజలను అర్చకులు నెరవేర్చారు. సాయంత్రం జోడు రథాలతో శరణ బసవేశ్వరుడి రథోత్సవం వైభవంగా జరిగింది.

బాలికపై అత్యాచార నిందితుడికి పదేళ్ల జైలు

కోలారు: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.పి.దేవమానె తీర్పును వెలువరించారు. తాలూకాలోని గద్దెకణ్ణూరు నివాసి నవీన్‌కుమార్ శిక్షకు గురైన వ్యక్తి. నిందితుడు కేజీఎఫ్ తాలూకా క్యాసంబళ్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికను అపహరించి అత్యాచారం చేసినట్లు విచారణలో రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి పైశిక్షను విధించారు,. జరిమానా కట్టలేకపోతే మరో ఆరు నెలలు అదనంగా శిక్షను అనుభవించాల్సి ఉంటుందని, బాధితురాలికి రూ.4 లక్షల పరిహారం అందించాలని తీర్పులో సూచించారు.

కేంద్రం సదుపాయాలపై తెలియజేయండి



మాట్లాడుతున్న ఎంపీ మునిస్వామి

శ్రీనివాసపురం: వీధి వ్యాపారులకు, ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సౌకర్యాల గురించి అవగాహన కలిగించాలని ఎంపీ ఎస్.మునిస్వామి తెలిపారు. మంగళవారం పట్టణంలోని పురసభ కార్యాలయంలో వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వ పీఎం స్వనిధి పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించి మాట్లాడారు. పూలు, కూరగాయలు, పండ్ల వ్యాపారులు రుణాల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి? తిరిగి ఎలా చెల్లించాలో వివరించారు. దశల వారీగా రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు పొందవచ్చన్నారు. జిల్లాలో 5 వేల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. వీధి వ్యాపారుల కోసం తెచ్చిన ఆత్మనిర్భర్ నిధి వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అటవీ ప్రాంతంలో అధికారులు తొలగించిన రైతుల పంటలకు నష్టపరిహారం అందించడానికి కృషి చేస్తానని, బాధిత రైతులకు అండగా ఉంటానన్నారు. ఇందుకోసం శ్రీనివాసపురం నుంచి బెంగళూరు విధానసౌధ వరకు పాదయాత్ర చేపడతానన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, పురసభ ముఖ్యాధికారి సత్యనారాయణ, రోణూరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్వార తీరంలో విషపూరిత జెల్లీ ఫిష్‌లు



ఒడ్డుకు వచ్చిన బ్లూ బటన్ చేపలు

యశవంతపుర: వాతావారణంలో మార్పుల కారణంగా కారవార సమీపంలోని అరేబియా సముద్రం తీరంలో విషపూరితమైన బ్లూ బటన్ జెల్లీ ఫిష్‌లు పెద్ద ఎత్తున బయటకు రావడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. బ్లూ బటన్ జెల్లీ ఫిష్ హోన్నావర, కాసరగోడ చుట్టు పక్కల, ముగళి తీరం కినారెలో వేల సంఖ్యలో ఒడ్డుకు వచ్చాయి. సముద్రతీరంలో ఈ చేపలు లక్షల సంఖ్యలో పుట్టికొచ్చినట్లు మత్స్యకారులు తెలిపారు. కళబర, ముగళి తీరం పొడవునా బ్లూబటన్ చేపలు తీరం వెంబడి కనిపిస్తున్నాయి.

నివాళులతో నిరసన

దొడ్డబళ్లాపురం: రామనగర జిల్లాలో కూడా కావేరి జలాల కోసం బంద్‌ను ఆచరించారు. పట్టణంలోని ఐజూరు సర్కిల్‌లో చేరిన కన్నడ భాషా సంఘాల కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వానికి, తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఫోటో ఉంచి దండలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నిరసన తెలిపారు. గుండెలు బాదుకుంటూ ఏడుపును నటించారు.

వ్యక్తిపై ఎమ్మెల్యే ఆగ్రహం



బొమ్మనహళ్లి: సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన వ్యక్తిపై ఎమ్మెల్యే చెన్నబసప్ప తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన బెంగళూరు 5వ వార్డు పుర లేఔట్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు... పురలేఔట్‌లో అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడానికి ఎమ్మెల్యే చెన్నబసప్ప అక్కడికి చేరుకున్నారు. ఇదే సమయంలో స్థానికంగా ఉంటున్న ఓ వ్యక్తి అక్కడికి వచ్చి సమస్యలు చెప్పడం మొదలు పెట్టాడు. తాగునీరు రావడం లేదని, రోడ్లు, డ్రైనేజీలు సరిగా లేవని, మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని చెప్పాడు. మేయర్ శివ కుమార్, అధికారులు కూడా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశాడు. కనీసం మీరైనా పట్టించుకోవాలని అన్నారు. ఇదే సమయంలో సదరు వ్యక్తి అందరిపైన ఆరోపణలు చేయడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో స్థానికులు అతన్ని అక్కడికి నుంచి పంపించి వేశారు.

పట్టపగలే ఇంటిలో చోరీ

బాగేపల్లి: పట్టపగలే దొంగలు ఇంటి తాళం బద్దలు కొట్టి బంగారు నగలు ఎత్తుకెళ్లిన ఘటన బాగేపల్లి తాలూకా దేవరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. దేవరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డి ఉదయం పొలం పనులకు వెళ్లాడు. ఆయనకు భోజనం ఇవ్వడానికి ఇంటికి తాళం వేసుకుని భార్య పొలానికి వెళ్లింది. ఈ సమయంలో దొంగలు ఇంటి తాళం బద్దలు కొట్టి బీరువాలో ఉన్న రూ. లక్ష 40 వేల విలువైన బంగారు నగలు ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన దంపతులు చోరీ విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరోసారి మోదీ ప్రధాని కావాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: నరేంద్ర మోదీ మరోసారి దేశానికి ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, ఇందుకోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని తుమకూరు గ్రామీణ ఎమ్మెల్యే బీ.సురేష్‌గౌడ అన్నారు. మంగళవారం తుమకూరు నగరంలోని కన్నడ భవనంలో బీజేపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ... ఇప్పటి నుంచి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు.

కుప్ప కూలిన రాజ్‌భవన్ ప్రహరీ

శివాజీనగర: విధానసౌధ ఉత్తర భాగంలో ఉన్న రాజభవన్ ప్రహరీ కూలిపోయిన ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. అయితే అదృష్టవశాత్తు ఆ సమయంలో గార్డెనింగ్ పనులు చేసే సిబ్బంది ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. 15 ఏళ్ల క్రితం నిర్మించి ఈ ప్రహరీ సోమవారం కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. అడ్డుగోడ వద్ద పార్కు ఉంది. సిబ్బంది గార్డెనింగ్ పనులు చేసేవారు. సిబ్బంది దూరంగా ఉండటంతో ప్రమాదం తప్పింది. అయితే అక్కడ ఎవరూ ప్రవేశించకుండా భద్రత కల్పించారు.

ఆసరాగా ఉంటారనుకుంటే..

- జాతరకు వస్తుండగా కారు- లారీ ఢీ..
- ముగ్గురు యువకుల మృతి
- తుమకూరు జిల్లాలో ఘోరం



లారీ ఢీకొనడంతో నుజ్జు నుజ్జైన కారు





ఆస్పత్రిలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, తుమకూరు: తుమకూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. మధుగిరి తాలూకా మిడిగేశి ప్రాంతంలో సోమవారం రాత్రి లారీ- కారు ఢీకొనగా, పావగడ తాలూకా గుజ్జనడు గ్రామానికి చెందిన ఆకాశ్ (23), కార్తీక్ (23), హేమంత్ (27) మరణించగా, 24 ఏళ్ళ ఉజ్వల్ తీవ్ర గాయాల పాలై తుమకూరు ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నాడు. మిడిగేశి పోలీసులు తెలిపిన ప్రకారం... వీరందరూ కూడా బెంగళూరులో ఎలక్ట్రీషియన్, మెకానిక్, కార్ల షోరూంలలో పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నారు. తమ స్వగ్రామం గుజ్జనడులో మంగళవారం జరిగే మారెమ్మ జాతరలో పాల్గొనేందుకు నలుగురూ సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో బెంగళూరు నుంచి కారులో బయల్దేరారు. పావగడకు 30 కిలోమీటర్ల దూరంలో ఉండగా అర్ధరాత్రి సమయంలో మిడిగేశి కేశప్ రోడ్డు సమీపంలో శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మంటపం సమీపంలో ని మలుపులో ఎదురుగా అతి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. కారు నుజ్జునుజ్జు కాగా అందులోని పై ముగ్గురూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాలను మధుగిరి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు

జాతరకు రావాల్సిన కొడుకులు కాటికి చేరుకోడంతో తల్లిదండ్రుల ఆక్రందనలు చెప్పనలవి కాదు. తల్లిదండ్రులు ఊళ్లో కూలిపనులు చేసుకుంటూ జీవించేవారే. గుజ్జనడు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మారెమ్మ జాతర మూగవోయింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ మార్చురి లో ఉన్న మృతదేహాలను సందర్శించి తల్లిదండ్రులను ఓదార్చారు.

హోటల్ తెరిచారని విధ్వంసం

- జయనగరలో సంఘటన



కట్టితో ధ్వంసం చేస్తున్న ఓ వ్యక్తి



పగిలిపోయిన క్యాబిన్

కృష్ణరాజపురం: కావేరి నీటి కోసం బెంగళూరు బంద్ జరుగుతుండగా మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో ఇద్దరు దుండగులు హోటల్‌లోకి చొరబడి ధ్వంసం చేశారు. జయనగరలో ఉన్న శ్రీ ఉడుపి హట్ హోటల్ తెరిచి ఉండగా వ్యక్తులు బైక్‌పై వచ్చారు, ఎవరు తీయమన్నారు అని హోటల్ యజమాని, సిబ్బందితో గొడవపడి కట్టెలతో వీరంగం సృష్టించారు. ప్రజలు చూస్తుండగానే హోటల్లోని టీవీపాటు కొన్ని విలువైన వస్తువులను పగులగొట్టారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. హోటల్ యజమాని జయనగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులు ఇలా రెండు హోటళ్లలో ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులకు ఇచ్చిన బిరియానీలో ఎలుక



బంద్‌లో గలాటాలు జరగకుండా బందోబస్తు కోసం పెద్దసంఖ్యలో పోలీసులు వచ్చారు. యశ్వంతపురలో బందోబస్తులో ఉన్నసుమారు 180 మంది పోలీసు సిబ్బందికి మధ్యాహ్నం భోజనంగా బిరియాని పొట్లాలను పంపిణీ చేశారు. వాటిలో ఒకదాంట్లో చచ్చిన ఎలుక రావడంతో సదరు పోలీసులు అవాక్కయ్యాడు. మిగతావారికి చూపించడంతో ఫోటోలు, వీడియోలు తీసి షేర్ చేశారు. దీంతో చాలా మంది ఆ బిరియానీలు తినకుండా వదిలేశారు.

తమిళనాడుకు నీరు ఎలా వదులుతారు ?



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్ రెడ్డి

బొమ్మనహళ్లి: కావేరి నది ప్రజల జీవనాడి అని, అలాంటి కావేరి జలాశయంలో నీరు లేక అక్కడి ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో వాటిని పట్టించుకోకుండా తమిళనాడుకు నీరు వదలడం ఏమిటని ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం కావేరి జలాల విడుదలను వ్యతిరేకిస్తూ చేపట్టిన బెంగళూరు బంద్ సందర్భంగా బొమ్మనహళ్లిలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...కావేరి నీటి కోసం ప్రజలు, రైతులు, పోరాట సంఘాలు ఆందోళన చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయిన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మంజునాథరెడ్డి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు ఖాళీ బిందెలతో బొమ్మనహళ్లిలోని స్వామి వివేకానంద సర్కిల్‌లో బైఠాయించి నీటి విడుదలను వెంటనే నిలిపి వేయాలని నినాదాలు చేశారు.

ఎల్లప్పుడూ కన్నడిగులకు తోడుగా ఉంటా

దొడ్డబళ్లాపురం: కావేరి జలాల పోరాటానికి సంబంధించి తాను ఎల్లప్పుడూ కన్నడిగులకు తోడుగా ఉంటానని కిచ్చ సుదీప్ ప్రకటించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. కన్నడ భాష, నేల, జలాల విషయంలో కన్నడపర సంఘాలు చేసే ప్రతి పోరాటంలో తాను తోడుగా ఉంటానన్నారు. వర్షాభావం కారణంగా రాష్ట్రంలో రైతులకు వ్యవసాయానికి, ప్రజలకు తాగడానికి నీటి కొరత ఏర్పడిందన్నారు. పర్యాయ మార్గం లేని మనం కావేరి జలాలనే నమ్ముకున్నామన్నారు. తనకు తెలిసినంత వరకూ కరువు అధ్యయన కమిటీ, కావేరి కమిటీలోని జల నిపుణులు తక్షణం ట్రిబ్యునల్ కోర్టుకు, కేంద్ర ప్రభుత్వానికి కర్ణాటక రాష్ట్రంలోని కావేరి జలాల పరిస్థితి గురించి వివరించాలన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రితో సామరస్యంగా చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. కావేరి వివాదంతో పాటు ఉత్తర కర్ణాటక కృష్ణానది, మహదాయి నది, కళసాబండూరి వివాదాలు కూడా పరిష్కరించాలని ఆశిస్తున్నానన్నారు.

ఆటోను ఢీకొన్న స్కూల్‌బస్సు

- ఆటోలోని ఐదుగురు మృత్యువాత
- కాసరగోడులో ప్రమాదం



ప్రమాద దృశ్యం

యశవంతపుర: వేగంగా వెళుతున్న పాఠశాల బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ఐదుమంది మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం మంగళూరు సమీపంలో కేరళలోని కాసరగోడులో జరిగింది. తాయలంగడికి చెందిన ఒక ప్రైవేటు స్కూల్ బస్సు విద్యార్థులను ఇళ్లకు తీసుకుని బయల్దేరింది. అదుపుతప్పి ఒక ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదు మంది ప్రయాణికులు మృతి చెందారు. మృతులు బీఫాతిమా (58), ఉమ్మలీమా (55), నబీసా (50), వారి బంధువు ఫాతిమా (72), ఆటో డ్రైవర్ అబ్దుల్ రవూఫ్ (58) మృతులు. మృతుల్లో మొదటి ముగ్గురూ అక్కచెల్లెళ్లు. బంధువు చనిపోతే చూసివద్దామని వెళ్తూ వారు కూడా మృత్యుఒడికి చేరడం గమనార్హం. ఆటో నుజ్జునుజ్జు కాగా మృతదేహాలను వెలికి తీయడం కష్టమైంది.

బస్సు బోల్తా, 20 మందికి గాయాలు

బెళగావి జిల్లా రామదర్గ తాలూకా బిజగుప్పి గ్రామం వద్ద మంగళవారం ఉదయం కేఎస్ఆర్‌టీసీ బస్సు బోల్తా పడింది. ప్రమాదంలో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. గాయలైనవారిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. హులకుంద గ్రామం నుంచి బస్సు రామదుర్గకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

సీఎం ఇంటి ముట్టడికి యత్నం

- కరవే కార్యకర్తలు అరెస్ట్

శివాజీనగర: తమిళనాడుకు కావేరి నీరు విడుదల చేయటాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించిన కర్ణాటక రక్షణా వేదిక కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం నగరంలో గాంధీనగర నుండి భారీ ర్యాలీగా కరవే రాష్ట్రాధ్యక్షుడు టీ.ఏ.నారాయణగౌడ నేతృత్వంలో ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించిన వందలాది మంది కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం పిలుపునిచ్చిన బెంగళూరు బంద్‌కు అనేక సంఘాలు పాల్గొన్నాయి. అయితే కరవే బంద్‌కు మద్దతు ఇవ్వలేదు. తాము ఏ బంద్‌కు మద్దతు ఇవ్వటం లేదని కరవే కార్యదర్శి సణీరప్ప తెలిపారు. కరవే రాష్ట్రంలో అన్ని జిల్లా, తాలూకాల్లో సంఘాలు ఉన్నాయి. దీంతో తాము బాధ్యతతో నిర్ధారణ తీసుకొంటాం. ఇప్పటికే జరుగుతున్న పోరాటాన్ని ముందుకు కొనసాగిస్తామని నీటి విడుదలను నిలుపుదల చేయకపోతే తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

వాటాళ్‌తో పాటుగా పలువురు అరెస్ట్:

కావేరి నీటిని తమిళనాడుకు విడుదల చేయరాదని డిమాండ్ చేస్తూ రాజభవన్ ముట్టడికి యత్నించిన కన్నడ పోరాట నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం నగరంలో విధానసౌధ ముందు భాగంలో కన్నడ చళవళి వాటాళ్ పార్టీ నాయకుడు వాటాళ్ నాగరాజ్ నేతృత్వంలో వివిధ కన్నడ సంఘాలు చేపట్టిన రాజభవన్ ముట్టడికి యత్నించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని నిషేధాజ్ఞలు జారీ చేసిన నేపథ్యంలో ధర్నా చేపట్టరాదని ఆందోళనకారులను అదుపులోకి తీసుకొన్నారు. పోరాట నాయకులు సా.రా.గోవిందు, ప్రవీణ్ శెట్టి, కే.ఆర్.కుమార్, వాటాళ్ నాగరాజు ఇతర పోరాట సంఘాలను నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు.

శాంతి సమావేశం



మాట్లాడుతున్న సీఐ రంగస్వామయ్య

చింతామణి: తాలూకాలోని మురగమల్ల గ్రామంలో అమ్మాజాన్, భావాజాన్ దర్గా ఉరుసును శాంతియుతంగా జరుపుకోవాలని రూరల్ సీఐ రంగస్వామయ్య తెలిపారు. మంగళవారం నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 28, 29 రెండు రోజుల పాటు జరిగే ఉరుసు ఉత్సవాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించుకోవాలన్నారు. యువత బైక్ వీలింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. సమావేశంలో తహశీల్దార్ సుదర్శన్ యాదవ్, గ్రామ పంచాయతీ అధ్యక్షుడు అన్సర్ ఖాన్, దర్గా అధ్యక్షుడు హనీఫ్ సేట్, గ్రామ ప్రముఖుడు లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జానపద కళలను భావి తరాలకు అందించాలి



పురస్కార గ్రహీతలను సన్మానించిన దృశ్యం

మండ్య: జానపద కళలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆదిచుంచనగిరి పీఠాధ్యక్షుడు డాక్టర్ నిర్మలానందనాథ స్వామీజీ అన్నారు. మండ్య జిల్లాలోని నాగమంగళ తాలూకా ఆదిచుంచనగిరి బీజీఎస్ సభా భవనంలో రాష్ట్ర స్థాయి 44వ శ్రీ కాలభైరవేశ్వర జానపద కళామేళా, చుంచుశ్రీ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించిన అనంతరం భక్తులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చుంచుశ్రీ అవార్డులు అందుకున్న వారిని సన్మానించారు.

హోసూరు వార్తలు..

చెత్త తొలగించి మొక్కలు నాటారు



ఖాళీ స్థలంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 41వ వార్డులో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ ప్రాంతంలో గ్రీనరి ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ కుబేరన్‌క స్థానికులు విజ్ఞప్తి చేశారు. రాయకోట గృహ వసతి కాలనీ విద్యుత్ కార్యాలయం నుంచి మురుగన్ ఆలయం వరకు ఒక కిలోమీటరుపైగా రోడ్డు మధ్యన హైటెన్షన్ విద్యుత్ తీగల వెళ్తున్నాయి. ఇరువైపుల రోడ్ల మధ్య చెత్తా చెదారంతో నిండిపోయింది. దీంతో అక్కడ చెత్తను తొలగించి గ్రీనరీ పెంచాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన చెత్త తొలగించే పనులకు శ్రీకారం చుట్టి, మొక్కలు నాటారు. జేపీ జయప్రకాష్, హేమకుమార్, రహమాన్, మధురాజ్, బాబు, కుట్టి, ధనపాల్, వేణుగోపాల్, మాదయ్యన్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

బంద్‌తైన బస్సులు

- సరిహద్దుల్లో పోలీసు గస్తీ



వాహనాలను అడ్డుకొని తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



సరిహద్దుకు అవతలివైపు కర్ణాటక పోలీసుల నిఘా

హోసూరు: కావేరి నీటి సమస్యపై మంగళవారం బెంగళూరు బంద్ ప్రకటించడంతో తమిళనాడు నుంచి బెంగళూరువైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు హోసూరులో నిలిచి పోయాయి. ముందు జాగ్రత్త చర్యలుగా రవాణాశాఖాధికార్లు సోమవారం రాత్రి 8 గంటల నుంచి తమిళనాడు ఆర్టీసీ బస్సులను హోసూరులో ఆపివేశారు. బెంగళూరులో ఉంటున్న తమిళనాడు ప్రజలు తిరిగి వచ్చేందుకు జూజువాడి చెక్‌పోస్ట్ వరకు బస్సులను నడిపింది. బెంగళూరు నుంచి తమిళనాడుకు వచ్చే ప్రయాణికులు రాష్ట్ర సరిహద్దు అత్తిపల్లి నుంచి జూజువాడి వరకు నడిచి వచ్చారు. వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. బైక్‌లు, కార్లను జుజువాడి చెక్‌పోస్ట్ వద్ద తమిళనాడు పోలీసులు అడ్డుకొని తమిళనాడు వాహనాలను వెనక్కి పంపారు. ఇరు రాష్ట్రాల పోలీసులు భారీగా మోహరించారు.

చిరుత సంచారంతో గుబులు

కెలమంగలం: డెంకణీకోట సమీపంలో చిరుత సంచారంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. డెంకణీకోట సమీపంలోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన విజయ్ పనికార్ (76) గత రెండు రోజుల క్రితం తన పెంపుడు కుక్కను ఇంటి ఆవరణలో కట్టేశాడు. కుక్క అదృశ్యం కావడంతో చుట్టుపక్కల గాలించగా సమీపంలో కుక్కను ఒక జంతువు తిన్నట్లు గుర్తించి అటవీ శాఖాధికార్లకు సమాచారం ఇచ్చారు. అటవీ సిబ్బంది ఆ ప్రాంతంలో సీసీటీవీ కెమెరాలను అమర్చి నిఘా పెట్టారు. ఈ సమయంలో ఓ చిరుతపులి రెండు మేకలను లాకెళ్లినట్లు రికార్డయింది. చిరుతను బంధించాలి ప్రజలు కోరుతున్నారు.

వికసించిన బ్రహ్మ కమలం



క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరిలో నివాసముంటున్న మైథిలి అన్బుశేఖర్ ఇంటి లో ఉన్న బ్రహ్మకమలం మొక్క సోమవారం రాత్రి వికసించింది. సువాసనతో వెదజల్లుతున్న ఈ పుష్పాలను చూడటానికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

నూతన పథకాల ప్రారంభం

కెలమంగలం: కెలమంగలం సమితిలో రూ. 1.30 కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేసిన పశువైద్య కేంద్ర భవనాన్ని, నాలుగు రెవెన్యూ కార్యాలయాలను మంగళవారం ఆహార భద్రతా శాఖ మంత్రి చక్రపాణి ప్రారంభించారు. మొదటగా కెలమంగలం పట్టణ పంచాయతీలో రూ. 48.35 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసిన పశువైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రూ. 82.26 లక్షల ఖర్చుతో నిర్మించిన బాగలూరు, ఉరిగం రెవెన్యూ కార్యాలయాలు, మంచుకొండపల్లి, ఉరిగంలో నర్సుల గృహ వసతులను ప్రారంభించారు. డెంకణీకోట పట్టణ పంచాయతీలో రూ. 1.80 కోట్ల ఖర్చుతో సీసీ రోడ్డు, మురికి కాల్వల ఏర్పాటుకు భూమిపూజ చేశారు. హోసూరు, డెంకణీకోట డిపోల నుంచి విద్యార్థుల గెట్టూరు, పూమరతుగుళి, బెన్నికల్, కుక్కలపల్లి, తిరుమలగౌండన్ కొటాయ్, పాతకోట, దాసనపురం గ్రామాలకు బస్సు వసతులను కల్పించారు. కలెక్టర్ శరయు, ఎమ్మెల్యేలు రామచంద్రన్, ప్రకాష్, హోసూరు మేయర్ ఎస్.ఏ.సత్య పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాక్సిన్ వేయించాలి

మండ్య: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలని మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్. చలువరాయ స్వామి రైతులకు సూచించారు. మంగళవారం మండ్య జిల్లా నాగమంగళ తాలూకా హరదనహళ్లి గ్రామంలో పశువుల చికిత్సాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన గాలికుంటు వేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు.

ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో మరో నలుగురు అరెస్ట్

మైసూరు: మైసూరు నగరంలోని మైసూరు వర్సిటీలో జరిగిన ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో సీసీబీ పోలీసులు మరో నలుగురు ఉద్యోగులను అరెస్ట్ చేశారు. మైసూరు వర్సిటీలో బీకాం చివరి ఏడాది కంప్యూటర్ ఇన్ బిజినెస్ ప్రశ్నాపత్రం రెండు రోజుల ముందే లీకైంది. ఈ కేసులో ఇద్దరి అరెస్ట్ చేసి విచారణ చేయగా వారి సమాచారం ఆధారంగా మంగళూరు, చామరాజనగర ప్రాదేశిక కేంద్రాల నుంచి నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేశ్యావాటికపై దాడి, ఇద్దరి అరెస్ట్

మైసూరు: వేశ్యా కేంద్రంపై మైసూరు హెబ్బాళ పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి నలుగురు మహిళలను రక్షించారు. మసాజ్ సెంటర్ పేరుతో వేశ్యావాటిక నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఇద్దరు నిర్వాహకులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

యశవంతపుర: కలబురగి రింగ్‌రోడ్డులోని నాగనహళ్లి వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. అలీ అబ్బాస్, ఇర్ఫాన్‌లు మృతి చెందారు. పదో తరగతి చదువుతున్న వీరు పుట్టిన రోజు వేడుక జరుపుకోవడానికి ఇద్దరు బైక్‌పై వేగంగా వెళ్తుండగా అదుపుతప్పి రైల్వే వంతెన వద్ద డివైడర్‌ను ఢీకొంది. ఇద్దరికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కలబురగి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పశు సంపదను మరింత అభివృద్ధి చేస్తాం : సీఎం

మైసూరు: రాష్ట్రంలో పశు సంపదను మరింత అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. మంగళవారం ఉత్తనహళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పశువులకు రోగాలు, కాలుబాయి జ్వరానికి వ్యాక్సిన్ వేసే కార్యక్రమం, పశు చికిత్సలయం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ...పాల ఉత్పత్తిదారులు సహకార రంగం ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని, ఇందుకోసం పాల సమాఖ్య కూడా ఏర్పాటు చేసుకున్నారని సీఎం చెప్పారు.

ఆడ దూడల జననానికి ఇంజెక్షన్ :

ఇదే కార్యక్రమంలో పాల్గొన్న పశు సంవర్ధక శాఖ మంత్రి వెంకటేశ్ మాట్లాడుతూ...ఆడ దూడలు మాత్రమే పుట్టడానికి ఇంజెక్షన్ పశు సంవర్ధక శాఖ ఇంజెక్షన్ సిద్ధం చేసిందని తెలిపారు. ఈ ఇంజెక్షన్ వల్ల 95 శాతం ఆడ దూడలు పట్టడానికి సాధ్యమని, దీని ధర రూ. 250 మాత్రమేనని, రైతులు కొనుగోలు చేయవచ్చన్నారు. రాష్ట్రంలో 290 పశు అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు.

ఉసురు తీసిన గొడవలు

క్రిష్ణగిరి: భార్యాభర్తలు గొడవపడి ఇరువురూ ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా భర్త మరణించాడు. ఈ ఘటన ఊత్తంగేరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి కామరాజ్‌నగర్‌కు చెందిన తిరునావుకరసు (27), ఇతని భార్య పవిత్ర (19). వీరికి గత మూడేళ్ల క్రితం పెళ్లి జరిగి ఓ బాలుడున్నాడు. దంపతులు తరచూ పోట్లాటకు దిగేవారు. సోమవారం రాత్రి కూడా కొట్లాడి ఆవేశంలో ఉరి వేసుకున్నారు. గమనించిన స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొనేలోపు తిరునావుకరసు మృతి చెందాడు. ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న పవిత్రను కిందకు దించి ఊత్తంగేరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కావేరికి మద్దతుగా..



విజయపుర (బెంగళూరు గ్రామీణ): తమిళనాడుకు కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ విజయపుర పట్టణంలోని అంకతట్టి నంజుండప్ప సర్కిల్ వద్ద హీరో దర్శన్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమిళనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో అధ్యక్షుడు కిరణ్, ఉపాధ్యక్షుడు మదన్, సభ్యులు పాల్గొన్నారు.

టైలర్ ఆత్మహత్య

హోసూరు: కుటుంబ కలహాలతో టైలర్ ప్రాణాలు తీసుకున్న ఘటన మత్తిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. వివరాల మేరకు హోసూరు సమీపంలోని పూనపల్లి గ్రామానికి చెందిన టైలర్ వినయ్‌కుమార్ (38) ఇతనికి తాడుగు అలవాటుండేది. దీంతో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. సోమవారం రాత్రి ఏర్పడిన గొడవల్లో ఆవేశం చెందిన వినయ్‌కుమార్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మీడియా పాయింట్

భువనేశ్వరీ ఈ ప్రశ్నలకు బదులివ్వు



తప్పుచేసిన చంద్రబాబును ఆధారాలతోనే అరెస్ట్ చేశారు. సానుభూతి కోసం భువనేశ్వరి ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబు తప్పు చేయనపుడు ధైర్యంగా సీబీఐ, ఈడీతో విచారణ చేయమని ఎందుకు అడగడం లేదు. తమ కంపెనీలో 2 శాతం అమ్మితేనే రూ. 400 కోట్లు వస్తాయని భువనేశ్వరి చెబుతున్నారు. ఈ లెక్కన మీ ఆస్తుల విలువ రూ. 20 వేల కోట్లు. చంద్రబాబు ఎన్నికల అఫిడవిట్‌లో మీరు చెప్పిన ఆస్తి రూ. 2 వేల కోట్లు. రెండు ఎకరాల నుంచి రూ. 20 వేల కోట్లకు మీ ఆస్తులు ఎలా పెరిగాయి. పాలమ్మితేనే 20 వేల కోట్లు వచ్చాయా? జైల్లో సదుపాయాలు ఉన్నాయో లేదో చంద్రబాబుని అడిగితే చెబుతారు. ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తున్నామని చంద్రబాబు, భువనేశ్వరి చెబితే జనం నవ్వుతున్నారు. ఏపీ ప్రజలెవరూ చంద్రబాబుకు సపోర్ట్ చేయడం లేదు. పక్కరాష్ట్రం నుంచి వచ్చిన వారే మీకు సపోర్ట్. భువనేశ్వరి, పవన్ కళ్యాణ్, బ్రహ్మణి కూడా పక్కరాష్ట్రం నుంచి వచ్చిన వారే. తప్పుచేసిన చంద్రబాబు నిజాలు ఒప్పుకోవాలి. తాను దోచిన సొమ్మును ప్రజలకు పంచాలి.

– ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

పార్టీ మారితే రూ. 100 కోట్లు ఇస్తామన్నారు



గత ప్రభుత్వంలో తిరుపతి ఎంపీగా ఉన్న నన్ను వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి మారాలని ఎన్నో ప్రలోభాలకు గురిచేశారు. పార్టీ మారితే రూ.100 కోట్ల వరకూ ఇవ్వాలని చూశారు. పార్టీ మారనని చెప్పడంతో ప్రజా సమస్యలపై మాట్లాడటానికి కూడా చంద్రబాబు నాకు అవకాశం ఇవ్వలేదు. పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి హామీలు ప్రకటిస్తుంటే.. అవన్నీ చేయగలరా అనుకున్నాను. సీఎం అయిన తర్వాత హామీలు నెరవేరుస్తుంటే ఆశ్చర్యపోయా. జగన్ మేనిఫెస్టోకి విలువనిచ్చి విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. అమ్మఒడి పెట్టడం వల్ల నా జీవితాశయం నెరవేరింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ఉండాలన్న నా చిన్ననాటి కల జగన్ వల్ల నెరవేరింది. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చిన సీఎంకు చేతులెత్తి నమస్కరిస్తున్నా. ఒక పౌరుడిగా, ఒక దళితుడిగా ఎంతో గర్వపడుతున్నా. మళ్లీ.. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే మన తలరాతలు మారుతాయి. దళితుల్లో ఎవరూ పుట్టకూడదని మమ్మల్ని చంద్రబాబు ఎంతో అవమానించాడు. ఈ ప్రభుత్వంలో కేవలం దళితులకే ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ. 70 వేల కోట్ల మేర మేలు జరిగింది. స్వరాజ్యమైదానంలో అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేస్తుండటం చాలా ఆనందంగా ఉంది.

– ఎమ్మెల్యే వరప్రసాద్


ఇరుపక్షాల తరఫున మేమే



రాష్ట్రంలో ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించడం లేదు. మంచి బిల్లులపై చర్చ జరుగుతున్నప్పుడు సభలో లేకుండా పోయారు. సభకు రాకపోవడం వల్ల టీడీపీ నేతలు విలువైన సమయాన్ని కోల్పోయారు. టీడీపీ నేతల బాధ్యతారాహిత్యాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ప్రతిపక్షం లేకపోయినా సభలో ఇరుపక్షాల తరఫున మేమే అన్ని అంశాలపై చర్చిస్తున్నాం. భవిష్యత్తులోనైనా సభా సమయం వృథా కాకుండా టీడీపీ నేతలు సహకరించాలని కోరుతున్నాం.

– ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఏపీ సివిల్ కోడ్ చట్ట సవరణకు అసెంబ్లీ ఆమోదం



సాక్షి, అమరావతి: దేశంలో న్యాయ వ్యవస్థ ఒకే విధంగా ఉండాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా ఏపీ సివిల్ కోడ్ చట్ట సవరణ బిల్లును శాసన సభ ఆమోదించింది. సీఎం వైఎస్ జగన్ తరఫున పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ సవరణ బిల్లును మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. మంత్రి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా న్యాయమూర్తుల పదవులు ఒకే విధంగా ఉండేలా చట్ట సవరణ చేశామన్నారు. ఇప్పటి వరకు జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జిగా పిలుస్తున్నవారిని..ఇకపై సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్/సీనియర్ డివిజన్)గా సంబోధించాలని చెప్పారు.

హిందూ ధర్మ పరిరక్షణకు సీఎం జగన్ కృషి



ధూపదీప నైవేద్యం కార్యక్రమం కింద 4,750 ఆలయాలకు లబ్ధి

- నిషేధిత భూముల జాబితా త్వరలో సవరిస్తాం
- డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు



సాక్షి, అమరావతి: హిందూ ధర్మ పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్ దృఢ సంకల్పంతో కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. దేవాలయాల్లో ధూపదీప నైవేద్య కార్యక్రమాన్ని ఆయన బలోపేతం చేశారన్నారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు డిప్యూటీ సీఎం సమాధానం ఇచ్చారు. ధూపదీప నైవేద్య కార్యక్రమాన్ని 2006లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టారని, గ్రామీణ ప్రాంతాల్లో రూ.30 వేల కంటే తక్కువ వార్షికాదాయం ఉన్న 1,401 దేవాలయాలకు దీని ద్వారా సాయం అందించేవారని వివరించారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కేవలం 150 ఆలయాలను మాత్రమే ఈ కార్యక్రమంలోకి కొత్తగా తెచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ.30 వేల వార్షికాదాయ పరిమితిని రూ.లక్షకు పెంచి, 2,978 దేవాలయాలకు అదనంగా లబ్ధి చేకూర్చామన్నారు. ప్రస్తుతం 4,750 దేవాలయాలకు ఈ కార్యక్రమం ద్వారా నిధులు సమకూరుస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం ఏటా రూ.28.50 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార కాలనీల్లో 2,961 దేవాలయాల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు.ఈ దేవాలయాల నిర్వహణకు ధూపదీప నైవేద్య కార్యక్రమాన్ని అమలు చేస్తామని చెప్పారు.

- అర్చకులకు ఇచ్చే గౌరవ వేతనాల్లో వ్యత్యాసాలు ఉంటున్నాయని వాటిని సరిచేయడంతో పాటు, అర్చకులు, పురోహితులకు దేవదాయ శాఖ నుంచి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు.
- వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ.. వినుకొండలోని కొండపై దేవాలయం నిర్మాణంలో భాగంగా ఘాట్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేసిందన్నారు.
- రాష్ట్రంలో ఇంకా ఎక్కడైనా ధూపదీప నైవేద్యం కార్యక్రమం పరిధిలోకి రాకుండా మిగిలిపోయిన ఆలయాలు ఉంటే వాటికి ఈ కార్యక్రమాన్ని వర్తింపజేయాలని పొన్నూరు ఎమ్మెల్యే కె. రోశయ్య విజ్ఞప్తి చేశారు.
- విజనరీనని గొప్పలు చెప్పే చంద్రబాబు తాను సీఎంగా ఉండగా సొంత జిల్లా చిత్తూరు జిల్లాలో దేవాలయాల అభివృద్ధికి చేసింది శూన్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బి. మధుసూదన్ రెడ్డి ఎద్దేవా చేశారు.
- అన్యాక్రాంతమైన దేవాలయాల భూములను పరిరక్షించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు.

సర్వే నంబర్లు సబ్‌డివిజన్ కాకపోవడంతోనే ఆలస్యం

సర్వే నంబర్ల సబ్ డివిజన్ కాకపోవడంతోనే నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపు ఆలస్యమవుతోందని మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాల వల్ల రైతుల భూములు దేవదాయ భూములుగా నమోదైనట్టు పేర్కొన్నారు. ఐఎఫ్‌ఆర్, ఇనాం, ఆర్ఎస్ఆర్ వంటి భూములను క్షుణ్ణంగా పరిశీలించి నిషేధిత జాబితాను సవరిస్తామని చెప్పారు. రైతుల భూములను దేవదాయ భూములుగా నమోదు చేసిన అధికారులపై చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. మంత్రి వివరణను కందుకూరు ఎమ్మెల్యే ఎం.మహీధర్‌రెడ్డి ఆక్షేపించారు. చిన్న, సన్నకారు రైతుల భూములు రెవెన్యూ శాఖను అడిగే ఎండోమెంట్‌లో కలుపుకున్నారా? అని ప్రశ్నించారు. నిషేధిత జాబితా నుంచి తొలగించమంటే రెవెన్యూ శాఖను బాధ్యులను చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం చేసిన పాపానికి ఎనిమిదేళ్లుగా రైతులు భూముల హక్కులు బదలాయించుకోలేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కందుకూరు అర్బన్ పరిధిలో 15 ఎకరాల దేవదాయ భూమి మాత్రమే ఉంటే.. 600 ఎకరాలకు పైగా రైతుల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణలకు గురైన దేవదాయ భూములను పరిరక్షించకుండా.. రైతుల భూములను అన్యాయంగా నిషేధిత జాబితాలో చేరుస్తున్నారంటూ ఆరోపించారు. దీనికి మంత్రి కొట్టు సత్యనారాయణ స్పందిస్తూ వీలైనంత త్వరగా నిషేధిత జాబితాను సవరిస్తామన్నారు.

రాష్ట్రంలో త్వరలో కులగణన

- వందేళ్ల తర్వాత కులగణన చేస్తోన్న తొలి రాష్ట్రం ఏపీనే
- అసెంబ్లీలో అధ్యయన కమిటీ నివేదికను ప్రవేశపెట్టిన మంత్రి చెల్లుబోయిన



సాక్షి, అమరావతి: వందేళ్ల తర్వాత దేశంలోనే తొలిసారిగా ఏపీలో కులగణన చేపట్టబోతున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చెప్పారు. సమాజంలో అణగారిన వర్గాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఆరోగ్య, విద్యా ఫలాలు అందేందుకు ఈ కులగణన ఎంతగానో దోహదపడనుందన్నారు. వందేళ్ల అనంతరం రాష్ట్రంలో త్వరలో కులగణన చేపట్టాలని సీఎం జగన్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కులగణన నిర్వహణపై సీఎం ఆదేశాల మేరకు ఆరుగురు సీనియర్ ఐఏఎస్‌లతో ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ నివేదికను మంగళవారం అసెంబ్లీలో మంత్రి ప్రవేశపెట్టారు. ఆయన మాట్లాడుతూ..కులగణన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఈ కమిటీ నివేదించిందన్నారు. ఈ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం సీఎం తనకు కల్పించడం నిజంగా తన అదృష్టమని మంత్రి చెప్పారు. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని సమర్థించాలని ప్రతిపక్షాలను కోరారు. త్వరలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా నిష్పాక్షికంగా కులగణన ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు.

సీఎం జగన్‌ది సాహసోపేతమైన నిర్ణయం

భారత్‌లో 1872లో తొలిసారిగా జనాభా లెక్కల సేకరణ జరిగిందని, ఆ తర్వాత 1931 వరకూ ప్రతి పదేళ్లకోసారి జనాభా లెక్కల సేకరణ సజావుగా సాగిందని, 2వ ప్రపంచ యుద్ధం కారణంగా 1941లో జరిగిన జనాభా లెక్కల వివరాలను వెల్లడించలేదని మంత్రి చెప్పారు. స్వాతంత్ర్యానంతరం 1951 నుంచి ప్రతి పదేళ్లకోసారి జనగణన జరుగుతోందే తప్ప కుల గణన జరగడం లేదన్నారు. ప్రతీ పదేళ్లకోసారి పెరిగే జనాభా దామాషా ప్రకారం కులాల వారీగా జనాభాను అంచనా వేస్తున్నామని చెప్పారు. పూర్తిస్థాయిలో కులగణన చేపట్టకపోవడం వలన పెరుగుతున్న జనాభా దామాషా సామాజిక, రాజకీయ, ఆర్థిక సంక్షేమ ఫలాలు అణగారిన వర్గాల వారికి పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలో కులగణన చేపట్టాలని సంకల్పించారని, స్వాతంత్ర్యానంతరం దేశంలో మరే రాష్ట్రంలోనూ ఏ సీఎం ఇలాంటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకోలేదన్నారు. కాగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రి చెల్లుబోయిన మాట్లాడుతూ..కులగణన వల్ల ప్రజలకు జరిగే మంచిని అడ్డుకోవద్దని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. కులగణన అంశాన్ని శాసనసభలో ప్రవేశపెట్టడం చరిత్రాత్మకమన్నారు.

జల వనరుల శాఖపై 18న సమీక్ష

శాసనసభ హామీల అమలు కమిటీ వెల్లడి

సాక్షి, అమరావతి: జల వనరుల శాఖపై వచ్చే నెల 18వ తేదీన సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు శాసనసభ హామీల అమలు కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో హామీల అమలు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలు చాలా వరకు పరిష్కారం అయ్యాయని తెలిపారు. అందులో జల వనరుల శాఖలో 132 అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించామని పేర్కొన్నారు. అందుకే సమీక్షా సమావేశం నిర్వహించి త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యేలు అన్నాబత్తుల శివకుమార్, భాగ్యలక్ష్మి, శ్రీనివాసరావు, మేడా మల్లికార్జునరెడ్డి, పర్వత పూర్ణప్రసాద్ పాల్గొన్నారు.



‘కులగణన’ నివేదిక సభలో ప్రవేశపెట్టడంపై హర్షం

సీఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన బీసీ మంత్రులు

సాక్షి, అమరావతి: కులగణన అంశానికి సంబంధించిన నివేదిక శాసనసభలో ప్రవేశపెట్టడంపై బీసీ మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శాసనసభలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో మంగళవారం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ,, ఎమ్మెల్యేలు ఎం శంకరనారాయణ, పొన్నాడ సతీష్ ఉన్నారు.


ముస్లింల సంక్షేమంలో సరికొత్త చరిత్ర

- తండ్రి కంటే వైఎస్ జగన్ రెండు అడుగులు ముందుకు
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా కితాబు
- మండలిలో సభ్యుల ప్రశ్నలకు బదులిచ్చిన మంత్రులు బొత్స, అంబటి, కాకాణి
- శాసనమండలిలో 11 బిల్లులకు ఆమోదం



సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలో ముస్లిం సమాజానికి మేలు చేసిన గొప్ప నాయకుడిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, తండ్రి కంటే రెండు అడుగులు ముందుకేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముస్లిం సంక్షేమంలో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజద్ బాషా కితాబిచ్చారు. మంగళవారం జరిగిన శాసన మండలి క్వశ్చన్ అవర్‌లో సభ్యుల ప్రశ్నలకు మంత్రులు బదులిచ్చారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ముస్లింల సంక్షేమానికి రూ. 2,665 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని, సీఎం జగన్ నాయకత్వంలో 2019 జూన్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ. 12,366 కోట్లకుపైగా ఖర్చు చేసినట్టు లెక్కలతో సహా వివరించారు. గత ప్రభుత్వం హయాంలో ఉర్దూ అకాడమీ నిర్వహణలో రూ. 14 కోట్ల అవినీతి జరిగిందని, దీనిపై సీఐడీ విచారణ కూడా జరిగిందన్నారు. ఉర్దూ అకాడమీకి చెందిన 36 కంప్యూటర్ కేంద్రాలను పునరుద్ధరించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా శిక్షణ ఇస్తామన్నారు. రానున్న రోజుల్లో మైనారిటీ స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేసి గ్రూప్ 1, గ్రూప్ 2 పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని అంజద్‌బాషా వెల్లడించారు.

వర్సిటీ ఖాళీలు త్వరలో భర్తీ: మంత్రి బొత్స



విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో ఖాళీల విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి ఆయన అనుమతితో త్వరలో భర్తీ ప్రక్రియ చేపడతామన్నారు.


రాష్ట్రంలో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా 2019–20 నుంచి 2022–23 వరకు 1,54,50,580 మంది విద్యార్థులు లబ్ధి పొందారని, ఇందుకోసం ప్రభుత్వం రూ. 6,262.29 కోట్లు ఖర్చు చేసిందన్నారు. విద్యార్థులకు వారానికి 16 రకాల పదార్థాలను అందిస్తున్నామన్నారు.

ఆర్బీకేల ద్వారా యంత్రసేవా పథకం: మంత్రి కాకాణి



వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే) ద్వారా వైఎస్సార్ యంత్రా సేవా పథకాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. అత్యంత పారదర్శకంగా ఈ–క్రాప్ ద్వారా రైతులకు బీమా వర్తింపజేస్తున్నామన్నారు. కౌలు రైతులను కూడా అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని, కౌలుదారులకు కార్డులు జారీ చేసేలా ప్రత్యేక కార్యాచరణ (స్పెషల్‌డ్రైవ్) చేపడతామన్నారు.

ప్రతి రూపాయీ సద్వినియోగం: మంత్రి అంబటి




జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. నీటిపారుదల ప్రాజెక్టులు వేగంగా నిర్మాణం జరగడంలేదనే అపోహ వద్దన్నారు. ప్రతి రూపాయిని ఈ ప్రభుత్వం బాధ్యతయుతంగా సద్వినియోగం చేస్తూ ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేస్తుందన్నారు. పోలవరం నిర్మాణం జాప్యానికి గత టీడీపీ ప్రభుత్వ నిర్వాకమే కారణమన్నారు. ప్రోటోకాల్ ఉల్లంఘించి కాఫర్ డ్యామ్ పనులు అసంపూర్తిగా చేయడం వల్లే డయాఫ్రంవాల్ కొట్టుకుపోయిందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అప్పటి ప్రభుత్వం వేసిన అంచనాలు మరింత పెరిగాయని, సవరించిన అంచనాలకు కేంద్రం ఆమోదంతో పనులు వేగవంతం చేస్తామని అంబటి స్పష్టం చేశారు.

మండలిలో సభ్యులు వరుదు కళ్యాణి, మొండితోక అరుణ్‌కుమార్, మర్రి రాజశేఖర్, రఘురాజు, కేఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ షాబ్జీ, అనంత సత్యఉదయభాస్కర్ పలు అంశాలను ప్రస్తావించారు. కాగా, అసెంబ్లీలో ఆమోదం పొందిన 11 బిల్లులను మండలిలో సంబంధిత మంత్రులు ప్రవేశపెట్టడంతో ఏకగ్రీవంగా ఆమోదం లభించింది.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’తో ప్రజలందరికీ ఆరోగ్యం

ఇది సీఎం వైఎస్ జగన్ సత్సంకల్పం

- ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ ద్వారా 1.60 కోట్ల కుటుంబాలకు వైద్య సేవలపై అవగాహన
- అసెంబ్లీలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమం చేపట్టారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఐదు దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం శాసన సభలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి బదులిస్తూ.. తొలి రెండు దశల్లో 1.60 కోట్ల కుటుంబాలకు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. బ్రోచర్ల ద్వారా వైద్యసేవలు పొందే విధానాన్ని వివరిస్తామన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అందించే వైద్య సేవలను వివరించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటారన్నారు. బాధితులను గుర్తించిన అనంతరం ఇంటి వద్దే స్పెషలిస్టు వైద్యులతో చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీ కింద రూ.9 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారన్నారు. ఒకప్పుడు 919 ఉండే నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను ఏకంగా 2,283కు పెంచారని తెలిపారు. ఇందులో 204 ఆస్పత్రులతో చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లోనూ అత్యాధునిక వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. క్యాన్సర్ వైద్యంలో 638 ప్రొసీజర్స్‌ను చేర్చడంతో పాటు రూ.600 కోట్లు ఖర్చు చేశామన్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగులను ఇబ్బంది పెట్టినా, డబ్బులు వసూలు చేసినా 104కు ఫిర్యాదు చేస్తే ఆ హాస్పిటల్స్ వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు: ప్రభుత్వ విప్ కోరముట్ల



అనంతరం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ చేపట్టిన చర్యల ఫలితంగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. అందుకే పీహెచ్‌సీలు, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో 300కు పైగా ఓపీలు నమోదవడంతో పాటు గుండె, క్యాన్సర్ వంటి వ్యాధులకు వైద్యం ఉచితంగా అందుతోందని, ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతోందని చెప్పారు. బద్వేల్ సీహెచ్‌సీలో ఆర్థోపెడిక్ సర్జన్ పోస్టు మంజూరు చేయాలని, ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ కోరారు. సీఎస్ఆర్ కింద పూర్తయిన డయాలసిస్ యూనిట్ భవనాన్ని ప్రభుత్వం తీసుకుని వెంటనే వైద్య సేవలు ప్రారంభించాలని కోరారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంతో బలోపేతం చేసిందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి తెలిపారు. ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి పథకాన్ని చేరువ చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 1059 ప్రొసీజర్లు ఉంటే ఈ ప్రభుత్వం 3,257కు పెంచిందన్నారు.

నెట్‌వర్క్ ఆస్పత్రులపై దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే జగన్మోహనరావు



నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో కొన్ని ప్రొసీజర్స్‌కు ఆరోగ్యశ్రీపై వైద్యం చేయట్లేదని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో పేదలు అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్నారని, ఆ తర్వాత సీఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తు చేసుకుంటే ఆరోగ్యశ్రీ ప్రొసీజర్స్‌లో ఉండటంతో సహాయ నిధిని విడుదల చేయట్లేదని తెలిపారు. ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సదుపాయాలపై తనిఖీలు చేయాలని, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలు, అక్కడ లభించే ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై అవగాహన కల్పించేలా దృష్టి సారించాలని కోరారు.

ఇలాంటి ఆస్పత్రులపై చర్యలు తీసుకోండి: ఎమ్మెల్యే తిప్పేస్వామి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసి పేదలకు ఉచిత వైద్యం అందించడమే కాకుండా, డిశ్చార్జి తర్వాత ఆసరా కింద రూ.5 వేలు ఇచ్చి, స్థానిక ఏఎన్ఎంల ద్వారా ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపడుతున్నారని మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. అయితే, కొన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు రోగుల దగ్గర, ఆరోగ్యశ్రీలోనూ రెండు రకాలుగా డబ్బులు వసూలు చేస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

108లను కర్ణాటకకూ నడపండి: ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం ప్రజలు వైద్యం కోసం 150 కిలోమీటర్ల దూరంలోని అనంతపురానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల సమీపంలోనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారిలోనూ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కోరారు. రోడ్డు ప్రమాదం, ఇతర అత్యవసర సమయాల్లో 108 అంబులెన్సులు కర్ణాటకకు తీసుకెళ్లడంలేదని, ఇకపై 108లను కర్ణాటకకు కూడా అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రిని వేగంగా పూర్తి చేయాలని కోరారు.

ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలు

- సచివాలయాలతో సీఎం వైఎస్ జగన్ నూతన ఒరవడి
- దేశానికే ఆదర్శంగా నిలిచిన వ్యవస్థ ఇది
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నూతన ఒరవడిని తీసుకొచ్చారని డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల గుమ్మం వద్దకే తీసుకెళ్లారని తెలిపారు. మంగళవారం శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు ఎమ్మెల్యేల ప్రశ్నలకు డిప్యూటీ సీఎం సమాధానమిచ్చారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత వివక్షకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని తెలిపారు. సచివాలయాల్లో సేవల పరిధిని మరింత విస్తృతం చేయాలని సీఎం జగన్ నిర్ణయించి ఇటీవలే రిజిస్ట్రేషన్లను ప్రారంభించినట్టు వివరించారు. ఇందుకోసం 2 వేల మందికిపైగా ఉద్యోగులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై శిక్షణ ఇచ్చారన్నారు. ప్రజల్లో ఎవరికైనా పథకాలు, కార్యక్రమాలు అందకపోతే వారికి మేలు చేసేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ప్రత్యేకంగా సురక్ష క్యాంప్‌లు నిర్వహించి ఒక్క రూపాయి రుసుము లేకుండా పూర్తి ఉచితంగా 95 లక్షల సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. రుసుముల నుంచి మినహాయింపు ఇవ్వడం ద్వారా రూ.46 కోట్ల మేర లబ్ధిదారులకు ప్రభుత్వం మేలు చేసిందన్నారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పి. ఉమాశంకర్ గణేశ్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పీలేరు ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడారు.

చంద్రబాబు కుంభకోణాన్ని హైకోర్టు నమ్మింది

- అందుకే క్వాష్ పిటిషన్‌ను తిరస్కరించింది
- కుంభకోణం జరగలేదని చంద్రబాబు వాదించడం లేదు
- 17ఏ వర్తించదని మాత్రమే వాదిస్తున్నారు
- స్కిల్ కుంభకోణంపై శాసనమండలి చర్చలో తూమాటి మాధవరావు



సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం నైపుణ్య కేంద్రాల పేరుతో కుంభకోణం చేసిందన్న విషయాన్ని హైకోర్టు కూడా నమ్మిందని.. అందుకే చంద్రబాబు వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పేర్కొన్నారు. శాసన మండలిలో మంగళవారం స్కిల్ కుంభకోణంపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా మాధవరావు మాట్లాడారు. రెండున్నరేళ్ల దర్యాప్తు చేసి.. 140 మందిని విచారించి.. పక్కా సాక్ష్యాధారాలు సేకరించిన తర్వాతే సీఐడీ చంద్రబాబును అరెస్ట్ చేసిందన్నారు. చంద్రబాబు నిజాయితీపరుడని, రాజకీయ కక్షతోనే ఆయనను అరెస్ట్ చేశారంటూ టీడీపీ నాయకులు చేస్తున్న వాదనను ఆయన కొట్టిపారేశారు. సీఐడీ విచారణలో సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే అని నిర్ధారించుకున్న తర్వాతే ఆయనను అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. ఈ కుంభకోణం వాస్తవంగా 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే వెలుగులోకి వచ్చిందన్నారు. జీఎస్టీ ఎగ్గొట్టారంటూ నోటీసులు వస్తే.. దానిపై దర్యాప్తు చేయకుండా ఈ కుంభకోణాన్ని కప్పిపుచ్చుకోవడానికి నోట్ ఫైల్స్‌ను మాయం చేసిన ఘనులు వీరంటూ విమర్శించారు.

ముసలోడు నేరం చేస్తే ఒప్పా?

73 ఏళ్ల వ్యక్తిని అవినీతి కేసులో అరెస్ట్ చేశారని టీడీపీ నాయకులు గగ్గోలు పెడుతున్నారని, 60 ఏళ్లు దాటిన వ్యక్తులు తప్పు చేసినా వదిలేయాలని చట్టంలో ఎక్కడైనా ఉందా అని మాధవరావు ప్రశ్నించారు. చంద్రబాబు తరఫు న్యాయవాదులు కూడా చంద్రబాబు అవినీతి చేయలేదని ఎక్కడా వాదించడం లేదని, సెక్షన్ 17ఏ ఆయనకు వర్తించదంటున్నారని చెప్పారు. ఐటీ అధికారులు నోటీసులు ఇస్తే వాళ్లకు నోటీసులు ఇచ్చే అధికారం లేదంటూ సాంకేతిక సమస్యలు చూపించి తప్పించుకుంటున్నారని, అరెస్ట్ చేస్తానంటే జైల్‌లో కాదు హౌస్ అరెస్ట్ చేయండని విచిత్రమైన వాదనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

నిందితునికి పురందేశ్వరి, పవన్ మద్దతు ఇవ్వడమేంటి!

అవినీతి కేసులో జైలు పాలైన నిందితుడు చంద్రబాబుకు మద్దతుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిలబడటాన్ని మాధవరావు తప్పుపట్టారు. చంద్రబాబు అవినీతిపరుడంటూ పురందేశ్వరి భర్త ఏకంగా పుస్తకం రాస్తే.. పురందేశ్వరి మాత్రం చంద్రబాబు నిజాయితీపరుడని అనటం విడ్డూరంగా ఉందన్నారు. తరచూ పార్టీలు మార్చే పురందేశ్వరి మాటలను పట్టించుకోనవసరం లేదన్నారు. చంద్రబాబు అవినీతిలో పవన్ కళ్యాణ్‌కు వాటా ఉందని, అందుకే చంద్రబాబుతో ములాఖత్ అయి మద్దతు ప్రకటించారన్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
బుధవారం ॥ 27-9-2023

'చౌద్‌వీ కా చాంద్ హో
యా ఆఫ్‌తాబ్ హో'...
ఈ చందమామ తెలుగు నేల మీదే
ఉదయించింది.
'ఏరువాక సాగారోరన్నో చిన్నన్న'...
తప్పెట దరువుకు ఆ పాదాలు
ఈ నేల మీదే చిందేశాయి.
'మారాయ్.. మారాయ్... మారాయ్..
రోజులు మారాయ్'...
తెలుగువారి పుణ్యాన ఒక మహత్తు జరిగి
వహిదా రెహమాన్ రోజులే
మారిపోయాయి.
భారతీయ వెండితెర సౌందర్యమే
మారిపోయింది.
తనకు ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే
ప్రకటించారని తెలిశాక
ఆ మురిపమైన నటి
అనుకునే మాట ఒకటే-
ఆజ్ ఫిర్ జీనే కి తమన్నా హై
ఆజ్ ఫిర్ మర్‌నే కా ఇరాదా హై..



ఫాల్కే గ్రహీత

చౌద్‌వీ కా చాంద్ హో

● ఖదీర్

విశాఖపట్నంలో ఈపాటికి సంబరాలు జరగాలి.

తమ ఊరి నటికి దాదాసాహెబ్ ఫాల్కే వచ్చినందుకు.

ఆ సంగతి వారికి తెలుసో లేదో.

తెలుగు వారికి వహిదా రెహమాన్ తమ నటి అని తెలుసో లేదో.

• • •

వహిదా రెహమాన్‌కు పదీ పదకొండేళ్లు ఉన్నప్పుడు ఆమె తండ్రి రెహమాన్‌కు మునిసిపల్ కమిషనర్‌గా విశాఖ ట్రాన్స్‌ఫర్ అయ్యింది. మెడ్రాస్ ప్రెసిడెన్సీ ఉద్యోగి అయిన రెహమాన్ తమిళనాడు, ఆంధ్రాల్లో పని చేసిన దక్కన్ ముస్లిం. ఆమె తల్లిది ఉత్తరాంధ్ర కావచ్చు. ఆమె మేనమామ డాక్టర్ ఫిరోజ్ అలీ గంజాంలో పేరు మోసిన డాక్టరు, సామాజిక కార్యకర్త. సినిమా నటిగా అవకాశం పొందే వరకు అంటే తన 17వ ఏట వరకూ వహిదా రెహమాన్ తొలిప్రాయపు రోజులు విశాఖలోనే గడిచాయి. అక్కడి సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో చదువుకుంది. అది కాదు- ఆమె జీవితాన్ని మార్చిన ఘటన అక్కడే జరిగింది. అదీ- నాటి మద్రాసు ముఖ్యమంత్రి సి.రాజగోపాలాచారి విశాఖ రావడం. ఆ సందర్భంగా వహిదా రెహమాన్ నాట్య ప్రదర్శన ఇవ్వడం.

• • •

ముఖ్యమంత్రి వచ్చినప్పుడు ఏవో ఒక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. నాటి వాల్తేరు కలెక్టర్ తన సహోద్యోగైన రెహమాన్‌ను 'నీ కుమార్తెలు భరతనాట్యం చేస్తారు కదా. వారి



ప్రదర్శన ఏర్పాటు చేద్దాం' అని కోరాడు. అందుకు రెహమాన్ అంగీకరించాడు. అప్పటికే వహిదా, ఆమె సోదరి సయిదా భరతనాట్యం నేర్చుకున్నారు. మొత్తం నలుగురు కూతుళ్లలో అందరి కంటే చిన్నది వహిదా. భరతనాట్యం నేర్చుకోవాలని పట్టుపట్టి నేర్చుకుంది. అయితే గురువు ఆమెకు అంత సులువుగా నేర్పలేదు. 'ముసల్మానులు ఈ విద్య నేర్చుకోగలరా? పౌరాణిక సందర్భాలను అభినయించగలరా?' అని సందేహం వ్యక్తం చేశాడు. అయినా వహిదా పట్టు విడువలేదు. మరోవైపు ముస్లింలు భరతనాట్యం నేర్చుకోవడం ఏమిటని అయినవారి ఎత్తిపొడుపులు. 'కళకు మతం లేదు' అని తేల్చిన రెహమాన్ కుమార్తెలను భరతనాట్యానికి ప్రోత్సహించాడు. కాని గురువు వినడే. చివరకు వహిదా మొండిపట్టు చూసి 'నీ జాతకం పట్టుకురా' అన్నాడు. ముస్లింలలో జాతకాలు ఉండవని తెలిశాక, పుట్టిన రోజు... సమయం తెలుసుకుని ఆ గురువే జాతకం రాసి ఆశ్చర్యపోయాడు. 'ఈ అమ్మాయి నా చివరి గొప్ప శిష్యురాలు అవుతుంది' అని ఆ జాతకంతో తేల్చి పాఠాలు నేర్పించాడు. అనుకున్నట్టుగానే జరిగింది. సి.రాజగోపాలాచారి సమక్షంలో వేదిక మీద వహిదా, సయిదాలు అద్భుతమైన నాట్య ప్రదర్శన చేసేసరికి శాస్త్రాలు ఎరిగిన అంతటి రాజగోపాలాచారి కూడా తబ్బిబ్బయ్యి మెచ్చుకున్నాడు. ఆ వార్త మరుసటి రోజు అన్ని ముఖ్యమైన పేపర్లలో మొదటి పేజీల్లో వచ్చింది. వహిదా రెహమాన్ అనే పేరు కళా జగత్తుకు తెలిసింది. సినిమా జగత్తుకు కూడా.

• • •

వహిదా రెహమాన్‌కు 13 ఏళ్లు ఉన్నప్పుడు ఆమె తండ్రి జబ్బు చేసి మరణించాడు. అతని సమాధి విశాఖలోనే ఉంది. ఇటీవలే వహిదా ఆ సమాధిని దర్శించింది కూడా. తండ్రి జీవించి ఉండగా సినిమా అవకాశాలు వస్తే 'చిన్నపిల్ల... సినిమాలేమిటి' అని సున్నితంగా తిరస్కరించాడు కాని వహిదాకు 16 ఏళ్లు వచ్చేసరికి, అప్పటికే ఆమె నాట్యకళకారిణిగా కొనసాగుతూ ఉండటంతో సినిమా అవకాశాలు వస్తూనే ఉండేవి. భర్త అండ లేని తల్లి భయంతో వాటిని తిరగ్గొట్టేది. అయితే వహిదాను సినిమా తెరకు పరిచయం చేసే అవకాశం తెలుగువారి ఖాతాలో ఉంటే ఆ విధిని ఎవరు కాదనగలరు? బాంబేలో ఎల్వీ ప్రసాద్‌తో పాటు సినిమా కళను ఆకళింపు చేసుకున్న నిర్మాత సి.వి.ఆర్. ప్రసాద్ మద్రాసు వచ్చి 'రోజులు మారాయి' సినిమా తీయదల్చుకున్నాడు. స్క్రిప్ట్ వర్క్ కూడా చేశాడు. అయితే సినిమా అంతా పూర్తయ్యే సమయానికి ఇందులో ఒక సంబరాల పాట ఉండాలి... పల్లెతనపు చిందు ఉండాలి అని పించిందతనికి. దానికి మంచి డాన్సర్ కావాలంటే వహిదా రెహమాన్ పేరు తెలిసింది. అదృష్టవశాత్తు అంతకు ముందే రెహమాన్‌తో ప్రసాద్‌కు పూర్వ పరిచయం ఉంది. 'మీవారు నాకు తెలుసు. నేను ఆయన శ్రేయోభిలాషిని. మీ అమ్మాయికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. స్టేజ్ మీద చేసే డాన్సు



బంగారు కలలు

కెమెరా ముందు చేయడమే' అని వహిదా తల్లిని ఒప్పించాడు. 'రోజులు మారాయి'లో 'ఐటమ్ సాంగ్'. కొసరాజు రాశాడు. మాస్టర్ వేణు బాణీ కట్టాడు. జిక్కి పాడింది. విశాఖ నుంచి మద్రాసు వెళ్లిన వహిదా రెహమాన్ అద్భుతంగా డాన్స్ చేసింది. దేహంతో పాటు హావభావాలను కూడా కదిలించింది. మెరుపు వలే మెరిసింది. 'ఏరువాక సాగారో రన్నో చిన్నన్న'... సూపర్‌డూపర్ హిట్. ప్రేక్షకులు చిల్లర ఎగరేసిన పాట అది. సినిమా అయిపోయాక ఆపరేటర్ చొక్కా పట్టుకుని మళ్లీ ఆ పాట వేయించుకునేవారు. గువ్వలాంటి ఆ అమ్మాయి ఎవరు? వహిదా రెహమాన్! ఇంటింటి పేరయ్యింది.

• • •

నటి సావిత్రి అదృష్టం బాగుంది. వహిదా రెహమాన్ తెలుగు నుంచి పోటీలో తప్పుకుని హిందీలో వెళ్లింది. లేకుంటే ఒకవైపు సావిత్రి, మరోవైపు వహిదా రెహమాన్ తెలుగు సినిమాలను ఒక ఊపు ఊపుతుంటే ఎవరు గొప్ప అంటే ఎవరు గొప్ప అని మనం తన్నుకు చచ్చుండే వాళ్లం. 1955 జనవరిలో 'మిస్సమ్మ' విడుదలైంది. అదే సంవత్సరం ఏప్రిల్‌లో 'రోజులు మారాయి'. 'మిస్సమ్మ' సూపర్ హిట్. 'రోజులు మారాయి' కూడా. 'మిస్సమ్మ' హైదరాబాద్‌లో నెలల తరబడి ఆడుతూనే ఉంటే ఒక డిస్ట్రిబ్యూటరు దాని హిందీ రీమేక్ కోసం దర్శకుడు గురుదత్‌ని బొంబాయి నుంచి హైదరాబాద్‌కు పిలిపించాడు- సినిమా చూడటానికి. మిస్సమ్మ గురుదత్‌కు నచ్చలేదు. కాని వహిదా రెహమాన్‌ను అదే సమయంలో రోజులు మారాయి ప్రమోషన్ కోసం మద్రాసు నుంచి పిలిపిస్తే ఆమె కారు చుట్టూ మూగిన జనాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. 'ఎవరు ఈ అమ్మాయి' అని అడిగితే 'వహిదా రెహమాన్' అని చెప్పారు. గురుదత్ ఆమెను అదే డిస్ట్రిబ్యూటర్ ఆఫీస్‌లో కలిశాడు. 'ఉర్దూ తెలుసా' అని మాత్రమే అడిగాడు. 'తెలుసు' అంది వహిదా. మూడు నెలల తర్వాత బొంబాయి నుంచి పిలుపొచ్చింది. వెళితే రెండేళ్ల పాటు కాంట్రాక్ట్ గురుదత్ బేనర్‌లో. నెలకు జీతం- 2,500 రూపాయలు. మొదటి సినిమా 'సి.ఐ.డి'. 'హీరో ఎవరండీ'

అడిగింది వహిదా రెహమాన్. గురుదత్ జవాబు- దేవ్ ఆనంద్.

• • •

'కహీ పే నిగాహే కహీపే నిషానా'...

'సి.ఐ.డి' సినిమాలో కొంచెం వేంప్ తరహా వేషం. చిన్న వేషం. కాని ఒక్కపాటతో మొత్తం పేరు కొట్టుకెళ్లింది వహిదా. సి.ఐ.డిలో అసలు హీరోయిన్ షకీలా. ఆమె తుడుచుకునిపోయి వహిదా నిలబడింది. కొద్దిగా మెల్ల కన్ను, లాగేసే చూపు, ఈడ్చేసే నవ్వు... ఈ అమ్మాయిని తీర్చిదిద్ద



రోజులు మారాయి

వచ్చు అనుకున్నాడు గురుదత్. వెంటనే 'ప్యాసా'లో లీడ్ రోల్ ఇచ్చాడు. గురుదత్ ఆమెలోని నటిని చాలా సమర్థంగా తీర్చిదిద్దాడు. తన లాగే అధిక ప్రసంగం చేయకుండా గాఢమైన భావాలను ఎలా పలికించవచ్చో నేర్పించాడు. ప్యాసా ఘనవిజయం సాధించింది. ఆ తర్వాత గురుతద్, వహిదా కలిసి 'కాగజ్ కే ఫూల్', 'చౌద్‌వీ కా చాంద్', 'సాహిబ్ బీబీ ఔర్ గులామ్' సినిమాలలో నటించారు. గురుదత్ ఆగిపోయాడు. వహిదా సాగిపోయింది.

• • •

సునిల్‌దత్‌తో చేసిన 'ముఝే జీనే దో', బిశ్వజిత్‌తో 'బీస్ సాల్ బాద్' పెద్ద హిట్స్. దిలీప్ కుమార్‌తో 'దిల్ దియా దర్ద్ లియా', 'ఆద్మీ', 'రామ్ ఔర్ శ్యామ్' చేసింది వహిదా. కాని దేవ్ ఆనంద్ మరోసారి ఆమెకు సవాలు విసిరే పాత్రను ఇచ్చాడు 'గైడ్'లో. ఆర్.కె.నారాయణ్ రాసిన ఈ ప్రఖ్యాత నవలను హాలీవుడ్ వెర్షన్‌గా, బాలీవుడ్ వెర్షన్‌గా తీయాలనుకున్నప్పుడు హిందీ వెర్షన్‌కు చేతన్ ఆనంద్ దర్శకుడు. కాని చేతన్‌కు వహిదా ఇష్టం లేదు. దేవ్ ఆనంద్‌కు వహిదాను తీయడం ఇష్టం లేదు. చేతన్‌ను తీసి విజయ్ ఆనంద్‌ను దర్శకుడిగా పెట్టాడు. విజయ్ ఆనంద్ 'గైడ్'లో క్లాసిక్‌గా తీర్చిదిద్దాడు. నిజానికి ఆనాటి హీరోయిన్లు ఎంపిక చేసుకునే విలువలున్న పాత్ర లాంటిది కాదు 'రోజీ'. భర్తను వదిలేసి ప్రియుడితో వెళ్లిపోయే పాత్ర అది. శ్రేయోభిలాషులు చేయొద్దన్నారు. వహిదా రెహమాన్ చేసింది. ఆమెలోని నాట్యాన్ని, నటనను, అభినయ గాఢతను అంత గొప్పగా పట్టి ఇచ్చిన సినిమా మరొకటి లేదు.

• • •

'పత్థర్ కె సనమ్', 'నీల్ కమల్' వంటి హిట్స్ చూసిన వహిదా ఆ తర్వాత చేసిన సినిమాలు అంతగా ఆడలేదు. రాజ్ కపూర్‌తో 'తీస్రి కసమ్', సునిల్‌దత్‌తో 'రేష్మా ఔర్ షేరా', రాజేష్ ఖన్నాతో 'ఖామోషీ', అమితాబ్ బచ్చన్‌తో 'కభి కభి'... ఆమెను మెల్లగా హీరోయిన్ దశ నుంచి తప్పించాయి. వీటి నడుమ అక్కినేనితో 'బంగారు కలలు'లో తెలుగువారిని పలుకరించింది.

• • •

వహిదా రెహమాన్ హిందీ సినిమా రంగంలో సాధించిన స్థానం, ఏర్పరుచుకున్న గౌరవం, పొందిన సత్కారాలు, గెలుచుకున్న అభిమానులు తక్కువ కాదు. హుందాగా ఉంటూ, అదే సౌందర్యంతో ఆమె ఆ తర్వాతి రోజుల్లో కూడా అడపాదడపా నటిస్తూనే వచ్చింది. ఆమె నవ్వుకు ఫిదా అయ్యే ప్రేక్షకులను కనికరిస్తూనే ఉంది.

గొప్ప ప్రయాణం ఆమెది.

ఎన్నో జ్ఞాపకాలు. కొన్ని గాయాలు.

నాటి రోజులు మళ్లీ రావు. ఈ ఉత్సవ సమయంలో ముసురుకునేది సువర్ణ తలపోతలే.

వక్త్ నే కియా క్యా హసీ సితమ్
తుమ్ రహేన తుమ్ హమ్ రహేన హమ్

జీవితాలను కాల్చిన ప్రేమ

వహిదా రెహమాన్, గురుదత్‌ల మధ్య బంధం, అనుబంధం, సంబంధం గురుదత్ జీవితంలో సంక్షోభం తెచ్చింది. వహిదాను హిందీ పరిశ్రమకు పరిచయం చేసిన గురుదత్ ఆమె పట్ల చాలా పొసెసివ్‌గా ఉండేవాడు. వహిదా కూడా గురుదత్ రెక్కల చాటునే ఉండటానికి ఇష్టపడేది. అయితే ఇదంతా గురుదత్ భార్య, ప్రఖ్యాత గాయని



గురుదత్, గీతాదత్‌లతో...

గీతా దత్‌ను చాలా గట్టి దెబ్బ తీసింది. గురుదత్, గీతాదత్‌ల మధ్య వహిదా ప్రమేయం వల్ల చాలా ఎడం వచ్చింది. గురుదత్, గీతా దత్‌లు ఇద్దరూ తాగుడుకు బానిసయ్యారు. అప్పటికే డిప్రెషన్‌తో బాధపడుతున్న గురుదత్ ఆత్మహత్య చేసుకు మరణించాడన్నది ఒక కథనం. నిద్రమాత్రలు ఎక్కువై మరణించాడని మరో కథనం. ఏమైనా అతని జీవితం అర్థంతరంగా ముగిసింది. ఆ తర్వాత గీతా దత్ కూడా నానా బాధలు పడుతూ తాగుడుకు బానిసై మరణించింది. వహిదా ఒక నాటి నటుడు కమల్‌జీత్‌ను వివాహం చేసుకుంది. ఆమెకు ఒక కొడుకు, కూతురు. బెంగళూరులో చాలా కాలం ఉన్నాక భర్త మరణం తర్వాత ముంబై వచ్చి నివసిస్తోంది.



గైడ్

వహిదా రెహమాన్ హిట్స్

1. భవరా బడా నాదాన్ హై - సాహిబ్ బీబీ ఔర్ గులామ్
2. జానే క్యా తూనే కహీ - ప్యాసా
3. కహీ దీప్ జలే కహీ దిల్ - బీస్ సాల్ బాద్
4. సాంఝ్ ఢలీ దిల్ కి లగీ - కాలా బజార్
5. ఏ నయన్ డరే డరే - కొహ్రా
6. గాతా రహే మేరా దిల్ - గైడ్
7. మెహబూబ్ మేరె మెహబూబ్ మేరె - పత్థర్ కె సనమ్
8. తుమ్ పుకార్ లో తుమ్హారా ఇంతెజార్ హై - ఖామోషీ
9. రంగీలారే తేరె రంగ్ మే - ప్రేమ్ పూజారి
10. జాదుగర్ తెరె నైనా - మన్ మందిర్

వహిదా రెహమాన్‌కు దాదాసాహెబ్ ఫాల్కే

సినిమా రంగంలో విశేష సేవలకుగాను భారత ప్రభుత్వం ప్రకటించే సర్వోన్నత పురస్కారం 'దాదాసాహెబ్ ఫాల్కే' 2021 సంవత్సరానికి సుప్రసిద్ధ నటి వహిదా రెహమాన్ (85)ను వరించింది. కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అనురాగ్ ఠాకుర్ మంగళవారం ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ఈ విషయాన్ని ప్రకటించారు.



ఈ వార్త విన్న వెంటనే వహిదా రెహమాన్ 'దేవ్ ఆనంద్ శతజయంతి నాడు ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. నిజానికి ఈ అవార్డు ఆయనకు అందాలి. నాకు అందింది' అని సంతోషం వ్యక్తం చేశారు. అవార్డుకు ఎంపిక చేసిన కమిటిలో ఆశాపరేఖ్, చిరంజీవి, పరేష్ రావెల్, ప్రసేన్‌జిత్ చటర్జీ, శేఖర్ కపూర్ ఉన్నారు. వహిదా రెహమాన్‌ను ఇది వరకే పద్మశ్రీ, పద్మభూషణ్ వరించాయి. ఇప్పుడు దాదాసాహెబ్ ఫాల్కేతో తనకు రెట్టింపు సంబరం కలుగుతున్నదని ఆమె అన్నారు. కాగా వహిదాకు ఫాల్కే పురస్కారం లభించడం పట్ల ప్రధాని మోడి హర్షం వెలిబుచ్చారు. సినిమా రంగంపై ఆమె ముద్ర చెరగనిది అని కొనియాడారు. హైదరాబాద్, విశాఖ, చెన్నైలతో అనుబంధం కలిగిన వహిదా రెహమాన్ తెలుగు సినిమా 'రోజులు మారాయి'తో సినిమా రంగంలో ప్రవేశించారు. ఆ తర్వాత హిందీ సినిమాల్లో అగ్రతారగా వెలుగొందారు. భారతీయ సినిమాల్లో అత్యుత్తమ నటీమణుల్లో ఒకరిగా ఆమెను పరిగణిస్తారు. వహిదా రెహమాన్ అక్కినేని సరసన 'బంగారు కలలు' సినిమాలో నటించారు. 'పుట్టిన రోజు జేజేలు చిట్టి పాపాయి' హిట్ సాంగ్ ఆమెపై చిత్రీకరించినదే.

పేరు మార్చుకోని నటి

ఆ రోజుల్లో హిందీ సినిమాల్లో నటీనటులు కొత్త తరహా పేర్లు పెట్టుకునేవారు. యూసఫ్‌ఖాన్ దిలీప్ కుమార్ అయ్యాడు. మెహజబీన్ మీనా కుమారి అయ్యింది. అలాగే వహిదా రెహమాన్‌ని కూడా పేరు మార్చుకోమని గురుదత్ సూచించాడు. గురుదత్ అసిస్టెంట్లు కూడా పేరు మార్పుకోసం పట్టుబట్టారు. వహిదా రెహమాన్ పేరులో గ్లామర్ లేదని, మధుబాల లాగా ఏదో ఒక బాల వచ్చేలాగా పెట్టుకోమని కోరారు. అయితే 'మా అమ్మా నాన్నలు పెట్టిన పేరు నేను మార్చుకోను. దానితోనే కొనసాగుతాను. మీకిష్టమైతే తీసుకోండి, లేకుంటే మానుకోండి' అని వహిదా రెహమాన్ హఠం చేసింది. చివరకు అందరూ దిగిరాక తప్పలేదు. వహిదా రెహమాన్ తన పేరుతోనే ఖ్యాతి గడించింది.

యూత్ పల్స్

ప్రవాహ రాగాలలో పరవశించే గీతాలై...



స్ట్రీమింగ్ సర్వీస్‌ల ద్వారా మ్యూజిక్ వినడానికి ఇష్టపడుతున్న యువతరం అవే సర్వీసుల ద్వారా సంగీతంపై అవగాహన ఏర్పర్చుకుంటోంది. ఆ అవగాహనతో యువ సంగీత ప్రేమికులు, శ్రోతలు స్పాటిఫై, యాపిల్ మ్యూజిక్, ఆడియో మ్యాక్... మొదలైన స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా మ్యూజిషియన్‌లుగా మారుతున్నారు...

శ్రోతలు సంగీతం వినే విధానంలో గత కొన్ని సంవత్సరాలుగా మార్పు వచ్చింది. ఇంటర్నెట్ యూజర్‌లను దృష్టిలో పెట్టుకొని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది ఫోనోగ్రాఫిక్ ఇండస్ట్రీ(ఐఎఫ్‌పీఐ) చేసిన సర్వేలో 78 శాతం మంది స్ట్రీమింగ్ సర్వీసుల ద్వారా మ్యూజిక్‌ను వింటున్నట్లు తెలిసింది. అందులో యువతరం ఎక్కువ.

అయితే యువతరంలో కొంతమంది సంగీతాన్ని విని ఎంజాయ్ చేయడానికి మాత్రమే పరిమితం కావడం లేదు. తమను ప్రపంచానికి పరిచయం చేసుకునే వేదికలుగా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకుంటు న్నారు.

'మన్ మేరీ జాన్' పాటతో అపర్ణ కుమార్ చందెల్ అలియాస్ కింగ్ 'టాప్ 50 చార్ట్స్'లో మొదటి స్థానంలో నిలిచి వైరల్ సెన్సేషన్ అయ్యాడు. నాన్-ఫిల్మ్ ఇండియన్ మ్యూజిక్ ఆ స్థాయిలో ప్రాచుర్యం పొందడం అరుదు. అపర్ణ కుమార్ ఇప్పుడు ఆడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ స్పాటిఫై మోస్ట్ పాపులర్ ఆర్టిస్ట్‌లలో ఒకరు.

కొన్ని సంవత్సరాల క్రితం శ్రోతగా స్పాటిఫైకి దగ్గరయ్యాడు అపర్ణ కుమార్.

కొత్త ఆర్టిస్ట్‌ల గురించి తెలుసుకోవడంలో, వారి నుంచి స్ఫూర్తి పొందడంలో అపర్ణ కుమార్‌కు ఉపయోగపడిన ప్లాట్‌ఫామ్‌లలో స్పాటిఫై ఒకటి. మూడు సంవత్సరాల క్రితం ఈ ర్యాపర్ తన తొలి ఆల్బమ్ 'కార్నివాల్'తో క్రియేటర్‌గా మారాడు. అతడి 'తు ఆకే దేఖ్లే' పాట వైరల్‌గా మారింది.

'స్పాటిఫై ద్వారా శ్రోతలు ఎలాంటి పాటలు వినడానికి ఇష్టపడుతున్నారో సులభంగా అవగాహన చేసుకోవచ్చు' అంటున్నాడు అపర్ణ కుమార్.

కుమార్‌కు మాత్రమే కాదు ఎంతోమంది యంగ్ ఇండిపెండెంట్ ఆర్టిస్ట్‌లకు స్పాటిఫైలాంటి ప్లాట్‌ఫామ్‌ల క్రియేటర్-సెంట్రిక్ అప్రోచ్ వరంలా మారింది. పెద్ద ప్రాజెక్ట్‌లు వచ్చేలా చేయడంలో, మ్యూజిక్‌ను కెరీర్ ఆప్షన్‌గా మలుచుకోవడంలో, ప్రపంచానికి వారి ప్రతిభను పరిచయం చేయడంలో స్పాటిఫైలాంటి ప్లాట్‌ఫామ్‌లు యూత్‌కు ఉపయోగపడుతున్నాయి.

'ఒకప్పుడు యంగ్ ఆర్టిస్ట్‌లు తమ గురించి తాము తెలుసుకోలేకపోయేవారు. తమ సంగీతాన్ని వినడానికి ఎవరు ఇష్టపడుతున్నారు? ఎలాంటి సంగీతం చేయాలి? అనే విషయంలో స్పష్టత ఉండేది కాదు. ఈ పరిస్థితిలో మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు మార్పు తీసుకువచ్చాయి. స్పాటిఫై ఫర్ ఆర్టిస్ట్ యాప్ ద్వారా తమకు ఎలాంటి మ్యూజిక్ ఉపయోగపడుతుంది, ఏది ఉపయోగపడదు... అనేది అర్థం చేసుకోవడానికి వీలవుతుంది' అంటుంది చెన్నైకి చెందిన సంగీత ప్రేమికురాలు నిధి.

'మ్యూజిక్ ఇండస్ట్రీలో చాలా మార్పులు వచ్చాయి. బడ్డింగ్ మ్యూజిషియన్‌లు తమ టాలెంట్‌ను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఇప్పుడు ఎన్నో సోషల్ మీడియా అప్లికేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. గతంలో ఒకరు పాపులర్ కావడానికి సినిమా మాధ్యమమే ఏకైకమార్గం అన్నట్లుగా ఉండేది. ఇప్పుడు ఇండిపెండెంట్ మ్యూజిక్ హవా నడుస్తోంది. ఔత్సాహికులు తమ మ్యూజిక్ టాలెంట్‌ను పరిచయం చేసుకోవడానికి యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లాంటి ఎన్నో వేదికలు ఉన్నాయి' అంటున్నాడు ప్రముఖ మ్యూజిక్ కంపోజర్ సలీమ్ మర్చెంట్.

మ్యూజిక్ కంపోజర్‌గా మంచి పేరు తెచ్చుకుంది కోల్‌కత్తాకు చెందిన అలోక దాస్‌గుప్తా. చిన్న వయసు నుంచే మ్యూజిక్ కంపోజ్ చేసేది. అయితే తాను కంపోజ్ చేసింది ఎవరికైనా వినిపించాలంటే భయంగా ఉండేది. కెనడా యార్క్ యూనివర్శిటీలో మ్యూజిక్ పెరఫార్మెన్స్ అండ్ కంపోజిషన్‌లో డిగ్రీ చేసినా తనమీద తనకు నమ్మకం కలగడానికి ఆలోక దాస్‌గుప్తాకు కొంత సమయం పట్టింది.

'స్పాటిఫై లాంటి ప్లాట్‌ఫామ్స్ యువ ఆర్టిస్ట్‌లకు గట్టి ధైర్యాన్ని ఇస్తున్నాయి' అంటుంది అలోకదాస్ గుప్తా.

ముంబైకి చెందిన సౌమ్య శ్రీరాగకు లీడింగ్ మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌పై మంచి అవగాహన ఉంది. భవిష్యత్‌లో మ్యూజిషియన్‌గా రాణించాలనేది ఆమె కల.

'నా ప్రయత్నంలో విజయం సాధిస్తానా? లేదా? అనేది తెలియదుకాని గట్టి ప్రయత్నమైతే చేయాలనుకుంటున్నాను' అంటున్న శ్రీరాగకు ప్లే బ్యాక్ సింగర్ నికిత గాంధీ ఇచ్చిన సలహా 'ఏదో ఒకటి రాస్తూనో, కంపోజ్ చేస్తూనో ఉండాలి. అవి బాగున్నాయా? లేదా- అనేది రెండో విషయం. ముందు మన సంతోషం కోసం చేస్తే చాలు'.

సంగీతాన్ని వినే అవకాశమే కాదు విశ్లేషించే అవకాశం కూడా ఇస్తున్నాయి కొన్ని ప్లాట్‌ఫామ్స్.

మ్యూజిక్ స్ట్రీమింగ్ అండ్ డిస్కవరీ ప్లాట్‌ఫామ్ 'ఆడియోమ్యాక్' సబ్‌స్క్రైబర్‌లకు తమ ఫేవరెట్ ఆర్టిస్ట్‌ల ఆల్బమ్‌లను విశ్లేషించే అవకాశం ఇచ్చింది.

శ్రోతలకు నచ్చేలా, మెచ్చేలా మ్యూజిక్ ఇండస్ట్రీ వ్యూహాల మాట ఎలా ఉన్నా... ప్రతి అవకాశాన్ని, ప్రతి ఫీచర్‌ని తమలోని సంగీత ప్రతిభను మెరుగు పెట్టుకోవడానికి యువతరం ఉపయోగించుకుంటుంది.

వివిధ మాధ్యమాల ద్వారా ట్రెండ్స్‌ను ఫాలో కావడమే కాదు క్రియేట్ చేస్తుంది యువతరం.

ఇండిపెండెంట్ మ్యూజిక్

యంగర్ జనరేషన్ ఏం వింటుంది, దేనికి కనెక్ట్ అవుతుంది అనే దానిపై మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్ ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. ఫిల్మ్ మ్యూజిక్ మాత్రమే కాదు ఇండిపెండెంట్ మ్యూజిక్ వినడానికి కూడా శ్రోతలు ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇండిపెండెంట్ మ్యూజిక్‌తో వివిధ మాధ్యమాల ద్వారా తమను తాము నిరూపించుకునే అవకాశం యువ కళాకారులకు ఉంది.

– అనీస్ కౌర్,
ఫేమస్ స్పాటిఫై సింగర్





స్క్వాష్‌లో పాక్‌పై భారత్ గెలుపు

ఆసియా క్రీడల స్క్వాష్ ఈవెంట్‌లో భారత పురుషుల, మహిళల జట్లు శుభారంభం చేశాయి. మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు 3–0తో పాకిస్తాన్‌పై... భారత పురుషుల జట్టు 3–0తో తొలుత సింగపూర్‌పై, అదే స్కోరుతో ఖతర్‌పై గెలుపొందాయి. పాక్‌తో జరిగిన పోరులో తొలి మ్యాచ్‌లో 15 ఏళ్ల అనాహత్ సింగ్ 11–6, 11–6, 11–3తో సాదియా గుల్‌పై... రెండో మ్యాచ్‌లో ఆరోసారి ఆసియా క్రీడల్లో ఆడుతున్న జోష్నా చినప్ప 11–2, 11–5, 11–7తో నూర్ అల్ హుదా సాదిక్‌పై... మూడో మ్యాచ్‌లో తన్వీ ఖన్నా 11–3, 11–6, 11–2తో నూర్ అల్ ఐన్ ఇజాజ్‌పై గెలిచారు.

సచిన్ శుభారంభం

భారత బాక్సర్లు సచిన్ సివాచ్ (57 కేజీలు), నరేందర్ (ప్లస్ 92 కేజీలు) ఆసియా క్రీడల్లో శుభారంభం చేశారు. తొలి రౌండ్‌లో సచిన్ 5–0తో అస్రి ఉదిన్ (ఇండోనేసియా)పై గెలుపొందగా... నరేందర్ తొలి రౌండ్‌లోనే తన ప్రత్యర్థి ఎల్చొరో ఉమట్‌బెక్ (కిర్గిస్తాన్)ను నాకౌట్ చేశాడు.





'ఆఖరి' పంచ్ కోసం...

మధ్యాహ్నం గం.1:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

- నేడు ఆస్ట్రేలియాతో మూడో వన్డే
- వరల్డ్ కప్‌కు ముందు చివరి పోరు
- క్లీన్‌స్వీప్‌పై టీమిండియా దృష్టి
- పరువు కాపాడుకునేందుకు ఆసీస్

రాజ్‌కోట్: విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలాంటి స్టార్ బ్యాటర్లు లేకుండానే భారత జట్టు ఆస్ట్రేలియాపై ఇప్పటికే వన్డే సిరీస్ గెలుచుకుంది. ఇప్పుడు వీరిద్దరు మ్యాచ్ ప్రాక్టీస్ కోసం మైదానంలోకి దిగబోతున్నారు. ప్రతిష్టాత్మక ప్రపంచకప్‌లో మరో 11 రోజుల్లో ఇదే ఆసీస్‌తో తొలి మ్యాచ్ ఆడనున్న నేపథ్యంలో దాని కోసం చివరి ట్రయల్‌గా ఇరు జట్లు బరిలోకి దిగుతున్నాయి. మరో నలుగురు ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి టీమిండియా తమ సత్తాను పరీక్షించుకునేందుకు సిద్ధం కాగా, ఆసీస్ మాత్రం ప్రధాన ఆటగాళ్లందరినీ ఆడించనుంది. ఆసీస్‌పై తొలిసారి వన్డేల్లో క్లీన్‌స్వీప్ కోసం భారత్ సిద్ధం కాగా, మరోవైపు వరుసగా ఆరో వన్డేలో ఓడిపోకుండా పరువు కాపాడుకోవాలని కంగారూలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు ఇరు జట్ల మధ్య సిరీస్‌లో చివరిదైన మూడో వన్డేకు రంగం సిద్ధమైంది. రాజ్‌కోట్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్ కావడంతో భారీ స్కోరు నమోదు కావడం ఖాయం.

జోరు కొనసాగిస్తారా...

ఈ మ్యాచ్ నుంచి భారత జట్టు గిల్, హార్దిక్, శార్దుల్, షమీలకు విశ్రాంతినిచ్చింది. తొలి రెండు మ్యాచ్‌లు ఆడని రోహిత్, కోహ్లి, సిరాజ్, కుల్దీప్, గత మ్యాచ్‌కు దూరమైన బుమ్రా బుధవారం పోరుకు సిద్ధమయ్యారు. ఆటగాళ్లు మారినా ఓవరాల్‌గా భారత జట్టు ప్రదర్శన అద్భుతంగా ఉంది. ఆటగాళ్ల తాజా ఫామ్‌ను బట్టి చూస్తే చివరి వన్డేలోనూ భారత్ పైచేయి సాధించేందుకు అన్ని అవకాశాలూ ఉన్నాయి. ఆసియా కప్ ఫైనల్ తర్వాత సిరాజ్ మళ్లీ తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. బుమ్రా పదునైన బంతులతో ఆసీస్‌ను కట్టడి చేయగలడు. రాహుల్, శ్రేయస్, సూర్యలతో కూడిన బ్యాటింగ్ ఆర్డర్‌తో భారత్ మరోసారి భారీ స్కోరు సాధించగలదు. అనుభవజ్ఞుడిగా తన విలువేంటో అశ్విన్ గత రెండు మ్యాచ్‌లలో చూపించి తన వరల్డ్ కప్ అవకాశాలు మెరుగుపర్చుకున్నాడు. రోహిత్‌తో పాటు ఇషాన్ ఓపెనర్‌గా ఆడతాడు.

స్టార్క్, మ్యాక్స్‌వెల్ సిద్ధం...

సిరీస్ ఓడినా వరల్డ్ కప్‌కు ముందు తగినంత ఆత్మవిశ్వాసం ప్రోది చేసుకునేందుకు ఆసీస్‌కు ఇది తగిన వేదిక. అందుకే ఆ జట్టు తమ వన్డే పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగనుంది. గత మ్యాచ్ ఆడని కమిన్స్, స్టొయినిస్ తిరిగి జట్టులోకి రాగా, స్టార్క్, మ్యాక్స్‌వెల్ అందుబాటులోకి వచ్చారు. దక్షిణాఫ్రికా సిరీస్‌లోనూ ఆడని స్టార్క్, మ్యాక్స్‌వెల్ తమ ఫామ్, ఫిట్‌నెస్ నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్నారు. మంగళవారం వీరిద్దరు సుదీర్ఘ సమయం పాటు సాధన చేశారు. జట్టులో వార్నర్ ఒక్కడే ఫామ్‌లో ఉండగా, స్మిత్ ఇంకా తడబడుతున్నాడు. మిచెల్ మార్ష్ తనదైన శైలిలో చెలరేగాలని ఆసీస్ టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. జంపా, హాజల్‌వుడ్ భారత్‌ను ఎంతవరకు నిలువరిస్తారనేది చూడాలి.



స్మిత్

'అయ్యర్ ఆట బహు బాగు'

సునీల్ గావస్కర్

వరల్డ్ కప్‌కు ముందు ఇబ్బంది పెడుతున్న ఒక సమస్యను పరిష్కరించుకునేందుకు ఇండోర్ మ్యాచ్ భారత్‌కు ఉపకరించింది. ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సిన స్థితిలో నిలిచిన శ్రేయస్ అయ్యర్ ఒక చక్కటి ఇన్నింగ్స్‌తో సత్తా చాటాడు. అతని ఆట ముందు గిల్ శతకం కూడా చిన్నబోయినట్లు అనిపించింది. అర్ధరాత్రి నిద్రలో నుంచి లేపి బ్యాటింగ్ చేయమన్నా సరే తడబడకుండా ఆడే ఫామ్‌లో ఉన్న గిల్‌ను అయ్యర్ వెనక్కి తోసిన తీరు ఈ ఇన్నింగ్స్ ప్రత్యేకతను చూపించింది. ఈ ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఇలాంటి సమన్వయం ఉండటం భవిష్యత్తులో భారత క్రికెట్‌కు ఎంతో మేలు చేస్తుంది. జట్టులో తన స్థానం గురించి రేకెత్తిన అన్ని సందేహాలను పటాపంచలు చేసే ఉద్దేశ్యంతో అయ్యర్ బ్యాటింగ్‌కు దిగాడు. అతను కొన్ని ఆకట్టుకునే షాట్లు ఆడిన తీరు సాధారణంగా ముభావంగా కనిపించే కోచ్ ద్రవిడ్ ముఖంపై కూడా చిరునవ్వులు పూయించింది. గిల్ ఎప్పటిలాగే ఒక్క పొరపాటు లేని ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్ ద్వారా భారత్‌కు మేలు చేసిన మరో అంశం అశ్విన్ బౌలింగ్. అతని గురించి సెలక్టర్లు ఏం ఆలోచిస్తున్నారో మరో ఒకటి రెండు రోజుల్లో తేలిపోతుంది కానీ మొహాలీతో పోలిస్తే ఈ మ్యాచ్‌లో అతని బౌలింగ్ మరింత మెరుగ్గా కనిపించింది. వరల్డ్ కప్‌కు ముందు తమ ఆటను సానుబెట్టుకునేందుకు భారత సీనియర్లకు రాజ్‌కోట్ వన్డే అవకాశం కల్పిస్తోంది. మరోవైపు దక్షిణాఫ్రికా నుంచి మొదలైన పరాజయాలకు ఎలా విరామం ఇవ్వాలో తెలియక ఆస్ట్రేలియా జట్టు పరిస్థితి అగమ్యగోచరంగా కనిపిస్తోంది.

41 ఏళ్ల తర్వాత...

అశ్వాలతో ముడిపడి ఉన్న క్రీడ ఈక్వెస్ట్రియన్. అశ్వానికి, రైడర్‌కు మధ్య పూర్తి సమన్వయం ఉండాలి. అప్పుడే ఫలితం వస్తుంది. లేదంటే తడబాటు తప్పదు. న్యూఢిల్లీలో ఆసియా క్రీడలు 1951లో మొదలుకాగా... ఇదే వేదికపై 1982లో జరిగిన ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్‌ను మొదటిసారి ప్రవేశపెట్టారు. నాటి ఆసియా క్రీడల్లో భారత జట్టు మూడు స్వర్ణాలతో అదరగొట్టింది. ఆ తర్వాత భారత జట్టు ఈ క్రీడాంశంలో మళ్లీ పసిడి పతకం సాధించలేకపోయింది. 41 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ చైనా గడ్డపై మళ్లీ భారత అశ్వదళం అద్భుతం సృష్టించింది. విపుల్ హృదయ్ చద్దా, అనూష్ అగర్‌వల్లా, దివ్యాకృతి సింగ్, సుదీప్తి హజేలాలతో కూడిన భారత జట్టు డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో మొదటిసారి బంగారు పతకం సాధించి సంచలనం సృష్టించింది. డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు చివరిసారి 1986 సియోల్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం లభించింది. ఈక్వెస్ట్రియన్ క్రీడలో భాగమైన ఈవెంటింగ్, పెగ్గింగ్ ఈవెంట్‌లలో గతంలో భారత్‌కు పసిడి పతకాలు వచ్చినా డ్రెసాజ్ ఈవెంట్‌లో స్వర్ణం రావడం ఇదే ప్రథమం. ఓవరాల్‌గా ఆసియా క్రీడల్లో మూడో రోజు మంగళవారం భారత్‌కు మూడు పతకాలు వచ్చాయి. ఈక్వెస్ట్రియన్‌లో స్వర్ణంరాగా... సెయిలింగ్‌లో ఒక రజతం, ఒక కాంస్య పతకం లభించాయి. షూటింగ్, జూడో క్రీడాంశాల్లో త్రుటిలో కాంస్య పతకాలు చేజారాయి.

- ఈక్వెస్ట్రియన్‌లో భారత జట్టుకు స్వర్ణ పతకం
- డ్రెసాజ్ ఈవెంట్‌లో తొలిసారి అగ్రస్థానం
- సంచలనం సృష్టించిన విపుల్, అనూష్, దివ్యాకృతి, సుదీప్తి బృందం
- సెయిలింగ్‌లో రెండు పతకాలు



స్వర్ణ పతకాలతో అనూష్, సుదీప్తి, దివ్యాకృతి సింగ్, విపుల్ హృదయ్

డ్రెసాజ్ అంటే...

ఈక్వెస్ట్రియన్‌లో ఎండ్యూరన్స్, ఈవెంటింగ్, జంపింగ్, పెగ్గింగ్, డ్రెసాజ్ తదితర ఈవెంట్లు ఉంటాయి. డ్రెసాజ్ అనేది ఫ్రెంచ్ పదం. ఆంగ్లంలో దీని అర్థం ట్రెయినింగ్. తన అశ్వానికి రైడర్ ఏ విధంగా శిక్షణ ఇచ్చాడో, వీరిద్దరి మధ్య సమన్వయం ఎలా ఉందో ఈ ఈవెంట్ ద్వారా తెలుస్తుంది. రైడర్ నుంచి వచ్చే సంజ్ఞల ఆధారంగా అశ్వం కనబరిచే పలు కదలికలను జడ్జీలు పరిశీలిస్తారు. అనంతరం సున్నా నుంచి పది మధ్య పాయింట్లు ఇస్తారు. గరిష్టంగా పాయింట్లు సాధించిన జట్టుకు పతకాలు ఖరారవుతాయి. జట్టులో నలుగురు రైడర్లు ఉన్నా... పతకాలు ఖరారు చేసేందుకు టాప్-3 రైడర్ల పాయింట్లను లెక్కలోకి తీసుకుంటారు.

హాంగ్జౌ: ఎవరూ ఊహించని విధంగా ఈక్వెస్ట్రియన్ క్రీడాంశంలో భారత బృందం మెరిసింది. 41 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్‌లో భారత్‌కు మళ్లీ స్వర్ణ పతకం లభించింది. మంగళవారం జరిగిన డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో విపుల్ హృదయ్ చద్దా, అనూష్ అగర్‌వల్లా, దివ్యాకృతి సింగ్, సుదీప్తి హజేలాలతో కూడిన భారత జట్టు 209.205 పాయింట్లు సాధించి పసిడి పతకం సొంతం చేసుకుంది. చైనా (204.882 పాయింట్లు) రజతం, హాంకాంగ్ (204.852 పాయింట్లు) కాంస్య పతకం గెల్చుకున్నాయి.

ఇంటికి దూరంగా...

ఆసియా క్రీడల చరిత్రలో డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు బంగారు పతకం రావడం ఇదే తొలిసారి. ఈ స్వర్ణ పతకం వెనుక భారత రైడర్ల శ్రమ ఎంతో దాగి ఉంది. విపుల్, అనూష్, దివ్యాకృతి, సుదీప్తి కొన్నేళ్ల క్రితం భారత్ నుంచి యూరోప్‌కు వెళ్లి కుటుంబసభ్యులకు దూరంగా నివసిస్తూ అక్కడే శిక్షణ తీసుకుంటున్నారు. ఆసియా క్రీడల కోసం భారత ఈక్వెస్ట్రియన్ సమాఖ్య వీరి కోసం యూరోప్‌లోనే ట్రయల్స్ కూడా నిర్వహించింది. ఈ నలుగురి అశ్వాలను జర్మనీలో ఏడురోజులపాటు క్వారంటైన్‌లో పెట్టాక ఈనెల 21న చైనాకు తరలించారు. 'ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించడం నమ్మశక్యంగా లేదు. ఇక్కడి దాకా మా అందరి ప్రయాణం ఎంతో కఠినంగా సాగింది. యుక్త వయసులోనే మేమందరం యూరోప్‌కు వచ్చి శిక్షణ తీసుకుంటున్నాం' అని ఇండోర్‌కు చెందిన 21 ఏళ్ల సుదీప్తి వ్యాఖ్యానించింది. 'మేమందరం ఒకరినొకరం ఉత్సాహపరుచుకున్నాం. జాతీయ గీతం వినిపిస్తూ, జాతీయ పతాకం రెపరెపలాడుతుంటే ఆ అనుభూతిని వర్ణించలేం. మా అందరి శ్రమకు తగ్గ ఫలితం స్వర్ణం రూపంలో లభించింది' అని 2017లో యూరోప్ వెళ్లిన కోల్‌కతాకు చెందిన 23 ఏళ్ల అనూష్ తెలిపాడు. జైపూర్‌కు చెందిన దివ్యాకృతి అజ్మీర్‌లోని విఖ్యాత మాయో గర్ల్స్ స్కూల్‌లో ఏడో తరగతిలో ఉన్నప్పుడు హార్స్ రైడింగ్‌పై దృష్టి సారించింది. 2020లో యూరోప్‌కు వెళ్లిన దివ్యాకృతి జర్మనీలో శిక్షణ తీసుకుంది. ముంబైకి చెందిన 25 ఏళ్ల విపుల్ గత పదేళ్లుగా యూరోప్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. లండన్ యూనివర్సిటీ నుంచి అతను బిజినెస్ మేనేజ్‌మెంట్ డిగ్రీ పూర్తి చేశాడు.

భారత్ గోల్స్ వర్షం

సింగపూర్‌పై 16–1తో ఘనవిజయం



హాంగ్జౌ: స్వర్ణ పతకమే లక్ష్యంగా ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల హాకీ జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. పూల్ 'ఎ'లో భాగంగా సింగపూర్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 16–1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (24వ, 39వ, 40వ, 42వ ని.లో) నాలుగు గోల్స్ నమోదు చేయగా... మన్‌దీప్ సింగ్ (12వ, 30వ, 51వ ని.లో) మూడు గోల్స్ సాధించాడు. అభిషేక్ (51వ, 52వ ని.లో), వరుణ్ కుమార్ (55వ, 55వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. లలిత్ ఉపాధ్యాయ్ (16వ ని.లో), గుర్జంత్ సింగ్ (22వ ని.లో), వివేక్ సాగర్ ప్రసాద్ (23వ ని.లో), మన్‌ప్రీత్ సింగ్ (37వ ని.లో), షంషేర్ సింగ్ (38వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. సింగపూర్ తరఫున జకీ జుల్కర్‌నైన్ (53వ ని.లో) ఏకైక గోల్ చేశాడు.

సెయిలింగ్‌లో సూపర్...

హాంగ్జౌ: సముద్రంలో తెర చాపను నియంత్రిస్తూ ముందుకు దూసుకుపోవడమే సెయిలింగ్. ఆసియా క్రీడల్లో మంగళవారం ఈ క్రీడాంశంలో భారత్‌కు రెండు పతకాలు లభించాయి. భోపాల్‌కు చెందిన 17 ఏళ్ల నేహా ఠాకూర్ బాలికల డింగీ ఐఎల్‌సీఏ-4 ఈవెంట్‌లో రెండో స్థానం సంపాదించి రజత పతకం గెల్చుకుంది. అయోధ్యకు చెందిన 29 ఏళ్ల ఇబాద్ అలీ విండ్‌సర్ఫర్ ఆర్‌ఎస్:ఎక్స్ ఈవెంట్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. 11 రేసులతో కూడిన డింగీ ఈవెంట్‌లో నేహా 32 పాయింట్లు స్కోరు చేయగా... 14 రేసులతో కూడిన విండ్‌సర్ఫర్ ఈవెంట్‌లో ఇబాద్ అలీ 52 పాయింట్లు సాధించాడు.



నేహా ఠాకూర్



ఇబాద్ అలీ

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	53	29	13	95
దక్షిణ కొరియా	14	16	19	49
జపాన్	8	20	19	47
ఉజ్బెకిస్తాన్	5	6	11	22
హాంకాంగ్	5	4	10	19
భారత్	3	4	7	14
ఇండోనేసియా	3	1	5	9
చైనీస్ తైపీ	2	3	3	8
థాయ్‌లాండ్	2	0	5	7
ఇరాన్	1	4	5	10

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

భవాని దేవి ఓటమి



ఆసియా క్రీడల ఫెన్సింగ్ ఈవెంట్‌లో భారత స్టార్ ఫెన్సర్ భవాని దేవి పోరాటం ముగిసింది. మహిళల సేబర్ విభాగంలో భవాని దేవి క్వార్టర్ ఫైనల్లో 7–15తో యాకి షావో (చైనా) చేతిలో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో భవాని గెలిచిఉంటే సెమీఫైనల్ చేరడంద్వారా కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకునేది.

చేజారిన కాంస్యం



ఆసియా క్రీడల షూటింగ్ ఈవెంట్‌లో భారత్‌కు త్రుటిలో కాంస్యం చేజారింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రమితా జిందాల్–దివ్యాంశ్‌లతో కూడిన భారత జోడీ కాంస్య పతక మ్యాచ్‌లో ఓడిపోయింది. రమిత–దివ్యాంశ్ ద్వయం 18–20తో పార్క్ హాజున్–లీ ఉన్‌సియో (కొరియా) జంట చేతిలో ఓటమి పాలైంది.

క్వార్టర్ ఫైనల్లో సుమిత్



ఆసియా క్రీడల టెన్నిస్ ఈవెంట్ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్, మహిళల సింగిల్స్‌లో అంకిత రైనా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సుమిత్ 7–6 (11/9), 6–4తో బెబిట్ జుకయెవ్ (కజకిస్తాన్)పై, అంకిత 6–1, 6–2తో ఆదిత్య పటాలి (హాంకాంగ్)పై గెలుపొందారు.

భారత గడ్డపై అతిథులుగా...

వరల్డ్ కప్‌లో పాల్గొనే జట్లు ఒక్కొక్కటిగా భారత్‌కు చేరుకుంటున్నాయి. ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ ఇప్పటికే భారత్‌లో ఉండగా... మంగళవారం అఫ్గానిస్తాన్ బృందం తిరువనంతపురం చేరింది. న్యూజిలాండ్ టీమ్ రెండు బృందాలుగా భారత్‌కు చేరుకుంటోంది. బంగ్లాదేశ్‌తో మంగళవారం చివరి వన్డే ఆడిన టీమ్ నేడు హైదరాబాద్‌కు రానుండగా... కెప్టెన్ కేన్ విలియమ్సన్ సహా ఇతర ప్రధాన ఆటగాళ్లతో కూడిన జట్టు మంగళవారం రాత్రి పది గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో అడుగు పెట్టింది. పాకిస్తాన్ కూడా బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకుంటుంది.



తమీమ్ ఇక్బాల్‌పై వేటు

వరల్డ్ కప్‌కు బంగ్లాదేశ్ జట్టు

ఢాకా: వన్డే వరల్డ్ కప్‌లో పాల్గొనే 15 మంది సభ్యుల బంగ్లాదేశ్ జట్టును బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మంగళవారం ప్రకటించింది. సీనియర్ బ్యాటర్ తమీమ్ ఇక్బాల్‌కు ఇందులో చోటు దక్కలేదు. వెన్నునొప్పితో బాధపడుతున్న అతను పూర్తి ఫిట్‌గా లేకపోగా, ఫిట్‌నెస్ సమస్యలు ఉన్న ఆటగాళ్లను జట్టులోకి ఎంపిక చేయరాదంటూ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ డిమాండ్ చేయడం కూడా ప్రధాన కారణం. రిటైర్మెంట్ ప్రకటించి, దేశ ప్రధాని జోక్యంతో దానిని వెనక్కి తీసుకొని, కెప్టెన్సీకి రాజీనామా చేసి ఆపై కివీస్‌తో రెండు వన్డేలు ఆడిన తర్వాతా తమీమ్‌కు వరల్డ్ కప్ టీమ్‌లో చోటు దక్కలేదు.



తమీమ్



హసరంగ

జట్టు వివరాలు: షకీబ్ (కెప్టెన్), లిటన్ దాస్, తన్‌జీద్, నజ్ముల్, ముష్ఫికర్, తౌహీద్, మిరాజ్, మహ్ముదుల్లా, మెహదీ హసన్, నసుమ్, మహమూద్, తస్కిన్, షరీఫుల్, ముస్తఫిజుర్, తన్‌జీమ్.

హసరంగ, చమీరా దూరం...

కొలంబో: వరల్డ్ కప్‌లో శ్రీలంక తమ ఇద్దరు ప్రధాన బౌలర్లు వనిందు హసరంగ, దుష్మంత చమీరా సేవలు కోల్పోనుంది. గాయాలతో బాధపడుతున్న వీరిద్దరు మెగా టోర్నీకి దూరమయ్యారు.

జట్టు వివరాలు: షనక (కెప్టెన్), కుశాల్ పెరీరా, నిసాంకా, కరుణరత్నే, కుశాల్ మెండిస్, సమరవిక్రమ, అసలంక, ధనంజయ, హేమంత, వెల్లలాగె, తీక్షణ, పతిరణ, కుమార, రజిత, మదుషంక.

వన్డే ప్రపంచకప్ మరో 8 రోజుల్లో



● నవీన్ చంద్ర, సాయిధరమ్ తేజ్, స్వాతి

నేనివ్వ!

\- స్వాతీ రెడ్డి

''శ్రీకాంత్ తీసిన 'భానుమతి రామకృష్ణ' సినిమాలో చాలా క్లిష్టమైన భావోద్వేగాలు ఉన్నాయి. ఆయన తీసిన ఈ 'మంత్ ఆఫ్ మధు'లోనూ అలాంటి భావోద్వేగాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. నవీన్ చంద్ర, స్వాతీ రెడ్డి ప్రధాన పాత్రల్లో శ్రీకాంత్ నాగోతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. యశ్వంత్ ములుకుట్ల క్రిషివ్ ప్రొడక్షన్స్, హ్యాండ్ పిక్డ్ స్టోరీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా అక్టోబర్ 6న విడుదల కానుంది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న సాయిధరమ్ తేజ్ ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. నవీన్ చంద్ర మాట్లాడుతూ– ''మా సినిమాకి మంచి కథ, సినిమాటోగ్రఫీ, మ్యూజిక్.. ఇలా అన్నీ బాగా కుదిరాయి'' అన్నారు. ''ఈ సినిమా చూసినవారు సర్‌ప్రైజ్ అవుతారు'' అన్నారు స్వాతీ రెడ్డి. అలాగే తన భర్త నుంచి స్వాతి విడాకులు తీసుకున్నారనే వార్త ప్రచారంలో ఉంది. ఈ విషయంపై క్లారిటీ ఇస్తారా అని అడగ్గా.. ''నేనివ్వా'' అన్నారు స్వాతి. ''మంత్ ఆఫ్ మధు' అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు శ్రీకాంత్ నాగోతి. చిత్ర సహనిర్మాత సుమంత్ దామ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రఘువర్మ పేరూరి, నటీనటులు శ్రేయ, రాజా రవీంద్ర, హర్ష, యశ్వంత్ పాల్గొన్నారు.

మంగళవారం థ్రిల్

పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంగళవారం'. స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. ఈ చిత్రాన్ని నవంబర్ 17న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అజయ్ భూపతి మాట్లాడుతూ– ''గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన రస్టిక్ యాక్షన్ థ్రిల్లర్ 'మంగళవారం'' అన్నారు. ''ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. త్వరలో ట్రైలర్ విడుదల చేస్తాం'' అన్నారు స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: దాశరథి శివేంద్ర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయికుమార్ యాదవిల్లి.



● పాయల్ రాజ్‌పుత్

సినిమా



ఇక మా ప్రయాణం మారుతుంది

\- నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి

''తెలుగు పరిశ్రమలో చెప్పుకోదగ్గ సినిమాలు అరుదుగా ఉంటాయి. మా 'పెదకాపు 1' కూడా అరుదైన చిత్రంగా నిలుస్తుంది. ఈ సినిమా తర్వాత మా ద్వారక క్రియేషన్స్ ప్రయాణం మారుతుంది'' అని నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి అన్నారు. విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మిర్యాల రవీందర్ రెడ్డి విలేకరులతో పంచుకున్న విశేషాలు.

● 'పెదకాపు 1' చిత్రకథకి కొత్త హీరో అయితేనే సహజత్వం వస్తుంది. అందుకే విరాట్ కర్ణని తీసుకున్నాం . సినిమా మొత్తం చాలా సహజత్వంతో ఉంటుంది. ఎక్కడ కూడా సెట్స్ వేయలేదు. 1980 నాటి పరిస్థితులని ప్రతిబింబించేలా రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో నిజమైన లొకేషన్స్‌లో చిత్రీకరించాం. ఒక చరిత్రని కళ్ల ముందు ఎలా చూపించాలో అలానే సహజంగా చూపించారు శ్రీకాంత్ అడ్డాల.

● మా సినిమాని చూస్తున్నప్పుడు నిజ జీవితాన్నే తెరపై చూస్తున్న అనుభూతి కలుగుతుంది. ఒక సామాన్యుడు తన పరిస్థితులను తట్టుకొని బలవంతుడిని జయించాలంటే ఒక యుద్ధమే చేయాలి. మనం అనుకున్నది సాధించాలంటే పోరాటం తప్పితే వేరే మార్గం లేదు.. అదే ఈ సినిమా కథ. కుటుంబం, సమూహం, ప్రాంతం.. ఇలా ఏదైనా నా అనుకొనే వారి కోసం కాపు కాసేవారికి పెదకాపు అనే పేరు ఉంటుంది. ఆ ఉద్దేశంతోనే మేం 'పెదకాపు' టైటిల్ పెట్టాం.

● విరాట్‌ని స్క్రీన్‌పై చూస్తున్నప్పుడు ఒక పెద్ద హీరోని చూసిన అనుభూతి కలిగింది. విరాట్‌ని వైజాగ్ సత్యానంద్‌గారు హీరో ప్రభాస్‌తో పోల్చడం హ్యాపీగా ఉంది. శ్రీకాంత్ అడ్డాలగారు విలన్‌గా చక్కగా సరిపోయారు. మిక్కీ జె. మేయర్ అద్భుతమైన మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చారు. 'పెదకాపు 1' రిలీజ్ తర్వాత 'పెదకాపు 2' ఉంటుంది. ఆ తర్వాత అడివి శేష్‌తో ఓ చిత్రం చేస్తాను. అలాగే 'అఖండ 2'తో పాటు మరో రెండు మూడు కథలు చర్చల్లో ఉన్నాయి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
78	10
65,945	19,665

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	13,099	▽ 177
డోజోన్స్	33,680	▽ 327
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,626	△ 2
డాక్స్	15,256	▽ 150
షాంఘై	3,102	▽ 13
నికాయ్	32,315	△ 364

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	58,520 ▽ 150
బంగారం (22 క్యారట్)	55,730 ▽ 150
వెండి (కిలో)	77,600 ▽ 1400

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎసబిఐ	82.45	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎసబిఐ	99.92	103.28
€	యూరో	ఎసబిఐ	86.64	89.74
¥	జపాన్ ఎన్ (100)	ఎసబిఐ	55.10	56.81
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎసబిఐ	52.39	54.69
S$	సింగపూర్ డాలర్	ఎసబిఐ	59.93	61.84
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.96	23.44
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.21	12.29

ముకేశ్ అంబానీ బాటలోనే..

- ఆకాశ్, ఈషా, అనంత్..
- జీతాలు తీసుకోకుండానే బాధ్యతలు
- బోర్డ్ సమావేశాలకు ఫీజులు మాత్రమే



న్యూఢిల్లీ: బిలియనీర్ ముకేశ్ అంబానీ బాటలోనే ఆయన ఇద్దరు కుమారులు, కుమార్తె జీతాలు తీసుకోకుండా బాధ్యతలు నిర్వహించనున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ బోర్డు, కమిటీ సమావేశాలలో పాలుపంచుకుంటున్నందుకు ఆకాశ్, ఈషా, అనంత్ ఫీజులు మాత్రమే పొందనున్నారు. అంతేకాకుండా నికర లాభాల నుంచి కమీషన్ అందుకోను న్నారు. ముకేశ్ సంతానాన్ని బోర్డులో నియమించేందుకు వాటాదారుల అనుమతి కోరుతున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా ఈ అంశాలను వెల్లడించింది. 66ఏళ్ల అంబానీ 2020–21 ఏడాది నుంచి ఎలాంటి జీతాన్ని అందుకోవడంలేదు. అయితే అంబానీ బంధువులు నిఖిల్, హిటల్ వేతనాలతోపాటు.. ఇతర అలవెన్సులు తదితరాలను పొందుతున్నారు.

నీతా అంబానీ తరహాలో

2014లో ముకేశ్ భార్య నీతా అంబానీ ఎంపిక తరహాలోనే కవలలు 31ఏళ్ల ఆకాశ్, ఈషా సహా 28ఏళ్ల అనంత్‌ను ఆర్ఐఎల్ బోర్డులో నియమించనున్నారు. 2022–23లో నీతా అంబానీ రూ. 6 లక్షల సిటింగ్ ఫీజు, రూ. 2 కోట్ల కమీషన్ అందుకున్నట్లు ఆర్ఐఎల్ తాజా వార్షిక నివేదికలో పేర్కొంది. గత నెలలో నిర్వహించిన కంపెనీ వార్షిక సమావేశంలో ఆర్ఐఎల్ బోర్డులోకి ముగ్గురినీ ఎంపిక చేశారు. అయితే ముకేశ్ ఆర్ఐఎల్ చైర్మన్, సీఈవోగా మరో ఐదేళ్లు బాధ్యతలు నిర్వహించనున్నారు. తద్వారా తదుపరితరం నాయకులకు మార్గదర్శకత్వం వహించనున్నారు. కాగా.. ముకేశ్ సంతానాన్ని బోర్డులో నియమించేందుకు వీలుగా ఆర్ఐఎల్ పోస్టల్ బ్యాలట్ ద్వారా వాటాదారుల అనుమతి కోరుతోంది.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి

- వినూత్న ఉత్పత్తులను తయారు చేయాలి
- అప్పుడే ప్రపంచ స్థాయికి ఎదుగుతాం
- దేశీ ఫార్మా సంస్థలకు కేంద్ర మంత్రి మాండవీయ సూచన



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా దిగ్గజాలుగా ఎదగాలంటే పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు పెద్ద పీట వేయాలని దేశీ ఫార్మా పరిశ్రమకు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సూచించారు. వినూత్న ఉత్పత్తులను రూపొందించడంపై దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో పాటు ప్రపంచ మార్కెట్ల కోసం కీలక యంత్రపరికరాలను తయారు చేయాలని అటు మెడికల్ టెక్నాలజీ కంపెనీలకు సూచించారు. ఫార్మా–మెడ్ టెక్ రంగంలో పరిశోధనలు, అభివృద్ధి, నవకల్పనలపై జాతీయ పాలసీని ఆవిష్కరించిన సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. 'అంతర్జాతీయ బహుళ జాతి కంపెనీలు తమ లాభాల్లో 20–25 శాతాన్ని పరిశోధన, ఆవిష్కరణలపై వెచ్చిస్తుంటాయి. కానీ దేశీ కంపెనీలు సుమారు 10 శాతమే వెచ్చిస్తున్నాయి. మనం పరిశోధన ఆధారిత వినూత్న ఉత్పత్తులను తయారు చేయనంత వరకూ అంతర్జాతీయంగా ఈ విభాగానికి సారథ్యం వహించలేము' అని ఆయన చెప్పారు. 2047 నాటికి ఫార్మా పరిశ్రమ స్వావలంబన సాధించుకునే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు.

నాణ్యత కూడా ముఖ్యమే..

భారీ పరిమాణంలో ఉత్పత్తి చేయడమే కాకుండా ఉత్పత్తుల నాణ్యతపై కూడా ఫార్మా పరిశ్రమ దృష్టి పెట్టాలని మాండవీయ చెప్పారు. మరోవైపు, ఫార్మా మెడ్‌టెక్ రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించే పథకాన్ని (పీఆర్ఐపీ) కూడా కేంద్రం ఆవిష్కరించింది. ఈ స్కీము బడ్జెట్ రూ. 5,000 కోట్లని మాండవీయ చెప్పారు. పరిమాణం పరంగా 50 బిలియన్ డాలర్లతో భారత ఫార్మా పరిశ్రమ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంది. వచ్చే దశాబ్ద కాలంలో 120–130 బిలియన్ డాలర్లకు ఎదగగలదని అంచనాలు ఉన్నాయి.

స్టార్టప్‌లకు 5 వేల్యుయేషన్ విధానాలు

ఏంజెల్ ట్యాక్స్ నిబంధనల నోటిఫికేషన్ జారీ



న్యూఢిల్లీ: ఇన్వెస్టర్లకు అన్‌లిస్టెడ్ అంకుర సంస్థలు జారీ చేసే షేర్ల విలువను మదింపు చేసే విధానాలకు సంబంధించి కొత్త ఏంజెల్ ట్యాక్స్ నిబంధనలను ఆదాయపు పన్ను శాఖ నోటిఫై చేసింది. ఆదాయపు పన్ను చట్టంలోని 11యూఏ నిబంధనలో ఈ మేరకు సవరణలు చేసింది. దీని ప్రకారం అన్‌లిస్టెడ్ స్టార్టప్‌లు జారీ చేసే ఈక్విటీ షేర్లు, కంపల్సరీ కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్ల (సీసీపీఎస్) వేల్యుయేషన్‌ను సముచిత మార్కెట్ విలువ (ఎఫ్ఎంవీ)కి పది శాతం అటూ ఇటూగా లెక్క కట్టవచ్చు. ప్రవాస ఇన్వెస్టర్లు అయిదు రకాల వేల్యుయేషన్ విధానాలను ఉపయోగించవచ్చు. ఆప్షన్ ప్రైసింగ్ విధానం, మైల్‌స్టోన్ అనాలిసిస్ విధానం మొదలైనవి వీటిలో ఉంటాయి. దేశీ ఇన్వెస్టర్లకు ఈ అయిదు విధానాలు వర్తించవు. రూల్ 11 యూఏ ప్రకారం దేశీయ ఇన్వెస్టర్లకు ప్రస్తుతమున్న డీసీఎఫ్ (డిస్కౌంటెడ్ క్యాష్ ఫ్లో), ఎన్ఏవీ (అసెట్ నికర విలువ) విధానాలు వర్తిస్తాయి. ఎఫ్ఎంవీకి మించిన ధరకు షేర్లను విక్రయించడం ద్వారా స్టార్టప్‌లు సమీకరించిన నిధులపై వేసే పన్నును ఏంజెల్ ట్యాక్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది తొలుత దేశీ ఇన్వెస్టర్లకే పరిమితమైనప్పటికీ 2023–24 బడ్జెట్‌లో విదేశీ పెట్టుబడులను కూడా దీని పరిధిలోకి తెచ్చారు. దీన్ని అమల్లోకి తెచ్చే దిశగా కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తాజా నోటిఫికేషన్ జారీ చేసింది. అయిదు రకాల వేల్యుయేషన్స్ విధానాలను అందుబాటులోకి తేవడం వల్ల ఇన్వెస్టర్లకు పన్నులపరంగా కొంత వెసులుబాటు పొందే వీలు లభించగలదని డెలాయిట్ ఇండియా, నాంగియా అండ్ కో తదితర సంస్థలు తెలిపాయి.

డీమ్యాట్ నామినీ నమోదు గడువు పెంపు

డిసెంబర్ చివరి వరకు అవకాశం



న్యూఢిల్లీ: డీమ్యాట్ ఖాతాదారులు నామినేషన్‌కు సంబంధించి తమ ఎంపికను తెలియజేసేందుకు గడువును సెబీ డిసెంబర్ చివరి వరకు పొడిగించింది. వాస్తవానికి అయితే ఈ నెల 30తో ఈ గడువు ముగుస్తోంది. ప్రస్తుత డీమ్యాట్ ఖాతాదారులు తమ ఖాతాలకు సంబంధించి నామినీ నమోదు లేదంటే నామినీ నిలిపివేయడం ఏదో ఒక ఆప్షన్ ఇవ్వడం తప్పనిసరి. ఇందుకు సంబంధించి ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఇక ట్రేడింగ్ ఖాతాలకు నామినేషన్ ఎంపికను స్వచ్ఛందం చేస్తున్నట్టు సెబీ ప్రకటించింది. ట్రేడింగ్ ఖాతాలకు ఇవ్వడమా, ఇవ్వకపోవడమా అనేది ఇన్వెస్టర్ల అభీష్టానికే విడిచిపెట్టింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు, డిపాజిటరీలు, బ్రోకర్ల అసోసియేషన్‌లు, ఇతర భాగస్వాముల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ట్రేడింగ్ ఖాతాలకు నామినేషన్‌ను స్వచ్ఛందం చేసినట్టు సెబీ తెలిపింది. డీమ్యాట్ ఖాతాలకు సంబంధించి నామినేషన్ ఎంపిక గడువును డిసెంబర్ 31వరకు పొడిగించినట్టు ప్రకటించింది. ఇక ఫిజికల్‌గా షేర్లు కలిగిన వారు తమ ఫోలియోలకు సంబంధించి పాన్, నామినేషన్, కాంటాక్ట్ వివరాలు, బ్యాంక్ ఖాతా, స్పెసిమెన్ సిగ్నేచర్ (సంతకం)ను డిసెంబర్ 31 వరకు ఇవ్వొచ్చని సెబీ స్పష్టం చేసింది.

రూ.500 కోట్ల కంపెనీగా అవతరించడమే లక్ష్యం

ఇన్ఫినిటీ లెర్న్ బై చైతన్య ప్రకటన

హైదరాబాద్: శ్రీ చైతన్య ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్టప్ 'ఇన్ఫినిటీ లెర్న్ బై శ్రీ చైతన్య' 2025 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.500 కోట్ల కంపెనీగా అవతరించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఎడ్యుటెక్ రంగంలో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ 2022–23లో అద్భుతమైన పనితీరు కనబరిచినట్లు పేర్కొంది. 2021–22లో సంస్థ ఆదాయం రూ. 2.3 కోట్లు కాగా.. 2022–23లో రూ.100 కోట్లకు చేరిందని వివరించింది. ''వ్యవస్థాపక ఆశయం స్పష్టంగా ఉంది. ఎడ్‌టెక్ రంగంలో అత్యధిక పాఠకులను ఆకర్షించడమే కాకుండా 'చదువుకునేవారు నేర్చుకున్నారా లేదా?' అనే మార్గదర్శక సూత్రాన్ని అలాగే కొనసాగిస్తున్నాము. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులకు ప్రయోజనం కలిగించేలా విద్యాపరమైన అంతరాలను తొలగించగలిగాము'' అని లెర్న్ బై శ్రీ చైతన్య వ్యవస్థాపక సీఈఓ ఉజ్వల్ సింగ్ తెలిపారు.

66 వేల దిగువకు సెన్సెక్స్

- ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ
- పరిమిత శ్రేణిలో బలహీనంగా ట్రేడింగ్



ముంబై: ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందడంతో సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో బలహీనంగా కదలాడాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెంచాయి. ఇంట్రాడేలో 158 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్ చివరికి 78 పాయింట్లు నష్టపోయి 66వేల దిగువన 65,945 వద్ద స్థిరపడింది. నిఫ్టీ పది పాయింట్లను కోల్పోయి 19,665 వద్ద నిలిచింది. పారిశ్రామిక, మెటల్, ఎఫ్ఎంసీజీ, టెలికాం షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.693 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.715 కోట్ల షేర్లను కొన్నారు. వడ్డీరేట్ల పెంపు ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా కదలాడుతున్నాయి.

- మనోజ్ వైభవ్ జెమ్స్ ఎన్ జ్యువెల్లరీ ఐపీఓకు 2.25 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ మొత్తం 91.20 లక్షల ఈక్విటీలను జారీ చేయగా 2.05 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగతేతర కోటా 5.18 రెట్లు, రిటైల్ విభాగం 1.66 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి.
- నష్టాల మార్కెట్లో స్మాల్ క్యాప్ షేర్లు మెరిశాయి. శ్రేయాస్ షిప్పింగ్ 20%, ఐఎఫ్‌సీఐ 12%, కొచ్చిన్ షిప్‌యార్డ్ 11%, ఎన్ఐబీ 10%, ఓమాక్స్ 9% అశోకా బిల్డ్‌కాన్ 8%, ఎన్‌సీసీ, అపార్ ఇండస్ట్రీస్, ఎంటార్ షేర్లు 7% ర్యాలీ చేశాయి. బీఎస్ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే బీఎస్ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ అరశాతం వరకు లాభపడింది.
- గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ జెఫ్పరీస్.., షేరు టార్గెట్ ధరను రూ.4,000 నుంచి రూ.4,150కి పెంచడంతో ఐషర్ మోటార్స్ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలో 2.5% బలపడి రూ.3471 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 4.5% ర్యాలీ చేసి రూ.3539 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు యోచన నేపథ్యంలో డిమాండ్ రికవరీ ఆలస్యం అవ్వొచ్చనే అంచనాలతో ఐటీ రంగ షేర్లు డీలాపడ్డాయి. ఎంఫసిస్, కోఫోర్జ్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ 2–1% నష్టపోయాయి.
- బ్యాంక్ ఆఫ్ అమెరికా పాజిటివ్ అవుట్‌లుక్ కేటాయింపుతో వరుణ్ బేవరేజెస్ షేరు ఐదున్నర శాతం ర్యాలీ చేసి రూ.975 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి నాలుగున్నర శాతం లాభపడి రూ.967 వద్ద ముగిసింది. బీఎస్ఈ ఎక్స్ఛేంజీలో మొత్తం 29 లక్షల షేర్లు చేతులు మారాయి.
- రూపాయి విలువ రెండోరోజూ కరిగిపోయింది. డాలర్ మారకంలో 15 పైసలు బలహీనపడి 83.28 వద్ద స్థిరపడింది. క్రూడ్ ధరలు పెరగడం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, బలహీన ఈక్విటీ మార్కెట్ దేశీ కరెన్సీ క్షీణతకు కారణమయ్యాయి.

జిరోధా లాభం జూమ్

గతేడాది రూ. 2,907 కోట్లు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ స్టాక్ బ్రోకింగ్ ప్లాట్‌ఫామ్ జిరోధా మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. నికర లాభం 39 శాతం ఎగసి రూ. 2,907 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22)లో రూ. 2,094 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం సైతం 39 శాతం జంప్‌చేసి రూ. 6,875 కోట్లకు చేరింది. అంతక్రితం రూ. 4,964 కోట్ల టర్నోవర్ నమోదైంది. గతేడాది అత్యధిక వృద్ధిని సాధించినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) ఇప్పటివరకూ అటు ఆదాయం, ఇటు లాభదాయకతల్లో బిజినెస్ మందగించినట్లు జిరోధా సహవ్యవస్థాపకుడు, సీఈవో నితిన్ కామత్ పేర్కొన్నారు. గత మూడేళ్లలో ప్రస్తావించదగ్గస్థాయిలో ఆదాయం, లాభాలు సాధించేందుకు మార్కెట్లు ప్రధానంగా ఎఫ్అండ్‌వో విభాగం కారణమైనట్లు వివరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష





గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ మండలం నిడమర్రులోని ఓ ఇంటిలో వృద్ధుడికి బీపీ పరీక్ష చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం ఉలవపాడులో పూరిగుడిసెలో ఉన్న వృద్ధునికి బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



నంద్యాల జిల్లా కోవెలకుంట్ల రెండో సచివాలయం పరిధిలో వృద్ధురాలు నాట్ల తులశమ్మకు బీపీ చెక్ చేస్తున్న ఏఎన్ఎం బావమ్మ




పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఓ ఇంటి వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



విశాఖ తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని ఓ ఇంటి వద్ద వృద్ధురాలికి బీపీ చెక్ చేస్తున్న ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు తాత్కాలిక బ్రేక్

- బీజేపీ ఎంపీ జీవీఎల్ వెల్లడి



సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు చెప్పారు. గతంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడం లేదని, ఇప్పట్లో ఈ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారికంగా ప్రకటన రావలసి ఉందన్నారు. మంగళవారం ఆయన విశాఖలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో విశాఖ ఉక్కును లాభాల్లోకి ఎలా తీసుకురావాలన్న దానిపై కేంద్రం దృష్టి సారిస్తోందన్నారు. దీనిపై త్వరలో ప్రధానికి ఒక నివేదిక ఇస్తానని చెప్పారు. త్వరలో విశాఖ–వారణాశి మధ్య వారంలో 2 రోజులు నడిచే కొత్త రైలును ప్రారంభిస్తారని, కొన్నాళ్ల తర్వాత ఆ రైలు డైలీ నడిచే అవకాశం ఉందని ఎంపీ చెప్పారు.

'జన్మభూమి' రైలులో పొగలు

తాడేపల్లిగూడెం: హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు, నిప్పు రవ్వలు ఎగసి పడడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. హైదరాబాద్ నుంచి వస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం మధ్యాహ్నం 3.38 గంటలకు తాడేపల్లిగూడెం స్టేషన్‌కు చేరుకుంది. అయితే రైలు వెనుక నుంచి మూడో బోగీలో నెమ్మదిగా పొగలు, చిన్న చిన్న నిప్పురవ్వలు ఎగసిపడడాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తమై రైలును స్టేషన్‌లో నిలిపివేశారు. వెంటనే సమస్యను పరిష్కరించారు. అయితే.. ఈ క్రమంలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ ద్వారా విడుదలైన ఫోమ్ లాంటి పదార్థాన్ని చూసిన ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురై బోగీ నుంచి ప్లాట్‌ఫాంపైకి దిగిపోయారు. రైలును 4.18 గంటలకు తిరిగి ఇక్కడి నుంచి విశాఖపట్నానికి పంపించారు.

నకిలీ పత్రాల ముఠా అరెస్టు

- 15 ఏళ్లుగా దందా



నకిలీ పత్రాలను పరిశీలిస్తున్న ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: ఎమ్మార్వో సంతకం కావాలా.. రిజిస్ట్రార్ సంతకం కావాలా.. ఎప్పుడో చనిపోయిన వారి చేత ఇప్పుడు వీలునామా రాయించాలా.. మీకేం కావాలన్నా ఇక్కడ లభించును. దేని రేటు దానిదే. ఎప్పుడో పనిచేసి వెళ్లిపోయిన అధికారి సంతకానికి ఒక రేటు. ఇప్పుడు విధుల్లో ఉన్న అధికారి సంతకానికి మరో రేటంటూ నకిలీ పత్రాలు సృష్టించి విక్రయిస్తున్న ముఠాను ఒంగోలు పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ మలికా గర్గ్ వివరాలను మంగళవారం రాత్రి వెల్లడించారు.. నగరంలోని లాయరు పేటలో నివశించే చీతిరాల పూర్ణచంద్రరావు, రాజా పానగల్ రోడ్డుకు చెందిన అయినాబత్తిని యానాదిరావు, సంతపేటకు చెందిన గొర్రెపాటి రవీంద్రబాబు, సీతారాంపురానికి చెందిన మేడికొండూరు విష్ణువర్ధన్ ముఠాగా ఏర్పడి నకిలీ పత్రాలను విక్రయిస్తున్నారు. వీరి వద్ద ప్రభుత్వ అధికారులకు సంబంధించిన ఎలాంటి సంతకం కావాలన్నా దొరుకుతుంది. స్టాంపులు, స్టాంపు పేపర్లు లభిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వీరివద్ద దొరకని ప్రభుత్వ అధికారుల స్టాంపులంటూ ఏవీ ఉండవు. ఒకటి, రెండు సంవత్సరాల నుంచి కాదు ఏకంగా 15 ఏళ్లుగా వారు ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఓ కేసు విచారణలో భాగంగా పోలీసులు తీగ లాగితే డొంకంతా కదిలింది. రంగంలోకి రూరల్ సీఐ పి.భక్తవత్సలరెడ్డి ఆధ్వర్యంలో చీతిరాల పూర్ణచంద్రరావు ఇంటిని తనిఖీ చేయగా.. రిజిస్ట్రార్, తహసీల్దార్, వీఆర్వో, పంచాయతీ కార్యాలయాలకు సంబంధించిన ఆఫీస్ సీళ్లు, స్టాంపు వెండర్స్ లైసెన్స్ సీళ్లు, జనన మరణ సర్టిఫికెట్లు కట్టలు కట్టలుగా దొరికాయి. పాత ఖాళీ స్టాంప్ పేపర్లు లభ్యమయ్యాయి. నిందితులను అరెస్టు చేశారు. కేసులో మరింతమంది నిందితులు ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామమని ఎస్పీ మలికా గర్గ్ చెప్పారు. అగ్రిమెంట్లు, వీలునామాల విషయంలో ఏదైనా అనుమానాలు ఉంటే వెంటనే ఒంగోలు డీఎస్పీ దృష్టికి తీసుకురావాలన్నారు.

రెండు రోజుల్లో రూ.28 లక్షలు లూటీ!

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై సైబర్ నేరగాళ్ల పంజా

చిత్తూరు అర్బన్: ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ ఇస్తామని చెప్పి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.28.16 లక్షలు కాజేశారు. రెండు రోజుల వ్యవధిలోనే ఈ మొత్తాన్ని లాక్కొని ముఖం చాటేయడంతో బాధితుడు మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. చిత్తూరు రామ్‌నగర్ కాలనీకి చెందిన ఉదయ్ కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. వర్క్ ఫ్రమ్ హోం కారణంగా కొద్ది రోజులుగా ఇంటి నుంచే పని చేస్తున్న ఇతని మొబైల్‌కు రెండు రోజుల కిందట ఒక మెస్సేజ్ వచ్చింది. ఆన్‌లైన్ నుంచి ఓ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులో పెట్టుబడి పెడితే 30 శాతం వరకు వడ్డీ ఇస్తామని అందులో ఉంది. దీంతో యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న ఉదయ్ కుమార్ తొలుత రూ.1,500 పెట్టాడు. దీనికి వడ్డీ తన బ్యాంకు ఖాతాలో జమచేయడంతో నమ్మిన ఉదయ్ కుమార్ వెనువెంటనే రూ.15 వేలు, రూ.30 వేలు, రూ.లక్ష, రూ.3 లక్షలు ఇలా పెడుతూ పోయాడు. ఓ దశలో ఆన్‌లైన్‌లో సరిగా పెట్టుబడి పెట్టకపోవడంతో పాయింట్లు తగ్గాయని, రూ.5 లక్షలు పంపాలని చెప్పగా ఆ మొత్తం కూడా పంపించేశాడు. ఇలా రెండు రోజుల్లో ఏకంగా రూ.28.16 లక్షలు సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాల్లో జమచేశాడు. ఎంతకూ వడ్డీ రాకపోవడంతో అనుమానం వచ్చి ఫోన్‌చేస్తే ఆ నంబర్లు పనిచేయలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. నిందితుడు చెప్పిన బ్యాంకు ఖాతాలు హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆయుష్ వెల్‌నెస్ కేంద్రాలు

- ఆయుష్ శాఖ కమిషనర్ డాక్టర్ రాజేంద్రకుమార్



కానుమోలులోని ఆయుర్వేద ఆస్పత్రిని పరిశీలిస్తున్న డాక్టర్ రాజేంద్రకుమార్ తదితరులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆయుష్ వెల్‌నెస్ కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపరిచి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయుష్ శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్‌బీ రాజేంద్రకుమార్ తెలిపారు. ఆయన మంగళవారం బాపులపాడు మండలం కానుమోలులోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌బీ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ అల్లోపతికి ప్రత్యామ్నాయంగా ప్రజలకు ఆయుర్వేదం, హోమియో, యునానీ, సిద్ధ, యోగ, నేచురోపతి వంటి వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నేషనల్ ఆయుష్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 206 ఆయుష్ వెల్‌నెస్ సెంటర్లను ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. తొలి దశలో 110 ఆస్పత్రులను ఎంపిక చేసి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు రూ.5లక్షలు చొప్పున నిధులు కేటాయించామని, 20 రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించామని పేర్కొన్నారు. అవసరమైనచోట పంచకర్మ చికిత్స, యోగా శిక్షకులు, సహాయ సిబ్బందిని నియమిస్తున్నామని చెప్పారు. కానుమోలులో ఎన్ఆర్ఐ నూకల పరమహంస సోదరుల విరాళంతో రూ.2.50 లక్షలతో యోగా హాల్ నిర్మించగా, దాతల ఆర్థికసాయంతో సోలార్ విద్యుత్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయుష్ శాఖ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ వై.శేఖర్, అకౌంట్స్ అధికారి ఎ.భుజంగరావు, ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

10లక్షల ఉద్యోగాలివ్వడమే ప్రధాని లక్ష్యం

- కేంద్ర సహాయ మంత్రులు ఫగ్గన్‌సింగ్ కులస్తే, నారాయణస్వామి



విజయవాడలో నియామకపత్రాలను అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ)/తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): దేశంలోని యువతకు ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరులోపు 10 లక్షల ఉద్యోగాలు ఇవ్వడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ప్రతి నెల రోజ్‌గార్ యోజన మేళాలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే, కేంద్ర సాంఘిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి ఎ.నారాయణస్వామి చెప్పారు. తపాలా శాఖ ఆధ్వర్యాన మంగళవారం విజయవాడ రైల్వే ఆడిటోరియంలో, విశాఖపట్నం సాలగ్రామపురంలోని పోర్టు సాగరమాల కన్వెన్షన్‌లో 9వ రోజ్‌గార్ యోజన మేళాలు నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాల్లో మొత్తం 379 మందికి ఉద్యోగ నియామకపత్రాలు అందించారు. విజయవాడలో జరిగిన రోజ్‌గార్ మేళాలో కేంద్ర సహాయ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే పాల్గొని 216 మందికి నియామకపత్రాలు అందించారు. విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం శారదామూర్తి, మంగళగిరి ఎయిమ్స్ డీన్ డాక్టర్ శ్రీమంత కుమార్ దాస్, పోస్టల్‌శాఖ అకౌంట్స్ జనరల్ రోజ్‌మేరి పాల్గొన్నారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి ఎ.నారాయణస్వామి పాల్గొని 163మందికి నియామకపత్రాలు అందించారు. ఏపీ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బి.రాములు, కస్టమ్స్ చీఫ్ కమిషనర్ రిషి గోయల్, జీఎస్టీ చీఫ్ కమిషనర్ ఎంఆర్ఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ రోజ్‌గార్ మేళాలను ఉద్దేశించి ప్రధాని మోదీ వర్చువల్‌గా సందేశమిచ్చారు. కాగా, కేంద్ర సహాయ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకున్నారు.

తెలంగాణ

ఎన్ఆర్ఐ కోటా ఎంబీబీఎస్ సీట్లలో ఇతరులకూ అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మిగిలిపోయిన 128 ఎన్ఆర్ఐ కోటా ఎంబీబీఎస్ సీట్లను ఇతరులకు కూడా కేటాయించాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం కీలక నిర్ణయం తీసుకుంది. వాస్తవంగా ఈ సీట్లను ఎన్ఆర్ఐ ధ్రువీకరణ పత్రం ఉన్నవారికే కేటాయిస్తారు. గతేడాది వరకు అన్ని విడతల కౌన్సెలింగ్ పూర్తయి, ఇలా మిగిలిన సీట్లను ఆయా ప్రైవేటు మెడికల్ కాలేజీలే నింపుకొనేవి. కానీ ఇప్పుడు అలా నింపుకొనే పద్ధతికి జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బ్రేక్ వేసింది.

ముందుకురాని విద్యార్థులు..

రాష్ట్రంలో 4,825 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. వాటిల్లో 15 శాతం అంటే 723 ఎన్ఆర్ఐ కోటా సీట్లున్నాయి. దాదాపు 12.20 లక్షల ర్యాంకు వచ్చిన వారికి ఎన్ఆర్ఐ కోటాలో సీట్లు లభించాయి. అంతకంటే ఎక్కువ ర్యాంకున్న వారికి కూడా సీట్లు వచ్చే అవకాశమున్నా విద్యార్థులు ముందుకు రావడం లేదు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రికార్డు స్థాయిలో కానుకలు, మొక్కుబడులను సమర్పిస్తున్నారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను మంగళవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 22 రోజులకు గాను రూ.2,92,28,842ల నగదు లభించింది. సరాసరిన రోజుకు రూ.13.28 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు చెప్పారు. 740 గ్రాముల బంగారం, 6.95 కిలోల వెండి, భారీగా ఇతర దేశాల కరెన్సీ లభించినట్లు ఆలయ ఈవో భ్రమరాంబ తెలిపారు. ఈ–హుండీ ద్వారా రూ.89,193 విరాళాలు దేశంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు సమర్పించినట్లు చెప్పారు.

అక్టోబర్ నుంచి గోధుమ పిండి పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 1.48 కోట్ల బియ్యం కార్డుదారులకు అక్టోబర్ నుంచి ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని పంపిణీ చేయనున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో కార్డుకు కిలో ప్యాకెట్‌ను రూ.16 చొప్పున సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని మున్సిపాల్టీల్లో సరఫరా చేస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోని కార్డుదారులకు కూడా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ నెలాఖరుకు ఆయా జిల్లాల్లోని రేషన్ దుకాణాల పరిధిలోని ఎండీయూల్లో గోధుమ పిండి అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. రైస్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీలో భాగంగా కేంద్ర ప్రభుత్వాన్ని 50వేల టన్నులు కేటాయించాలని ప్రతిపాదించామని తెలిపారు. దేశ వ్యాప్తంగా పప్పుధాన్యాల కొరత కారణంగా కేటాయింపులు ఆలస్యమైనట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలతో అక్టోబర్ నుంచి గిరిజన జిల్లాలైన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యంలోని 10 గిరిజన మండలాలు అయిన భామిని, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, సాలూరు, సీతంపేటలోని 1.86 లక్షల కార్డులకు కిలో రూ.67 చొప్పున కందిపప్పును అందజేయనున్నట్టు తెలిపారు.



చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు



తిరుమల ఆలయంలో ధ్వజావరోహణం నిర్వహిస్తున్న వేద పండితులు

చక్రస్నానంతో సేద తీరిన శ్రీనివాసుడు

ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

పుష్కరిణిలో పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. మంగళవారం తెల్లవారుజాము మూడు గంటల నుంచే పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవంతో స్వామివారు వరాహస్వామి ఆలయానికి చేరుకున్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ వాహనాల్లో ఊరేగి అలసిసొలసిన శ్రీవారు స్నపన తిరుమంజనం సేవలో సేద తీరారు. జీయర్లు, ఆలయ అర్చకుల నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పను సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. వైదికంగా పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు సాగింది. అనంతరం మంగళవాయిద్యాల నడుమ, వేదపండితుల వేదఘోష, అశేషభక్తజన గోవింద నామస్మరణల మధ్య గర్భాలయంలోని మూలమూర్తి అంశమైన సుదర్శన చక్రత్తాళ్వార్‌కు పుష్కరిణిలో పవిత్ర స్నానం చేయించారు. భక్తులు సైతం ఈ పుష్కరిణిలో పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు ఆచరించి పునీతులయ్యారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు. కాగా, తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల మధ్యలో ఆగమ శాస్త్రం ప్రకారం గరుడపతాకాన్ని కిందకు దించి బ్రహ్మోత్సవాలు ముగించారు.

కమనీయం.. గణనాథుని కల్యాణం

అశ్వ వాహనంపై సిద్ధి, బుద్ధి, వినాయక స్వామి విహారం



మంగళసూత్రాలు భక్తులకు చూపిస్తున్న అర్చకులు

యాదమరి (చిత్తూరు జిల్లా): స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి తిరుకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. వేకువజామున మూలాస్థానంలోని స్వయంభు వినాయకునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ ఉభయదారుల ఆధ్వర్యంలో మూలమూర్తికి అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం అలంకార మండపంలో పచ్చటి తోరణాలు, అరటి చెట్ల మధ్య బ్రహ్మ మానస పుత్రికలైన సిద్ధి, బుద్ధిలతో స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చక వేదపండితులు సోమశేఖర్ స్వామి, సుబ్బారావు నిర్వహించారు. అనంతరం ఉభయదారులు, ఆలయ అధికారులు నూతన వధూవరులను పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, మంగళవారం రాత్రి సిద్ధి, బుద్ధి, వినాయక స్వామివారు అశ్వవాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగారు.

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

వినాయక స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ధ్వజావరోహణతో ముగియనున్నాయి. గురువారం ఉదయం నుంచి స్వామివారి ప్రత్యేక ఉత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభం కానున్నాయి. గురువారం నుంచి అక్టోబర్ 8 వరకు సిద్ధి, బుద్ధి సమేతంగా వినాయక స్వామి పలు వాహనాలపై ఊరేగనున్నారు.

అమ్మవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

నేటి నుంచి 3 రోజుల పాటు నిర్వహణ



అంకురార్పణ ఘట్టానికి వెళ్తున్న అమ్మవారు

తిరుచానూరు(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలకు మంగళవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఆలయంలో బుధవారం నుంచి 3 రోజుల పాటు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం,సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణలను పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ఏడాది పొడవునా పలు క్రతువుల్లో తెలియక జరిగిన దోషాల నివారణకు ప్రతి ఏడాదీ 3 రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పవిత్ర ప్రతిష్ట, గురువారం పవిత్ర సమర్పణ, శుక్రవారం పూర్ణాహుతి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో పాల్గొనదలచిన భక్తులు ఒక్కొక్కరు రూ.750 చెల్లించి ఒక్కరోజు ఈ పవిత్రోత్సవాల ఆర్జిత సేవలో పాల్గొనవచ్చునని ఆలయ అధికారులు తెలిపారు. వీరికి 2 లడ్డూలు, 2 వడలు బహుమానంగా అందజేస్తారు.

గుండెపోటుతో వీర జవాను మృతి

నేడు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



గోపరాజు (ఫైల్)

పల్లెకోన(భట్టిప్రోలు): బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లెకోనకు చెందిన జవాను పురమా గోపరాజు (26) సోమవారం రాజస్తాన్‌లోని జస్సల్ మీర్ పాకిస్తాన్ బోర్డర్‌లో నిర్వహిస్తున్న ట్రెనింగ్ ఎక్స్‌ర్‌సైజ్‌లో అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. గోపరాజు ఏడేళ్ల క్రితం మిలటరీలో చేరారు. ప్రస్తుతం మద్రాస్–6 యూనిట్‌లో లాన్స్ నాయక్‌గా పనిచేస్తున్నారు. భౌతికకాయాన్ని విమానం ద్వారా హైదరాబాద్‌కు మంగళవారం రాత్రి తీసుకురానున్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని మిలటరీ హాస్పటల్‌లో మృతదేహాన్ని ఉంచనున్నారు. వీర జవాన్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించిన అనంతరం సైనిక లాంఛనాలతో ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గోపరాజు అవివాహితుడు. గోపరాజు మృతదేహానికి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు నివాళులర్పించనున్నారు. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, రాష్ట్ర అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు తెలిపారు. కాగా, కుమారుడి మరణంతో తల్లిదండ్రులు నాంచారయ్య, మంగమ్మ, ఇతర కుటుంబసభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. వీరజవాన్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

రూ.3 కోట్ల గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్టు, నలుగురు పరారీ
- అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం కుడుమసారి పంచాయతీ నిమ్మపాడు వద్ద రూ.మూడు కోట్ల విలువజేసే 1,400 కిలోల గంజాయి పట్టుకున్నట్లు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. అన్నవరం ఎస్ఐ రమణ తమ సిబ్బందితో తెల్లవారుజామున నిమ్మపాడు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, అటుగా వస్తున్న బొలేరో వాహనం పోలీసులను చూసి వెనుదిరిగింది. దాంతో పోలీసులు వెంబడించి పట్టుకుని గంజాయి తరలిస్తున్నట్లుగుర్తించారు. ఒడిశా రాష్ట్రం దుగుడుపల్లి నుంచి నర్సీపట్నం తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. కాగా, నిందితుల్లో నలుగురు పరారీ కాగా డ్రైవర్ భీమసింగికి చెందిన కూడా ప్రసాద్, మధ్యవర్తిగా పనిచేసిన సిందేరి చిన్నయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించామని ప్రతాప్‌శివకిశోర్ తెలిపారు. వారి నుంచి రూ.లక్షతోపాటు రెండు సెల్‌ఫోన్లు, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే గంజాయి సాగు చేసినా, తరలించినా, గంజాయి ముఠాలతో సంబంధం ఉన్న వారి సమాచారాన్ని టోల్‌ఫ్రీ 9381123100 నంబరుకు చెప్పాలని ఎస్పీ తుహీన్‌సిన్హా కోరారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే సీఎం ఆకాంక్ష

వైద్యఆరోగ్యశాఖ చీఫ్ సెక్రటరీ టి.కృష్ణబాబు



నకరికల్లులో గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్యఆరోగ్యశాఖ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

నకరికల్లు: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే ఆకాంక్షతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తీసుకువచ్చారని వైద్య ఆరోగ్యశాఖ చీఫ్ సెక్రటరీ టి.కృష్ణబాబు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటా వైద్య సిబ్బంది చేపడుతున్న ఆరోగ్య సర్వేను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌తో కలసి నకరికల్లు–2 సచివాలయం పరిధిలో మంగళవారం ఆయన పరిశీలించారు. బీపీ, షుగర్, రక్తశాతం పరీక్షలు చేయడాన్ని నేరుగా గమనించారు. కార్యక్రమం లక్ష్యం, ఆవశ్యకత గురించి ప్రజలకు ఏ మేరకు అవగాహన కల్పిస్తున్నారో ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రాధాన్యతను ఆయనే ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేశారు. వైద్యశాలలో వసతులు, సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న మందులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ డి.రవి, ఫ్యామిలీ ప్లానింగ్ నోడల్ అధికారి హనుమకుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ఉత్తమ సేవా పురస్కారాలు

- 29న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం



పెళ్లకూరు సాత్విక



కురుబ జయమారుతి

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు జాతీయ ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపికైనట్లు ఏపీ జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ పి.అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని జాతీయ సేవా పథకం కింద వివిధ సేవలను సమర్థవంతంగా నిర్వహించినందుకు 2021–22 గానూ కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ పురస్కారాలను ప్రకటించిందన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విక్రమ సింహపురి వర్సిటీ పరిధిలోని జగన్స్ డిగ్రీ–పీజీ కళాశాలకు చెందిన పెళ్లకూరు సాత్విక, అనంతపురం జిల్లా శ్రీకృష్ణ దేవరాయ వర్సిటీకి చెందిన కురుబ జయమారుతి ఉత్తమ వలంటీర్లుగా ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 29న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ము ఇద్దరు వలంటీర్లకు రూ.లక్ష నగదు, మెడల్, సర్టిఫికెట్‌తో కూడిన పురస్కారాన్ని ప్రదానం చేస్తారన్నారు.

రేపాకకు గుర్రం జాషువా సాహితీ పురస్కారం



తిరువూరు: అభ్యుదయ రచయితల సంఘ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్‌కు ఆంధ్రప్రదేశ్ బహుజన రచయితల వేదిక గుర్రం జాషువా జాతీయ సాహితీ పురస్కారానికి ఎంపిక చేసింది. ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన రేపాక తెలుగు, హిందీ భాషల్లో పలు రచనలు చేయడంతోపాటు ప్రతిజ్ఞ (భారతదేశం నా మాతృభూమి) రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత చరిత్రను రచించారు. ఆకాశవాణిలో కవితలు, రచనలు అందించడమే కాక పలు పత్రికల్లో ఆయన కవితలు ప్రచురితమయ్యాయి.

3న పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలిన సీట్లను అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్లతో భర్తీ చేస్తున్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 30న ఆయా పాలిటెక్నిక్ కళాశాలల నుంచి అందుబాటులో ఉన్న సీట్ల వివరాలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

ఫుట్‌బాల్‌కు అత్యంత ఆదరణ కల్పిస్తాం..

- ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్
- అనంతలో అట్టహాసంగా ప్రారంభమైన సబ్–జూనియర్ బాలుర జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ కోటగిరి శ్రీధర్, కలెక్టర్ గౌతమి

అనంతపురం: రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడకు అత్యంత ఆదరణ కల్పిస్తామని ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. అనంతపురం నగర శివారులోని అనంత క్రీడా గ్రామం (ఆర్డీటీ స్టేడియం)లో మంగళవారం ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్‌ఎఫ్) ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలుర జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ.. మన గ్రామీణ ప్రాంతాలకు సరిపోయే క్రీడ ఫుట్‌బాల్ అని, ఇందులో యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వివిధ స్థాయిల్లో పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇకనుంచి క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ కూడా ఆంధ్రప్రదేశ్‌లో క్రియాశీలకమైన క్రీడగా ఉండాలని భావిస్తున్నామన్నారు. ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ ఫైనల్‌కు చేరితే మ్యాచ్‌ను వీక్షించాల్సిందిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తామని చెప్పారు. కలెక్టర్ ఎం.గౌతమి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ, శాప్ బోర్డు డైరెక్టర్ డానియల్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఆంధ్రప్రదేశ్, సిక్కిం జట్ల మధ్య తొలి మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ 1–1 స్కోరుతో డ్రాగా ముగిసింది.

కవిత్రయం తరువాత సిసలైన కవి జాషువా

అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విజయబాబు, వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: కవిత్రయం తరువాత తెలుగులో సిసలైన కవి గుర్రం జాషువా అని అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యూనివర్సిటీ తెలుగు విభాగం, ఏపీ అధికార భాషా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి ముందస్తు వేడుకలు మంగళవారం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన విజయబాబు మాట్లాడుతూ.. తాను ఎదుర్కొన్న ఛీత్కారాలను సత్కారాలుగా మలచుకున్న దార్శనికుడు జాషువా అని చెప్పారు. వీసీ పి.రాజశేఖర్ మాట్లాడుతూ.. జాషువా విశ్వజననీయమైన రచనలు చేశారన్నారు. జాషువా తన సాహిత్యం ద్వారా విశ్వాన్ని జాగృతం చేశారన్నారు. రెక్టార్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, పాలక మండలి సభ్యురాలు సీహెచ్.స్వరూపరాణి, సీడీసీ డీన్ కె.మధుబాబు, ప్రిన్సిపాల్స్ పి.సిద్దయ్య, శ్రీనివాసరెడ్డి, ప్రమీలారాణి ప్రసంగించారు.

సాహితీ పురస్కారాలు ప్రదానం

తెలుగు భాషా సాహిత్యంలో విశేష సేవలు అందించిన దుగ్గినపల్లి ఎజ్రయ్య, కొమ్మవరపు విల్సన్ రావు, విడదల సాంబశివరావు, పోగుల విజయశ్రీ, కొండపల్లి సుదర్శనరాజు, గుమ్మ సాంబశివరావు, కాకాని సుధాకర్, సీహెచ్ స్వరూపరాణి, గుమ్మడి విజయ్‌కుమార్, డి.అనిల్‌కుమార్, పీవీ సుబ్బారావుకు సాహితీ పురస్కారాలు ప్రదానం చేశారు. వ్యాసరచన, వక్తృత్వం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

విమాన టికెట్లపై ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రాయితీ

సాక్షి, అమరావతి: ఐఆర్‌సీటీసీ 24వ వ్యవస్థాపక, ప్రపంచ పర్యాటక దినోత్సవాలను పురస్కరించుకుని విమాన టికెట్ బుకింగ్‌లపై జీరో కన్వీనియన్స్ ఫీజు సౌలభ్యాన్ని కల్పిస్తున్నట్టు ఐఆర్‌సీటీసీ విజయవాడ ప్రాంతీయ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. బుధవారం (నేటి)లోగా ఐఏటీఏ సర్టిఫైడ్ వెబ్‌సైట్ www.air.irctc.co.inలో దేశీయ, అంతర్జాతీయ విమాన టికెట్లను బుక్ చేసుకున్న వినియోగదారులకు జీరో కన్వీనియన్స్ ఫీజు వర్తిస్తుందని పేర్కొంది. వీటితోపాటు వివిధ బ్యాంకుల కార్డు లావాదేవీలపై విమాన టికెట్ల ధరల్లో రూ.2 వేల వరకు రాయితీలు పొందవచ్చని పేర్కొంది. ప్రతి విమాన టికెట్‌పై రూ.50 లక్షల ప్రయాణ బీమాతో పాటు ప్రభుత్వ అధికారులకు సెలవు ప్రయాణ రాయితీ, డిఫెన్స్ కోటాలో ప్రత్యేక టికెట్లను అందుబాటులో ఉంచినట్టు వివరించింది. భవిష్యత్ పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని 100 రోజుల్లోపు విమాన టికెట్ బుకింగ్‌లను తీసుకొచ్చింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

కావేరి నీటిని తమిళనాడుకు వదలొద్దు


వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: కావేరి నీటిని తమిళనాడుకు విడుదల చేయరాదని కర్ణాటక సేన డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు రమేష్ మాట్లాడారు. కావేరి జలాశయంలో నీటి నిల్వ తక్కువగా ఉన్నందున రాష్ట్రంలోని రైతులకు వ్యవసాయానికి సరిపడా నీరు లేనప్పుడు ప్రభుత్వం తమిళనాడుకు నీటిని వదలడం సరికాదన్నారు. నిత్యం 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయకుండా నిలిపివేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

అదుపు తప్పిన బస్సు


ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కకు జారిన దృశ్యం

కంప్లి: పాఠశాల, కళాశాలల విద్యార్థులతో వెళుతున్న ఆర్టీసీ బస్సుకు డ్రైవర్ సమయస్ఫూర్తితో త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం హరపనహళ్లి డిపో బస్సు విద్యార్థులతో హరపనహళ్లి తాలూకాలోని అలమరసికెరె మార్గం మీదుగా ఎప్పటిలానే వెళుతుండగా చెరువు గట్టు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి డ్రైవర్ మౌనేష్ కుడి వైపునకు బస్సును తిప్పి వెంటనే నిలిపి వేయడంతో బస్సుతో పాటు అందులో ప్రయాణిస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు.

డిసెంబరులో తెలుగు జాతీయ సదస్సు

శివాజీనగర: రాష్ట్రేతర తెలుగు సమాఖ్య, విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో బెంగళూరులో డిసెంబర్ 23, 24 తేదీల్లో తెలుగు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో దేశంలోని అన్ని తెలుగు సంఘ సంస్థల నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొననున్నారని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు ఏ.రాధాకృష్ణరాజు తెలిపారు. ప్రారంభోత్సవానికి పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును ఆహ్వానించినట్లు తెలిపారు. ఇంకా అనేక రంగాలకు చెందిన తెలుగు ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. సాహిత్యం, సంస్కృతి, భాష గురించి సదస్సులు ఉంటాయన్నారు. ఆదికేశవుల నాయుడు, సీ.ఏ.వరదరాజులు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

చేతులతో వేడి పాయసం వడ్డింపు


పాయసాన్ని చేతులతో కలిపి వడ్డిస్తున్న స్వామీజీ

రాయచూరు రూరల్: సలసలా కాగుతున్న వేడి పాయసాన్ని చేతులతో కలిపి వడ్డించిన ఘటన బాగల్‌కోట జిల్లా జమఖండి సమీపంలోని మైగూరులో జరిగింది. సోమవారం రాత్రి చక్రవర్తి సదాశివమఠం జాతర మహోత్సవ సమయంలో కోలూరు చిక్కయ్య గురుబసయ్య హిరేమఠ్ స్వామీజీ తన చేతులతో వేడి వేడి పాయసాన్ని కలిపి వడ్డించడం భక్తులకు ఆశ్చర్యం కలిగించింది. చేతిలో ఎలాంటి గరిట సాయం లేకుండానే భక్తుల జయజయ ధ్వానాల మధ్య స్వామీజీ ఈ కార్యాన్ని నెరవేర్చారు. కాగా వేలాది మంది భక్తులు సదాశివ మఠం జాతర మహోత్సవంలో పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో జయకేతనం


చాంపియన్స్‌గా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికను అందజేస్తున్న అతిథులు

బళ్లారి రూరల్: జిల్లా పీయూ విద్యా శాఖ, ఇండిపెండెంట్ పీయూ(బెస్ట్) కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన జిల్లా స్థాయి పీయూ కళాశాలల క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. కంప్లి, కురుగోడు, బళ్లారి, సండూరు, సిరుగుప్ప తాలూకా క్రీడాకారులకు నిర్వహించిన పోటీల్లో ఓవరాల్‌గా బళ్లారి తాలూకా విద్యార్థులు విజేతలుగా నిలిచారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన బళ్లారి తాలూకా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు అర్హత సాధించారు. విజేతలకు జిల్లా పీయూ విద్యా శాఖ ఉప సంచాలకుడు టి.పాలాక్షి జ్ఞాపికను, పతకాన్ని అందజేశారు. జిల్లా క్రీడాధికారి రహమతుల్లా, బెస్ట్ కళాశాల ప్రిన్స్‌పాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్స్‌పాల్ జి.శ్రీనివాస రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్స్‌పాళ్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాచనగరిలో వినూత్న ధర్నాలు

- కావేరి జలాల విడుదలపై ఆగ్రహం
- సామూహిక భజనలు చేస్తూ నిరసన
- వెంటనే నీటి విడుదలను నిలిపి వేయాలని డిమాండ్


తపాలా కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం


కరవే స్వాభిమాని సేనె కార్యకర్తల నిరసన

మైసూరు: తమిళనాడుకు కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ మంగళవారం మైసూరు నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో పోరాట సంస్థలు, రైతు సంఘాలు వినూత్న ధర్నా నిర్వహించారు. మంగళవారం మళ్లీ 18 రోజుల పాటు మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరి నీటి నిర్వహణ ప్రాధికార ఆదేశించడంతో స్థానిక పోరాట సంస్థలు మండిపడుతున్నాయి.

స్టాలిన్ దిష్టిబొమ్మతో నిరసన :
బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, సామూహిక భజనలు చేస్తూ తమిళనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా జలాశయాలు వెలవెలపోతున్నాయని, ఇటువంటి తరుణంలో ప్రజల జీవనాడి కావేరిలో కూడా నీరు అడుగంటిందని, ఈ సమయంలో కోర్టుల్లో సరైన వాదనలు వినిపించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు మండిపడ్డారు. తమిళనాడు సీఎం స్టాలిన్ దిష్టిబొమ్మతో ఆందోళనకారులు శవయాత్ర నిర్వహించారు. ఇక గందధగుడి ఫౌండేషన్ సభ్యులు కూడా ధర్నా నిర్వహించారు. మైసూరు జిల్లా పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ నిరసన వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, తమిళనాడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

టి.నరసిపుర బంద్ విజయవంతం :
తమిళనాడుకు కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ కబిని కావేరి హితరక్షణ సమితితోపాటు వివిధ పోరాట సంఘాలు, కన్నడ సంఘాలు మంగళవారం మైసూరు జిల్లాలోని టీ నరసిపుర పట్టణంలో బంద్ నిర్వహించాయి. అన్ని కార్యాలయాలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్ పాటించారు.

మండ్యలో ఫొటోగ్రాఫర్ల ధర్నా
మండ్య: కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ ఫొటోగ్రాఫర్లు మండ్య నగరంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. నగరంలోని సిల్వర్ జూబ్లీ పార్కుకు చేరుకున్న వారు మానవహారం నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. అనంతరం జిల్లా అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

గురుభవన్‌ను నిర్మిస్తాం


పాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: జిల్లాలో ఎన్నో ఏళ్లుగా మరుగున పడిన గురుభవన్ నిర్మాణాన్ని ఖచ్చితంగా పూర్తి చేస్తామని, ఇందుకు రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసి ఉపాధ్యాయుల ఆశయాలకు అనుగుణంగా భవన నిర్మాణం జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ, విద్యా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల కృషి వల్లే దేశాభివృద్ధి సాధ్యమని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ఉపాధ్యాయ స్థాయి నుంచి రాష్ట్రపతి దాకా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని కొనియాడారు. తల్లి, తండ్రి తర్వాత గురువు స్థానం ఎంతో గొప్పదన్నారు. అలాంటి గురువులు ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపుతున్నారన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపమేయర్ బి.జానకి, హనుమక్క, ఎం.శివాజీరావ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

- వర్సిటీల్లో విద్యార్థులకు బంగారు భవిష్యత్
- వైస్‌చాన్సలర్ డాక్టర్ టీఎస్.నాగభూషణ


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్‌చాన్సలర్ యశ్వంత్ భూపాల్ తదితరులు

సాక్షి,బళ్లారి: విద్యతోనే అభివృద్ధి సాధ్యం అని, ఆ దిశగా ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా మారాలని కిష్కింధ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ టీఎస్ నాగభూషణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కిష్కింధ విశ్వవిద్యాలయంలో మొదటి బ్యాచ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అమెరికాలో అత్యంత ఉన్నత విద్యాభ్యాసాలు ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. మన దేశంలో కూడా ఇటీవల ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులకు బంగారు బాటలు వేస్తున్నాయన్నారు. కిష్కింధ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఉన్నత స్థాయికి చేరుకొనే అవకాశం ఉంటుందన్నారు. విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ యశ్వంత్ భూపాల్, వైజే.పృథ్వీరాజ్ భూపాల్, అశోక్ భూపాల్, డాక్టర్ వీజే.భరత్, అమరరాజ్ భూపాల్, డాక్టర్ యూ.ఈరన్న, డాక్టర్ ఎస్‌బీ.కామశెట్టి, డాక్టర్ అన్నంరాజు, కాశీ విశ్వనాథ్, పీ.అమరేశయ్య, ప్రొఫెసర్ వెంకటేశులు, డాక్టర్ కేఎస్ఆర్.శ్రీధర్, డాక్టర్ ఎస్.మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో భీమాకు వరద


నీట మునిగిన వీరాంజనేయ ఆలయం

రాయచూరు రూరల్: గత రెండు రోజుల నుంచి యాదగిరి జిల్లాలో జోరుగా వానలు కురుస్తున్నాయి. దీంతో భీమా నదికి వరద పోటెత్తింది. కళ్యాణ కర్ణాటకలోని యాదగిరి, రాయచూరు జిల్లాల్లో పూర్తి స్థాయిలో వరద నీరు చేరడంతో భీమా నదిలోకి 5 వేల క్యూసెక్కుల నీరు వదిలారు. యాదగిరి జిల్లా గురుసణిగి వద్ద ఆరు గేట్లను తెరిచారు. నదీ తీర ప్రాంతంలోని వీరాంజనేయ, కంగాళేశ్వర ఆలయాలు నీట మునిగాయి. నదీ పరివాహక జిల్లాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక


ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

కంప్లి: పట్టణంలోని 6వ వార్డు ప్రభుదేవర సంస్థాన విరక్తమఠం పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న కే.నవ్య, కే.పూజ యోగా పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎం అరుధంతి ఇరువురిని అభినందిస్తూ ప్రతి విద్యార్థిని యోగా పట్ల ఆసక్తి చూపి ఇలా రాష్ట్ర స్థాయికి ఎంపికై పాఠశాల కీర్తిని పెంచాలని కోరారు.

నిమజ్జనాలతో జలకాలుష్యం


నదిలో గణేష్ విగ్రహ నిమజ్జనం చేసిన దృశ్యం

కంప్లి: ఓ వైపు సరైన వర్షాలు లేక జలాశయాలు నిండక తాగునీటి కోసం పరితపించాల్సిన పరిస్థితి ఎదురైంది. ఏటా తుంగభద్ర జలాశయం ఆగస్టు నెలలోనే నిండుకుండలా ప్రజలకు ఎంతో ఆనందం కల్గించేది. అయితే ఈ ఏడాది పరిస్థితి తారుమారైంది. జలాశయంలో నీటి కొరత వల్ల నదికి చాలీచాలని విధంగా నీటిని వదులుతున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో కంప్లి కోట ప్రాంతాన గల నదిలో గణేష్ నిమజ్జనాలు జోరుగా చేయడంతో మట్టి విగ్రహాలు నెమ్మదిగా కరుగుతూ మరోవైపు పీఓపీ విగ్రహాలు నదిలో నీటిపై తేలుతుండడంతో నదిలో నీరు కలుషితమవుతోంది. ఈ నీటిని తాగే పట్టణవాసులు, నదీ పరివాహక ప్రాంత వాసులకు అంటువ్యాధుల ముప్పు తప్పదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి ప్యాసింజర్ సేవలు పునరారంభం

హుబ్లీ: గతంలో రద్దు చేసిన తిరుపతి–హుబ్లీ–తిరుపతి డైలీ ప్యాసింజర్ ప్రత్యేక రైలు సంచారాన్ని సోమవారం నుంచి పునః ప్రారంభించారు. ఈ రైలు సేవలను ఈ నెల 22 నుంచి అక్టోబర్ 1 వరకు రద్దు చేయాలని తీర్మానించిన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు నైరుతి రైల్వే అధికారులు తెలిపారు.

ఉద్యోగాలిప్పిస్తామని రూ.కోట్లు లూటీ

- మంత్రి పేరు చెప్పి దందా


గురు విశ్వకర్మ

రాయచూరు రూరల్: గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్లు ఇప్పిస్తామని చైత్రా కుందాపుర గ్యాంగ్ వసూళ్ల కేసు కనుమరుగు కాక ముందే మంత్రి పేరుతో ఆప్త సహాయకుడు ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులకు రూ.కోట్లలో శఠగోపం పెట్టిన ఘటన జిల్లాలో వెలుగు చూసింది. రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు ఆప్త సహాయకుడినని చెప్పుకొని డబ్బులు వసూలు చేస్తున్న గురు విశ్వకర్మ నిజస్వరూపం బయటపడింది. అతనిపై అంగన్‌వాడీ, ఎస్ఐ, ఎఫ్‌డీసీ, ఇతర ఉద్యోగాలు ఇప్పిస్తానని 28 మంది నుంచి అడ్వాన్స్‌గా రూ.2 కోట్లు వసూలు చేశాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే తాము గురు విశ్వకర్మను ఇప్పటికే తమ వద్ద విధుల నుంచి తొలగించామని మంత్రి బోసురాజు విలేకరులకు స్పష్టం చేశారు. ప్రస్తుతం అతను మాజీ ఎంపీ బీవీ నాయక్‌తో, బీజేపీలో గుర్తింపు పొందారన్నారు.

అన్ని దానాల్లోకి రక్తదానం శ్రేష్టం


రక్తదానం చేస్తున్న ఆశా కార్యకర్తలు

గంగావతి: అన్ని దానాల్లోకి రక్తదానం పవిత్రమైందని డాక్టర్ సబ్రిన్ పేర్కొన్నారు. నగరంలోని ఇస్లాంపురలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రధానంగా మనిషి మరొకరి ప్రాణాలను కాపాడేందుకు కన్ను, కిడ్నీ, రక్తదానం లాంటివి చేయాలన్నారు. శిబిరంలో 100 మంది రక్తదానం చేయడం శ్లాఘనీయం అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్, నేత్రావతి, ఆశా కార్యకర్తలు దీపా, శరణమ్మ, లాల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ శరీరదానం

- మానవతను చాటిన మృతురాలి కుటుంబ సభ్యులు

హుబ్లీ: మెదడు నిర్వీర్యం అయిన 37 ఏళ్ల బసవ్వ కరికట్టి అనే మహిళ శరీర అవయవాలను దానం చేయడం ద్వారా మరణంలోను ఆమె కుటుంబ సభ్యులు సార్థకతను చాటారు. ఈనెల 19న కలఘటిగి తాలూకా మడికిహొన్నళ్లికి చెందిన బసవ్వ అనే మహిళ చికిత్స కోసం ఎస్‌డీఎం ఆస్పత్రిలో చేరారు. ఆమెను మెరుగైన వైద్యం కోసం అత్యవసర విభాగంలో చేర్చి చికిత్స అందించగా ఆమెకు మెదడు నిర్వీర్యం అయినట్లు తేలిందని వైద్యులు తెలిపారు. ఈ దుఃఖ సమయంలో మానవతను చాటుకున్న వారి కుటుంబం శరీరదానం చేయడానికి సమ్మతించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 23న ఎస్‌డీఎం ఆస్పత్రిలో విజయవంతంగా అవయవాలను ఆపరేషన్ ద్వారా తొలగించారు. ఒక కిడ్నీని ఎస్‌డీఎం ఆస్పత్రి, మరో కిడ్నీని హుబ్లీలోని తత్వదర్శి ఆస్పత్రి, లివర్‌ను, హృదయాన్ని బెళగావిలోని కేఎల్ఈ ఆస్పత్రికి దానం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌డీఎం నుంచి బెళగావి కేఎల్ఈ ఆస్పత్రికి వేగంగా అవయవాలను చేర్చడానికి వినాయక నిమజ్జన ప్రదర్శనలోను పోలీస్ శాఖ తగిన బందోబస్తు ఏర్పాటు చేసి అవయవాలను సరైన సమయానికి చేర్పించడానికి గ్రీన్ కారిడార్ వ్యవస్థను కల్పించారు. ఇందుకోసం జంట నగరాల పోలీస్ కమిషనర్ రేణుక సుకుమార్, సీఐ నాయకర్, సంబంధిత అధికారులకు ఎస్‌డీఎం వైద్య కళాశాల వీసీ డాక్టర్ నిరంజన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పొలంలో వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

రాయచూరు రూరల్: తాలూకాలోని కూడ్లూరు–వడ్లూరు మధ్య పొలంలో మంగళవారం వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. కూడ్లూరు వద్ద సురేష్(40)ను హత్య చేశారని భార్య సబితా ఫిర్యాదు చేసినట్లు పోలీస్ స్టేషన్ సీఐ సాబయ్య వెల్లడించారు. సురేష్ సరిహద్దు రాష్ట్రం తెలంగాణలో కల్లు తాగి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. బంధువు అయ్యప్ప తనను హెగ్గసనహళ్లిలో వదలి పెట్టడంతో కూడ్లూరు వద్ద వెళుతుండగా తన భర్తను గుర్తు తెలియని వ్యక్తులు చంపినట్లు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 12 మేకల మృతి
సిరివార తాలూకా కవితాళలోని కనక నగర్‌లో వీధి కుక్కలు దాడి చేసి కరవడంతో 12 మేకలు మృతి చెందాయి. సోమవారం రాత్రి బసవలింగ, శివనప్పలకు చెందిన మేకలు ఇంటి వద్దనే ఉండగా వీధి కుక్కలు ఉన్నఫళంగా దాడి చేశాయి. మేకలను ఎక్కడ పడితే అక్కడ కరవడంతో అవి మరణించాయి.

రైతు సమస్యలకు పరిష్కారం

- కరువు పీడిత రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం వద్దు
- అధికారులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర సూచన


సమస్యలను ఆలకిస్తున్న మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే గణేష్, అధికారులు

సాక్షిబళ్లారి: ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతులు పెట్టిన పంటలు పూర్తిగా నష్టపోవడం వల్ల ప్రభుత్వం ఇప్పటికే జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించిన నేపథ్యంలో రైతులను ఆదుకొనే విషయంలో అధికారులు నిర్లక్ష్యం చూపకూడదని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆయన జిల్లాలోని కంప్లి, కురుగోడు తాలూకాకు సంబంధించి కురుగోడు పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రగతి పరిశీలన సమావేశంలో పాల్గొని అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకొని పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ జిల్లాలో విస్తారంగా మిరప సాగు చేస్తున్న నేపథ్యంలో బ్లాక్ మార్కెట్‌లో మిరప విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

బ్లాక్ మార్కెట్‌లో విత్తనాలు అమ్మితే చర్యలు
ఈ విధంగా బ్లాక్ మార్కెట్‌లో మిరప విత్తనాలు అమ్మితే సంబంధిత వ్యక్తులు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత వ్యవసాయ అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి బ్లాక్ మార్కెట్‌లో మిరప విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో అధికారుల పాత్ర ఎంతో ఉంటుందని గుర్తు చేశారు. క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకొనేందుకు అధికారులు గ్రామాల్లో పర్యటించాలన్నారు. జిల్లాలో పంట నష్టంపై సమీక్ష నిర్వహించి నివేదిక ఇవ్వాలన్నారు. ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వకపోతే రైతులు నష్టపోతారన్నారు. పంట బీమాకు సంబంధించి రైతులకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు.

డెంగీ జాగృతి రథం ప్రారంభం


ప్రారంభిస్తున్న మంత్రి, అధికారులు

హొసపేటె: జిల్లాలో డెంగీ నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డెంగీ జాగృతి రథాన్ని ప్రారంభించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన ఈ రథాన్ని మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ మంగళవారం ప్రారంభించారు. ఇప్పటికే 50 డెంగీ కేసులు నమోదైనందున జిల్లాలో డెంగీపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ రథం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తారు. రెండు నెలల పాటు జిల్లాలోని అన్ని తాలూకాల్లో ఈ రథం పర్యటిస్తుందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శంకర్ నాయక్ తెలిపారు.

వన్యజీవుల స్టాంపుల పుస్తకం విడుదల

బనశంకరి: అంతరించిపోతున్న జీవ జాతుల దినోత్సవం సందర్భంగా ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆన్ నేచర్ (ఐయుసీఎన్), సిటీస్ సంస్థలు వన్యప్రాణులు, మొక్కల వ్యాపారాన్ని నియంత్రించడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. పలురకాల జాతుల పక్షులు, ప్రాణులు, చెట్లను రక్షించడానికి రెండు సంస్థలూ కృషిచేస్తాయి. మంగళవారం బెంగళూరు కేంద్ర తపాలాఫీసులో జరిగిన కార్యక్రమంలో ప్రవాసాంధ్రుడు, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి ఎం.లోకేశ్వరరావు రాసిన సిటీస్ అంతరించిపోతున్న జాతులకు చెందిన స్టాంపుల పుస్తకాన్ని పరిసర ప్రేమికురాలు ప్రియావెంకటేశ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీ.రాజు మాస్టర్ క్రాఫ్ట్‌మ్యాన్ విడుదల చేశారు.

ఆరోగ్యాధికారి ఆకస్మిక తనిఖీ


సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రబాబు

రాయచూరు రూరల్: జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు మంగళవారం మాన్వి తాలూకా కల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలు అందించడానికి ముందుండాలని అధికారులకు, సిబ్బందికి సూచనలిచ్చారు. ఆరోగ్య కార్యకర్తలు పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు.

కరువు సహాయక పనులు చేపట్టండి


వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: జిల్లాలోని తాలూకాలను కరువు పీడిత తాలూకాలుగా ప్రకటించి కరువు సహాయక పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రాంత రైతు కూలీ కార్మికుల సంఘం అధ్యక్షుడు కరియప్ప డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలు లేక ప్రజలు ఉపాధి కోసం వలస వెళుతున్నారన్నారు. జాతీయ గ్రామీణ ఉద్యోగ ఖాత్రి పథకాన్ని విస్తరించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పౌర కార్మికుల ర్యాలీ


ర్యాలీ చేపట్టిన పౌర కార్మికులు

రాయచూరు రూరల్: నగరంలో స్వచ్ఛతకు చిరునామాగా నగరసభ పౌరకార్మికులు నిలిచారని ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ అభిప్రాయపడ్డారు. మంగళవారం మహంతేష్ భవనంలో పౌర కార్మికుల దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెల్లవారక ముందే చీపుర్లు చేతబట్టుకొని వీధులను శుభ్రం చేసే కార్మికుల సేవలు మరువరానివన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు. సమావేశంలో పీడీ గంగాధర్, కమిషనర్ గురుసిద్దయ్య, రవీంద్ర జాలదార్, నాగరాజ్, శశిరాజ్‌లున్నారు.

ఘనంగా శరణ బసవేశ్వర రథోత్సవం

గంగావతి: కారటగి పట్టణంలో శ్రీశరణ బసవేశ్వర జాతర మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఉదయాన్నే శరణ బసవేశ్వరుడికి పలు రకాల అభిషేకాలు, పూజలను అర్చకులు నెరవేర్చారు. సాయంత్రం జోడు రథాలతో శరణ బసవేశ్వరుడి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు నేతృత్వం వహించారు.

కాలిపోయిన కారు

శివమొగ్గ: వెళుతున్న కారులో మంటలు లేచి మొత్తం కాలిపోయింది. ఈ సంఘటన సోమవారం రాత్రి శివమొగ్గ– తీర్థహళ్లి జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. తీర్థహళ్లి నుంచి శివమొగ్గకి వస్తుండగా మండగద్దె 15వ మైలురాయి వద్ద మంటలు లేచాయి. దీంతో కారులోని వారు గబగబా దిగిపోయారు. చూస్తుండగానే కారంతా మంటలు వ్యాపించాయి.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

బళ్లారిఅర్బన్: సంగనకల్లులో మంగళవారం ఇంటి వద్ద ఉన్న విద్యుత్ స్తంభం వద్ద తీగను తాకి గ్రామానికి చెందిన కే.శివరాజ్(23) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు బళ్లారి రూరల్ పోలీసులు తెలిపారు. ఇంటిలోని చెత్తను స్తంభం వద్ద వేసేందుకు వచ్చినప్పుడు అక్కడ ఉన్న తీగను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురైనట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పీఎంఏవై పనుల పరిశీలన

హొసపేటె: సండూరు పట్టణంలోని కప్పలకుంట రోడ్డులో రాజీవ్‌గాంధీ హౌసింగ్ కార్పొరేషన్ వద్ద ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద నిర్మిస్తున్న గృహ సముదాయ పనులను గృహ నిర్మాణ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే తుకారాంతో కలిసి రూ.135 కోట్లతో 2172 ఇళ్లను నిర్మిస్తున్నారని, త్వరగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

అనారోగ్యంతో ఫొటోగ్రాఫర్ మృతి


విజయ్‌కుమార్(ఫైల్)

బళ్లారిఅర్బన్: నగరంలో సీనియర్ ఫొటోగ్రాఫర్ విజయకుమార్(68) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు మృతుని సోదరుడు, ప్రెస్ ఫొటోగ్రాఫర్ రాజన్న తెలిపారు. తన సోదరుని అంత్యక్రియలు బుధవారం హరిచంద్రఘాట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో కోవిడ్‌ను సైతం లెక్క చేయకుండా తనదైన శైలిలో పత్రికా రంగానికి సేవలు అందించినట్లు గుర్తు చేశారు. కాగా విజయకుమార్ మృతికి నగర మీడియా మిత్రులు, స్థానిక ఫొటోగ్రాఫర్లు సంతాపం వ్యక్తం చేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు.